# సంపూర్ణ

# హనుమత్ చరిత్రము

## వచన కావ్యం



శ్రీ విష్ణు రూపాయ నమః శివాయ
వేద గ్రంథాలయం
9666122140
vedhagrandhalayam@gmail.com

# విషయసూచిక

**ప్రథమాధ్యాయము ........................................ 1**
అయోధ్యానగర వర్ణన. శ్రీరాముని కొలువుకూటం. ........................ 2
శ్రీరాముని వద్దకు అగస్త్య మహాముని వచ్చుట. .............................. 4
అగస్త్యుడు రామునికి శతకంధర వృత్తాంతం చెప్పుట ..................... 5
శ్రీరాముడు శతకంధరుని చంపు విధమాలోచించుట ....................... 6
ఏకపాద రుద్రావతరణ కథ ............................................... 7
ఏకపాద రుద్రావతరణ కారణం? సీత ప్రశ్న – రాముని సమాధానం .... 11
శివుని వనవిహారాది వృత్తాంతం. .......................................... 12
కేసరియను వానరుని వృత్తాంతం ........................................... 14
కేసరి శంబసాధసుడను దైత్యుని వధించిన వృత్తాంతం.................... 14
దేవతలు కేసరిని వివాహానికి ప్రోత్సహించుట
వివాహ పరమ ప్రయోజనం ................................................ 17
అహల్య – గౌతముల వృత్తాంతం ........................................ 19
అహల్యా ఇంద్రుల సమాగమం – వాలి జననం........................... 20
అంజన జననం.............................................................. 22
అహల్యా సూర్యుల సమాగమం – సుగ్రీవ జననం ........................ 23
సూర్యలోక మాహాత్మ్యము ................................................. 24
గౌతముని శాపం. ........................................................... 26
అహల్యా ఇంద్రుల సమాగమం. గౌతముని శాపం. శతానంద జననం. .. 27
అంజనను వాలి అహల్యలు శపించుట సుగ్రీవుడు ఊరడించుట. ......... 28
ఫలశ్రుతి ................................................................... 29

## ద్వితీయాధ్యాయము ........................................ 30


అంజన పూర్వజన్మ వృతాంతం ........................................ 30
కుంజరుడను వానరుని వృత్తాంతం........................................ 31
అంజనాదేవి యౌవన ప్రాదుర్భావం ........................................ 32
అంజనాకేసరుల వివాహం ........................................ 34
సంతానం కలగలేదని అంజన దుఃఖించుట ........................................ 35
ధర్మదేవత ఎఱుక చెప్పుట........................................ 36
కేసరి అంజనను వాయుదేవుని గూర్చి తపస్సు
చెయ్యమని ప్రోత్సహించుట ........................................ 38
వాయుదేవుని మహత్త్వం. ........................................ 38
అంజనాదేవి తపస్సు........................................ 40
గ్రీష్మఋతు వర్ణన........................................ 40
వర్షఋతు వర్ణన ........................................ 40
శీతకాల వర్ణన ........................................ 41
అంజనగర్భం దాల్చుట. ........................................ 41
గర్భకారణం తెలియక అంజన దుఃఖించుట ........................................ 42
ఆంజనేయుని జననం ........................................ 43
పండని భ్రమించి ఉదయ సూర్యుని పట్టబోవుట. ........................................ 44
దేవతా సమూహం భయకంపితులగుట ........................................ 45
రాహువు భయకంపితుడై ఇంద్రునితో మొరపెట్టుకొనుట ........................................ 45
ఇంద్రుడు ఆంజనేయుని వజ్రాయుధంతో కొట్టుట.
వాయువు స్తంభించుట........................................ 48
పుత్రుని కానక అంజన శోకించుట. ........................................ 49
కేసరి అంజనను ఊరడించుట. ........................................ 50
దేవతలు బ్రహ్మను ప్రార్థించుట. బ్రహ్మ వాయువును సమాధాన పఱచుట. 50
ఆంజనేయుని బ్రహ్మదీవించుట ........................................ 51
దేవతలు ఆంజనేయునకు అనేక వరాలిచ్చుట. ........................................ 52

ఆంజనేయునకు విధాత వరాలిచ్చుట ........................ 52
అంజన పుత్రుని లాలించుట ................................ 54
హనుమ తల్లి ఆజ్ఞచే వాలి సుగ్రీవుల వద్ద చేరుట ................. 54
హనుమ సూర్యునివద్ద విద్యనభ్యసించుట. ......................... 56
సూర్యమండల మాహాత్మ్యం ................................. 58
ఫలశ్రుతి ......................................................... 59
**తృతీయాధ్యాయము ................................ 60**
సుగ్రీవునికి హనుమ చేదోడు – వాదోడుగా ఉండుట. ...................... 60
సీతకు రాముడు హనుమ ఔన్నత్యాన్ని చెప్పుట......................... 61
సీతా వియోగం – రాముని దుఃఖం ........................................ 63
రాముడు కిష్కింధలో చూచిన హనుమ దివ్యరూపం ......................... 63
శ్రీరామ హనుమల సమాగమం................................................ 65
శివకేశవులకు అభేదం........................................................ 65
హనుమ వాక్చాతుర్యం; రాముని ప్రశంస ...................................... 66
రాముడు హనుమకు ముద్రిక నిచ్చుట ......................................... 67
హనుమ సీతాన్వేషణ ప్రయత్నం ............................................. 67
హనుమ సముద్ర లంఘనం ....................................................... 68
లంకలో హనుమ సీతాన్వేషణ..................................................... 70
సీతను కానక హనుమ రౌద్రమూర్తి యగుట ..................................... 70
సీతా సందర్శనం. రామముద్రిక నిచ్చుట........................................ 71
రామునికి సీతాసందేశం............................................................ 73
అశోక వన ధ్వంసం ................................................................ 74
బ్రహ్మాస్త్ర ప్రయోగానికి హనుమ కట్టువడుట ..................................... 74
హనుమ రావణునికి హితవు పలుకుట ............................................ 75
రావణునికి విభీషణుని సలహా ..................................................... 76
హనుమ లంకాదహనం ................................................................. 76
సీతా వృత్తాంత విన్నపం. రాముడు హనుమను స్తుతించుట................. 77
హనుమ లోకోపకార కృత్యాలు...................................................... 78

విభీషణుడు గుణశాలి యని రామునకు హనుమ చెప్పుట ................ 79
హనుమ చేసిన ఇతర అద్భుత కృత్యాలు. ................................. 81
ధాన్యమాలినికి శాప విమోచనం. ఆమె హనుమను స్తుతించుట. .......... 83
ధాన్యమాలిని తన శాప వృత్తాంతాన్ని చెప్పుట ............................. 84
ధాన్యమాలినిని చూచి శాండిల్యుడు మోహపరవశుడగుట.
మునిని ఆమె నివారించుట. ................................................ 85
ముని బ్రతిమాలుట ........................................................ 85
రావణుని బలాత్కారం. శాండిల్యుని శాపం. ................................ 86
కాలనేమి వధ. హనుమ ద్రోణాద్రిని చేరుట. ................................ 88
గంధర్వులతో యుద్ధం. మాల్యవంతుని వధ ................................ 88
రాముని ప్రశంస ............................................................ 89
ఫలశ్రుతి ................................................................. 90

**చతుర్థాధ్యాయము ................................ 91**

మైరావణ వృత్తాంతం ........................................................ 91
మైరావణునికి భార్య హితవు చెప్పుట ........................................ 92
మైరావణ, ఖడ్గరోముల వధ. ................................................ 93
గంధమాదనుని వృత్తాంతం .................................................. 94
హనుమ యమలోకాని కేగుట .................................................. 95
హనుమ బ్రహ్మలోకానికేగి గంధమాదనుని భూలోకానికి తెచ్చుట ......... 96
వానరుల సంతోషం. ......................................................... 97
ఋషులు రాముని సందర్శించుట. .......................................... 98
రామేశ్వర లింగ ప్రతిష్ఠా వృత్తాంతం ........................................ 99
హనుమ కైలాసాని కేగుట .................................................... 99
సీతారాముల సైకత లింగ ప్రతిష్ఠ........................................... 100
శ్రీమన్మహా రామేశ్వర జ్యోతిర్లింగ సంస్థాపనోత్సవ సంరంభం. ............. 101
హనుమ దుఃఖించుట ....................................................... 103
రాముడు హనుమకు చేసిన అద్వైత బోధ ................................... 103
హనుమ సైకత లింగాన్ని పెకలించటానికి పూనుకొనుటలో అంతరార్థం . 107

హనుమ మూర్ఛితుడగుట. సీతారాముల ఓదార్పు. ........................ 107
సీతారాములు దుఃఖించుట ........................................ 110
హనుమ మూర్ఛ నుండి తేలుకొని సీతారాములను స్తుతించుట. .......... 111
సీత హనుమకు తన అవతార తత్త్వాన్ని తెలుపుట. ........................ 112
అవతార నిర్వచనం. నిష్కామ కర్మాచరణ నిర్వచనం. ...................... 114
అవతార రహస్యం. ................................................ 117
లోకంలో జీవుల పుట్టుక పంచాహుతి క్రమం ................................ 118
హనుమత్కుండ మహాత్మ్యము ........................................ 120
హనుమ భరతుని వద్దకేగుట. ........................................ 121
సీత హనుమకు మణిహారాన్ని బహూకరించుట. .............................. 122
శతకంధర వధ .................................................. 123
హనుమ విశ్వరూపం ................................................ 123
హనుమ విశ్వరూపాన్ని చూచి రామాదులు స్తుతించుట ...................... 124
హనుమ ఆకాశ మార్గ ప్రయాణం ........................................ 125
ఫలశ్రుతి ........................................................ 126

**పంచమాధ్యాయము ........................................ 127**

మాయానగర ముట్టడి ................................................ 127
కాలకేయాదులతో యుద్ధం .............................................. 128
శతకంఠుడు యుద్ధ వార్తను వినుట ...................................... 129
శతకంఠుడు యుద్ధానికి బయలుదేరుట .................................... 130
అపశకునాలు గోచరించుట ............................................ 130
శతకంఠునితో హనుమ యుద్ధం ........................................ 131
హనుమ వాల సేతువును నిర్మించుట .................................... 132
శతకంధరుని పరాక్రమం ............................................ 133
శ్రీరామ శతకంధరుల యుద్ధం .......................................... 133
పంచముఖ ఆంజనేయుని వీర విక్రమం .................................... 135
సీత శతకంధరుని వధించుట .......................................... 136
రాముడు సీతకు మణిహారాన్ని బహుమతిగా ఇచ్చుట ...................... 139

మణిహారాన్ని హనుమకిమ్మన్ని సీత చెప్పుట ........................ 140
అందరు అయోధ్యకు చేరుట ........................ 141
తల్లుల ఎదుట రాముడు హనుమను నుతించుట. ........................ 142
సీతారాములు హనుమతో కలిసి విందు ఆరగించుట ........................ 143
సీత భోజన పదార్థాల వడ్డన ........................ 143
సీత స్వరూప వర్ణన ........................ 144
రాముడు విందారగించుట ........................ 144
హనుమ శ్రీరాముని భుక్త శేషాన్ని కోరుట. ........................ 145
ప్రసన్నాంజనేయుడు శ్రీరామ భుక్త శేషాన్ని
కపులకు ప్రసాదంగా పంచుట. ........................ 146
కపులు హనుమను నుతించుట. ........................ 147
రాముని రాజ్యంలో హనుమ దినచర్య ........................ 147
అశ్వమేధ క్రతువుల్లో హనుమ సహాయం ........................ 149
రాముడు హనుమను గంధ మాదనానికేగి నివాసముండు మనుట ........ 150
ఫలశ్రుతి ........................ 152

**షష్ఠాధ్యాయము ........................ 154**

సకుంభ నికుంభుల వృత్తాంతం ........................ 154
సకుంభ నికుంభులు దేవయానిని చూచి మోహించుట ........................ 155
దేవయాని శాపం ........................ 155
సకుంభ నికుంభుల సభకు నారదుని రాక ........................ 156
విభీషణునిపై దండెత్తుట ........................ 157
విభీషణుడు హనుమను ప్రార్థించుట ........................ 158
శ్రీరాముని సహాయం కోరుట ........................ 158
భరత శత్రుఘ్నుల మూర్ఛ – సకుంభ నికుంభుల వధ ........................ 159
హనుమ అమరావతి కేగి అమృతాన్ని తెచ్చుట. ........................ 160
అమరావతీ నగర వర్ణన ........................ 160
రాముడు హనుమను స్తుతించుట ........................ 161
శ్రీరాముని వద్దకు అగస్త్య మౌని వచ్చుట. ........................ 162

శ్రీరాముడు హనుమను స్తుతించుట ........................................ 162
శ్రీరాముడు అగస్త్యునకు హనుమన్మంత్ర మాహాత్మ్యము చెప్పుట
మరియు తత్త్వ బోధ. .......................................................... 163
భక్తులకు హనుమ ఇచ్చే వరాలు ............................................. 167
పంచముఖ ఆంజనేయ వృత్తాంతం ............................................ 168
శ్రీకృష్ణుడు హనుమచే సత్యభామా, గరుత్మంతులకు
నారద – తుంబురులకు గర్వభంగము చేయించుట. ...................... 170
గరుత్మంతుని బలపరాక్రమాల వర్ణన........................................ 170
ద్వారకలో కృష్ణుని వృత్తాంతం.................................................. 171
సత్య గర్వం ......................................................................... 171
గరుడుని గర్వం..................................................................... 172
తుంబురు నారదుల వృత్తాంతం................................................. 172
కలహం ............................................................................... 173
తుంబురు నారదులు ద్వారకకు వచ్చుట. .................................... 173
గరుడుని హనుమను తోడి తెమ్మనుట........................................ 174
గరుడునకు అవమానంగా తోచుట. ........................................... 175
గరుడుడు హనుమ వద్దకేగుట ................................................ 175
గరుడుని అహంకారం.............................................................. 176
గరుడుని గర్వభంగం ............................................................. 177
కృష్ణుని పరిచర్యలు ............................................................... 177
గరుడుడు హనుమను వినయంతో ద్వారకు తోడి తెచ్చుట ................. 179
సత్యభామా గర్వభంగం............................................................ 179
రుక్మిణీ కృష్ణులు సీతారాములుగా దర్శన మిచ్చుట........................ 180
నారద తుంబురుల గానాధిక్యతను హనుమను నిర్ణయించమనుట ........ 181
నారద తుంబురులు తమ గానాన్ని హనుమకు వినిపించుట............... 181
హనుమ సంగీత పాండిత్యం ..................................................... 182
ఓంకార స్వరూపం.................................................................. 182
స్వర వివేకం ......................................................................... 183

శ్రుతి వివేకం........................................................ 183
రాగగీతాదుల లక్షణ వివేకం ........................................ 184
వాద్య వివేకం ........................................................ 184
భరత వివేకం ........................................................ 184
హనుమ తన సంగీతాన్ని వినిపించుట ............................ 185
నారద తుంబురుల గర్వభంగం ..................................... 186
నారద తుంబురులు హనుమను స్తుతించుట ........................ 186
ఫలశ్రుతి ............................................................ 188

**సప్తమాధ్యాయం ................................... 189**

కృష్ణార్జునులు లవణ సముద్ర తీరంలో విహరించుట. ..................... 189
అర్జునుని అహంకారం ................................................ 190
కృష్ణుడు హనుమను రప్పించుట ..................................... 190
అర్జునుని గర్వభంగం................................................ 191
కృష్ణుని శరీరం నెత్తురు ముద్దగుట.................................... 192
హనుమ మాహాత్మ్యం .................................................. 193
భీముడు ద్రౌపదికి సౌగంధిక పుష్పాన్ని ఇచ్చిన వృత్తాంతం ............... 193
భీమునికి గర్వభంగం ................................................ 194
హనుమ భీమునకు బోధించిన కాల మహిమానువర్ణనం. ................. 196
హనుమ భీమునకు చెప్పిన కలియుగ లక్షణాలు ........................ 200
భీమునకు హనుమ తన విశ్వరూపాన్ని చూపుట.......................... 202
భీముడు పురుష మృగాన్ని తెచ్చుట. ..................................... 204
గంధమాదనం వద్ద హనుమ దినచర్య.................................... 207
ఋషిగణం హనుమను తత్త్వోపదేశం చెయ్యమని కోరుట. ................. 208
కలిలో రామ కృష్ణావతారం – ఆంజనేయావతారం........................ 211
సువర్చలా వృత్తాంతం ................................................ 213
సువర్చలా హనుమల కళ్యాణం ........................................ 216
ఫలశ్రుతి ............................................................ 217

*

ఓం శ్రీ మహాగణాధిపతయే నమః

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## ప్రథమాధ్యాయము

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే ॥ 1

శ్లో॥ అగజానన పద్మార్కం గజానన మహర్నిశమ్ ।
అనేకదం తం భక్తానామ్ ఏకదంత ముపాస్మహే ॥ 2

శ్లో॥ దిక్కాలాద్యనవఛిన్నానన్త చిన్మాత్ర మూర్తయే ।
స్వానుభూత్యేక మానాయ నమశ్శాన్తాయ తేజసే ॥ 3

శ్లో॥ గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణాం ।
నిధయే సర్వ విద్యానాం దక్షిణా మూర్తయే నమః ॥ 4

శ్లో॥ శ్రుతి స్మృతి పురాణానామ్ ఆలయం కరుణాలయమ్ ।
నమామి భగవత్పాద శంకరం లోక శంకరం ॥ 5

శ్లో॥ విశ్వేశ్వర సమారంభామ్ శంకరాచార్య మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతామ్ వందే గురుపరంపరామ్ ॥ 6

శ్లో॥ ఆంజనేయమతిపాటలాననం
కాంచనాద్రి కమనీయ విగ్రహమ్ ।
పారిజాత తరుమూల వాసినం
భావయామి పవమాన నందనమ్ ॥ 7

# కథా ప్రారంభం

శ్లో॥ సర్వ వేదాంత వేద్యాయ - పూర్ణాయ పరమాత్మనే ।
సచ్చిదానంద రూపాయ - భవిష్యద్బ్రహ్మణే నమః ॥

అఖిల భూత దయానిష్ఠుడు, సకల సద్గుణ వరిష్ఠుడు, ఆత్మనిష్ఠుడు ఐన వసిష్ఠుడు అమృతోపమానంగా ఆనతిచ్చిన రామాయణ గాథలోని మారుతాత్మజుడైన హనుమ మహిమలు కొన్ని విని శతానందుడు ఆనందంతో ఇలా అంటున్నాడు.

"యతిమూర్ధన్యా! లోకకంటకుడైన రావణుని సంహరించిన రామభూపాలుని చరిత్ర మీరు తేటతెల్లంగా చెప్పగా తేనెసోనలు కురిసినట్లు వీనుల విందుగా విన్నాను. అందు మారుతాత్మజుడైన హనుమ మాహాత్మ్యాన్ని కొంత వినిపించారు. అతని చరిత్ర చాలా ఆశ్చర్యం కలిగించేదిగా ఉంది. అద్భుతావహమైన అతని సంపూర్ణ ప్రభావాన్ని ఆనుపూర్వకంగా చెప్పవలసిందిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను" అని శతానందుడు వేడగా ఇక్ష్వాకువంశ పురోహితుడైన వసిష్ఠుడు ప్రీతితో ఇలా అన్నాడు:

**అయోధ్యానగర వర్ణన**
**శ్రీరాముని కొలువుకూటం.**

నాయనా! శతానందా! తొలి నాళ్ళనుండి ధనధాన్య సమృద్ధిగల కోసలదేశ పాలకులైన ఇక్ష్వాకు వంశ

రాజధానిగా అలరారుతున్న అయోధ్య పట్టణాన్ని గూర్చి ముందుగా చెపుతాను విను. మోక్షదాయకమైన సప్త పురులలోను అది ఒకటయ్యా! అక్కడి మేడలు మంచి ముత్యాలతో అలంకరింపబడి, 'పగలే వెన్నెల' అన్నట్లుగాను; ఇంద్రనీలమణి ప్రభలతో 'పగలే చీకట్లు' గాను, శోణమణి కాంతులతో సాంధ్యరాగ శ్రీలతోను వింత గొల్పుతూ ఉంటాయి. నిరంతరం నాట్యాభ్యాసం చేస్తున్న నటీనటుల కాలిగజ్జెల మువ్వల సవ్వడితోను, మృదంగ ధింధిమి ధ్వానాలతోను, 'నిత్య కళ్యాణం – పచ్చ తోరణం' లా కళల సౌభాగ్యంతో అలరారుతూ ఉంటాయి. విశాలమైన రాజవీధులు, చతుష్పథాలలో కేళాకూళులు, పుండరీక శోభితమైన సరస్సులు ఎన్నో ఉపవనాలతో ఆ పట్టణం శోభాయమానంగా ఉంటుంది. అచటి ప్రజలందరు కర్తవ్య నిష్ఠులే! నిత్య సంతుష్టులే! రాజయోగులే! భోగ మోక్షాలు రెండూ వారికి కరతలామలకం.

అది భూ పురంధ్రికి నూపురం! జయలక్ష్మికి కాపురం! అదే అయోధ్యాపురం.

ఆ నగరాన్ని రాజధానిగా చేసికొని సకలజన మనోభిరాముడైన శ్రీరామచంద్రుడు పరిపాలన చేస్తున్నాడు. అతని పాలనలో ప్రజలకు రోగభయం, శత్రుభయం లేవు. క్షుత్పిపాసలు లేవు. అరిషడ్వర్గాలు అదుపులో ఉంటాయి. ఈ విధంగా ప్రజారక్షణ కర్తవ్య పరాయణుడైన శ్రీరామచంద్ర ప్రభువు ఒకనాటి వేకువ జామున వందిమాగధుల స్తుతులతో మేల్కొని, కాలోచిత కృత్యములను నిర్వర్తించుకొని, రత్నభూషణాదు లలంకరించుకొని, జానకీ ఆంజనేయులు వామదక్షిణ పార్శ్వముల తన్ననుసరింప... నవరత్న ప్రభామండితమైన కొలువు కూటానికి వచ్చి పద్మరాగమయ భద్రాసనం మీద ఆసీనుడయ్యాడు. గగన మండలమంతా వ్యాపించిన ఇంద్రధనుస్సు వంటి వాలాన్ని చుట్టుకొని నిశ్చల దృష్టితో నిలబడి ఉన్న భవిష్యద్బ్రహ్మ ఐన హనుమను దయార్ద్ర దృష్టితో చూచాడు. భరత లక్ష్మణ శత్రుఘ్న సుగ్రీవ అంగద నల నీల జాంబవద్విభీషణాది సోదర సేవక బృందమంతా

పరివేష్టించి ఉన్నారు. వసిష్ఠ వామదేవాది సాధు పురుషులు సాధు వచనాలను పలుకుతున్నారు. రత్నమండిత మూర్ధన్యులైన నానాదేశ నరేంద్రమండలి తలలువంచి తనకు మ్రొక్కగా ఆ కాంతుల మధ్య చుక్కల నడుమ చంద్రునిలా మహాశోభతో నయనానందకరంగా వెలిగి పోతున్నాడు రామచంద్రమూర్తి.

**శ్రీరాముని వద్దకు అగస్త్య మహాముని వచ్చుట.**

ఆవేళ సభాభవనంలోకి ప్రవేశించాడు కుంభసంభవుడైన అగస్త్య మహర్షి. శతానందా! అగస్త్యుడంటే ఎవరను కొంటున్నావు? ఆయన ప్రభావం కొంచెం చెపుతాను విను! ముక్కంటి పగవారికి అజ్ఞానంతో ఆశ్రయాన్నిచ్చిన సముద్రుడు ఆయనకు ఆపోశనం! వెడమాయలతో అతిశయించిన గడుసు రేరాజు బొంది ఆయనకు భోజనం! బ్రహ్మర్షి, దేవర్షి సంఘాలలో ఆయన శ్రేష్ఠుడు! మిన్నుముట్టిన వింధ్య అతిశయాన్ని అణచివేసి తన పాదపీఠిగా చేసికొన్న పరమర్షి ఆయన!

అలా వచ్చిన అగస్త్య మౌనిని చూచి సంభ్రమాశ్చర్యాలతో నిటల తట ఘటితాంజలుడై రామచంద్రుడు ఎదురేగి ఆయనను పూజించి వినయంతో ఇలా అడిగాడు:

" మునీంద్రా! సర్వులకు భద్రమే గదా? అందరి యోగక్షేమాలను విచారించటం ప్రభువుల కర్తవ్యం. అందునా ఋషి సంఘాల భద్రత విషయం మాకు విధి. "

అప్పుడు తన రాకలోని ఆంతర్యాన్ని తెలియజేస్తూ అగస్త్యుడిలా ప్రత్యుత్తర మిచ్చాడు:

" నాయనా! రామభద్రా! రఘుకులానికి రత్న దీపానివి! దుష్టశిక్షణ శిష్టరక్షణారూప కర్తవ్య పాలనలో నీ బాణాలు మరింత పదునెక్కుతుంటే మా క్షేమానికి ఏమి కొఱత? రావణుని సంహరించి పార్వతికి, సముద్రునికి అభయమిచ్చి పుణ్యవతులైన నదీమతల్లులకు సంతోషాన్ని కలిగించావు. పాలిపోయిన దేవతాస్త్రీల చెక్కిళ్ళ మీద ఇప్పుడు చిరునవ్వు వెన్నెలలు

పూస్తున్నాయి. నాగకన్యలిప్పుడు నిర్భయంగా మైపూతలతో అలంకరించు కొంటున్నారు. సిద్ధగణ సేవిత రత్న లింగాలన్నీ పారిజాతపూల పరిమళంతో గుబాళిస్తున్నాయి. ఈ విధంగా లోకవిద్రావణుడైన రావణ వధానంతరం ముల్లోకాల ప్రజలు దైన్యం లేని జీవితాన్ని అనుభవిస్తున్నారు... కానీ...”

“ఆజ్ఞాపించండి మహర్షీ! ఎప్పుడూ లోక క్షేమాన్ని కోరే మీవంటి వారి ఆజ్ఞాపాలనమే మాకు కర్తవ్యం కదా!” అంటూ రాముడు ఉత్సాహ వచనాలను పలికాడు. ఆయన ఉత్సాహాన్ని గమనించిన అగస్త్య భగవానుడు ఇలా అన్నాడు:

**అగస్త్యుడు రామునికి శతకంధర వృత్తాంతం చెప్పట.**

“రామచంద్రా! రణరంగంలో దశకంఠుని సంహరించి అత్యానందాన్ని పొందేవు. కాని వాని కంటె బలవంతుడు ఇంకొకడున్నాడు. వానిపేరు శతకంఠుడు. వాడు దధిసాగర పరీవృత ప్రాంతంలో మాయాపురిని రాజధానిగా చేసికొని రాజ్యమేలుతున్నాడు. ప్రస్తుతం వాడిప్పుడు నిన్ను గెల్చే ప్రయత్నంలో ఉన్నాడు.”

ఆ మాటలను విన్న రాఘవుడు ఎంతో ఉత్సుకతతో “ఇప్పటి వరకు అచుంబితమైన ఆ శతకంధరుని వృత్తాంతాన్ని సవిస్తరంగా సెలవీయండి మునీంద్రా!” అంటూ విస్మయంగా అడిగాడు.

“రాఘవా! నీకా దనుజుని జనన వృత్తాంతాన్ని సంక్షేపంగా చెపుతా విను” అంటూ అగస్త్యుల వారిలా ప్రారంభించారు: “కశ్యప ప్రజాపతికి వసువు అనే పేరుగల సుందరాంగి ఐన భార్య ఉండేది. ఆమె ఋతుస్నాతయై ఒకనాటి మనోహర సంధ్యాసమయాన సుగంధ సురభిళ మలయానిల స్పర్శ కోర్వక మదనాతురయై భర్తను సమీపించి తన కోరికను వెల్లడించింది. సంధ్యా సమయం ఆ కార్యానికి నిషిద్ధమని భర్త చెప్పినా పెడచెవిని పెట్టి ప్రోత్సహించింది వసువు. ఫలితంగా వికృతాకృతుడైన శతకంధరుడనే

రాక్షసుడు జన్మించాడు. వాడు బ్రహ్మను గూర్చి ఘోర తపస్సుచేసి ఇంద్రాది దిక్పాలకులకు అసాధ్యమైన వరాలను పొంది లోకత్రయాన్ని బాధిస్తున్నాడు.

వాడి పరాక్రమం ఎలాటిదంటే...

అనంత కోటి తారకా మండలాలన్నీ వాని తలలకు బొండు మల్లెలు. సూర్యచంద్రగురుశుక్ర గ్రహాలన్నీ వాని చెవులకు కర్ణాభరణాలు. వాని బాహుబలానికి కుల పర్వతాలే అవధి. వాని ఉదగ్రతర విగ్రహానికి నీలపు నింగి ఒక చల్లడం. కాలకేయాది రాక్షసులు వాని సైన్యాధ్యక్షులు. ముల్లోకాల మీది ఆధిపత్యాన్ని ఆశించి వాడు బ్రహ్మ నుండి మాత్రమే కాదు శంకరుని కూడా భజించి నిర్జర భావాన్ని పొందాడు. రామచంద్రా! నీ పరాక్రమం అద్భుతం! అమోఘ శస్త్రాస్త్ర సంపన్నుడవు! భండనంలో శతకంధరుని తలలను బంతులాడించి లోక త్రయానికి సంతోషాన్ని సమకూర్చవయ్యా." అని ఆదేశించి అగస్త్యుల వారు అంతర్ధానమయ్యారు.

**శ్రీరాముడు శతకంధరుని చంపు విధ మాలోచించుట.**

భగవాన్ అగస్త్యుల వారలా ఆజ్ఞాపించి అంతర్ధాన మయ్యాక రామచంద్రుడు తన ముగ్గురు తమ్ములతోను ఇలా ఆలోచన చేశాడు. "శత యోజన విస్తీర్ణమైన లంకను సాధించి దశగ్రీవుని యుద్ధంలో మట్టుపెట్టటానికే ఇంత దుష్కరమైన ప్రయత్నం చేయాల్సి వచ్చిందే! తమ్ములారా! మీరు ఇప్పటికే అలసిపోయి ఉన్నారని నాకు తెలుసు. రావణ సంహారం కంటె ఇది కడు దుష్కరమైన కార్యంగా నాకు తోస్తున్నది. దీనికి ఉపాయమేది? ఈ కార్యంలో మనకు తొడ్పడే దెవ్వరు? "

అని తన చెంతనే అంజలి బద్ధుడై మేరుపర్వతంలా నిలబడియున్న హనుమను చూచి సముచితంగా ఇలా అన్నాడు: "ఓ! వాయుకుమారా! శౌర్యోత్సాహాలలోను, బాహుబలంలోను, నీతో సమానుడు ముల్లోకాలలోను లేడు. ఏ కార్యాన్ని సాధించాలన్నా నీవే సమర్థుడవు! 'ఏకపాదుడు' అనే

నామం నీకు తప్ప మరెవ్వరికి వర్తించదు గదా! ఇక నువ్వు ఉపేక్షించకు." రాముని పలుకులు విన్న హనుమ ఎంతో భయభక్తులతో "రామా! కృపావన రాసులైన మీకీ వనరాసు లొకలెక్కా? మీరు మీ సహోదరులతోను సైన్యంతోను నా భుజపీఠి నెక్కి ఆ దీవికి పోయి శతకంధరుని వధించండి." అన్నాడు. ఆ మాటలు విన్న రాముడు "హనుమా! ఈ మగటిమి నీకు గాక మరెవరికి ఉంది!" అని ఆప్యాయంగా ఆలింగనం చేసికొన్నాడు.

ఆ దృశ్యాన్ని చూచిన జానకి సంభ్రమాద్భుత రసాయత్త చిత్తంతో "నాథా! శ్రీకరుడు, సర్వబుధ సేవితుడు ఐన ఈ కపి ముఖ్యుణ్ణి మీరు ఏకపాద రుద్రాకృతుడని అన్నారు గదా! ఆ రుద్రుడు ఈ కపివేషాన్ని ఎందుకు ధరించవలసి వచ్చింది? నాకు ఆ కథ సవిస్తరంగా సెలవియ్యండి. వినాలని చాలా కుతూహలంగా ఉంది" అని కోరింది. అప్పుడు రామభద్రుడు త్రిభువన పావని ఐన సీతకు పావని యొక్క పావన చరిత్రను... ఇలా చెప్పటం ప్రారంభించాడు.

**ఏకపాద రుద్రావతరణ కథ.**

"జనకనందినీ! విను! ఏకపాదరుద్రుడే ఈ ఆంజనేయుడు అనే విషయాన్ని నేను పెద్దల వలన రూఢిగా విన్నాను. నీకు ఇంకొక విషయం కూడా చెపుతాను విను. జన్మసంసార కర్మబంధాన్ని ఛేదించే విద్య ఏదైతే ఉందో ఆ విద్య నా ప్రథమ పాదం. అట్టి విద్యా స్వరూపం ఈ హనుమ! ఆ కారణంగా ఇతడు ఏకపాదాహ్వాయుడు. అన్నిటా నాతో సమానుడీ కపివరుడు. ఈతని అనుపమ పుణ్య చరితామృత పానం చేసిన వారికి అభీప్సితార్థములు వెంటనే సిద్ధిస్తాయి. ఈ విమలాత్ముని పూర్వ జన్మానుగత ప్రభావాన్ని సమస్తము చెపుతాను. శ్రద్ధతో విను.

ఈ బ్రహ్మాండం పంచభూతాత్మకం. దానికి ఆవరణగా జలతత్త్వ, అగ్నితత్త్వ, వాయుతత్త్వ, గగనతత్త్వ, అహంకారతత్త్వ, మహత్తత్త్వములు ఒకదాని కంటె మరొకటి దశగుణాధికములై ఉన్నాయి. దానికి ఆవల

శుద్ధసత్త్వాఖండ తేజోవిరాజమానంగా ఒక పద్మజాండం ఉంది. అక్కడి జీవులకు అరిషడ్వర్గాదులు లేవు. వాటి స్వరూపాన్ని వర్ణించటం కుదరదు. ఆ గోళంలో పంచభూతాలలోని మన్ను, నీరు లేవు. ఆకాశం, వాయువు, అగ్ని ఈ మూడూ కలిసి జ్వలిస్తూ ఉంటాయి. అచటి జీవులకు ఆకలి దప్పికలుండవు. నడక వాయుగతి. వారు ఇచ్ఛారూపులు. అణిమాద్యష్ట సిద్ధులు వారికి కరతలామలకం. వారి తలపులకు చలనం లేదు. బ్రధ్న అనే పేరుగల బ్రహ్మ సృష్టి అది. అది రుద్రుని తావు కనుక అక్కడ మన్మథుని ప్రతాపం చెల్లదు. జరామరణాదులు దరిచేరవు. అక్కడ కాలము, కర్మ రెండూ లేవు. ముప్పది రెండు అర్బుదముల సంఖ్య రుద్రులు తన్ననుసరింపగా ఏకపాద రుద్రుడు జ్ఞాన శక్తితో కూడి సానందుడై ఆ అజాండాన్ని పాలన చేస్తూంటాడు.

అతని మహత్త్వాన్ని ఊహించటం అసాధ్యం. మహావాయుసంచలిత పావకాద్భుత కీలికా మాలికలు అతనికి కేళిడోళికలు. మహదహంకారాది భూమికలు కేళీవిహార భూములు. ప్రాకృత మాయావకుంఠనాన్ని తొలగించు కొంటే లభించే నిర్వాణ కన్యకా పాణిగ్రహణం అక్కడ నిత్యకళ్యాణం. "తత్త్వమసి" ఇత్యాది శ్రుతివాక్య లక్ష్యార్థమే... ఆ జ్ఞాన స్వరూపుడైన రుద్రుడు.

ఒకనాడు ఆ ఏకపాద రుద్రుడు దివ్యతేజోమయాసనం మీద పరమాద్భుత దివ్యప్రభలతో ఆసీనుడయ్యాడు. "అభయదాన నిదాన! శుభగుణాధీన! మాం రక్ష! రక్ష! " అంటూ బ్రధ్నుడు పార్థనలు చేస్తున్నాడు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు భక్తితో చామరములు వీస్తున్నాయి. శాంతి, దాంతి, విరక్తి, సత్త్వాది గుణాలు సాకారులై చేరి సేవిస్తున్నారు. అణిమాద్యష్ట సిద్ధులు సాహోనినాదాలు చేస్తున్నాయి. మహారుద్రగణం పరివేష్టించి ఉంది.

దేవీ! సీతా! వింటున్నావా! అలా ఆ రుద్రుడు అఖండ తేజో విరాజమానంగా కొలువుండి... సర్వ పరిపూర్ణుడనైన నన్ను సత్తామాత్రుని నిష్కళ రూపంలో తన మనస్సులో ధ్యానించాడు. నేనతనికి సగుణ రూపంలో సాక్షాత్కరించాను. అలా ఎట్టఎదుట నవ్యవనమాలికా వక్షుడనై

సాక్షాత్కరించిన నా దివ్యమంగళ విగ్రహాన్ని చూచి ఏకపాద రుద్రుడు సంచలించి ఇలా తలపోశాడు. "ఈ విగ్రహం నేత్ర పర్వంగా ఉంది! మదికి దురవగాహంగాను ఉంది! ముందెన్నడు ఇట్టి రూపు నే చూచినది కాదు! సమాధిలో ఈ సగుణ సాక్షాత్కారం ఏమిటి! నా సమాధి నిష్ఠ చెదిరి పోలేదు గదా! కాదు కాదు! నా జ్ఞాన సముపార్జనా లక్ష్యమైన తత్త్వమే ఇలా సగుణంగా దర్శన మిచ్చింది." అని మనస్సులో ఆనందించి మత్పరాయణుడై ముప్పిరిగొన్న భక్త్యనురాగ సంభ్రమాలతో తన పరిసరాలను శరీరాన్ని సర్వాన్ని మఱచి ఉప్పరమున తోచిన నా ఒప్పిదమైన జగదాశ్చర్యకర దివ్యస్వరూపాన్ని చేరుకోవాలనే తపనతో గగనానికి ఉద్గమించాడు రుద్రుడు.

రుద్రుని యొక్క సంచరణానికి సభంతా సంచలించింది. రుద్రలోకం అంతా తల్లడిల్లిపోయింది. ఎవరికివారే పలు విధాల తలపోతలతో తలమున్కలై సంశయాస్పదు లయ్యారు. ఈ మహాత్ముడు ఏ కారణంగా ఎక్కడికి గమిస్తున్నాడో అని కొందరు ఆలోచనలో పడ్డారు. ధ్యానకాలంలో ఏ విశేషం తోచిందో అని కొందరు ఊహింపసాగారు. తెలిసికొనటానికి మనం ఎంతటి వారమని కొందరు తమ అశక్తతను వెల్లడించారు. తన భక్తుల హృదయాలను శోధిస్తున్నాడేమో అని కొందరు అనుమానించారు. సర్వజ్ఞునకు శోధింప పనియేమున్నదని కొందరు సంశయించారు. నమ్మిన వారిని అన్య పథగాములుగా చేయబూనటం లేదు గదా అని కొందరు ఆందోళన చెందారు. ఏదో లోకానుగ్రహ నిమిత్తం అయ్యుంటుంది అని కొందరు విశ్వసించారు. "రాజానుమతో ధర్మః" అనే న్యాయం చొప్పున మనం కూడా అనుసరించటమే ధర్మమని కొందరు నిర్ణయించారు. ఇలా అందరూ తలకొక విధంగా తలపోయ సాగారు. అలా తలపోస్తూ "రక్ష! రక్ష!" అంటూ కొంత దవ్వనుసరించి ఆపై రుద్రుడు దృగ్గోచరం కాకపోయే సరికి విన్ననైన వదనములతో అన్యచింతన లేని చిత్తంతో అతనినే ధ్యానించి పునరావృత్తి రహితమైన పరమపదాన్ని పొందారు వారు.

జ్ఞాన క్రియాశక్తులు, షడ్గుణైశ్వర్యాదులు సూర్యుని వెంట వెలుగులా రుద్రుని అనుసరించాయి. ఇక ఆ కమల గర్భాండ పతియైన రుద్రుడు తన భక్తజనాన్ని విడిచి వాయుపథాన్ని దాటి, శతకోటి రవిమండల ప్రభాభాసమానమైన నా మూర్తి చెంతకు చేరాలనే తీవ్రకాంక్షతో వాయువేగాన్ని మించిన మనోవేగంతోను, మనోగతిని మించిన దర్శన కాంక్షతోను, దానికి తగిన నేత్ర దృష్టితోను నిరాలంబ గతితో తన ప్రాణ పంచేంద్రియ మనోదృష్టులు నాయందే ఏకాగ్రతతో నిలిపి అంతకంతకు నా చెంతకు చేరువవుతూనే ఎంతోదూరం వచ్చాడు.

జానకీ! నా వెంట ఆ ఏకపాద రుద్రావతారం ఒక్కొక్కమెట్టే అవతరణం చేస్తూ (క్రిందికి దిగుతూ) భూమికి అవతరించిన క్రమం చెపుతాను విను. అలా నిరాలంబ గతితో ముందుగా అవిచ్ఛిన్న వజ్రస్వచ్ఛప్రభలతో ఆచ్ఛాదితమైన మహత్తత్త్వావరణాన్ని దాటింది. ఇంద్రనీల కాంతులకు ఆలవాలమైన అహంకార తత్త్వాన్ని గడిచింది. అనంత పథానికి అవకాశమైన ఆకాశ తత్త్వాన్ని అధిగమించింది. అడ్డగించటానికి వీలులేని నినాదంతో ఘోరారావ సంకులమైన సమీర తత్త్వాన్ని మీరింది. మారుత ప్రేరిత చ్ఛటచ్ఛటారావ ప్రజ్వలిత జ్వాలికా మాలికలతో అవలోకించటానికి అసాధ్యమైన అగ్ని తత్త్వాన్ని అవలీలగా నిర్గమించింది. అభంగ రంగత్తుంగ తరంగ మాలికా డోలికారావ భీషణ ఘోషణలతో సంక్షోభించు జలతత్త్వాన్ని తరించింది. ఆ వెనుక కాంచన ప్రభాభాసమానమైన అజాండ కుహరాంతర్గత మార్గంలోకి ప్రవేశించింది. అలా నా వెనుకనే నన్నే అనుసరిస్తూ వస్తూన్న అతని అఖండ తేజోమండలాన్ని తేరిచూడలేక లోకాలోకాలన్నీ బ్రహ్మ నాశ్రయించి ఇలా మొఱ పెట్టుకొన్నాయి:

" పితామహా! మేమిది వరకు కనివిని ఎఱుగని ఒక దుర్నిరీక్ష్య తేజో విశేషం భువనాలన్నిటిని ఆక్రమించి నెట్టుకొని వచ్చేస్తోంది. అది పరిశుద్ధ జ్యోతియే కాని మమ్ములను భయకంపితులను చేస్తోంది. ప్రళయ కాలంలో

కాని ఫాలాక్షుని కంటిమంటలు పుట్టవుగదా? ఈ తేజో విశేషం ఏమిటి? భారతీవల్లభా! ఏవిధంగానైనా మీరు చేసిన సృష్టిని, ప్రాణికోట్లను రక్షించే భారం మీదే." అని వేలుపులు వేడినా బ్రహ్మతో కలిపి అచటి వారెవరికి ఆ తేజోవిశేషం అవగతం కాలేదు. సరిగదా అందరూ భయకంపితు లయ్యారు. "పాహి! పాహి!" అంటూ ఆ జ్యోతికి ప్రణమిల్లారు.

ఆ మీదట ఆ జ్యోతి సత్యలోకాన్ని గడిచి, తపోలోకాన్ని నిర్గమించి, సనకాది మునిజనాన్ని సంభావించి, ధ్రువ మండలాన్ని దాటి, శింశుమార చక్రాన్ని అధిగమించి, మహర్లోకాన్ని లంఘించి, స్వర్లోకాన్ని ఆశ్చర్యపరచి, భువర్లోకాన్ని తరించి, భూలోకానికి అవతరించింది.

ఇక్కడ భూలోకంలో కైలాసగిరి మీద పార్వతితో కూడి త్రిలోక శంకరుడైన శంకరుడు తారకబ్రహ్మమంత్ర జపానుష్ఠాన నిష్ఠాగరిష్ఠుడై ఉండగా నేనతని నాసికా రంధ్రాంతర ఆకాశపథంలో ప్రవేశించాను. నా వెనుక ఆ ఏకపాదరుద్ర తేజోవిశేషం కూడా ప్రవేశించి ఈశ్వరుని మూర్ధసీమలో సుషుమ్నా పథంలోకి జొచ్చి నన్ను వెన్నాడి హృదయాకాశంలో నన్ను కానక శివభావంలో ఐక్యాన్ని పొందింది. దేవీ! శివ-రుద్రు లిరువురు ఒక్క తత్త్వమే కనుక నీటిలో నీరు కలిసినట్లు శరీరభేదం లేకుండా భావం భావంలోను, ప్రాణం ప్రాణంలోను, తేజం తేజంలోను ఐక్యాన్ని పొందాయి. ఆ విధంగా గగన వాయు అగ్ని రూపమైన ఆ తేజం శివుని భావ, ప్రాణ, తేజో రూపంలో కలిసిపోయి నన్నే భజిస్తూ ఉండిపోయింది."

**ఏకపాద రుద్రావతరణ కారణం?**
**సీత ప్రశ్న - రాముని సమాధానం.**

ఆ విధంగా శ్రీరాముడు చెప్పిన ఏకపాద రుద్రావతరణ గాథను సావధానంగా విని సీత వినయంగా ఇలా ప్రశ్నించింది: "నాథా! మీరు చెప్పిన ఈ గాథ చాలా విస్మయావహంగాను, భయావహంగాను ఉంది. అనుక్షణము మిమ్ములనే స్మరిస్తూన్న ఈ పావనమూర్తిని ఈ అజాండానికి తెచ్చిన కారణమేమిటి?

శంకరునిలో ఐక్యమైనా తిరిగి జన్మించిన కారణమేమిటి? ఆ విధం ఎలాంటిది? మీరు ప్రారంభించింది మొదలు ఈ హనుమచ్చరిత్రం సారసుధారస ధారాపూరంలా చెవులకు ఇంపు పుడుతోంది!" అని తన ప్రాణేశ్వరి అడుగగా రామక్షోణీశ్వరుడు... ఇలా చెప్పాడు.

"దేవీ! ఇది పరమ రహస్యం. ఐనా చెబుతాను విను! పరమ పావనుడైన ఆ ఏకపాదరుద్రుడు తన స్వచ్ఛమైన అంతఃకరణంలో... నా యొక్క శుద్ధ నిర్గుణ, నిరాకార, నిష్కలాతత్త్వాన్నే ధ్యానిస్తూ కోరికలను జార్చి, చిత్త వృత్తులను నిరోధించి ముక్తితత్పరుడై ఉన్నాడు. నేనతని సమాధిని త్రోసి సకలుడనై సాక్షాత్కరించి ఈ విధంగా శివదేహంలో ప్రవేశపెట్టాను. ఎందుకంటె అతడు భవిష్యత్ బ్రహ్మ-జగత్కారణుడూను. ఈ విధంగా అతనికి మనోజయాన్ని సిద్ధింప చేశాను. అతని ఏకాగ్రత ఎట్టిదంటే... తను పాలించే బ్రహ్మాండం ఏమవుతుందో, తన ప్రజలు ఏమవుతారో, తన హితవ్యాపారం ఎలా ఉంటుందో అని కూడా ఊహింపలేదు. సంచలింపకుండా నాయందే దృష్టి నిలిపి ఏకాగ్రచిత్తంతో భువికేతెంచిన అతని చిత్తజయాన్ని ఏమని పొగడాలి!

ఇక శివునిలో ప్రవేశించి తిరిగి జన్మించిన వృత్తాంతాన్ని చెపుతాను విను.

**శివుని వనవిహారాది వృత్తాంతం.**

"దేవీ! పార్వతీ సహితుడైన శ్రీకంఠుడు కైలాసపర్వతం మీద ప్రమథగణ పరివృతుడై కొలువుండి వనవిహారం సలుపవలెననే సర్వ మంగళ వాంఛ ఎఱిగిన వాడై చైత్రవనానికి వచ్చాడు. ఎలా ఉంది... ఆ చైత్రవనం... మన్మథుని చైత్రరథం వలెనే ఉంది!

చిలుకలు, గోరువంకలు, నెమళ్ళు, కోయిలల కలకలారావాలే ఘంటా నాదాలుగా...

దట్టమైన మావి చిగుళ్ళే చంద్రకావిరంగు ధ్వజములుగా... వివిధ రంగుల పువ్వులే చిత్రపటాలుగా...

తీగఉయ్యాల లెక్కి ఊగే దేవకాంతల మెఱుపు చెక్కిళ్ళే అద్దాలుగా... మొల్లల జల్లులే ముత్యాల జల్లులుగా... చైత్రవనం చైత్రరథం వలెనే మనోహరంగా ఉంది. హృదయాహ్లాదకరంగా ఉన్న వసంతఋతు శోభను మాటిమాటికి మెచ్చుకొంటూ ఆ ఆదిదంపతులు అచ్చటి గిరికందరాలలోను, చంద్రకాంతశిలా వితర్దికల మీద, చిగురాకు పాన్పుల మీద, లతా నికుంజముల యందు కొంత తడవు విహరించారు.

ఇలా లీలావిహారం సలుపుతున్న గిరిజా శంకరులకు... తోకలు పెనవేసికొని, మోము మోమున చేర్చి, ఆలింగన సుఖపారవశ్యంలో మేనులొక్కటిగా మన్మథసుఖ స్థితిలో ఉన్న మర్కట మిథునం గోచరించింది. ఆ దృశ్యాన్ని చూచిన పార్వతి సిగ్గుతో శిరసు వంచుకొంది. ఆమె మనోగత అభిప్రాయాన్ని ఎఱిగిన ఈశ్వరుడు ఆమె కోరికను సఫలీకృతం చేశాడు. వారిరువురు మర్కటాకృతితో కొంతతడవు క్రీడించారు. సురతాంత వేళకు కపిస్ఫురణ నశించి ఆత్మరూపులై అద్వైత సిద్ధిని పొందారు.

అప్పుడు జాఱిపడిన శివుని తేజోభారాన్ని పార్వతి భరింపలేక "నాథా! ఈ భారాన్ని వేఱొక చోటుకు చేర్చండి!" అని ప్రార్థించింది. ఈశ్వరుడు నవ్వుతూ దానిని భూమియందు నిక్షిప్తం చేశాడు. ధారుణి దానిని పదివేల సంవత్సరాలు మోసి ఇక భరింపలేక "ఈశ్వరా! సప్త కుల పర్వతాలను, సప్త సముద్రాలను, సప్త ద్వీపాలను అవలీలగా మోస్తున్న నేను మీ తేజస్సును భరించలేక పోతున్నాను. వాటికంటె బరువుగా ఉందిది. దీనిని ఇంకెక్కడైనా నిలపండి" అని వేడగా దానిని అగ్నియందు నిక్షిప్తం చేశాడు ఈశ్వరుడు. ఆ అగ్నికూడా కొన్నేండ్లు జ్వలించి ఆ తేజాన్ని సహింపలేక మొఱపెట్టుకోగా ఈశ్వరుడు శాశ్వత సత్త్వ సంపన్నుడైన వాయువును పిల్చి వహించమని కోరాడు. ఆ వాయువు కూడా వేయి సంవత్సరాలు ఆ తేజస్సుతో చరించి ఇక వహించలేక అంజనా గర్భంలో ప్రవేశపెట్టాడు.

"దేవీ! సీతా! జగత్పావని ఐన అంజనాదేవి గర్భంలో పండ్రెండు మాసాలు పెరిగిన ఆ ఏకపాద రుద్రతేజమే ఈ హనుమ!" అని ఆ

వృత్తాంతాన్ని చెప్పి ముగించాడు శ్రీరామచంద్రుడు.

**కేసరియను వానరుని వృత్తాంతం.**

అడుగడుక్కి ఎంతో అద్భుతావహంగా ఉన్న ఆంజనేయుని పూర్వావతార వృత్తాంతాన్ని ఆశ్చర్యంతో విన్న సీతాదేవి ఇలా అడిగింది: "నాథా! వాయుదేవుడు ఆ తేజాన్ని ఏ రూపంలో అంజనాదేవి కిచ్చాడు? అంజన ఎవరి కూతురు? ఎవని భార్య? లోకపావనుడైన పావని అంజనా గర్భాన ఉద్భవింపగల ఆమె భాగ్యమేమి? హనుమకు తండ్రి ఐన ఆ జగద్ధితాత్ముని చరిత మెట్టిది?" ఇలా ఎంతో కుతూహలంతో ప్రశ్నించిన జానకితో రాముడిలా అన్నాడు:

"దేవీ! పూర్వం అశేషశేముషీ విభవుడు, మునీశ్వరాశీర్వచన శుభశీలుడు, పార్వతీ పరమేశ్వరార్చనా నిమగ్న మానసుడు, సమస్త ఆగమ ధురంధరుడు ఐన కేసరి అనే వానర ముఖ్యుడు అరవైవేల వానరులు తనను కొల్వగా దేవతా విహారభూమి ఐన హిమాలయగిరి భూమియందు రాజ్యం చేస్తూ ఉండేవాడు. అతడు బలము, తేజము, భోగము, భాగ్యము ఇలా సమస్తము కలవాడయ్యును దేవతాగిరి సార్వభౌమాధికారాన్ని కోరి ఘోరమైన తపస్సు చేశాడు. ఆ తపఃఫలంగా స్వేచ్ఛా వర్తనము, ధర్మదయా పరత్వము, పరేంగిత జ్ఞానము, రోగ, జరా మరణ జయము ఇలా చాలా శక్తులను వరంగా పొందాడు.

**కేసరి శంబసాధసుడను దైత్యుని వధించిన వృత్తాంతం.**

ఆ కాలంలో శంబసాధసుడనే దైత్యుడు శౌర్యంలో తనసాటి వేరొకడు ఉండరాదనే కాంక్షతో తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి వరాలను పొందాడు. ఆ వరగర్వంతో దేవతలను, పన్నగులను, అప్సరస్త్రీలను చాలా క్రూరంగా హింసించేవాడు.

"నేను గాక మీరెవరు శిరసున రత్నాలను ధరింపరాదు" అంటూ దేవతా సర్పాల పడగల మీది మణులను పెటికి వేసేవాడు.

"నేను తప్ప మీరెవరు తపస్సు చేయరాదు!" అంటూ మునుల గడ్డాలను గుంజేవాడు.

"పూర్వదేవతల రాజును నేనే! నన్నే కొలవండి!" అంటూ అప్సరసల కొప్పు పట్టుకొని ఈడ్చేవాడు.

"యజ్ఞభాగం నా కివ్వరా?" అని దేవతల కిరీటాలను తన్నేవాడు.

ఇలా వాడి బారిన బాధలు పడిన వారంతా బ్రహ్మను చేరి తమ గోడును చెప్పుకోగా, వారికి ఆయన కేసరిని దిక్కుగా చూపించాడు. అప్పుడు వారంతా వానర రాజైన కేసరిని సమీపించి "ఓ! మహాత్మా! కేసరీ! నీ సరి శౌర్యోత్సాహవంతులు లేరు. దేవజాతులన్నీ శంబసాధసుని బారినపడి పడ్డపాట్లకు లెక్కలేదు. చివరకు ఎంత పాపం చేసి ఈ దేవతాజన్మను పొందామో అనే స్థితికొచ్చాం! వాడిని సంహరించి మమ్ములను ఈ ఆపదనుండి గట్టెక్కించి మా ప్రాణాలను రక్షించు!" అని ప్రార్థించారు.

ఇక్కడిలా దేవతలు పడరాని పాట్లు పడుతుండగా అక్కడ త్రిలోక సంచారియైన నారదుడు తన మహతిని మీటి హరినామ సంకీర్తన చేసికొంటూ శంబసాధసుని సందర్శించి "శుభమస్తు నిశాచరచంద్ర" అంటూ ఆశీర్వదించాడు. ఎంతైనా నారదుడు కలహప్రియుడు కదా! వెంటనే ఆ దైత్యుడు జోహారు చేసి "దేవమునీ! ఎక్కడ నుండి ఎక్కడకు ప్రయాణం? లోకవార్త లేమిటి?" అంటూ ప్రశ్నించాడు. అడిగిందే తడవుగా "దైత్యశ్రేష్ఠా! లోకవార్త లేమిటి? అని అడుగుతున్నావా? ఇంకా నీ దాకా రాలేదా! నీ గూఢచారి వ్యవస్థ ఏమైంది? నెలగ్రాసం తీసికొంటూ నిద్రపోతున్నారా?" అంటూ అర్థోక్తిలో ఆగాడు నారదుడు. ఆ దైత్యుని ఆరాటం పదింతలైంది. "ఈ వార్త నా నోటితోనే చెప్పవలసి వస్తుందని నేననుకోలేదు! సరే! చెపుతాను విను! దేవతలంతా నిన్ను చంపటంకోసం ఒక వానరుణ్ణి ప్రార్థిస్తున్నారు. జాగ్రత్త!" అని చావుకబురు చెప్పి చల్లగా వెళ్ళిపోయాడు... నారదుడు.

ఆ వార్త విన్న శంబసాధసుడు అగ్గిమీద వేసిన గుగ్గిలంలా భగ్గున మండిపడి “ఇంత దుర్మార్గానికి తలపెట్టారా! దేవతలు! పోనీలే ఎంతైనా జ్ఞాతులం కదా అని దయతలచి ప్రాణాలతో విడిచినందుకు నాకే హాని తలపెడతారా! ఔరౌరా! ఆ కోతిబలంతో నన్నెట్లు గెలుస్తారో చూస్తా!” అని రోషంతో దంతఘట్టనం చేశాడు. దేవతలకది పిడుగుపాటైంది. పుడమి కంపింపగా అడుగులు వేసికొంటూ ప్రళయకాల శూలపాణిలా కృపాణాన్ని చేపట్టి అట్టహాసం చేశాడు. కృపాణధారా కాంతులకు దిక్కులన్నీ ఒక్కసారే మెరిసినట్లైంది. ఆ దనుజుని అట్టహాసం గిరికందరాలలో ప్రతిధ్వనించగా వనమంతా వెలవెల పోయింది. నాకవాసులంతా వ్యాకులచిత్తు లయ్యారు. విలయకాల నీలజీమూతంలా వస్తున్న ఆ శంబసాధసుని చూచి గీర్వాణులంతా కీడు మూడిందని ప్రాణభయంతో వణికిపోయారు. కొండగుహలలో దూరేవారు కొందరు, విధిని నిందించువారు కొందరు, తమ్ముతాము దూషించుకొనువారు కొందరు, కేసరిని శరణు కోరినవారు కొందరు... ఇలా తలకొక దిక్కుగా చెల్లాచెదరయ్యారు.

అలా ప్రాణభయంతో పాఱిపోతున్న వేల్పులను చూచి “పాఱిపోయి ప్రాణాలు దక్కించు కొందామను కొంటున్నారా? పిరికి పందల్లారా! నా భీకర శౌర్యాగ్నికి మీరు శలభాల్లా మాడి చావాల్సిందే!” అంటూ మాటలతోనే ముందు చంపుతూ వేల్పుల వెంట తరుముతూ వచ్చాడు శంబసాధసుడు.

కపిసార్వభౌముడైన కేసరి మహోగ్రుడై ఆ దైత్యునికి అడ్డంవచ్చి “ఓరీ! దైత్యాధమా! ధర్మంతప్పి చరించే నీ పాలిటి కాలయముణ్ణి! నీ రాజసం అణగించటానికి వచ్చాను” అంటూ పట్టుకోబోయాడు.

అంత ఆ అసురుడు “ఓరీ కోతీ! నాతో యుద్ధం చేయటానికి నిటలాక్షుడు కూడా తటపటాయిస్తాడు. నువ్వు నాతో ఎలా సరిజోడు కాగలవు? నా ముందు నిలబడడానికి కూడా నీకు సామర్థ్యం లేదు. పరుగుతీస్తున్న బండి క్రింద పాదం పెడితే బండి ఆగుతుందా? దేవతలను తరుముతున్న నాకు నీవు అడ్డు రావటం అలాంటిదే!” అని కత్తి ఎత్తాడు. అంత

కేసరి జూలు విదళించిన కేసరి వలె దిక్కులదరునట్లుగా పెద్ద అఱపు అఱిచి కండ్ల నిప్పులు రాల పెద్ద బండరాయిని విసిరాడు. ఇదేగదా... నీ సాధనం అంటూ ఆ బండను తన గదతో ముక్కలు చేశాడు దైత్యుడు. వెంటనే ఇంకొక పెద్ద బండరాయిని గురిపెట్టి వేశాడు కేసరి. ఆ విసురుకు సొమ్మసిల్లి తేరుకొని "ఔరా! వనచరా! తగిన వాడవే! నీ భుజబలం గొప్పదే! నా గదాఘాతం కూడా ఎలాటిదో చూడు" అంటూ ఱొమ్ముకు గుఱిచూసి గదను విసరగా అది పొడియై నేలకు రాలింది. గదాఘాతానికి చలించక నిలిచిన కేసరిని చూచి ఉక్రోషంతో శంబసాధసుడు శూలాన్ని విసిరాడు.

కాలసర్పాన్ని పట్టిన గరుడుని వలె ఆ శూలాన్ని నేర్పుతో పట్టి మోకాలి పట్టుతో విరిచాడు కేసరి. ఆయుధాలన్నీ నిరుపయోగంకాగా అసహాయుడైన అసురుడు బాహు యుద్ధానికి తలపడ్డాడు. అదే అదనుగా బలంగా పిడికిట ఒక్కపోటు పొడిచే సరికి బుడబుడ రక్తం కక్కుకొని సాయుజ్యాన్ని పొందాడు శంబసాధసుడు.

మహారోషంతో హిరణ్యకశిపుని చంపిన నృకేసరిలా ఉన్న కేసరిని చూచి దేవదుందుభులు మ్రోయగా, గంధర్వులు పాడగా, అచ్చరలు ఆడగా కోలాహలంగా దేవతలంతా అతనిని చుట్టి స్తుతించి మిక్కిలి సంభావించి లోకోపకారకమైన చక్కని హితోపదేశాన్ని ఇలా చేశారు.

**దేవతలు కేసరిని వివాహానికి ప్రోత్సహించుట - వివాహ పరమ ప్రయోజనం.**

"నాయనా! కేసరీ! ఇప్పటి వరకు శమదమ సత్య శౌచములకు లోటు రానీకుండా బ్రహ్మచర్య దీక్షను నడిపావు. ఈ పైన గృహస్థ దీక్షను స్వీకరించు. అన్ని ఆశ్రమాల్లోకి గృహస్థాశ్రమం చాలా గొప్పది. భార్యకంటె ప్రియమైన వస్తువులేదీ లోకంలో. పరస్పర విరుద్ధమైన చతుర్విధ పురుషార్థాలకు సమన్వయస్థానం భార్య. దాంపత్యానికి ఫలం సంతానం. గృహస్థు కానివానికి పరిపూర్ణత లేదు.

కేసరీ! నీకొక్క పరమ రహస్యం చెపుతాము... విను! ఇప్పటి వరకు సంహితను అంటే వేదాన్ని అధ్యయనం చేశావు. పరమేశ్వరుడు సంహితా స్వరూపుడు. సంహిత: 1. పూర్వ రూపము, 2. ఉత్తరరూపము, 3. సంధి, 4. సంధానము అనే నాలుగు అవయవములు కలది. ఆచార్యుడు అంటే గురువు పూర్వరూపం. అంతేవాసి అంటే శిష్యుడు ఉత్తరరూపం. విద్య సంధి. విద్యార్జనకోసం చేసే ప్రయత్నమే సంధానం.

సంసారం కూడా సంహితా స్వరూపమే. తల్లి పూర్వరూపం. తండ్రి ఉత్తరరూపం. సంతానం సంధి. సంతానం కోసం ప్రవర్తించే క్రియ గాని లేదా ఆ క్రియ ఫలించే కాలంగాని సంధానం. అందువల్ల ఇప్పటి వరకు వేద సంహితాభ్యాసం చేశావు. ఈపైన సంసార సంహితాభ్యాసం చెయ్యి. సృష్టిలోని పదార్థ ప్రపంచాన్ని, జీవులను విడదీయటానికి వీలు లేకుండా కలిపి ఉంచే శక్తికే 'సంహిత' అనిపేరు. అది అనాది. స్వతంత్రమైనది. అది పరమాత్మ స్వరూపమే! అది సర్వవ్యాపి.

వేదం కూడా నాలుగు అవయవములు కలిగి ఉంటుంది. 1. మంత్రం: ఇదే పూర్వరూపం. 2. బ్రాహ్మణం: ఇదే ఉత్తర రూపం. 3. ఆరణ్యకం: ఇదే సంధానం. 4. ఉపనిషత్తు: ఇదే సంధి. ఇదే విద్యారూప ఫలం. అంటే జీవేశ్వరుల ఏకత్వాన్ని బోధించే ఉపనిషత్ జ్ఞానరూపమైన ఫలమే సంధి.

సంతానాన్ని కోరి దాంపత్య ధర్మాన్ననుసరించి ప్రవర్తించే క్రియలో జనులు ఎలాటి అద్వైత ఆనందాన్ని పొందుతున్నారో... పరమాత్మ నుండి నిత్యము ప్రవాహ రూపంగా వ్యక్తమయ్యే జగద్రూపమైన సృష్టి కార్యంలో కూడ పరమాత్మ అట్టి ఆనందాన్నే పొందుతున్నాడు. సృష్టికార్యం తైలధారావచ్ఛిన్నంగా అఖండంగా సాగుతూనే ఉంటుంది. అందుకనే పరమాత్మ అఖండానంద స్వరూపుడని ఉపనిషత్తులు నొక్కి చెప్పాయి. ఆనందంలోనే సృష్టి, ఆనందంలోనే స్థితి, ఆనందంలోనే లయములు

కొనసాగుతూ ఉంటాయని, పరమాత్మనుండి వేరైనట్లుగా అనిపిస్తున్న జీవాత్మకూడా ఆనంద స్వరూపుడే అని వేదం పదేపదే హెచ్చరించింది.

కేసరీ! చైతన్య స్వరూపులైన దంపతుల సంధాన ఫలంగా జన్మించిన ఆత్మరూపులైన సంతానం "ఆత్మావై పుత్ర నామాసి" అనే న్యాయం చొప్పున తల్లిదండ్రుల కంటె ఎలా భిన్నం కాదో... అలాగే శివశక్తుల సమాగమం వల్ల వ్యక్తమవుతున్న ఈ జీవ – జగత్తులు వారి కంటె భిన్నం కావు."

ఇలా హితోపదేశం చేసి తమతమ నెలవులకు చేరుకొన్నారు వేలుపులు.

**అహల్య - గౌతముల వృత్తాంతం.**

దేవతలు చేసిన హితోపదేశాన్ని శిరోధార్యంగా స్వీకరించి అనుకూల కన్యాన్వేషణా తత్పరుడయ్యాడు కేసరి.

దేవీ! జనకనందినీ! హనుమ వంటి మహామహుని కనిన పవిత్రమూర్తి అంజనాదేవి. ఆమె జన్మ వృత్తాంతాన్ని చెపుతాను విను.

" ఒకనాడు సృష్టికర్త ఐన పితామహుడు తన పూర్వసృష్టిని గూర్చి పర్యావలోకనం చేస్తూండగా అందులో కొన్ని దోషాలు తోచాయి. తద్దోషాలను పరిహరించి అప్పటి వరకు చెయ్యని నూతన సృష్టిని చేయ సంకల్పించినవాడై... ఏ వంకలేని ఒక మహా సౌందర్యరాశిని సృజించాడు. ఆమెకు అహల్య అని పేరుపెట్టి గౌతమ మహర్షికి భార్యగా ఇచ్చి చక్కగా ఏలుకొమ్మన్నాడు" అని చెప్పి మౌనం వహించాడు రాముడు.

"నాథా! పూర్వ సృష్టిలో తాతగారికి తోచిన తప్పులేమిటో?" అంటూ మందహాసం చేసింది... మైథిలి.

"దేవీ నీ విషయంలో కాదులే. ఎందుకంటే నీవు తాతగారి సృష్టిలోని దానివి కావు గదా! చెపుతాను విను. చంద్రుడు అందగాడే కాని వృద్ధిక్షయాలున్నాయి. కలువలు పగలు ముడుచుకొంటాయి. మణులకు కూడా మలినం ఉంది. చిగురాకులు ముదురుతాయి. మొల్లమొగ్గలు మొన

విచ్చుకొంటాయి. శంఖం బురదలో పుడుతుంది. పూబంతులు తమ వాసనను కోల్పోయి వాడిపోతాయి. కాక లేకుండా బంగారానికి వన్నె రాదు. ఇవన్నీ దోషాలే కదా? ఈ దోషాలన్నింటిని పరిహరించి ముఖాన్ని, కన్నులను, చెక్కిళ్ళను, పెదవులను, పళ్ళను, కంఠాన్ని, స్తనాలను, శరీరాన్ని సృజించి 'అహల్య' అని పేరుంచాడు విధాత.

బ్రహ్మకూతురైన అహల్య ఆ విధంగా గౌతమ మహర్షి భార్యయై ఆయన అనుష్ఠానానికి, తపస్సుకు, అవసరమైన ఉపకరణాలను సమకూరుస్తూ అనుకూలవతియై సంసారం చక్కదిద్దుకొంటూ ఉండగా...

**అహల్యాఇంద్రుల సమాగమం. వాలి జననం.**

దేవరాజైన ఇంద్రుని కన్ను అహల్య మీద పడింది. ఇంద్రునికి అహల్య మీద మోహం పుట్టటానికి గల కారణమేమంటే బ్రహ్మ అహల్యను సృష్టించిన వెంటనే ఆమెను తనకు భార్యగా ఇమ్మని బ్రహ్మను కోరాడు... ఇంద్రుడు. **విధివిలాసంగా** అహల్య గౌతముని భార్య అయింది. అప్పటి నుండి ఇంద్రునికి ఆమె మీది మనసు మళ్ళలేదు.

ఒక రోజున ఇంద్రుడు కోడిరూపంలో గౌతమ ముని ఆశ్రమ ప్రాంతంలోకి వచ్చి తెల్లవారక ముందే కోడికూత కూసాడు. వేకువ జామైంది అనే భ్రమతో ముని నదీతీరానికి అనుష్ఠానానికై వెళ్ళాడు. ఆ వెంటనే ఇంద్రుడు ఆశ్రమ కుటీరంలోనికి ప్రవేశించి అహల్యను తన **ఇంద్రజాలంతో** ముంచి మనసులోని చిరకాల వాంఛను తీర్చుకొని మఱలి పోయేటంతలో యెట్టయెదుట గౌతమ ముని ప్రత్యక్షమయ్యాడు. ఆయన అమరేంద్రుని కనుగొని జరిగినది తెలుసుకొని ఆగ్రహంతో శపించి అహల్యను కూడా శపించబోయే టంతలో అక్కడ విధాత ప్రత్యక్షమయ్యాడు.

ప్రత్యక్షమై "నాయనా! గౌతమా! అందచందాలలో వంకలేనట్లుగా ఈ అహల్యను సృజించాను. కంతు, జయంత, వసంతులు, చంద్ర

దినేంద్రులు, ఇంద్రాది దిక్పాలకులు ఒకరేమిటి సమస్త దేవలోకం ఎవరికి వారే తమకిమ్మని పలుమార్లు ప్రార్థించినా...

నీ జపానికి – తపానికి, ఆచారానికి – అనుష్ఠానానికి, అగ్నిహోత్రానికి అధ్యయనానికి అనువుగా ఉంటుందని నీవు అర్థించకుండానే నీకు అర్ధాంగిగా కట్టబెట్టాను. చతుర్ముఖుడనైన నా అపురూప సృష్టి గదయ్యా!... ఈ అహల్య! ఈమెను కన్నకడుపు శ్రుతిమాత! అమృతాన్ని ఆస్వాదించి, ఐరావతాన్ని అధిరోహించి, అమందానంతో నందనవన విహారం సలుపవలెననే కాంక్ష ఆమెకు గాని నాకు గాని ఉండి ఉంటే.... ఆనాడే ఈ దేవరాజుకు భార్యగా ఇచ్చి ఉండే వాడిని గదా? నా సృష్టిని తప్పుపట్టే వారుంటే ఈమెను తప్పు పడతారు.

మహర్షీ! నీ ఆశ్రమ ప్రాంతమంతా ఇప్పటివరకు గోవులు సంచరించే పచ్చిక బయలుగానే ఉంది. ఈపైన ఈ అహల్య సహకారంతో ఈ మైదానాన్ని సస్యఫల కేదారంగా మార్చుకో! ఆశ్రమ ప్రాంతాన్ని ఉపవనంగా తీర్చిదిద్దుకో! ఇప్పటి వరకు వండి వార్చే ఆడదిక్కు లేదు కనుక కందమూలాలతో, గోక్షీరంతో కాలక్షేపం చేశావు. ఈ పైన నీ భోజనం అలవాట్లను మార్చుకో. శాల్యన్నం, శాకపాకాలతో, దధిఘృతాలతో, సూప అపూపాలతో హాయిగా భోజనం చెయ్యి. వండి పెడుతుంది... ఈ అహల్య. ఈ అహల్య ఉన్నచోట కఱవు అనేది ఉండదు. దేశం సుభిక్షంగా ఉంటుంది. ఈ వరం నీకిస్తున్నాను.

కొంచెం ఛాందసాన్ని తగ్గించుకో. దినమంతా జపతపాదులు, అగ్నిహోత్రం, అనుష్ఠానం, అధ్యయనం మాత్రమే కాదు. నీకోసం ఒక ఇల్లాలు కనిపెట్టుకొని ఉంటుంది అనే విషయాన్ని మనసులో ఉంచుకో. వచ్చినవాడు సామాన్యుడు కాడు... వాసవుడు! దేవతా సార్వభౌముడు. దేవకార్యం మీద వచ్చాడు. నువ్వు కొంచెం తొందరపడ్డావు. ఈపైన కోపతాపాలకు గురై శాపజలాన్ని అందుకోకు. ఎందుకంటే ఈ అరణ్యంలో దేవ మహిమలే

కాదు... రాక్షస మాయలు కూడా చాలా ఉంటాయి! మాయకోళ్ళు... మాయలేళ్ళు వాటికేం లోటు!

ఇంత మాత్రమే కాదు... ఈపైన ఇలాంటివి ఇంకా కొన్ని జరగవచ్చు! అందువల్ల భవిష్యత్తులో ఒకటి రెండు ఇలాటి భ్రమ ప్రమాదాలు జరిగినా తొందర పడవద్దని నీకు హితవు చెప్పటానికే నేను వచ్చాను" అని భవిష్యత్తును సూచించి గౌతముని వద్ద నుండి మాట పుచ్చుకొని పితామహుడు అదృశ్యుడయ్యాడు.

దేవకార్యాన్ని ముగించుకొని నాకలోకానికి చేరుకొన్నాడు... త్రిదశాధిపతి ఐన ఇంద్రుడు. ఇంద్రతేజాన్ని తన గర్భాన ధరించి కొంతకాలానికి ఒక గొప్ప బలశాలి ఐన కుమారుని కన్నది... అహల్య. అతనికి వాలి అని నామకరణం చేశారు. ఆ బాలుణ్ణి అల్లారుముద్దుగా పెంచుకొంటూ అన్యోన్యంగా అహల్యాగౌతము లిద్దరు ఆశ్రమ జీవితం హాయిగా నడుపు కొంటున్నారు.

**అంజన జననం**

ఆ అనురాగానికి ఫలితంగా నెలతప్పి శుక్లపక్ష చంద్రునిలా నెలలు నిండగా... తూరుపు దిక్కున పున్నమ చంద్రుడు ఉదయించినట్లు సకల గుణరంజన ఐన ఒక బాలికను కన్నది అహల్య. ఆమెకు అంజన అని నామసంస్కారం చేశారు.

కమ్మని పిండి నలుగుపెట్టి, సంపెగ నూనెతో తలంటి, పన్నీట జలకమాడించి, మెత్తని క్రొత్త వలువల తడియొత్తి, రక్షపెట్టి, కన్నుల కాటుక తీర్చిదిద్ది, పయ్యెద చేర్చుకొని చెక్కులు నొక్కి, మోము మోమున చేర్చి ముద్దాడి, పాలిచ్చి ఆకటి పోరార్చి, బాలను ఉయ్యాలలో ఉంచి జోలపాడి నిద్దురపుచ్చి... ఈ విధంగా ప్రతిదినం బాలను అల్లారు ముద్దుగా పెంచుతోంది అహల్య. ఆ బాలిక కూడా శశిరేఖలా దినదిన ప్రవర్ధమానమవుతూ బాల్యాన్ని వీడి కన్నెతనపు వన్నెచిన్నెలన్ని సంతరించుకొని తోటి కన్నెలతో ఆటపాటల మధ్య పొద్దు పుచ్చుతూ సకల

విద్యాప్రపూర్ణురాలైంది. అగ్రజుడైన వాలి కూడా ఆశ్రమవాసు లందరి అభిమానాన్ని చూరగొంటూ తల్లిదండ్రులకు చేతోమోదాన్ని చేకూరుస్తూ వయసు మీరుతున్నాడు. ఆ విధంగా వాలిని, అంజనను అపురూపంగా పెంచుకొంటూ పతిసేవకు ఏ లోటు రాకుండా చూసుకొంటూ మితిమీరిన సంతోషంతో తన సౌందర్యం ఆశ్రమ ప్రాంతానికి వెన్నెలై విరియగా కాపురం చేసికొంటూన్నది అహల్య.

**అహల్యాసూర్యుల సమాగమం. సుగ్రీవ జననం.**

ఆ అహల్యాదేవి ఒక రోజు వేకువ జామున ఋతుస్నాతయై ఆశ్రమ ప్రాంగణంలో పువ్వులను కోసికొంటున్న వేళ... తొలిగట్టున తోచిన దినరాజు వనకన్యలా తోచిన ఆమె నవ్య సౌందర్యానికి ముగ్ధుడై మనసు పారేసుకున్నాడు. మనసు పారేసుకున్నదే తడవుగా మరో ఆలోచన లేకుండా కర్తవ్యాన్ని మఱచి కర్మసాక్షి దివి నుండి భువికి మంత్రమూర్తియై ప్రత్యక్షమయ్యాడు.

మందేహాది రాక్షసుల మదమణగించే కార్యక్రమాన్ని ఆవలపెట్టాడు.

తుంబురు, నారద, హాహా, హూ హూ, విశ్వావసు, అగ్రసేన ఇత్యాది గంధర్వుల గానాన్ని పట్టించుకోలేదు.

మేనక, సహజన్య, ఘృతాచి, ఊర్వశి, తిలోత్తమ, రంభాది ద్వాదశాప్సర స్త్రీల నృత్యాన్ని క్రీగంటనైనా చూడలేదు.

కేవలం సూర్యకిరణాలనే ఆహారంగా సేవిస్తూ జీవించే అంగుష్ఠ మాత్ర పురుషులైన అరువదివేల వాలఖిల్యాది ఋషుల సూక్తపఠనాన్ని పెడచెవిని పెట్టాడు.

బ్రాహ్మణులు నెరవేర్చే సంధ్యావందనాది కృత్యాలలో మంత్ర పూతంగా ఇచ్చే అర్ఘ్యాన్ని స్వీకరించలేదు. మంత్రమూర్తి కావున భువర్లోకాధిపతి ఐన ఆదిత్యుడు స్వర్ణమయ శరీరంతో అహల్య ముందు సాక్షాత్కరించాడు.

**సూర్యలోక మాహాత్మ్యము.**

దేవీ! జనకనందినీ! సూర్యమండల ప్రాశస్త్యాన్ని కొద్దిగా చెపుతాను విను. ఆదిత్యుడు ఒక్కడే ఐనా మేషాది పన్నెండు రాశుల్లోను సంచరించేటప్పుడు ద్వాదశాదిత్యులుగా పిలువబడుతున్నాడు.

ద్వాదశ ఋషులు ఆ స్వరూపాన్ని నిత్యమూ కీర్తిస్తూంటారు.

ఆయన రథానికి ద్వాదశ సర్ప ప్రముఖులు రజ్జువులు.

ద్వాదశ గంధర్వులు గాయకులు.

ద్వాదశ అప్సరసలు ఆయన ముందెప్పుడూ నృత్యోత్సవం చేస్తుంటారు.

ఆయనకు ద్వాదశ సారథులు. ద్వాదశ రాక్షసులు ఆయనకు పార్శ్వవర్తులైన కావలిగాండ్లు.

అరవైవేల వాలఖిల్యాదులు అంగుష్ఠమాత్ర పురుషులు ఆయనకు సభాసదులు. సూర్యమండలం ధ్రువమండల పర్యంతం ప్రవాహాశక్తి రూపమైన ఒక రజ్జువు చేత బంధింపబడి ఉంది. ఆ కారణంగా ఆయన గమనం స్వతంత్రం కాదు. నిత్యమూ ఆయనను అనుసరించి సంచరించే బుధ, గురు, శుక్ర, శని, భూ ఇత్యాది గ్రహ మండలాలన్నీ స్వతంత్ర గమనం కలవి కావు. ఇక భూమి మీద సంచరించే మానవుడు అస్వతంత్రుడని వేఱే చెప్పాలా! రోగానికి మూలుగుతూ, జరాభారానికి కాళ్ళీడ్చుకొంటూ, మృత్యువుకు వణికిపోయే మానవుడు... ఏ పాటి స్వతంత్రుడు? కానే కాదు. కొయ్యకు పలుపుతో కట్టబడిన పశువు తనకు స్వాతంత్ర్యం ఉందనే భ్రమిస్తుంది. మానవుని స్వాతంత్ర్యం కూడా అట్టిదే! సూర్యుని చుట్టూ పరిభ్రమించే గ్రహాలన్నీ పరస్పర సంబంధం కలవి. ఆ కారణంగా ఈ భూమి మీది జీవరాశి గమనం, జీవవ్యాపారం... సమస్తమూ గ్రహస్థితి ననుసరించే ఉంటుంది.

దేవీ! సీతా! నేనింతకు ముందు దేవతలు కేసరికి చేసిన హితోపదేశ సందర్భంగా 'సంహితా' స్వరూపాన్ని గురించి చెప్పాను. జ్యోతిశ్శాస్త్రం

వేదాంగాలలో ఒకటి. అందుకని జ్యోతిషం కూడా సంహితయే. ఎందుకంటే... అనేక కోటి తారకా మండలాలతో నిండిన ఖగోళంలో... ఈ భూమితో కలిపి సూర్య కుటుంబంలోని అన్ని గ్రహముల యొక్క అనాది సిద్ధమైన ప్రకృతి సహచర్యాన్ని, వాటి సన్నికర్షను, పరస్పర ప్రభావాన్ని, వాటి మైత్రిని – వైరాన్ని శాస్త్రీయంగా ఋజువు చేసి చెపుతుంది... జ్యోతిష సంహిత. ఒక్క సూర్యునిలోనే ఎన్ని శక్తులు దాగి ఉన్నాయో తెలిసిన వారు వాలఖిల్య, విశ్వామిత్ర, వసిష్ఠ, కశ్యపాది మహర్షులు. అట్టి ఋషి ప్రణీతమే జ్యోతిషం.

దేవీ! జానకీ! సూర్యుడు జ్ఞాన స్వరూపుడు. జ్ఞానం అంటే వెలుగు. వెలుగులోనే సమస్త ప్రపంచము గోచరిస్తుంది కాని చీకటిలో కాదు గదా? వెలుగు అంటే బాహ్య ప్రకాశము, జ్ఞానమంటే పదార్థ విజ్ఞానము మాత్రమే కాదు. సత్తా మాత్రంగా ఉండి అన్నిటిని నడిపే ఆంతర శక్తి ఒకటున్నది. ఆ విధంగా యావత్తు విశ్వాన్ని అన్యోన్యాశ్రయంగా బంధించి ఉంచిన శక్తినే "సంహిత" అంటాం. అదే పరమాత్మ స్వరూపం. అది నేనే! అట్టి పరమాత్మను గూర్చి వివరించే విద్యాస్వరూపాన్ని సంగ్రహంగా చెపుతాను విను!

కళలు – శాస్త్రములు అని విద్యలు రెండు విధాలు. ఈ రెండూ నన్ను గూర్చి చెప్పేవే – నన్ను చేర్చేవే. కళలు మొత్తం అరవై నాలుగు. అభ్యాసంచేత వచ్చేది కళ. అధ్యయనం చేత సిద్ధించేది శాస్త్రం. కళలన్నీ కర్మేంద్రియ వ్యాపారాలు కాగా శాస్త్రములన్నీ జ్ఞానేంద్రియాధీనాలు. కర్మేంద్రియ వ్యాపారాన్ని కర్మ మార్గమని – జ్ఞానేంద్రియ దర్శనాన్ని జ్ఞానమార్గమని ఋషులు లోకానికి తెలియజెప్పారు. ఈ రెంటిలో జ్ఞాన మార్గం శ్రేష్ఠమైనది. అట్టి జ్ఞానాశ్రయమైన విద్యలు పద్దెనిమిది. అందులో మాననీయమైనది మీమాంస. మీమాంస కంటె తర్కశాస్త్రం గొప్పది. తర్కం కంటె వేదరాశి అధికం. అంతకంటె ఉపనిషత్తులు శిరోధార్యాలు. అన్నిటికంటె ఊర్ధ్వపదవి గాయత్రి. కాశీని మించిన నగరం, విశ్వనాథుని మించిన వేలుపు, గాయత్రిని మించిన మంత్రరాజం లేనేలేవు. కడుపు చల్లగా వేదరాశి కన్నతల్లి గాయత్రి.

గాయత్రియే పరబ్రహ్మము. సావిత్రి, విశ్వజనయిత్రి, చతుర్వేద మాత, పర–అపర బ్రహ్మములు... ఈ పేర్లు గాయత్రికి సమాహ్వాయాలు. అట్టి గాయత్రికి అధీశ్వరుడు... హృదయ పుండరీకాలను వికసింపచేసే కమలాప్తుడు. ఈతడు వేదమూర్తి.

దేవీ! జానకీ! ఇదీ... మా వంశకర్త ఐన సూర్య భగవానుని ప్రాశస్త్యం. ఇక కథలోకి వెడదాం.

**గౌతముని శాపం .**

అలా సాక్షాత్కరించిన అంశుమాలిని అహల్య గోరు సోకకుండా కోసిన కుసుమాల పుష్పాంజలి సమర్పించి దివినుండి భువికి దిగిన వైన మేమని దరహాస పూర్వకంగా సభక్తికంగా ప్రశ్నించింది. దరహాసమే అంగీకారంగా "వచ్చిన పని దేవ కార్యమే" అని నచ్చజెప్పి దినకరుడు తన నునులేత కిరణాల సహస్ర బాహువులతో కౌగిలించి గిలిగింతలు పెట్టి పులకలెత్తించి ఆమె గర్భంలో తన తేజస్సును బీజావాపం చేసి తిరిగి తన లోకానికి చేరుకోబోయే టంతలో...

అక్కడ ప్రత్యక్షమయ్యాడు గౌతమ ముని. ఎదురుగా ఉన్న ఉదయ భానుని జూచి నుదురు చిట్లించి, దేవతలు చేసిన పనికి మరోమారు మనసు వికలంకాగా గ్రహరాజును చూచి ఆగ్రహంతోను, అసహనంతోను ఇలా మందలించాడు:

"భాస్కరా! మూర్తి త్రయాత్మకుడవైన నీకు పరవధూ కాంక్ష తగునా? ఆదిత్యా! వేదమూర్తివైన నీవు అన్యకాంతా సంగమం ఆశించవచ్చా? ప్రణవ స్వరూపుడవైన నీకు పరకాంతా వ్యామోహం పాపమని తెలీదా? పరమ హంసలను రంజిల్ల చేసే పరమ పావన మూర్తివి, లోక పాలకుడవు! ఒక ఆశ్రమ వాసినికై ఇంత అపకీర్తి కార్యానికి ఎలా ఒడిగట్టావు? కర్మసాక్షివైన నీవే ఇట్టి అధర్మాన్ని ఆచరిస్తే అల్పులైన మానవులు అన్యకాంతా వ్యామోహం పాపమని ఎంచరు గదా? నీవు చేసిన ఈ పాపకార్యానికి ఫలితంగా, రాహుగ్రస్తుడవై ఈ అపకీర్తి కళంకాన్ని ఈపైన శాశ్వతంగా ధరిస్తావు."

ముని శాపానికి దినరాజు గడగడ వణికి " మహర్షీ! వచ్చినపని దేవ కార్యమైనా తప్పు తప్పే గదా. శాపమోక్షాన్ని అనుగ్రహించ వలసింది" అని ప్రార్థించాడు. "కమలాప్తా! నువ్వు రాహుగ్రస్తుడ వైనప్పుడు అది లోకానికి పర్వదిన మవుతుంది. ఆ విధంగా నువ్వు కళంక రహితుడ వవుతావు." అని ముని తన అనుగ్రహంతో శాప విమోచనాన్ని కల్పించాడు. గతంలో బ్రహ్మదేవుడికి ఇచ్చిన మాటప్రకారం అహల్య మీద ఆగ్రహాన్ని ప్రదర్శించలేదు. సూర్యతేజోద్భవుడైన కుమారునకు సుగ్రీవుడని నామ సంస్కారం చేశారు. అగ్రసుతుడైన వాలిని, అంజనను, సుగ్రీవుని మక్కువతో పెంచుకొంటూ ఎప్పటిలాగే ముని దంపతులు ముచ్చటగా కాపురం చేసికొంటున్నారు.

దేవీ! ఎవరి కాపురాల్లో ఎప్పుడు ఎలాటి చిచ్చు రేగుతుందో తెలియదు గదా! గతాన్ని మఱచి కలతలు లేకుండా తలపులొక్కటిగా ఆశ్రమ జీవితాన్ని నడుపు కొంటున్నారు అహల్యాగౌతములు. పిల్లల సంరక్షణలోను ముని పరిచర్యలలోను మునిగి అహల్య చిత్తాన్ని అన్యథాయత్తం కానీకుండా ఆశ్రమ నిర్వహణలోను, అతిథి అభ్యాగత సేవలోను తలమున్కలైంది.

**అహల్యాఇంద్రుల సమాగమం.**
**గౌతముని శాపం.**
**శతానంద జననం.**

కాని నిర్జర సార్వభౌముడైన ఇంద్రుడు అహల్య మీది మమతను చంపుకోలేక, మనసును మళ్ళించు కోలేక ఒక అర్ధరాత్రి ఆశ్రమ ప్రాంతంలో ప్రవేశించాడు. తెల్లవారకుండానే కోడికూత కూసి వేకువ జామైందనే భ్రమను మునికి కల్పించి అహల్యను మరోసారి అంటుపఱచి అదృశ్యుడై అమరావతికి వెళ్ళిపోయాడు. ఇదంతా గమనించిన అంజన తన తండ్రియైన గౌతముడు రాగానే పూసగుచ్చినట్లు వివరించింది. విన్న గౌతముడు ఆజ్యాహుతికి భగ్గున మండిన అగ్నిహోత్రంలా పెల్లుబికిన ఆగ్రహంతో అమరేంద్రుని అభిశప్తుని జేసి అహల్యను శిలాకృతివి గమ్మని

శపించాడు. అహల్య గడగడ వడకి తన నేరమేమీ లేదని విన్నవించి శాపావధిని తెలుపమని కోరింది.

భవిష్యద్దర్శనం గల ముని శ్రీరామపాద సంస్పర్శనా సౌభాగ్యానికి నోచుకొన్న క్షణం శాపావధిగా సూచించాడు. సూచించి ఇంకా ఇలా అన్నాడు: "అహల్యా! నీకు కొన్ని విషయాలు చెపుతాను విను! ఇప్పుడు పుట్టిన పిల్లవాడు, శతక్రతుడైన ఇంద్రుడు నీ వల్ల శతానందాన్ని పొందిన కారణంగా జన్మించాడు. కనుక శతానందుడనే నామధేయంతో లోకపూజ్యు డవుతాడు. కొడుకులందరు అన్యజాతులైన కారణంగా నాకు తలవంపులుగా ఉంది. కన్నకడుపైన కారణంగా నీకు సమభావం ఉండవచ్చు. ఇంద్ర దినేంద్రులకు జన్మించిన ఈ వాలిసుగ్రీవులు ఇప్పుడున్న ఈ శరీరాలను విడిచి వారి తండ్రుల యందు కలుస్తారు. ఆ అంశలతో ఇంకొక కపిముఖ్యునకు జన్మించి వనచరులై ఇప్పటి వాలిసుగ్రీవ నామధేయాలనే ధరిస్తారు. ఈ ఇద్దరికి ఒకే స్త్రీ భార్య అవుతుంది. సోదరమైత్రి వారి మధ్య ఉండదు... ఎప్పుడూ కలహమే!"

ఈ విధంగా భవిష్యద్దర్శనంతో శాపమిచ్చిన తండ్రిని జూచి వాలిసుగ్రీవులు "తండ్రీ! కొడుకుల పైనే కోపం తగునా? మీ శాపాన్ని ఉపసంహరించుకొని మమ్ములను రక్షించండి. మాకా కపిజన్మలు వద్దు," అని ప్రార్థించారు. "ఋషి వాక్కు అమోఘం! తప్పదు. అలాగే జరగవలసి ఉంది. అనుభవించండి!" అని తన శాపాన్ని స్థిరీకరించి వెళ్ళిపోయాడు... ముని.

**అంజనను వాలి అహల్యలు శపించుట సుగ్రీవుడు ఊరడించుట.**

సీతా! చిత్రగతిని నడిచిన ఆ తరువాత వృత్తాంతం విను! మునీంద్రుడు అలా వెళ్ళగా జూచి అహల్య, వాలి... కన్యయైన అంజనను అసహనంతో ఇలా శపించారు. "అంజనా! అసలిదంతా నీ మూలంగానే సంప్రాప్తించింది. మీ నాన్నకు నువ్వే

చెప్పావు! బాలవని అనుకొన్నాం గాని ఇంతటి జంతవని ఊహించలేదు! నువ్వు కపికాంతవై చరించు!"

ఆ మాటలు విన్న సుగ్రీవుడిలా అన్నాడు: "ఇదంతా **విధివిలాసం! విధిమాయ** అఘటనఘటనా చాతుర్యం కలది. ఇందులో అంజనపై ఆగ్రహించటానికి ఏముంది ? కర్మననుసరించి జీవులకు శుభాశుభాలు ఆయా కాలాల్లో సంప్రాప్తిస్తాయి. అల్పులు ఈ తత్త్వాన్ని తెలుసుకోలేక మిథ్యా విమోహంలో చిక్కుకొంటారు." అని ఈ విధంగా తల్లికి అన్నకు హితబోధ చేసి సుగ్రీవుడు భవిష్యజ్ఞానం కలవాడు కావున అంజనను ఇలా ఊరడించాడు.

"అంజనా! అన్నగారైన వాలి, కన్నతల్లి ఐన అహల్య నిన్ను దురాగ్రహంతో శపించారని విచారించకు. వివేకశాలి ఐన ఒక కపిముఖ్యుడు నీకు భర్త అవుతాడు. ముల్లోకాలలోను సర్వగుణధాముడైన ఒక పుత్రుని కంటావు. ఆ పుత్రుడు నాకు ఆత్మీయుడైన స్నేహితుడవుతాడు." ఇలా చెప్పి సుగ్రీవుడు యోగంచేత శరీరాన్ని త్యజించి సూర్యమండలాన్ని చేరుకొన్నాడు. వాలికూడా ఏ వ్యామోహములేక ఇంద్రప్రాప్తిని పొందాడు. తిరిగి వారిద్దరూ ఆయా అంశలతో ఋక్షరజుడనే వానరునకు పుత్రులై జన్మించారు. అహల్య శిలయై బాహ్యసంచార ప్రవృత్తులను అరికట్టి నా పాదస్పర్శతో పునర్జీవనాన్ని పొంది నగజాత వలె లోకారాధ్య ఐంది."

ఇంత వరకు శ్రద్ధగా విన్న ధరాత్మజ ఐన సీత "నాథా! అంజనాదేవి అవతల వృత్తాంతం చెప్పవలసింది" అని వేడగా శ్రీరామచంద్రుడు ఇలా శ్రవణానందంగా చెప్పసాగాడు:

**ఫలశ్రుతి**

ఈ పవిత్ర చరిత్ర వ్రాసినా, చదివినా, విన్నా ఆయా దేవాతానుగ్రహం కలిగి సర్వైశ్వర్యాలు సిద్ధిస్తాయి.

## ప్రథమాధ్యాయం సమాప్తము.

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## ద్వితీయాధ్యాయము

అఖిల భూతదయా గరిష్ఠుడైన వసిష్ఠుడు శతానందుని జూచి ఇలా అన్నాడు. "శతానందా! విను! సీతకు రామచంద్రుడు తరువాత కథను ఇలా వినిపించాడు.

"దేవీ! జానకీ! ఆపైన గౌతమ ముని శతానందుని మీ తండ్రిగారైన జనక మహారాజు వద్ద పురోహితునిగా కుదిర్చి... కూతురైన అంజనతో హర్ష విషాదాలు క్రమ్ముకొనగా ఇలా అన్నాడు. "అమ్మాయీ! నీకు యుక్త వయస్సు వచ్చింది. తగిన వరుణ్ణి వెతికి వివాహం జరిపించకపోతే లోకం నన్ను నిందిస్తుంది. లక్ష్మీదేవిని పోలిన నిన్ను ఒక వనచరునకు కట్టపెట్టటానికి మనస్సంగీకరించటం లేదు. కూతురుని కన్న తల్లిదండ్రులకు మిగిలేది దుఃఖమే కదమ్మా! ఎప్పటికైనా ఈమె పరునిపాలు అనుకొంటేనే బాధ. ఎలాటి భర్త వస్తాడో అని ఆవేదన. అత్తమామలు, ఆడపడుచులు ఎలా నడిపిస్తారో అని దిగులు." ఈ విధంగా ముని చింతించి అసలింతకి ఈమె జీవితంలో ఇలాటి యోగం పట్టటానికి వెనుకటి జన్మల కర్మ ఎట్టిదో అని అంతరంగ దర్శనం చేసి అంతా ఎటిగినవాడై అంజనతో ఇలా అన్నాడు.

**అంజన పూర్వజన్మ వృత్తాంతం.**

"అమ్మాయీ! నీ పూర్వజన్మ వృత్తాంతం చెపుతాను విను! తొల్లిటి జన్మలో విద్యాధర

జాతిలో సుకంఠి అనుపేర జన్మించావు. అందచందాలలోను, నృత్యగీతాదులలోను నీకు నీవే సాటి. ఒకనాడు... వెయ్యారు మంది ఒయ్యారులు వెంటరాగా హిమగిరి ప్రాంతాల విహారం సలిపి అలసట పొగొట్టుకొనే నిమిత్తమై ఒక సరోవరం చెంతకు చేరావు. చెలులతో కలిసి సరసోక్తుల జల్లులాడుకొంటూ జలక్రీడ సలిపి గట్టుకు చేరి పట్టుపుట్టాలు ధరించి అలంకరణ ముగించు కొన్నావు. మగరాల నిగనిగల మెటిసిపోయే తిన్నెకట్టు గల గున్నమామిడి నీడకు చేరి చివురు పాన్పును ఆశ్రయించిన వేళ...

భరియింపలేని శంకర తేజాన్ని ధరియించి రొప్పుతూ – రోజుతూ, ముక్కుతూ – మూల్గుతూ, సోలుతూ – తూలుతూ గగన పథాన సంచరిస్తున్న వాయువును చూచి నువ్వు నవ్వావు. ఆ నవ్వులో నీ యౌవన మదం గోచరించగా వాయుదేవుడిలా శపించాడు. " ఓ! మదవతీ! అవార్య శంకర వీర్య భారవహుడనై నడువలేని నన్నుజూచి కోడెవయసు కారణంగా వెడనవ్వు నవ్వి నన్ను పరిహసించావు. మరుజన్మలో నీవు ఒక కోతికి భార్యవై ఈ శంకర తేజాన్ని గర్భాన ధరించి ఒక పుత్రుని కంటావు."

అమ్మాయీ! ఆనాటి వాయుదేవుని శాపఫలం నీకు ఈనాడిలా ప్రాప్తించింది. ఇది దైవకృతం. ఒక వనచరుని వివాహమాడి కామరూపిణివై సంచరిస్తావు. పతిభక్తి, నిత్యయౌవనం, శీలము, నిగ్రహానుగ్రహ సామర్థ్యము నీకు వరాలుగా ఇస్తున్నాను!" అని పలికి... తపస్సాచరించుకొనే నిమిత్తం దేవతా విహారభూమి ఐన హిమాలయ పర్వత భూములకు వెళ్ళిపోయాడు గౌతముడు. అంజనను కూడా వెంట తీసుకెళ్ళాడు.

**కుంజరుడను వానరుని వృత్తాంతం.**

ఆ కాలంలో కుంజరుడనే వానర శ్రేష్ఠుడు పుత్రార్థియై భూతనాథుణ్ణి గూర్చి తీవ్ర తపస్సు చేశాడు. అతని తపశ్చర్యకు మెచ్చి భక్తవశంకరుడైన శంకరుడు ప్రత్యక్షమై "కుంజరా! పుత్రునికనేటంత

పుణ్యం పూర్వజన్మలో నువ్వు చెయ్యలేదయ్యా. కన్న సంతానాన్ని కళ్ళజూచే యోగ్యత లేదుగాని గౌతమ మహర్షి తన కుమార్తెను నీకప్పజెప్పి వెడతాడు. ఆమె గర్భాన నా అంశతో ఒక కుమారుడు అద్వితీయ ప్రభావుడు జన్మిస్తాడు. అతడు నీ వంశాన్ని ఉద్ధరిస్తాడు" అని వరమిచ్చి శంకరుడు అంతర్ధాన మయ్యాడు.

అది మొదలుగా కుంజర వింధ్యావళీ దంపతులు పండుటాకులు గలగల మనినా కూడా గౌతమ ముని పాద నిస్వనంలా భావించుకొంటూ క్షణమొక యుగంగా గడపసాగారు. మునికూడా సంచారంలో తన తనయతో కలిసి ఒక రోజున కుంజరుని ఇంటికి అతిథిగా వచ్చాడు. వచ్చిన మునిని చూచి మదిహెచ్చిన సంతోషంతో అతిథి మర్యాదలాచరించి నాటి నా తపస్సు నేడు గదా ఫలించింది! అని తలపోసి తన తపశ్చర్యను శంకర వర ప్రభావాన్ని మునికి విన్నవించాడు. అది విన్న ముని మది కందళింపగా ఎంతో ప్రమోదంతో "కపినాయకా! నేటికి కదా నా దిగులు తీరింది. మహాదేవుడైన శంకరుడే కరుణతో నీకు వరమియ్యగా కాదనటానికి నే నెవరిని? ఇదిగో ! నా సుతను గ్రహించు! కన్నతండ్రివై భారాన్ని వహించు! ఈపైన ఈమెకు అన్నీ మీరే!" అని అంజనను అప్పగించి వెళ్ళిపోయాడు..... గౌతమ మహర్షి.

తదనంతరం కుంజర వింధ్యావళీ దంపతులు సంతానభాగ్యం లేదనే చింత నేటికి గదా తీరింది అని ఆనందించారు. శ్రీలక్ష్మి కళతో సిరులు కురుస్తున్న చంద్రముఖి ఐన అంజనా ముఖసౌందర్య సందర్శన పారవశ్యంలో మునిగి నిత్యతృప్తులై పెన్నిధిగన్న పేదచందంగా పొంగిపోతున్నారు. అంజన కూడా కన్నెతనాన్ని వీడి యౌవన ప్రాంగణంలోకి అడుగుపెట్టింది.

**అంజనాదేవి యౌవన ప్రాదుర్భావం.**

కన్నెతనం (ముగ్ధభావం) అనే అవిద్య తొలగి నిండు ప్రాయపు తెలివి నివ్వటిల్లింది.

నడకలో అజపామంత్ర నామ వైఖరి (సోఽహం మంత్ర జపంలో సిద్ధించే తాళ లయాత్మకత) సిద్ధించింది. చూపులు అనిమిష ఖ్యాతిని వహించాయి. లేత నవ్వు ఇడ – పింగళ – సుషుమ్న నాడులు మూడూ కలిసిన ఆజ్ఞాచక్రంలా శృంగాటకానుభూతిని పొందింది. అనాహత నాదంలా శరీరమంతా ఆంతరస్వరం నిండింది. నడుము చిదాకాశలీలను పొంది సన్నబడింది. పలువరుస స్వచ్ఛతను సంతరించుకొని అష్టాంగయోగ సిద్ధిని పొందింది. నఖసంపద తారకాభ్యుదయాన్ని నింపుకొంది. ముఖవికాసం అమృతకరునిలా షోడశకళా వ్యాప్తిని నింపుకొని అమృత సిద్ధిని పొందింది. మోవి జపానురాగ గతిని మించింది. ఈ విధంగా అంజనమేన లలిత శృంగారం ఆనంద లక్ష్యంగా అవతరించింది.

ఈ విధంగా షట్చక్ర భేదనా సామర్థ్య లబ్ధ సహస్రార సార శ్రీవిద్యా దరహాసంలా, చిత్కళా విలాసంలా, శ్రుతి సీమంత వీధీ విహార లబ్ధ అమృత విద్యాఫల శ్రీ స్వరూపంలా వేయి శంపాలతా విద్యుత్ప్రభలను విరజిమ్ముతూ నట్టింట నడయాడుతున్న అంజనను చూచి వింధ్యావళీ కుంజరులు మురిసి పోతున్నారు. ఒకనాడు వింధ్యావళి కుంజరుని సమీపించి "నాథా! ఆడపిల్లను ఎప్పటికైనా ఒక అయ్య చేతిలో పెట్టాలి గదా! అంజనకు యుక్త వయస్సు వచ్చింది. మీది కర్తవ్యం మీరే ఆలోచించండి" అని బాధ్యతను గుర్తు చేయగా వివాహ సంబంధాన్ని వెతక సాగాడు... కుంజరుడు.

ఇంతలో మధుమాసం ప్రవేశించగా ప్రకృతి అంతా నవనవోన్మేషంగా నూత్న చైతన్యంతో వెల్లి విరుస్తోంది. ఆ వేళ అంజన తన చెలికత్తెలతో కలసి వేడుకగా విహారానికై వనసీమను చేరింది. అంతకు ముందే గంధర్వులు పాడుకొనే పాటలలో అంజన చక్కదనాన్ని గురించి విన్నాడు కేసరి. ఆమెను చూడాలన్న కాంక్షతో వనాన్ని ఆశ్రయించి ఉన్నాడు. ఆ విధంగా వారిరువురికి అక్కడ పరస్పర సందర్శన సౌభాగ్యం లభించింది. తొలిచూపులలోనే వలపుదైవం ఆశీర్వదించగా అన్యచింతనలేని విధంగా ఆకర్షితులయ్యారు. మును విన్నది ఇపుడు కన్నది ఒక్కలా ఉన్నది. ఈమె

కూడా నన్ను వరిస్తే అంతకంటే కోరుకోదగ్గ ధనం ఈ లోకంలో ఏముంటుంది? అనుకొన్నాడు. అంజన కూడా ఏదో నెపంతో కేసరి దృఢ శరీర సౌందర్యాన్నే పలుమార్లు చూస్తూ తన అంతరంగాన్ని చెలులకు తెలియ నీయకుండా దాచి, వెళ్ళలేక వెళ్ళలేక వనాన్ని వీడి గృహాన్ని చేరుకొంది. చేరుకొంది అన్నమాటే కాని మనసు మాత్రం కేసరి మీదే ఉంది.

అక్కడ కేసరి కూడా అంజనను చూచినది మొదలుగా అన్యచింతన లేక చిత్తం అంజనాయత్తం కాగా మంత్రులను పిలిచి తత్ప్రాప్తికి ఉపాయమేమని ఆలోచింపసాగాడు. బుద్ధి విశారదులైన మంత్రులంతా "స్వామీ! సాధారణంగా ఇంద్రియాలు విషయ సుఖాలే ప్రధానంగా ప్రవర్తిస్తూ ఉంటాయి. బుద్ధిచేత ఆలోచిస్తే కొన్ని అసమానతలు గోచరిస్తాయి. ఇక్కడ కుంజరుని తోడి సంబంధం అన్ని విధాలా యోగ్యంగా ఉంది. బాంధవ్యాన్ని కోరి అతణ్ణి ప్రార్థిద్దాం... కాదంటే మన భుజ బలాన్ని ప్రదర్శిద్దాం" అని శ్రేయోదాయకమైన వచనాలను పలికారు. మంత్రి మండలి సలహా ప్రకారం వ్యవహార దక్షులైన పెండ్లిపెద్దలను కుంజరుని యొద్దకు పంపాడు కేసరి. కుంజరుడు కూడా తన మనస్సులో ఆహా! సకల శుభలక్షణ లక్షితాంగి ఐన అంజన మూలంగా గదా సరిలేని కేసరి నాకు అల్లుడు కాబోతున్నాడని ఆనందించి తన అంగీకారాన్ని తెలిపి వచ్చిన పెద్దలను వద్దనేటంత తాంబూల జాంబూనద ఆభరణాదులచేత సత్కరించి పంపాడు.

**అంజనాకేసరుల వివాహం**

నిర్జర గురుడు లగ్న నిర్ణయం చేశాడు. పునుగు, జవ్వాది, గొజ్జంగి, పన్నీట కలయంపి చల్లి, గోమేధిక పుష్యరాగ ఇంద్రనీల ప్రవాళ మణిమయాదుల రంగవల్లికలు తీర్చిదిద్దారు. జాలువా సరిగంచు మేలి ముత్యాల మేలికట్లు మెరయగా కుబేర పుష్పకం వంటి పెండ్లి చవికెలో కులోచిత మర్యాదలకు లోటు రానీకుండా కాళ్ళు కడిగి కన్యాదానం చేశాడు కుంజరుడు.

ఆ సమయంలో కనక వేత్రహస్తులై చారణులు బరాబరులు చేయ, గీర్వాణులు సర్వమణి భూషణాదుల కానుక లీయ, ముత్తైదువలు ముత్యాల హారతులెత్తి సుస్వరంగా పాడ, దివి గంధర్వులాడ... బ్రహ్మర్షులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వేయి కన్నుల వేలుపు తన కన్నుల సాఫల్యానికి సంతసించాడు. దేవ దుందుభుల మ్రోత కర్ణపర్వం కాగా అంజనా కేసరుల పాణిగ్రహణోత్సవం అఖిలజన లోచనోత్సవంగా సాగింది. ఆనాడు పర్వదినం కాకపోయినా సముద్రం ఉద్రేకాన్ని పొందింది. మందారం మకరందాన్ని కురిపించింది. కామధేనువు చేపులేక పోయినా ఆపుకోలేక అక్షీణ క్షీరధారలను క్షితికి వర్షించింది. పారిజాతం నిలువెల్ల పూచి పులకరింతల మైమఱచిపోయింది. బృందారక రాజధానీ నగరమైన అమరావతి సందడి లేక నిర్జీవమైంది.

అర్బుద సంఖ్యలో కపికోట్లు, ఊర్జిత సత్త్వులైన నిర్జర సమూహం వివాహోత్సవ సందర్శన కౌతూహలంతో హిమాలయగిరి భూముల చేరిన వేళ ఆ భారానికి ధరామండలం ఉత్తర దిక్కుగా ఒరిగిపోయింది. అనేక రత్నాభరణాలను, బంగరు జలతారు పట్టు పుట్టాలను కుమారికకు... అనేక దుర్గాలను, పదిలక్షల కపిసైన్యాన్ని అల్లునకు బహుమానంగా ఇచ్చాడు... కుంజరుడు. ఆశీర్వచనం చెయ్యటానికి వచ్చిన వేదశాస్త్ర పారంగతులైన విప్రులకు అనేక పరిచర్యలు చేసి అపార హిరణ్య మణిమయాదులతో సత్కరించారు... ఉభయ పక్షాల వారైన కేసరి – కుంజరులు.

వివాహనంతరం ఘనంగా సారెపెట్టి అంజనను అత్తవారింటికి పంపాడు కుంజరుడు. అంజనా కేసరుల దాంపత్య జీవితం పూవుతావి వలె కలిసి హాయిగా సాగిపోతోంది. రాజ్యతంత్రాన్ని పూర్తిగా మంత్రుల మీదే పెట్టి అంజన తోడిదే లోకంగా మన్మథ సామ్రాజ్యాన్ని ఏలుతున్నాడు కేసరి.

**సంతానం కలగలేదని అంజన దుఃఖించుట**

అలా...అలా... నిండు పున్నమలు ఎన్ని గడిచినా నెల మాత్రం తప్పలేదు

అంజన. కాలం గడిచే కొలది సంతానం లేదనే చింత చితిలా బాధిస్తోంది. ముల్లులా కెలుక్కు మంటోంది. ఊరేగటానికి వేవేల బంగరు పాలకీలున్నా ఇంట ఉయ్యాలతొట్టి ఒక్కటీ లేదు. బంగారు భృంగారువు లెన్ని ఉన్నా ఉగ్గుగిన్నె మాత్రం లేదు. మణిదీపాల కాంతులున్నా పసిపాప బోసినవ్వు కరువైంది. మబ్బు పొత్తిళ్ళలో నెలవంక లేదు. చైత్ర వనంలో కోయిల పాటలేదు. సరసిలో రాజహంస విహారం లేదు. పట్టు పఱుపుల మీద పాపడు లేడు. కెవ్వుమన్న కేక లేదు. సావిళ్ళలో శారదా చప్పుళ్ళు లేవు. ఇదీ కేసరి దంపతుల దుఃఖమయ స్థితి. కూడబెట్టిన సంపద నీడలా వెంటపడి వెక్కిరిస్తోంది.

సంతానం కోసం నోచని నోములు – చేయని వ్రతాలు లేవు. ముత్తైదువులకు ఫలదానాలు, వృద్ధోప సేవ, దంపతీ పూజ, అన్నదానం... ఇలా ఒకటేమిటి ఇష్ట కామ్యార్థ సిద్ధికై యథా శాస్త్రీయంగా అన్నీ చేశారు. వరలక్ష్మి, మార్గశిరలక్ష్మి... ఇలా లక్ష్మీపూజలు సలిపారు. ఇక గౌరీపూజలకు లెక్కేలేదు ! గజగౌరి, ఉత్తరాగౌరి, సాంవత్సగౌరి, పదియారు గౌరి, పసుపు పట్టె మహాగౌరి, నిట్టుప్పు గౌరి, దంగేటి గౌరి, చల్లకూటి గౌరి, సావిత్రి గౌరి, చల్దిగౌరి, గరళ్ళ గౌరి, ఆదిత్య గౌరి... ఇలా మూడు వందల అరవై గౌరీ వ్రతాలను ఆచరించారు. కనుపించిన ఆకెల్లా పత్రి–రాయైనదెల్లా శివుడని భావించి పార్వతీ పరమేశ్వరులను భక్తితో భజించారు.

ఎన్ని చేసినా కాలం ఊరకే గడిచి పోతోంది కాని ఫలితం మాత్రం లేదు. అలా అంతులేని సంతాపంతో అంజనాదేవి ఖిన్న వదనంతో విన్ననైయున్న వేళ... ధర్మదేవత దయతలచి...

**ధర్మదేవత ఎఱుక చెప్పట**

ఎఱ్ఱ మందారాలు తురిమిన కొప్పు – చంద్రవంకబొట్టు – దంతపు కమ్మల తళుకు చెక్కిళ్ళు – రొమ్మున జాఱుపైట – బంగారు సంది దండలు – శంఖ సరాలు – కెంపుల ఒడ్డాణం – చంద్రకావి రంగు దువ్వలువ – మూపున

బుదుతడు – రాయంచ నడకలతో కొఅవంజి వేషంతో ప్రత్యక్షమైంది. అలా ప్రత్యక్షమై ఇలా సోదె చెప్పటం మొదలుపెట్టింది.

"సోదోయమ్మ సోది! ఎఱుకోయమ్మ ఎఱుక! ఎఱుక సెపుతానో తల్లి! ఎఱుక సెపుతాను! మనసులో మాట సెపుతాను! నుదిటి మీది రాత సెపుతాను! సేతిలోని గీత సెపుతాను! మునుపు ముగ్గురమ్మలకు సెప్పానో యవ్వ! నిజం సెపుతానే తల్లి నిజం సెపుతాను! నిప్పు కాలుస్తుంది – నీరు తడుపుతుంది. నిజం సెపుతాను! కాకి నలుపు – నిమ్మకాయ పులుపు! నిజం సెపుతాను! తార్కాణం సెపుతాను! మగాడి మూతికి మీసం ఉంటది! తిరుగులేని తార్కాణం సెపుతాను! అదే ఉండదు ఆడదానికి!

ఎఱుకత చెప్పిన పాఠం చెవిన పడగానే... పువ్వు పాన్పుమీద చెక్కిట చేయి జేర్చి చింతిస్తున్న అంజన పాద కటకాలు గల్లున మ్రోయ ఒక్క ఉదుటున లేచి వచ్చి, దోసెడు ముత్యాలు చేటలో పోసి... ఓ! ఎఱుకల సానీ! ఎఱుక సెపుతావా! నా మనస్సులోని కోరిక సెపుతావా అని ఎంతో ఔత్సుక్యంతో చేయి చాపింది. సంది దండలు సవరించుకొని, చాచిన చేతిని చక్కపట్టుకొని... ఆ ఎఱుకలసాని ఇలా ఎఱుక మొదలుపెట్టింది. "మా బంగారు చెయ్యి! దాన ధర్మాలు గల చెయ్యి! కాయంటే పొల్లు – పండంటే పంట! పుంజంటే మగ – పెట్టంటే ఆడ. కోడె అంటే మగ – పెయ్యంటే ఆడ! పండుతుంది! నీ మనసులో కోరిక పండుతుంది! పండే తల్లి పండే! పచ్చ విల్తుని సాటి రూపుగల కొడుకు పుడతాడు! గొంటు రక్కసుల రాయిడిని గెంటే పోటుబంటు పుడతాడు. నీ అంగద పోగొట్టే పాపడు పుడతాడు. మా సింగని పాదాలు సాక్షి! నీకు తాళిబొట్టు కట్టిన వాడి ఒప్పుదలతో తపం చెయ్యి! నీ వెతలు తీరతాయి!" అని ఎఱుకలసాని వేఱుముక్క ఇచ్చి, సింగని సాక్షిగా కొంగున కట్టుకోమని తపసులో దగదప్పిక లుండవని ఆశీర్వదించి అదృశ్యురాలైంది!

అంజన ఆ మాటలను పతికి నివేదించగా కేసరి కూడా వంశోద్ధారకుడైన సుతుడు లేని చింతాభరంతో కృంగి పోతున్నాడు కనుక ఇల్లాలితో ఇలా అన్నాడు.

**కేసరి అంజనను వాయుదేవుని గూర్చి తపస్సు చెయ్యమని ప్రోత్సహించుట.**

"అంజనా! గత వృత్తాంతం ఒకటుంది... నా విషయంలో! అది చెపుతాను విను! దేవస్తుతుడైన కొడుకు కలిగే ఉపాయం ఉంది! పశ్చిమ సముద్ర తీరంలో ప్రభాసమనే దివ్యతీర్థ మొకటుంది. తత్తీరభూమిలో భరద్వాజాది మునులు తీవ్ర తపోనిష్ఠలో మునిగి ఉంటారు. వారికి అవసరమైన కుసుమ ఫల దర్భాది విశేషాలను సమకూరుస్తూ నిరంతర నిష్ఠతో నేనుకూడా తపస్సాచరిస్తూ ఉండేవాడిని. ఒకరోజు తన తండ్రిఐన శంబసాధసుని గతంలో నేను చంపిన కారణంగా ద్వేషంతో అతని కొడుకైన శంఖశబళు డనువాడు మదగజంగా మారి ఆశ్రమ వాసులకు కీడు తలపెట్టాడు. అతని దుష్ట తలంపు ఎఱిగిన నేను తొండం మీది నుండి కుంభస్థలాన్ని ఆక్రమించి పిడికిటి పోటుతో వాణ్ణి మట్టి కరిపించాను. అందుకు భరద్వాజాదు లానందించి "కేసరీ! సర్వ లోకోపకారి, శాశ్వతబలుడు, నిర్మలుడు ఐన పుత్రుడొకడు ఉదయించ బోతున్నాడు... నీకు. మా మాట తప్పదు. వెంటనే నీకు తగిన కన్యను వివాహం చేసికో!" అని ఆజ్ఞాపూర్వక ఆశీర్వచనాన్ని నాకీయగా, నువ్వు నాకు అర్ధాంగివయ్యావు. ఆ దయాళుర మాట వేదం. సకలార్థములు తపస్సు వల్లనే సమకూరుతాయి. దేవీ! తపస్సుకు నియమం ప్రధానం. నియమం వల్ల హృదయ నిశ్చలత్వం వస్తుంది. అప్పుడు మారుత దేవత అతిశయం కల్గుతుంది. అతని అనుగ్రహం వలన గాని ఇష్టకామ్యార్థ సిద్ధి కలుగదు.

**వాయుదేవుని మహత్త్వం.**

అంజనా! నీకొక రహస్యం చెపుతాను విను! లోకానికి ప్రాణం

వాయువే! తదన్యుడు లేడు! చైతన్య సాక్షి వాయువు! దేహేంద్రియాదుల చేష్టలకు జ్ఞాన మిచ్చేవాడు వాయువు! ఇంద్రియ గోచరుడు కాకపోయినా చల్లదనాన్ని వెదజల్లి ప్రజలకు తాపోపశమనాన్ని కలిగించేవాడు వాయువు. లోపల వెలుపల కూడా వివిధ జంతువులకు ఆయువును కొనసాగించేవాడు వాయువు. పురుషుని వీర్యాన్ని స్త్రీగర్భంలో విసృష్టి చేసేవాడు వాయువు. స్త్రీ గర్భంలో ఉండి ఆ వీర్యాన్ని గ్రహించి సృష్టి చేసేవాడు వాయువు. సంతుష్టిని ఇచ్చేవాడు వాయువు. అఖిల జీవులకు ఆధారమైనవాడు, అన్ని చోటుల పరిపూర్ణుడైన వాడు వాయువు. వాయువే విశ్వ వ్యాపకుడు, శాశ్వత బలుడు ఐన కారణంగా నీ విశ్వాసాన్ని వాయువునందే ఉంచి తపస్సు చెయ్యి. ఆ వాయుదేవుని అనుగ్రహంతో ధర్మ, దయా, బల, కీర్తి, మతి, దాంతి, శాంతి, ధైర్య, పరాక్రమాదులు కలవాడు, వేదశాస్త్ర విశారదుడు, అణిమాది అష్టసిద్ధి విభుత్వహితుడు ఐన సుతుడు కల్గుతాడు.” అని ఈ విధంగా అనుమతిని మార్గోపదేశాన్ని చేసి అంజన నుద్దేశించి ప్రేమతోను లాలనతోను ఇలా అన్నాడు కేసరి.

“అంజనా! తపస్సు చాలా కఠినమైనది. లతాంగీ! మండు వేసవి పంచాగ్ని మధ్యమందు కాకకు ఎలా ఓర్చుకొంటావో? పద్మముఖీ! వానాకాలం బట్టబయలున ఎలా తట్టుకొంటావో? కలువకంటీ! ఉదయ అస్తమయముల వరకు చండభానుని ఎలా తేరి చూడగలవు? చంచలాక్షీ! వాయువు నందే నిశ్చల భక్తిని ఎలా నిలుపగలవు? అబలా! సింహ శార్దూల భల్లూక ఖడ్గ మృగాది సంకీర్ణమైన కానలో నిర్భయంగా ఎలా తపస్సాచరించ గలవు? ఇంతకు దైవేచ్ఛ ఎట్టిదో తెలియదు గదా? అంజనా! పుంజకస్థల అనే ఒక దివ్యక్షేత్రం ఉంది. అది విశేష ఫలదాయి. అక్కడ తపస్సు ఆచరించు. నీకు అవసరమైన కృత్యములను నేను ఆచరిస్తాను. ముఖ్యప్రాణదేవత ఐన వాయుదేవుని ఉపాసించు. నీ గుణానికి ఏ మాత్రం కొఱతరాదని” అనుజ్ఞ ఇచ్చాడు కేసరి.

# అంజనాదేవి తపస్సు

అంజనాదేవి ప్రాణనాథుని ఆజ్ఞను అనుసరించి పుంజక స్థలను చేరి బోధ రంజనుడు, నిరంజనుడు ఐన ప్రభంజనుని గూర్చి నిష్ఠగా తపస్సు మొదలు పెట్టింది. కేసరి ఆమెకు తగిన కృత్యములను నెరవేరుస్తున్నాడు.

**గ్రీష్మఋతు వర్ణన.**

ఇంతలో గ్రీష్మ ఋతువు ప్రవేశించింది. భూమి తాబేలుడిప్ప వలె బిరుసెక్కింది. చండభానుని ప్రతాపానికి పాతాళం కనుపించేటట్లుగా భూమి నెఱియలు విచ్చింది. పైరులు వాడాయి. కొలనులలోని నీరింకి జలచరాలు బైటపడ్డాయి. దావాగ్ని అరణ్యాలను దహింపగా మృగాలన్నీ ప్రాణభీతిచే పరుగులెత్తాయి. సెగలతో పొగలతో గాడుపు వీచగా మంగలంలో పేలాలు మాదిరి మనుష్యులు మాడిపోసాగారు. ఫాలాక్షుని కంటిమంటల్లా ఎండ, విలయకాల ఝంఝా నిలంలా గాలి, దుమ్ము విసురుతూంటే పంచాగ్ని మధ్యమందు నిలిచి తన తపశ్చర్యను కొనసాగిస్తూనే ఉంది... అంజన.

**వర్షఋతు వర్ణన.**

గ్రీష్మంలో తపించి శోషిల్లిపోయిన సకల ప్రాణికోటికి ఎంతో ఆప్యాయకరంగా వర్షఋతువు ప్రవేశించింది. నదులన్నీ గట్లొరసి ప్రవహిస్తున్నాయి. సరస్సులన్నీ నిండాయి. సంకెళ్ళను ఊడదీస్తే పరుగులెత్తే ఏనుగుల గుంపులా కారుమబ్బులు ఆకాశం మీద మహావాయు సంచలితగాములై వేగంగా కదులుతున్నాయి. ఆకాశం మీద నక్షత్ర సమూహం భూమి మీదికి దిగిందో అన్నట్లు మిణుగురుల కాంతులతో భూమి ప్రకాశిస్తోంది. పూరిపాకల మీద నిప్పు రవ్వల్లా ఎగిరే మిణుగురులు పాక అంటుకుందేమో అనే భ్రమను కల్పిస్తున్నాయి. పిడుగుల చప్పుళ్ళకు ఉలికిపడి బెదిరి నక్షత్రాలు నేలకు రాలినట్లు వడగళ్ళు రాలుతున్నాయి. అట్టి వానకారులో ఉఱుముల చప్పుళ్ళకు భీతిల్లిక,

వర్షధారలకు జంకక నిశ్చల భక్తితో సమీరుని యందు మనస్సు నిలిపి నిష్ఠతో తపస్సును కొనసాగించింది అంజన.

**శీతకాల వర్ణన.**

ఇంతలో శీతకాలం ప్రవేశించింది. దంపతుల మధ్య అనురాగం హెచ్చింది. సంపన్నులు మృష్టాన్నాన్ని ఆరగించి కుంకుమపువ్వు కస్తూరి ఇత్యాది ఉష్ణకరములైన మైపూతలతో తాంబూల చర్వణ భోగులై భోగింపజొచ్చారు. పొన్నలు, చేమంతులు, సుర పొన్నలు, సంపెగలు, మొగలి పువ్వులు ఈ పుష్పాలు ఉష్ణకరములైన కారణంగా వాటిని ఆప్యాయంగా అంగనలు ధరించి తమ భర్తలకు సంతోషాన్ని కలిగిస్తున్నారు. అగ్నిదేవుడు సైతం చలికి భయపడి కుంపట్లను ఆశ్రయించి దంపతులు శయనించే మంచం క్రింద దూరాడు. సూర్యుడు సైతం శీతలానికి కృశించాడా అన్నట్లు పగళ్ళు కుఱచలయ్యాయి. అట్టి దినాలలో సైతం కంఠదఘ్న జలాలలో నిలిచి తపశ్చర్యను కొనసాగిస్తూన్న అంజనకు క్షుద్బాధను పోగొట్టే నిమిత్తమై దినానికి ఒక పండును వాయుదేవుడు ఆమె ముందుంచ సాగాడు. పురుష ప్రయత్నం లేకుండా దైవం మాత్రం ఊరకే ఫలాన్ని ఇయ్యగలడా అని కొందరు సందేహిస్తారు. కాని నిశ్చల మతితో కొలిస్తే దైవం ఫలాన్ని ఇయ్యడా? ఈ విధంగా అనేక సంవత్సరాలు తన తపస్సును కొనసాగించింది అంజన. పుత్రార్థిని ఐన ఆమె తపస్సుకు మెచ్చి ఇక జాగుచెయ్యటం మేలుకాదను కొన్నాడు వాయువు. మున్ను ఈశ్వరుడు తనయందు నిక్షిప్తం చేసిన రుద్రతేజాన్ని ఫలరూపంలో ఆమె ముందుంచాడు. ఆ ఫలాన్ని ఆరగించింది అంజన.

**అంజన గర్భం దాల్చుట.**

అమోఘమైన ఆ రుద్రతేజ ఫలాన్ని ఆరగించిన కారణంగా అంజన గర్భవతి ఐంది. క్రమంగా గర్భ చిహ్నాములు బహిర్గతం అయ్యాయి. చూచుకములు

నల్లనై కృష్ణ విలాసాన్ని వహించాయి. చెక్కిళ్ళు వెల్లనై కౌముదీ భావాన్ని ధరించాయి. నడుము బరువెక్కి దృగ్దృశ్య వివేకస్ఫురణ ప్రకటించింది. మనసు కోరికలతో నిండి కామాగమోద్వృత్తి వర్ధిల్లింది. తనువు బరువై అలంకార సందర్భ వర్ధనాన్ని పొందింది. నిట్టూర్పు లధికమై చండమారుత లీలలను ప్రదర్శించింది. నడక మందగించి ఛాందసాన్ని సంతరించుకొంది. గర్భం వృద్ధియై భరత విస్ఫూర్తిని పొందింది. వేదశాస్త్ర పారంగతుడు, వేదాంతఛందో వ్యాకరణ అలంకారశాస్త్ర మర్మజ్ఞుడు, భరత శాస్త్ర ధురంధరుడు, సకలాగమవేత్త ఐన కుమారోదయం కాబోతున్నది కనుక ఆ లీలలన్ని అంజనా గర్భ చిహ్నాలుగా ప్రకటితమయ్యాయి.

**గర్భ కారణం తెలియక అంజన దుఃఖించుట**

ఈ విధంగా ప్రకటితమైన గర్భ చిహ్నాలను గమనించి అంజన భయ విస్మయాలతో కంపించి... పతిని ఎడబాసి తపస్సులో ఉన్న నాకు ఈ గర్భం ఎలా సంప్రాప్తమైంది? దీనిని కన్నవారు విన్నవారు నవ్వరా! ఎదుటి వారి ముందు ఎన్ని కల్లలైనా ఆడవచ్చు గాని మనసెరుగని కల్ల ఒడలెరుగని శివం ఉంటుందా? తాళికట్టిన భర్తకు తప్పక చెప్పి... ఇందులో నా తప్పేమీ లేదని ఎలా ఒప్పించాలి? అని పరితాప భారంతో కృంగిపోతున్న వేళ... కప్పురపు పలుకుల పరిమళము, సుధారస మాధుర్యము కలబోసినట్లు గగన భారతి ఇలా పలికింది. “బాలా! చింతించకు! మున్ను మర్కట రూపంలో శివపార్వతులు వనంలో క్రీడించిన వేళ రుద్రతేజాన్ని భరింప పార్వతి అశక్తురాలైన కారణంగా వరుసగా భూమియందు, అగ్నియందు, వాయువు నందు దానిని నిక్షిప్తం చెయ్యటం జరిగింది. ఆ తేజాన్ని ఫలరూపంలో వాయువు నీయందు గర్భీకరించాడు. శివుడే ప్రత్యక్షంగా నీ గర్భాన ఉదయించ బోతున్నాడు. పుట్టబోయే శిశువు సామాన్యుడు కాడు. ఆర్య సంభావిత దివ్యకీర్తి, సకలాదేవతాకోటి కిరీట

మాణిక్య కాంతి పుంజ శోభావహమూర్తి, శ్రీరామపాద సేవానురక్తి గల వాయుపుత్రుడు."

అని పల్కగా వాయువు కూడా ఆ విషయాన్నే ప్రమాణీకరించి దీనిని నీ భర్తకు యథాతథంగా విన్నవించు. నీ శీలం కళంకితం కాకుండా వరమిస్తున్నాను... అని అదృశ్యుడయ్యాడు. అంజన తన భర్తతో ఆద్యంతము తెలియచెప్పి సంతానం లేదనే వంత తీరిందనే సంతోషంతో ఆ దంపతులు వేడుకలలో మునిగిపోయారు.

**ఆంజనేయుని జననం.**

ఆ రుద్రతేజాన్ని పండ్రెండు మాసాలు గర్భాన ధరించి సూర్యాది నవగ్రహాలు శుభస్థితిలో నున్నవేళ త్రిలోక పావనమైన శుభ తరుణంలో త్రిలోక పావనుడైన కుమారుని కన్నది... అంజన. ఆ కుమారోదయ వేళ ఆకాశం నిర్మలంగా ప్రకాశించింది. దిక్కులన్నీ కౌముదీ వికాసంతో తెలివొందాయి. విరించి వాహనమైన రాయంచ కలకూజితం చేసింది. వైకుంఠంలో సుపర్ణుడు రెక్కలు విప్పి ఆడాడు. కైలాసంలో నంది రంకె వేసింది. ఐరావతం ఆకాశగంగలో జల్లులాడింది. కుమారస్వామి వాహనమైన నెమలి పురివిప్పి నృత్యం చేసింది. ఋతువు కాని వేళ పుష్పవనాలన్నీ పరిమళాన్ని వెదజల్లాయి. పుడమిదేవి పులకాంకితం కాగా సస్యాలన్నీ ఆలస్యాని కోర్వక శీఘ్రంగా ఫలించాయి. శీతల మలయానిలం మందగమనంతో అందరికి అమందా నందాన్ని సమకూర్చింది. దిక్కులన్ని పారిజాతపూల పరిమళంతో గుబాళించాయి.

పుట్టిన పాపడు పుడుతూనే బాల బ్రహ్మచారిలా జన్మించాడు. అంజన కన్నుతెఱచి చూచే సరికి ఎలా ఉంది ఆ రూపం. నిడుదైన వాలం – శంకర తుల్యమైన బలం; పచ్చని చూపులు – పగడపు మేని చాయ; ఒంటి పోచ జందెం – బంగారు మౌంజి; కుండలాల కాంతులు – క్రొత్తదైన పట్టు

పుట్టం. పుట్టిన బాల బ్రహ్మచారిని చూచి అంజనాకేసరులు పట్టరాని సంతోషంతో నేడుగదా మా తపసు ఫలించింది అనే పరమానందంతో పండిత మండలికి సత్కారాన్ని జరిపి ఆంజనేయుడనే నామకరణం చేశారు.

ఒకరోజు అంజన తను కన్నకుమారుని కౌగిలించుకొని "రారా! నా తపః ఫలమా! నా నోముల పంటరారా! ఇంచుకసేపు ఆకలి కోర్చుకో! పోరు పెట్టకు! వనంలోకి వెళ్ళి ఫలాలను తెస్తాను" అని కానకేగింది. తల్లి అలా వెళ్ళగా చూచిన పాపడు ఆకలితో వాపోతూ తూర్పుదిక్కుకు చూచాడు.

**పండని భ్రమించి ఉదయ సూర్యుని పట్టబోవుట.**

అరుణారుణ ప్రభలతో అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబం ఒక పండులా తోచింది పాపనికి. తోచిందే తడవుగా జాగుసేయక వాయుపుత్రుడు దానిని పట్టుకొని తిందామనే భ్రాంతితో శరభంలా గర్జిస్తూ, ప్రళయకాల భయంకర భ్రుకుటి దుర్నిరీక్ష్య దుస్సహ తేజోమహిమతో సంహార తాండవం చేసే రుద్రునిలా గగనానికి ఎగిరాడు. ఆంజనేయుని గమన వేగానికి ఒక్కపెట్టున సప్త సముద్రాలు ఘూర్ణిల్లాయి. సప్త పాతాళాలతో భూమి ఉయ్యాల లూగింది. అష్ట దిగ్గజాలు అదిరిపడి మూర్ఛిల్లాయి. కులపర్వతాలు కూలిపోతున్నాయి. దిక్కులన్నీ తెగిపడు తున్నాయి. ఉదధులన్నీ ఉడుకెత్తి పోతున్నాయి. విరించి మనస్సు భయోత్పాతాలతో క్షోభించింది.

ఆవేళ అలా సూర్య మండలం వైపు సాగిపోతున్న అద్భుత పాపణ్ణి చూసి యక్ష రాక్షస సిద్ధ సాధ్య దేవ సంఘాలన్నీ భయాద్భుత చిత్తంతో ఇలా తలపోశాయి. అఖిల లోకాలను ఆహుతి గైకొనే ప్రళయాగ్నియా ఇది? అంత్యకాల ఝంఝా సమీరమా? అప్రతీప ప్రతాప విలయార్క బింబమా? ఘోర వీరావేశ వీరభద్రావతారమా? ఇట్టి దుర్నిరీక్ష్య ప్రభాప్రతాపోగ్ర రూపాన్ని మున్నెన్నడు కనివిని ఎఱుగం గదా! ఆ తేజాన్ని తేరిచూడలేక తలకొక దిక్కై విమానారూఢులై పారిపోతున్నారు సురలు.

వాలాన్ని తిప్పుతూ, ముడివడిన ఫాలంతో, చెమట నిండిన ముఖంతో, రోదసీ కుహరం భేదిల్లే అరుపులతో వాయువేగంతో రవిబింబం వైపు సాగిపోతున్నాడు ఆంజనేయుడు. వాయువు కూడా చలువ తావులను వెదజల్లుతూ వెనువెనుకనే పయనిస్తున్నాడు. పుత్రుని మీద ఎంత మమకారమో! ఆ విధంగా లక్షయోజనాల నతిక్రమించి సూర్యమండలాన్ని చేరుకొన్నాడు మారుతి.

**దేవతా సమూహం భయకంపితులగుట.**

ఆ దుర్నిరీక్ష్య రుద్రతేజాన్ని తేరి చూడలేక దివాకర పార్శ్వవర్తులైన వారందరు భయంచేత మాటలుడిగి జపమాలికలు జారిపోగా "మాం పాహి మాం పాహి" అని రక్షాస్తోత్రాలను పఠిస్తూ "సంపశ్యామి ప్రజా అహమిడ ప్రజసోమానవాః, సర్వాభవంతు నో గృహే... "(మా వారిని నేను చక్కగా చూచుచున్నాను. వీరందరు నా గృహమునందే ఉందురుగాక. నేను జాగరూకుడనై గృహమును కాపాడుచున్నాను). ఇత్యాది యజుర్వేద ఋక్కులచే శుభకాములై స్తుతించటం మొదలుపెట్టారు.

అలా భయకంపితులైన వారిని చూచి సూర్యుడిలా అన్నాడు. " ఈ బాలుడు ఈశ్వర వీర్యజుడు...ఆంజనేయుడు. సర్వలోకహితుడు. కేవలం శైశవభావం చేత నన్నుచూచి పండని భ్రమించి పట్టుకొందామనే ఇచ్ఛతో మీదికి ఉఱుకుతున్నాడు. మీరు భీతిల్లకండి." ఈ విధంగా ఊరడించి ప్రేమతో రవికూడా తన వేడిమిని ఉపసంహరించుకొన్నాడు. ఏనుగు గున్న ఎఱ్ఱ తామర పువ్వును తొండంతో పెటికి వేసినట్లు ఆంజనేయుడు సూర్యుణ్ణి పట్టుకొని ముఖాన ముద్దాడి, ముక్కుతో వాసనచూచి కపి స్వభావమైన చంచలత్వంతో కదపబోయాడు.

**రాహువు భయకంపితుడై ఇంద్రునితో మొరపెట్టుకొనుట.**

ఆనాడు పర్వదినమైన కారణంగా రాహువు ఘోరంగా హుంకారం చేసి

నోరు తెఱచి దుర్వార గర్వంతో సూర్యుణ్ణి మ్రింగబోయేటంతలో ఆంజనేయుడు కల్పాంత వేళ భర్గునిచేతి ఢక్కారావంలా గర్జించి రాహువుకు ధైర్యచ్యుతిని కల్పించాడు. భయపెట్టబోయి తానే భయపడిన చందంగా రాహువు వెనుకకు తిరిగి తిరిగి చూస్తూ దిగులుతో ఈ విధమంతా తెలియజెప్పే నిమిత్తమై స్వర్గపురిని చేరుకొన్నాడు. అక్కడ జంభారి వేడుకల సంరంభంలో మునిగి ఉన్నాడు.

వృత్రాసురాది దైత్యులను సంహరించిన విజయగాథలను విద్యాధరశ్రేణి స్తుతిస్తున్నారు.

తుంబురు నారదాదులు తమ గానామృతాన్ని వినిపిస్తున్నారు.

అరుదైన బిరుదులు గైకొన్న రంభోర్వశీ తిలోత్తమ మేనకాది పదునాలుగు జాతుల అప్సర స్త్రీలు వింతకోపులతో నృత్యవిలాసాన్ని ప్రదర్శిస్తున్నారు.

సకల దేవతా సమూహం కృతమస్తకాంజలులై వినతులు సమర్పిస్తున్నారు.

సుధర్మా సభా భవనాంతర చింతామణీ భద్రపీఠంపై కన్నుల పండువుగా నిండు పేరోలగంలో దేవతా మండలేశ్వరుడు వైభవ శ్రీలతో వెలిగిపోతున్నాడు. అలా నృత్యగాన విలాసాదులతో ప్రొద్దు పుచ్చుతున్న పురందరుణ్ణి చూచి ఒడలు మండి ఇలా అన్నాడు... రాహువు. "దేవరాజా! నీవు సకల సద్గుణ రాశివి! కాకపోతే ఏమిటిదంతా? ఎంతసేపూ విద్యాధరుల స్తోత్ర పాఠాలతో, అప్సర స్త్రీల నృత్యగాన విలాసాలతో ప్రొద్దు పుచ్చటమేనా? ఇతర బాధ్యతలేమీ నీకు పట్టవా? ఇందుకేనా స్వర్గాధిపత్యం నీకు కట్టబెట్టింది? అభంగ ఆకాశగంగోత్తుంగ తరంగ మాలికా డోలికా కేళి విలాసాలు... క్షీరసాగర సముద్భూత అమృతపాన మత్తవిశేష నందనవనీ విహారాలు... సుధారసపాన అప్సరః మత్తకామినీ ఆలింగన సౌభాగ్యాలు.... ఇవే నిర్జర సార్వభౌముని నిత్య కృత్యాలనుకొంటే శతమఖునివైన నీవరకు ఎందుకు? ఏ అనామకుడైన ఈ పనిని నీకంటే చక్కగా నెరవేర్చగలడు."

రాహువు ఎత్తిపొడుపు మాటలకు సభంతా చిత్తరువులా స్తంభించింది. అమరేంద్రుడు ఆగ్రహంతో వజ్రాయుధాన్ని ఝుళిపించి వచ్చిన ముప్పేమిటి? అన్నట్లుగా కెంపులవాన కురిసినట్లు వేయికన్నుల నిప్పులు రాల రాహువు వైపు చూచాడు.

అప్పుడు రాహువిలా అన్నాడు: "సిగ్గుమాలి చెప్పాల్సి వస్తోంది! అమరేంద్రా! విను! ఈ రోజు పర్వదినం. నేటి ఉషఃకాలం రవిబింబాన్ని పట్టుకొందామని దిట్టతనంతో సమీపించగా అంతకు ముందే నా పాలిట వింత రాహువై కనిపించి నన్ను గ్రుడ్లురిమి తరిమాడు ఒక బాలుడు. భక్షణ సంగతి దేముడెఱుగు బ్రతికితే చాలనుకొని భయంతో పారిపోయి ఇలా వచ్చాను. రాక్షసికి ప్రోక్షసి అనే సామెత నాపట్ల నిజమై నాపాలి యముడయ్యాడు ఆ బాలుడు. వాసవా! నీవు సత్యపతివిగదా! నన్ను చంద్రదినేంద్ర గ్రసనాధిపతిగా నియమించి నాకంటె వేఱొక బలాఢ్యునికి తిరిగి ఆ ఆధిపత్యాన్ని కట్టబెట్టటం తగునా?"

ఈ విధంగా భయకంపితుడై పల్కిన రాహువు మాటలు విని మిట్టిపడి మఘువుడిలా అన్నాడు: "ఏమేమీ! ఇట్టి విధం మేమెప్పుడూ వినలేదే! కేవలం కశ్చిదనామకు డొకడు దిట్టతనంతో నా ఆధిపత్యాన్ని నెట్టి ఆదిత్యుణ్ణి పట్టాడా! విధికట్టడి నెట్టజూస్తున్న ఆ జగజెట్టిని మట్టుపెట్టాల్సిందే. విచారపడకు. నిర్భయంగా నా వెంటరా. వృత్రాది దైత్యాహంకార గర్వ నిర్మూలన సామర్థ్యమైన వజ్రాయుధం నా హస్తాన్ని అలంకరించి ఉండగా నీ కొచ్చిన ఆపదేమీ లేదు. దిక్పాలక సార్వభౌముణ్ణైన నేను నీ చెంత నిలుస్తాను. నీ కర్తవ్యాన్ని నిర్వహించు. రా! పారిజాత పుష్పమాలాలంకృతమైన ఈ ఐరావతాన్ని అధిరోహించు."

ఇలా ధైర్యవచనాలను పల్కిన వాసవుడు వెంటరాగా, సిద్ధసాధ్యులు సాహో నినాదాలు చేస్తుండగా, దుర్వార పరాక్రమోపేతులై గీర్వాణులు సర్వసమర్థులై తోడురాగా, భయవిహ్వలుడైన రాహువు ధైర్యాన్ని వహించి కాలాంబుదచ్ఛాయ తన కరాళ దంష్ట్రలతో దినరాజును పట్టబోయాడు. అలా

రాహువు కోరల మధ్య చిక్కిన రవిబింబాన్ని చూచి మంచి పండని భ్రమించి కహకహా రావంతో దిక్కులల్లాడ నోరుతెఱచి ఉగ్రనరసింహునివలె వాయువేగంతో రాహువును రవిని కలిపి మ్రింగబోయాడు మారుతాత్మజుడైన ఆంజనేయుడు.

**ఇంద్రుడు ఆంజనేయుని వజ్రాయుధంతో కొట్టుట. వాయువు స్తంభించుట.**

ప్రమాదాన్ని పసిగట్టిన రాహువు ప్రాణభీతితో పలాయితుడై ఇంద్రుని సన్నిధికి వచ్చి ఈ అర్భకుడిదె నన్ను చంపబోతున్నాడు. నన్ను నిర్భీకుని చెయ్యవలసింది అని ప్రార్థించాడు. అంత జంభారి ఈ పాటిదానికి వెఱపేటికని స్వర్భానుని ఊఱడించి; దంభోళి ఝళిపించి ఈ వజ్రాయుధంతో వాణ్ణి తుత్తునియలు చేస్తాను చూడమని...దుర్వార గర్వాటోపంతో కుంభస్థలంపై ఒక్కపోటు పొడిచి ఐరావతాన్ని బాలుని పైకి దూకించాడు. సంభృత మదవిభ్రమంతో ఒప్పారుతూ ఉన్న దంతావళం అంకుశాఘాతానికి రెచ్చిపోయి కొండలా ముందుకు దూకింది. విష్ణుపథం నుండి శివజటాజూటం మీదికి దూకుతున్న గంగలా ఘీంకరిస్తూ వస్తూన్న ఐరావతాన్ని చూచాడు బాలుడు. తన మనస్సులో ఇలా అనుకొన్నాడు. "ధవళ దీప్తులతో దీపిస్తూన్నది... ఈ పండు. దీనిని తిని నా ఆకలి బాధను తీర్చుకొంటాను" అని సంకల్పించి ప్రళయ ఝంఝామారుతంలా విక్రమించి పట్టుకోబోయే సరికి భీతితో ఐరావతం గర్వముడిగి శరత్కాల మేఘంలా పరుగులు తీసింది.

అప్పుడు జంభారి సామీరి ఆటోపాన్ని సహింపలేక సంభృత రోష కషాయితాక్షుడై... హుంకార సరంభంతో...శతకోటి శంపాలతా కాంతులు వ్యోమమండల మంతా వ్యాపింపగా...అద్రిభేదనా సమర్థమైన దంభోళిని యెత్తి అంజనా సుతుని, కుండల ద్యుతులతో మెఱిసిపోయే చిగురుటాకు వంటి

నునులేత చెక్కిలిపై తన బాహుబలమంతా ప్రయోగించి భీకరంగా దెబ్బకొట్టాడు.

అప్రతీప ప్రతాపంతో ఆఖండల మండలేశ్వరుడు క్రకచ దంష్ట్రాకరాళమైన నూఱంచుల కత్తితో కొట్టిన దెబ్బకు... అసలే ఆకలితో అలమటిస్తూన్న బాలుడు ఉదయాద్రి మీద వివశుడై మూర్ఛపోయాడు. తన ముద్దులపట్టి దుర్దశచూచి చితాక్రాంత స్వాంతుడైన సమీరుడు బాహ్యాభ్యంతర సంచారం మాని క్రోధంతో స్తబ్ధుడయ్యాడు.

**పుత్రుని కానక అంజన శోకించుట.**

దేవీ! జగదాశ్చర్యకరము, పరమ పావనము ఐన ఆంజనేయుని వృత్తాంతాన్ని సవిస్తరంగా చెపుతున్నాను విను! ఫలాలను తెచ్చే నిమిత్తమై వనానికి వెళ్ళిన అంజన తిరిగి వచ్చి పానుపుమీద బాలుడు లేకపోయే సరికి ధైర్యాన్ని కోల్పోయి నేలకూలి నిట్టూర్పులు విడుస్తూ ఇలా శోకించింది.

“ హా! కుమారా! కులభూషణా! వంశోద్ధారకా! నీ ఆకలి చిచ్చును చల్లార్చటం కోసం ఫలాలకై వనానికి వెళ్ళి వచ్చేటంతలో ఇంతలోనే ఎక్కడికి వెళ్ళావు. తండ్రీ! వనంలోని క్రూరమృగాలు వాటి ఆకలి చిచ్చు చల్లార్చుకోటానికి నిన్నెక్కడికైనా తీసికొని పోయాయా! ఇట్టె నా వాంఛితాన్ని నెరవేర్చి అట్టె ఎడబాటు కల్పించిన ఆ దైవాన్ని ఏమనాలి? నా తపఃఫలమా! నా తపస్సంతా వ్యర్థమైనట్లేనా? అమ్మ మంచి మంచి ఫలాలను తెస్తుందని ఎంత ఆశతో ఎదురు చూచావో కదా! ఇవిగో! పండ్లు! ఎవరు తింటారు తండ్రీ ఇవన్నీ! ఆటలకై ఎక్కడికైనా వెళ్ళావా! లేదా నే రావటం ఆలస్యమైందని అలిగి వెళ్ళావా? ఏ క్రూర మృగాలు నిన్ను కఱకఱ కొఱుక్కొని తింటున్నాయో అన్న ఊహే గుండెకు రంపపు కోతలా ఉంది. అయిపోయింది. నా నోములు నా తపస్సు.... అంతా వ్యర్థమై పోయింది! నా కన్నా! నువ్వు లేకుండా నేనెట్లా బ్రతికేదిరా?”

అని ఈ విధంగా సుందరుడు, సుకుమారుడు ఐన కుమారుని కొఱకు పలవరిస్తూన్న భార్యను చూచి త్రికాలజ్ఞాని ఐన కేసరి ఓదారుస్తూ ఇలా అన్నాడు.

**కేసరి అంజనను ఊరడించుట.**

"దేవీ! అంజనా! శోకించకు! పరమేశ్వరుని వరప్రభావంతో జన్మించిన మన కుమారునికి వచ్చిన ముప్పేమీ లేదు. జరిగింది చెబుతాను విను! బాల భానుణ్ణి చూచి పండని భ్రమించి గగనానికి ఎగిరాడు మన బాలుడు. ఈరోజు పర్వదినమైన కారణంగా సూర్యుణ్ణి మ్రింగుదామని పొంచి ఉన్నాడు రాహువు. పిల్లవాడి కంటికి నేరేడు పండులా కనిపించాడు! ఆ భ్రమతో రాహువును గుటుక్కున నోట్లో వేసుకోబోయాడు! ప్రాణభయంతో పరుగెత్తి ఇంద్రుని దగ్గర మొఱపెట్టు కొన్నాడు రాహువు. దేవేంద్రుడు ఆగ్రహంతో మనపిల్లవాడి క్రింది దౌడమీద వజ్రాయుధంతో భేదించాడు. ప్రస్తుతం ఉదయాద్రి మీద స్పృహ లేక పడి ఉన్నాడు బాలుడు. వరపుత్రుడైన ఆంజనేయుణ్ణి కంటికి ఱెప్పలా కాపాడుకొంటున్న వాయువు శోకంతో స్తంభించాడు. శీఘ్రంగా సకల మహిమలు నీ కుమారునికి సంప్రాప్తిస్తాయి. శోకాన్ని విడిచిపెట్టు మనకు శుభం కలుగుతుంది !"

కేసరి పలుకులు అంజనకు దాహంతో అలమటించి పోతున్న చాతకి నోటపడ్డ వాన చినుకుల్లా తోచి ఖేదమోదాలు రెండూ ఏకకాలమందు సంప్రాప్తించగా కొంతసేపటికి ఊరడిల్లింది.

**దేవతలు బ్రహ్మను ప్రార్థించుట. బ్రహ్మ వాయువును సమాధాన పఱచుట.**

దేవీ! సీతా! ఇక అక్కడ దేవలోకంలో జరిగిన వృత్తాంతాన్ని చెపుతాను విను! పుత్ర వ్యామోహంతో వాయువు సంచారం మాని స్తబ్ధుడై పడిఉండే సరికి దేవలోకంలోని సకల ప్రాణులు నిస్ప్రాణులయ్యారు.

గీర్వాణులంతా విధాతను సమీపించి భక్తితో మ్రొక్కి ఈ ఆర్తిని హరించి సకల ప్రాణికోటికి శుభాన్ని సంకల్పించమని ప్రార్థించారు. జరిగింది తెలుసుకొని తాను కల్పించుకొనకపోతే కార్యం చక్కబడదని నిశ్చయించుకొని తెలిరెక్కల పక్కితేరునెక్కి పలుకుల తల్లితో కలిసి కుందనపు బొజ్జయ్యగారు జందెం సవరించుకొని గాడ్పు దరికేగి నేర్పుతో ఇలా అన్నాడు:

"ఓ! సకలాత్మక! సకల జగత్ప్రాణుడవు! సకల జగజ్జన విహార సంధాతవు! సకలాత్మ సంచారివి! నీకు ఇంత కినుక తగునా?" విధాత పలికిన ఈ మాటలు విని పెద్దయ్య గారి పల్కులకు ఎదురాడ లేక హద్దుమీరి ఎదురాడిన మర్యాదాతిక్రమణం అవుతుందనే శ్రుతి కట్టడిని పాలించి... ఇంద్రుని వజ్రాయుధం దెబ్బకు మూర్ఛిల్లిన తన లేలేత పట్టిని రెండుచేతుల మోసితెచ్చి విధాత పాదాంభోజయుగ్మం ముందుంచి నమస్కారం చేసి మౌనంగా నిల్చున్నాడు...వాయువు. "ఇంద్రుడు చేసిన ఈ తొందరపాటు పనికి తాతా! మీ సమాధానం ఏమిటి?" అన్నట్లుగా ఉంది ఆ మౌనం. ఆ దృశ్యాన్ని చూచిన వారందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

**ఆంజనేయుని బ్రహ్మ దీవించుట.**

బాలుణ్ణి చూచిన బ్రహ్మ వేదమంత్రాలతో స్వస్తి చెప్పి వాయువును చూచి "ఓ! పవనా! ఈ బాలుడు ఆర్యసంస్తవనీయ శౌర్యుడు! లోకహితాత్ముడు!" అని ప్రశంసించి బాలుని మేను తన సుకుమార హస్త పద్మాలతో స్పృశించాడు. జానకీ! విధాత హస్తస్పర్శ సామాన్యమా! పూర్ణిమా చంద్రుని కరస్పర్శకు వాడినపైరు వర్ధిల్లినట్లు... విరించి హస్త స్పర్శకు దేహదాహం నశించి ఆ బాలుడు చర్లాడటం మొదలుపెట్టాడు. అప్పుడే శైశవక్రీడా పారవశ్యంలో చర్లాడుతున్న బాలుణ్ణి చూచి "నాయనా! తరుణార్క కబళనోద్ధతిని చూపిన విక్రమ కుమారా! గిరిశుంభద్ధైర్య! ఇలా చెంతకు రావోయి!" అని దగ్గరకు తీసుకొని బాలుని చెక్కిళ్ళను నిమిరి మోము మోమున చేర్చి ముద్దాడాడు... ఆదిజుడు. ఆ దృశ్యాన్ని చూచిన వాయువు

సంతోషించి భాషావధూటిపెనిమిటి పాదాలకు నమస్కరించి ఎప్పటిలా సంచరించాడు. వాయు సంచారంతో సకల లోకాల ప్రాణులు తిరిగి సత్త్వాన్ని సంతరించుకొన్నాయి. అప్పుడు కమలభవుడు అక్కడున్న సమస్త దేవతాకోటిని ఉద్దేశించి ఇలా అన్నాడు:

**దేవతలు ఆంజనేయునకు అనేక వరాలిచ్చుట.**

"ఓ దిక్పాలకులారా! ఈ బాలుడు రుద్ర తేజుడు! అవారిత శౌర్యుడు! లోక త్రయాలకు ఆమోదాన్ని చేకూర్చగల ఆర్యుడు. ఇతనికి మీ మీ శక్త్యానుసారం వరాలియ్యండి." అలా విధాత ఆజ్ఞాపించగానే... వేద శాస్త్రాలతో కూడి సర్వవిద్యలలోను సంపూర్ణుడవుతాడని ధరణి తన తేజాన్ని ఇచ్చింది. వరుణ పాశముల చేత నీట కట్టబడడని కరుణతో వరుణుడు వరమిచ్చాడు. జరామరణాదులు లేకుండా చిరంజీవి అవుతాడని సూర్య పుత్రుడైన యముడు వరమిచ్చాడు. తనచేత తన ఆయుధముల చేత కట్టుబడడని శంకరుడు వరమిచ్చాడు. యుద్ధంలో జయాన్ని తన గదాఘాతానికి వెఅవని మహిమను కుబేరుడు ధారపోశాడు. తన చేత నిర్మితములైన ఆయుధములు ఏమీ హాని చేయలేవని వరమిచ్చి కనక కుండలాలను కూడా ఇచ్చాడు విశ్వకర్మ. శతకోటి పర్వతాలను తుత్తునియలు చేయగల వజ్రాయుధంతో క్రిందిదౌడ మీద కొట్టినా తట్టుకొని నిలబడ్డాడు కనుక ఈ బాలుడు **"హనుమంతుడు"** అనే నామధేయంతో ఈపైన లోకంలో వర్ధిల్లుతాడు. అంతేకాదు ఈపైన నా వజ్రం ఇతని విషయంలో విఫలమవుతుందని ఇంద్రుడు వరమిచ్చాడు. ఇంకా అనేక దేవతలు అనేకానేక వరాలిచ్చారు.

**ఆంజనేయునకు విధాత వరాలిచ్చుట.**

చివరగా బ్రహ్మదేవుడు చిరంతన దీర్ఘాయువునిచ్చి వాయువును వీక్షించి ఇలా అన్నాడు: " ఓ పావనమూర్తి! నీ కుమారుడు

అమల కీర్తి విహారుడు! అజితుడు! ఏకవీరుడు! అద్రిధీరుడు! అఖిల జగదుదారుడు! ఆత్మతత్త్వ విచారుడు! అంతేకాదు. అణిమాద్యష్ట సిద్ధులు నిత్యము ఇతనికి పరిచార దేవతలు. వాటిని ఇతరులకు వరప్రసాదంగా ఇయ్యగలడు కూడా! ఇతనికి మనోవేగం సిద్ధిస్తుంది. ఇతడు కామరూపి. దుర్వార శౌర్య ధైర్య దయాది సద్గుణాలకు ఇతడు ఆటపట్టు. చాలా విచిత్రమైన పనులు చేయగలడు. అఘటన ఘటనా సమర్థుడు. రామకార్యార్థమై రాక్షసులను సంహరించి స్వామికి మేలు చేయగలడు. ఎన్నని చెప్పను. ఈ చిన్నవాని అద్భుత లీలలను నీ కన్నుల నీవే చూడగలవు!" ఈ విధంగా వరాలిచ్చి సకల దేవతాకోటి బ్రహ్మతో కూడి తమతమ నెలవులకు వెళ్ళిపోయారు.

వెడుతూ వెడుతూ దారిలో హనుమను గూర్చి ఇలా అనుకొన్నారు.

ప్రతిలేని తన ప్రతాపాన్ని చూపటానికి ఇంతపని చేశాడు కాబోలు అని కొందరు...

తన కాంతిని పోలిన అరుణ ద్యుతులతో ప్రకాశిస్తూన్న సూర్యుణ్ణి చూసి అసూయతో కబళింప బోయాడని కొందరు...

తన త్రిమూర్త్యాత్మకత్వ మాహాత్మ్యాన్ని ఇలా ప్రకటించాడని కొందరు...

తన ఏకపాద రుద్రావతార తత్త్వాన్ని రహస్యంగా దాచి మౌగ్ధ్యాన్ని వెల్లడించాడని కొందరు...

కాని ఎడల బాలునికీ శక్తి ఎక్కడిదని కొందరు...

ఇలా తలకొక రీతిగా తలపోస్తూ తమతమ లోకాలకు చేరుకొన్నారు. వాయువు బాలుడైన హనుమను తీసికొని అంజన చేతికిచ్చి. జరిగిన

కథనంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి, దేవతలిచ్చిన వరాలను ఎఱిగించి అంజనను హెచ్చరించి తన లోకానికి వెళ్ళిపోయాడు.

**అంజన పుత్రుని లాలించుట.**

అంజన ఎంతో ఉద్వేగంతో పుత్రుని కౌగిలించుకొని పలుమార్లు ముద్దులాడి "నా కంటి వెలుగా! నా ఇంటి దీపమా! సూర్యుణ్ణి చూసి పండని భ్రమించి పైకెగిరిన నిన్ను వాసవుడు వజ్రాయుధంతో కొట్టినప్పుడు ఎంతబాధ పడ్డావో కదా! అమ్మా! అమ్మా! అంటూ నన్నెన్ని సార్లు తలచుకొన్నావో! బిడ్డా! దేవతలకు రాజేకాని ఆ ఇంద్రుడెంత కఠినాత్ముడో కదా? ఏదో చంటి పిల్లాడివి. పిల్లలు చేతికి దొరికిందల్లా ముందు నోట్లో పెట్టుకొంటారు. ఏదో సూర్యుణ్ణి చూసి నారింజ పండని, రాహువును చూసి నేరేడు పండని, ఐరావతాన్ని చూసి తెల్లని పంచదార బొమ్మని అనుకొని ఉంటావు! అంత మాత్రానికే దౌడమీద కొట్టాలా? ఏ కాయో – కసరో, పండో – ఫలమో నీ చేతిలో పెడితే నువ్వూరుకొనే వాడివి గదా. ఇంతకీ తప్పు నాదే. కాకపోతే ఏ తల్లైన శిశువును ఒంటరిగా విడిచి వెడుతుందా? అందులోనూ... అడవిలో!" అని ఎన్నో విధాల పలవించి మట్టితో నిండిన బాలుని దేహాన్ని కన్నీళ్ళతో కడిగేసింది... అంజన.

తక్కిన ఆశ్రమ వాసులంతా అక్కడ చేరి "ఎంత విచిత్రం! కొద్ది పాటి భానుని కిరణాలు మేను సోకగానే అమ్మక్క అంటూ ఉమ్మలిస్తాం గద! అలాంటిది ఆ సూర్యుణ్ణే మ్రింగబోయిన ఈ బాలుని మహాత్మ్యాన్ని ఏమని పొగడాలి?" అంటూ ముక్కున వేలేసుకొన్నారు. విషయాలను తెలుసుకున్న కేసరి కూడా బాలుడు దేవతా వరప్రసాది ఐనందున సంతోషించి సుఖస్థితిని పొందాడు.

**హనుమ తల్లి ఆజ్ఞచే వాలిసుగ్రీవుల వద్ద చేరుట.**

అంజనకు తపఃఫలంగా జన్మించినా బ్రహ్మాది దేవతలంతా వరాలిచ్చినా హనుమ బాల్యం మాత్రం ఆ వనంలో

సంచరించే మిగతా వనచర సమూహంతో కలిసి మర్కట చేష్టలతో క్రీడిస్తూ సామాన్యంగానే గడిచిపోయింది.

ఆంజనేయుని భవిష్య కార్యాచరణను దృష్టిలో ఉంచుకొని ఒక రోజున అంజన తన కుమారుని పిలిచి గతచరిత్రనంతా విపులంగా చెప్పింది. అలా చెప్పి "నాయనా! ఆంజనేయా! నే చెప్పిన గతచరిత్ర అంతా విన్నావుగా? ఆ కారణంగా వాలిసుగ్రీవులు నీకు మేనమామలు. ప్రస్తుతం వారిద్దరు కిష్కింధను పాలిస్తున్నారు. వారిలో సుగ్రీవునకు మంత్రిగా ఉండు. వారిద్దరి మధ్య తగవులేవైనా వస్తే నీవు జోక్యం చేసికోవద్దు. ఎట్టి పరిస్థితులలోను వాలి మీద చేయి చేసికోవద్దు, సుగ్రీవునికి హితవు చెపుతూ సన్నిహితంగా ఉండు."

ఈ విధంగా చెప్పిన తల్లి మాటలను ఎంతో వినయంతో ఆలకించి హనుమ ఇలా ప్రశ్నించాడు. "అమ్మా! మునుపు సత్యదయాది ధర్మములు, నిత్య బ్రహ్మచర్యము విధాత నాకు వరాలుగా ఇచ్చినప్పుడు ఆయనకు భక్తితో మ్రొక్కి నా తనుమనఃప్రాణాలను ఏలుకోగల విభుడెవ్వడని అడిగాను. అప్పుడు విధాత 'నీ శరీరం మీది దివ్య విభూషణాదులను ఎవరు గుర్తిస్తారో అతడే నీ ఏలిక. అతడు విష్ణువే' అని సమాధానమిచ్చాడు. నీవు సుగ్రీవునికి మంత్రిగా ఉండమంటున్నావు. ఈ రెంటిలో ఏది కర్తవ్యం?"

హనుమ ప్రశ్నకు సమాధానంగా అంజన "నాయనా! కమలోద్భవుడాడిన మాట పొల్లుపోదు గదా! నా మాటా తప్పదు. సుగ్రీవునకు మంత్రిగా ఉంటూ రామకార్యాన్ని నెరవేర్చగలవు. కనుక వెంటనే కిష్కింధకు బయలుదేరు" అన్నది. తల్లి చెప్పిన మాట ఔదల దాల్చి కిష్కింధకు వెళ్ళి వాలేడు.

మేనమామలు కావున వాలిసుగ్రీవులకు మ్రొక్కి వారిచే సంభావింపబడి సుగ్రీవునకు మంత్రిగా ఉంటూ సుఖంగా ఉంటున్నాడు... హనుమ. మహాత్ములెప్పుడూ తల్లిదండ్రుల మాట జవదాటరుగదా!

**హనుమ సూర్యునివద్ద విద్యనభ్యసించుట.**

అలా మేనమామలకు ఎంతో చేతోమోదాన్ని సమకూరుస్తూ వేద శాస్త్రాభ్యాసాన్ని చేయ సంకల్పించినవాడై ఒకానొక అరుణోదయ వేళ... తొలిగట్టున తోచిన పద్మాభ్యుదయ ప్రసన్నుడైన రవిబింబాన్ని చూచాడు హనుమ. యథావిధి ప్రత్యూషోచిత కృత్యములను నిర్వర్తించి చదివితే గాయత్రికి సింహాసనమైన సవితృమూర్తి, త్రయీతనుడైన సూర్యుని వద్దనే చదవాలనే ఆకాంక్షతో గరుడుని మించిన వేగంతో మారుతాత్మజుడు కావున వియద్గతిని చని ఆదిత్యుని సందర్శించి "తుభ్యం నమస్సత్య జ్ఞాన కళాత్మనే" అని నమస్కరించాడు.

తన ప్రకాశాన్ని చూసి ఏమాత్రం జంకకుండా నిలబడిన మారుతిని చూచి "వాయుజ! భవత స్సంకల్పసిద్ధిరస్తు" అని సహస్రాంశుడు బహుమతిగా సమాధానమిచ్చాడు. ఇచ్చి అంజనాదేవి మనోవాక్కాయ కర్మల చేత అనేక జన్మల్లో చేసిన తపఃఫలంగా ఉదయించిన ఓ ఆంజనేయా! ఇక్కడకు నీవరుదెంచిన కారణమేమని అడిగాడు. అందుకు హనుమ "ఓ! భాస్కరా! వేదశాస్త్రాగమాభ్యాసం నువ్వెప్పుడు కోరితే అప్పుడు చెపుతానని మీరు నాకు వరం ఇచ్చారు. ఆ ఇచ్ఛతో ఇప్పుడు మీ సన్నిధికి వచ్చాను. కరుణించి సకల విద్యల నన్ను పరిపూర్ణుణ్ణి చెయ్యండి" అని ప్రార్థించాడు.

దానికి లోకబాంధవుడెంతో సంతుష్టాంతరంగుడై "ఓ! వటుమూర్ధన్యా! లోకహితాన్ని కోరి మేరువుచుట్టూ ఎంతో వేగంగా తిరుగుతూ ఉంటాను. వేదశాస్త్రాభ్యసనం మార్గలంపట సంపర్కంతో కుదిరేది కాదు. అలా పఠించటం చాలా కఠినం. నీవు నా సప్తాశ్వరథ ఘట్టనలకు భ్రమ చెందక స్వరం తప్పకుండా శ్రుతిపాఠాన్ని నాతో పాటే చరిస్తూ వల్లించగలవా?" అని ప్రశ్నించాడు.

అరుణుడు అడిగిన ప్రశ్నకు మారుతి ఇలా సమాధానమిచ్చాడు: "ఓ భువనపావన! లోకసాక్షీ! నా గమన వేగాన్ని నేనే చెప్పుకొంటే అది గర్వమవుతుంది. నా దేహాన్ని పెంచి పూర్వపశ్చిమాద్రులపై చెరొక పాదం

నిలిపి పాఠం చెప్పుకోమంటారా? లేదా దేవరవారి కంటె ముందు గమిస్తూ వేదాభ్యాసం చెయ్యమంటారా?"

అది విన్న సప్తాశ్వుడు "ఓహో! చాలా మహిమాన్వితుడవు! ఏడు లోకాల్లోను నీకు సరిజోడు లేరు. దాటటానికి శక్యంగాని తూర్పు పశ్చిమ కొండలపై నీ పాదాలుంచి వియచ్చరులెల్ల మెచ్చగా వేదపాఠం చెప్పుకో! అలా చేస్తే అది నాకు నీకు కూడా ప్రతిష్ఠాకరమవుతుంది" అని హెచ్చరికగా అనుమతిచ్చాడు.

వెంటనే హనుమ గ్రహపతి ఐన సూర్యునకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి మున్ను బలిని అర్థించి త్రివిక్రమస్ఫురణ చూపిన విష్ణువువలె తారలన్నీ తనకు మొలనూలు ముత్యములుగా ప్రకాశింపగా దిశావలయమంతా వ్యాపించి స్వైర ప్రచారోద్ధతితో నిలిచాడు. భక్తజన హృదయాస్పదములైన తన పాదాలను పూర్వ పశ్చిమాద్రులపై నిలిపి బ్రహ్మాండమంతా నిండిన ఆయనవిరాట్ స్వరూపాన్ని బ్రహ్మాదులంతా నుతించారు. అప్పుడు భానుడు అద్భుతచిత్తుడై "ఓ ప్రత్యక్ష రుద్రావతారా! నన్ను జనులాదరించుటకు, నా ప్రతిష్ఠను పెంచుటకు నా వద్ద విద్యాభ్యాసానికి వచ్చావు కాని నేనా నీకు ఉపదేష్టను? ఇంతకుముందు ఏమన్నానో ఆ విషయాలను బుద్ధిలో పెట్టుకోకు. నా నేరాన్ని క్షమించు!" అని వినయోక్తులాడాడు. హనుమ వెంటనే తన విరాట్ స్వరూపాన్ని ఉపసంహరించుకొని "ఆదిత్యా! ఓ జగదీశ్వరా! తమరలా ఆనతీయ వచ్చా? సమస్తమైన వేదరాశికి మీరు పెన్నిధానం కదా! నన్ను కృపతో చేపట్టి నాకు జ్ఞానబోధ చెయ్యవలసింది" అని తన శిష్య భావాన్ని ప్రకటించాడు.

వేగంగా పయనించే మార్తాండుని ముందు నిలిచి అతనికంటె వేగంగా గమిస్తూ నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, ఆరు దర్శనాలు, సకల స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్య నాటకాలంకారాదులు, అరవై నాలుగు కళలు... ఇలా సమస్తమైన విజ్ఞానాన్ని భవిష్యద్బ్రహ్మ ఐన హనుమ వాచో విధేయంగా అభ్యసించాడు. విద్యాభ్యాసానంతరం ప్రభాకరుని ముందు నిలిచి అంజలి ఘటించి...

**" విద్యోతత్కరుణారసేన భవతో విజ్ఞాత మర్మాః కళా**
**స్సద్యోఽవేహి న దాతు మీశ మితి మాం స్వామిన్! గురోర్దక్షిణాం**
**హృద్యాం స్వీకురు పాదపద్మ వినతిం ప్రేమ్ణా కృతాంతే... "**

" ఓ! కర్మ సాక్షీ! మీ కరుణ వల్ల సమస్తమైన విద్యలను, అధ్యయనం చేశాను. కళలను అభ్యసించాను. మర్మజ్ఞుడనయ్యాను. ప్రేమతో నా గురు దక్షిణను స్వీకరించి నన్ను కృతార్థుణ్ణి చేయండి" అని సూర్యునికి నమస్కరించి కిష్కింధకు చేరుకొన్నాడు... హనుమ.

అలా వచ్చిన మారుతిని జూచి వాలిసుగ్రీవులు ఇతర బంధుజనం ప్రియమార కౌగిలించుకొని విద్యాభ్యాస విశేషాలను చెప్పమని కోరారు. వారందరికి తన వాగ్వైభవం వెల్లడి అగునట్లు సవిస్తరంగా విషయాలను చెప్పి ఎప్పటివలె తల్లిమాట చొప్పున సుగ్రీవునితో సఖ్యంగా ఉంటూ విద్యామృత రసపానతృప్తుడై చిదానందంతో వెలిగిపోతున్నాడు.

**సూర్యమండల మాహాత్మ్యం**

దేవీ! జానకీ! నీకొక రహస్యం చెపుతాను విను. ఆదిత్యుడు శక్తి కేంద్రం. జ్ఞాన స్వరూపుడు. భువర్లోకాధిపతియై ఉంటూ భూమ్యాది సకల లోకాలను తన దీప్తులచే ప్రకాశింప చేస్తున్నాడు. సకల జీవులను తన కిరణాలతో చైతన్యవంతులను చేసి బుద్ధిని ప్రచోదనం చేసి వారివారి కర్మలయందు ప్రవర్తింప చేస్తున్నాడు. భూమి మీది సకల జీవరాశుల సుఖదుఃఖాలు కర్మాధీనమై ఉన్నాయి. ఆ కర్మ జగచ్చక్షువు, కర్మసాక్షి ఐన సూర్యాధీనమై ఉంది. ఈ రహస్యాన్ని ఎఱిగిన పూర్వ ఋషులు ఆదిత్యోపాసన చేసి ఇహంలో దుఃఖాన్ని జయించి ఉత్తమ లోకాలను పొందారు. భగవాన్ అగస్త్య మహర్షి అనుగ్రహంతో ఆదిత్యోపాసన చేసే నేను రావణుణ్ణి యుద్ధంలో సంహరించగలిగాను. మరుత్సుతుడైన కారణంగానే హనుమ ఆదిత్యుని నుండి అన్ని విద్యలను నేర్వ గలిగాడు. హనుమదుపాసన చేసిన భక్తులకు ఇహపరాలు సిద్ధిస్తాయి. ఇందులో సందేహం లేదు. తన

బాహుబలంతో కైలాసాన్ని కదిలించిన దశగ్రీవుడు హనుమలోని నందీశ్వర స్వరూపాన్ని గుర్తించే ఉలికిపడ్డాడు.

ఈ విధంగా పారవశ్యంతో చెప్పుకుపోతున్న రామభూపాలుని పలుకులు ఆశ్చర్య సంభ్రమాలతో విని "నాథా! అడుగడుక్కి హనుమ వృత్తాంతం అద్భుతావహంగా ఉంది! ఇంకా ఇంకా వినాలని కుతూహలంగా ఉంది. తనివి తీరటం లేదు. అవతల వృత్తాంతాన్ని సెలవీయండి!" అని సీత కోరగా రాఘవుడు తరువాత కథను ఇలా చెప్పసాగాడు.

**ఫలశ్రుతి**

ఈ పవిత్ర చరిత్ర వ్రాసినా, చదివినా, విన్నా ఆయా దేవాతానుగ్రహం కలిగి సర్వశుభాలు చేకూరతాయి.

## ద్వితీయాధ్యాయం సమాప్తము

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము
## తృతీయాధ్యాయము

అఖిలభూత దయానిష్ఠుడైన వసిష్ఠుని జూచి గౌతమాత్మజుడైన శతానందుడు "మహర్షీ! తరువాత కథను సీతకు రామచంద్రుడు ఏం చెప్పాడు? ఆనతీయ వలసింది" అని కోరగా మహర్షి ఇలా ప్రారంభించారు.

శతానందా! విను! సీతకు రాముడిలా చెప్పసాగాడు.

## రామసుగ్రీవుల మైత్రి

"సీతా! హనుమ పుణ్య కథను విను! సుగ్రీవుడు హనుమ మంత్రిత్వంతో తన మోహపుటాలి ఐన రుమతో కలిసి రాజ్యపాలన సుఖంగా చేసికొంటూ ఉండగా, మహాబలశాలి ఐన వాలి కేవలం మదోద్ధరుడై రుమను, రాజ్యాన్ని కూడా బలాత్కారంగా లాక్కొని సుగ్రీవుని తరిమివేశాడు. హనుమ ఈ విషయంలో కలుగజేసికొని వాలిని శిక్షింప సమర్థుడై ఉండి కూడా... తల్లికిచ్చిన మాట ప్రకారం అశక్తునివలె ఉండిపోయాడు.

**సుగ్రీవునికి హనుమ చేదోడు - వాదోడుగా ఉండుట.**

ఇక సుగ్రీవుడు అన్నగారైన వాలి వలన తనకు కలిగిన అవమాన పయోధిని మరుత్సుతుని ధైర్యంతో తరించాడు. భార్యా వియోగ చింతానలాన్ని హరివటూక్తి సుధా

లహరితో హరించాడు. రాజ్యరాహిత్య తిమిరాన్ని సూర్య శిష్యుని మిత్రత్వంతో తొలగించాడు. మనోగ్లానిని పోద్రోలి ప్రాణాలను ధరించి శల్యావశిష్టుడై ఋష్యమూక పర్వతంమీద దినాలు వెళ్ళబుచ్చుతున్నాడు. మతంగ మహర్షి శాప కారణంగా వాలి ఆ పర్వతాన్ని చేరలేడు. అందుకని సుగ్రీవుడు అక్కడ చేరాడు.

ఆ కష్టకాలంలో హనుమ సుగ్రీవునికి ఎలా తోడ్పడుతూ ఉన్నాడంటె...

కార్యాకార్య విధిని తెలియ చెప్పటంలో ప్రధాని గాను...
శోకాన్ని తొలగించటంలో ఆచార్యుడు గాను...
చింతితార్థ ఫలాన్ని ఘటించటంలో ఇష్టదైవం గాను...
ధైర్యాన్ని కలిగించటంలో దాతగాను...

ఉండి అన్ని విధాలా అండగా ఉన్నాడు. బుధులెప్పుడూ దీనజన సంతోషప్రదులు కదా! తనకు గురువైన ఆదిత్యుని కుమారుడనే కారణంగా సుగ్రీవుని తన మైత్రితో సంతోష పెడుతున్నాడు.

ధర్మాత్ములైన వారెప్పుడూ ఆత్మగురు బంధురక్షా తత్పరులు కదా! వాలి జోలికి వెళ్లకుండా అతని కపటోపాయాల నుండి సుగ్రీవుణ్ణి అప్రమత్తుడై రక్షిస్తున్నాడు... హనుమ.

**సీతకు రాముడు హనుమ ఔన్నత్యాన్ని చెప్పుట.**

**దేవీ! సీతా! మారుతి ప్రాజ్ఞుడు, తజ్ఞుడు, ఉత్తముడు, సర్వజ్ఞుడు. గొప్ప రాజనీతి కోవిదుడు. కనుకనే విల్లంబులు ధరించి తపసి వేషాలలో ఉన్న మమ్ములను అజ్ఞతతో విశ్వసించని సుగ్రీవునికి నచ్చజెప్పి మా ప్రజ్ఞ లెరిగినవాడై సత్యమృదు వచనాలతో మైత్రి ఘటించాడు.**

**సమీర కుమారుడు విద్వాంసులలో విద్వచ్ఛిరోమణి! కవులలో ఉత్తమ కవి! గాయకులలో ఉత్తమ గాయకుడు ! భరతశాస్త్ర ధురంధరుడు!**

**బలవంతులలో కెల్ల మహా బలవంతుడు! ధీమంతులలో కెల్ల ధీమంతుడు!**

**తపోనిధులలో అతుల తపశ్శాలి! యోగులలో పరమయోగి!**

**గుణులలో కెల్ల లోకైక గుణధురీణుడు! వైరాగ్య పరులలో అతి విరక్తుడు!**

**వీరులలో వీరాధి వీరుడు! అప్రమేయుడు! అజేయుడు!**

అంతే కాదు దేవీ...

**ఈ పవమాన సూనుడు విరక్తుడే కాని రక్తి పుట్టునట్లు జంత్రగాత్రముల రాళ్ళను కరిగించగల గాంధర్వ విద్యాధురీణుడు!**

**విజితేంద్రుడైన వీరుడు! శాంతుడైన శత్రుభయంకరుడు!**

**విద్యాధికుడైన వినయశీలి! బహుకార్య ధురంధరుడైన బ్రహ్మచారి!**

**చిత్తవృత్తి నిరోధాన్ని సాధించిన మనోవేగి! సౌశీల్యనిధి ఐన కపిముఖ్యుడు!**

**అతి బలైశ్వర్యయుక్తుడైన నిగర్వి! కామరూపధరుడైన కామదూరుడు!**

**ఇతని అనంత కళ్యాణ గుణాలు త్రిలోకాద్భుతాలు!**

**లోకంలో గల వేలుపులు ఏకైక గుణప్రసక్తి, ప్రశస్తి కలవారు! ఈ హనుమ సకల గుణాకరుడు!**

**సకలదైవ ప్రభావాలు, సద్గుణాలు, పరమ సుజ్ఞాన, వైరాగ్య, భక్తి, కరుణ, కాంతి ప్రతాపాలు ఏక రూపాన్ని ధరించి పవన నందన రూపంలో మూర్తిమంత మయ్యాయి!**

**ఇతడు చిరంజీవి! ఇతణ్ణి కొలిచిన వారికి ఇష్టకామ్యార్థాలు వెంటనే సిద్ధిస్తాయి!**

**ఇతడు స్వంతంత్రుడై ఉండి కూడా నాయందు భక్తి భావాన్ని, భృత్య భావాన్ని చూపించాడంటే ఇతని వినయాన్ని ఏమని స్తుతించాలి!**

**స్వామి భక్తి, నయ, ఉద్యోగ, సౌమ్య, వినయ, ధర్మ, దాక్షిణ్య, కార్య సంధాన, ధైర్య, శౌర్య, చాతుర్యాలు ఇతని ఆత్మగుణాలు. ఇతడు అఖిల లోకోపకారి!**

రాముని నోట ధీమంతుడైన ఆంజనేయుని గుణ ప్రశంస విన్న జానకి, స్వామీ! మీకు హనుమకు మైత్రి ఎలా ఏర్పడింది? ఆ కథంతా చెప్పవలసిందని వేడగా రఘుకుల స్వామి ఇలా అన్నాడు.

# సీతకు రాముడు హనుమతో మైత్రి ఏర్పడిన విధము తెలుపుట

**సీతా వియోగం - రాముని దుఃఖం.**

"సీతా! మన అరణ్యవాస కాలంలో మాయలేడి మీది వ్యామోహంతో నన్ను తెమ్మని కోరగా ధనుర్బాణాలు ధరించి నేను దాని వెంట పరుగెత్తాను... గుర్తుందా! ఇంతలో రావణుడు... రాహువు రాకాశశాంకుణ్ణి మ్రింగినట్లు నిన్ను నా నుండి వేఱు చేసి అపహరించి తీసికొనిపోయాడు. నా మనస్సంతా వియోగ దుఃఖంచేత నిండిపోయి నిముషం కూడా నిలువ నిలకడ లేక కానలో తిరుగుతూనే ఉన్నాను. ఆనాటి నా పరితాప భారాన్ని ఏమని చెప్పను. నా కంటికి అంతా అంధకారమే!

**నిండు చందురుడు నిప్పల కుంపటి!**

**గండు కోయిల పల్కులు బాణపు ముల్కులు!**

**పుష్ప పరాగం విషధూళి!**

**చిగురుటాకులు వాడి కత్తులు!**

**హిమపాతానికి రేకులన్నీ రాలిపోగా... నిలువు లోతు నీళ్ళలో కర్ణికా మాత్రంగా కళాహీనమై... పద్మవనంలో ఒంటరిగా మిగిలిన పద్మంలా... ఇదీ నా దీనావస్థ! నిట్టూర్పు గాడ్పులతో నీరసించి... దరిలేని విరహంతో పంపాదరిని సంచరిస్తూన్న సమయంలో నన్నుద్ధరించటానికి వచ్చిన నావలా అక్కడ కనుపించాడు... ఈ హనుమ!**

**రాముడు కిష్కింధలో చూచిన హనుమ దివ్యరూపం.**

**అహో! ఏమారూపం! ఏమా బ్రహ్మచారి తేజస్సు! మెలిగొన్న ముత్యాల సరులతో కూడి వెన్నెల తీగలా వెలిగి పోతూన్న ఒంటి పోచ జందెం. మేలైన సరిగంచు ఎఱ్ఱని పట్టుపంచె మీద**

**మూడుపేటల బంగారు మొలత్రాడు. నవరత్న ఖచిత కుండల ద్వయం. బాలసూర్యుని మించిన ఎఱ్ఱని ముఖం. పసిమి గోచి. ముంజేతికి హేమ కంకణం! తన మేని నవ్యకాంతులతో బయటి ప్రపంచాన్నంతటిని సువర్ణ ధీధితులతో నింపుతూన్న ఒక బ్రహ్మచారి...** మా ముందుకు వస్తున్నాడు.

అలా వస్తూన్న ఆ బ్రహ్మచారిని చూచి తమ్ముణ్ణి ఉద్దేశించి "సోదరా! లక్ష్మణా! చూచావా! మన ఎదురుగా ఉన్న కొండ దిగి గంధసింధురంలా నడిచి వస్తున్నాడు. సుప్రసన్న శుభ దృష్టులతో మనవైపే చూస్తూ వస్తున్నాడు. నేత్ర పర్వంగా ఉంది ఈ వటుకులాగ్రణి రూపం! ఈతడు ఆదరణీయుడు సుమా!

**బంగారు పట్టుగోచి - పచ్చని మొలత్రాడు - ఒంటి పోచ జందెం - ముంజేతికి కంకణం - తారా ధావళ్యాన్ని మించిన హారాలు - కుండలాల కాంతులతో తళుకులీను ముద్దు చెక్కిళ్ళు - ఉదయార్కుని మించిన వదనద్యుతి. మన చింతను తీర్చటానికి శివుడే ఈ వటువు రూపంలో వస్తున్నాడేమో! అనిపిస్తోంది నాకు"** అంటూ ముందే శుభ వచనాలను పలికాను నేను.

"దేవీ! సీతా! ఎందుకో నాకా క్షణంలో ఆ బ్రహ్మచారిని చూడగానే ఇతనివల్ల దురంతమైన నా చింతలన్నీ తీరుతాయి. శుభాలన్నీ సమకూరుతాయి అనిపించి ఇంకా ఇలా అన్నాను.

"తమ్ముడూ! లక్ష్మణా! ఈ వటువు శివుడైనా కావాలి లేదా మన తాపాన్ని పరిమార్చటానికి మనవి తెల్ప వస్తూన్న వాణీశ్వరుడైనా కావాలి. వారిద్దరిలో ఒకడు కానినాడు ఇతరు లెవ్వరియందు ఈ మహాపురుష లక్షణాలు ఉండవు. ప్రాక్తనజన్మ పుణ్యపరిపాక విశేషం చేత గాక ఇతనితో సంభాషించే అదృష్టం పట్టదు. మేలిమి బంగారాన్ని మించిన మేనిఛాయతో వస్తూన్న ఈతని శరీర కాంతులకు వనంలోని చెట్లన్ని కుందనపు తళుకులతో ఎలా అందాలను గ్రుమ్మరిస్తున్నాయో చూడు! మునుపెన్నడు ఇట్టి ఘనుణ్ణి ఎచ్చట చూడలేదు. ఇతని యందు నాకు ఇష్టం పుడుతోంది. ముదం హెచ్చుతోంది. వెతలన్నీ తీరతాయి అనిపిస్తోంది."

**శ్రీరామ హనుమల సమాగమం.**

ఇలా ఉత్సాహ వచనాలను పలుకుతూన్న నా చెంతకు వచ్చి చేరాడు ఆ వటువు. నా ఇంగితాన్ని తన ఆత్మలో ఎఱిగి, నే నన్న శుభవచనాలను ఆలకించి, రెండు చేతులను తన లలాటాన్ని చేర్చి సాష్టాంగ నమస్కారం చేశాడు. మా చరిత్రనంతా లక్ష్మణుని వలన తెలుసుకొన్న వాడై మా మనసు లోని చింత మటుమాయ మౌనట్లుగా సుధామధురంగా ఇలా అన్నాడు:

"రాజా! నా రాజైన సుగ్రీవుణ్ణి రప్పిస్తాను. మీకు బంటును గావిస్తాను. మీ పాదాలు సేవిస్తాను. మిమ్ములనే స్వామిగా భావిస్తాను. కపిముఖ్యుడైన కేసరికి అంజనాదేవికి సమీర వరప్రసాదంగా జన్మించాను. నన్ను ఆంజనేయు డంటారు. నాకు గతి ఐన పతి ఎవరో తెల్పుమని విధాతను కోరగా నీ మేని మీది అలంకారాలను ఎవరు గుర్తిస్తారో అతడే నీకు పతి – అతడే నీకు గతి అని భావి శుభాన్ని చెప్పాడు. ఆ చతురాననుడు ఆనతిచ్చినట్లుగా నామేని సొమ్ములను మీరు గుర్తించారు."

అని ఈ విధంగా హనుమతో సఖ్యం ఎలా ఏర్పడిందో చెపుతూన్న రామచంద్రుని పలుకులను విన్న సీత తన ఆశ్చర్యాన్ని అణచుకోలేక మధ్యలో ఇలా అడిగింది.

"నాథా! వాయు వరప్రసాదంగా అంజనాదేవి తపఃఫలంగా ఆమె గర్భాన జనించిన రుద్రతేజం కదా హనుమ. లోకపాలకుల నుండి అనేక వరాలను పొంది... తాను స్వతంత్రుడై ఉండి కూడా మీ యందు స్వామి భావాన్ని ప్రకటించాడంటె చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆత్మజ్ఞాని ఐన హనుమ తరువాత వృత్తాంతాన్ని సెలవీయండి. నా పరోక్షంలో జరిగిన విషయాలు కావా...ఇవి."

**శివకేశవులకు అభేదం.**

"దేవీ! సీతా! విను! శివకేశవులమైన మా యందు ఎప్పుడూ భేదం లేదు. ఒకరియందొకరికి పూజ్యభావమే! మా లోకాల్లో మా నిజస్థితి యందు

ఉంటూ కర్తవ్య పాలనలో ఉన్నప్పుడు... అవతారాలుగా అవతరించినప్పుడు ఎప్పుడూ పూజ్యభావంతో ఒకరికొకరు సహకరించుకొంటాం. అల్పులైన వారు మాత్రం మా యందు భేద భావాన్ని కలిగి మత భేదాన్ని సృష్టించుకొంటారు.

**హనుమ వాక్చాతుర్యం రాముని ప్రశంస.**

ప్రథమ పరిచయంలోనే నాయందు స్వామిభావాన్ని ప్రకటించిన మారుతి ఇంకా ఇలా అన్నాడు. "రామా! మీ ముందు నేనెంత లఘుస్థితిలో మాట్లాడాను. సర్వలోకాలోక చరితలు తెలిసిన మీరు నా నిజభూషణావళిని గుర్తించటం ఒక లెక్కా! వ్యష్టిగాను సమష్టిగాను అంతర్యామి స్వరూపంగా సాక్షి మాత్రంగా ఉంటూ సృష్టి స్థితి లయములకు కారణభూతమైన చిన్మాత్ర స్వరూపుడవు! సగుణరూపంలో నా ముందు ఇలా సాక్షాత్కరించటం నా అదృష్టం! మీ ముఖచంద్ర దర్శన మాత్రంచేత హృదయాంధకారం తొలగిపోయింది. మీ నామోచ్చారణ మాత్రంచేత బహుపాతక శ్రేణి పటాపంచలైంది. మీ పాదస్పర్శచే నా మేను పరమ పావనమైంది. మీ సన్నిధిలో నా కామితార్థాలన్నీ నెరవేరాయి. మిమ్ము సేవించే నేను నిత్యోత్సవ శ్రీలను పొందటంలో ఆశ్చర్యమేముంది!

అని ఈ విధంగా పల్కిన హనుమ యొక్క భక్తి, యుక్తి, అనురక్తి, ఇత్యాది గుణ సంపదను ఆత్మలో మెచ్చి లక్ష్మణుని చూచి ఇలా అన్నాను.

"లక్ష్మణా! ఈ కపికుంజరుడు వచించిన మాటలను విన్నావు గదా! నవ వ్యాకరణాలను చదివిన ప్రాజ్ఞుడు మాత్రమే ఇలా మాట్లాడగలడు. ఈతడు శబ్ద ప్రయోగ కుశలుడు. శ్రుతి విశుద్ధతాత్పర్య యుక్తుడు. ఇట్టి గుణసుందరుని మునుపెక్కడైనా చూచామా?"

అలా నేను ప్రశంస చేస్తున్న సమయంలో తాను సుగ్రీవుని వద్దకేగి..."రాజా! గొప్పదైన శోకంలో మునిగిన మీకు రాఘవుడనే ఒక దరి కనిపించింది. ఇక ఆపదలన్ని తీరినట్లే" అని చెప్పి తిరిగి మా వద్దకు వచ్చి

మా ఎదుట నిల్చి "మీ బంట్రైన అర్క సుతునికి దర్శన మియ్యండి" అని నన్ను కోరాడు. అప్పుడు నేను ప్రేమతో "నరవానరులకు ఇలా సఖ్యాన్ని సమకూర్చిన నీ అఘటన ఘటనా సామర్థ్యాన్ని ఏమని ప్రస్తుతించాలి! ఈ అవ్యాజమైన ప్రేమ, ఈ పరోపకార పారీణత, ఈ నిత్య సత్యవ్రతం, ఈ నైపుణ్యం ఎవరి యందు చూడబోము" అని నేను కొనియాడాను.

దానికి తాను లజ్జిస్తూ మమ్ములను భక్తితో ఋష్యమూకాద్రిపైనున్న సుగ్రీవుని వద్దకు కొనిపోయి అతనితో సఖ్యాన్ని సమకూర్చాడు. ఆపై వాలివధ, సుగ్రీవుని కిష్కింధా రాజ్యానికి పట్టభద్రుని చెయ్యటం.... ఇదంతా వాగ్విధాననిధి ఐన హనుమ యొక్క చాతుర్య ఫలితమే!

**రాముడు హనుమకు ముద్రిక నిచ్చుట.**

దేవీ! జానకీ! నిన్ను అన్వేషించే కార్యంలో హనుమ ప్రతాపాన్ని, శక్తి సామర్థ్యాలను చెపుతాను విను! సుగ్రీవుడు తన కపిసేనను నల్దిక్కులకు పంపాడు. దక్షిణ దిక్కుకు అంగదాదులతో కలిసి పావనిని వెళ్ళమ్మన్నాడు.

అప్పుడు నేను మారుతిని పిల్చి ఇలా అన్నాను: "తండ్రీ! హనుమా! ఇదుగో ప్రస్తుతం నేనున్న ఈ దుఃఖ స్థితిని చూస్తున్నావుగా. ఇదంతా జనకనందినికి వివరించు. ముందు ఆమె జీవనాన్ని ఉద్ధరించు. ఆపై సీతయొక్క శుభస్థితిని నాకు చెప్పి నా ప్రాణాలను ఉద్ధరించి... మా ప్రేమను సఫలీకృతం చెయ్యి. మారుతీ! రఘుకులానికి పునర్జన్మను ప్రసాదించవోయీ" అని బేలగా అతని ముందు వాపోయాను. నా మణిముద్రికను గుర్తుగా ఇచ్చాను.

**హనుమ సీతాన్వేషణ ప్రయత్నం.**

దానిని భక్తితో తీసికొని కళ్ళకద్దుకొని "స్వామీ! మహా ప్రసాదం! ఇదుగో! ఈ క్షణమే బయలుదేరుతున్నాను. మూడు లోకాలు

శోధించి సీతను కనుగొని ఆ శుభవార్త మీకు మనవి చెయ్యటానికి వస్తాను గాని వృథాప్రయత్నశీలినై మాత్రం రాను. ఇది నా ప్రతిజ్ఞ!" అని పలికి నాకు మ్రొక్కాడు. ఆపై రాజైన సుగ్రీవునకు, లక్ష్మణునకు మ్రొక్కి వారిచే వంద్యమానుడై సహచర వానర సంఘంతో కలిసి బయలుదేరాడు. గిరి గహ్వరాలు, అడవులు, మహానదీ తీరాలు, గ్రామాలు, నగరాలు అన్ని శోధించి నిన్ను కానక దక్షిణ సముద్ర తీరానికి చేరాడు.

వనచర బృందమంతా ఆ కడలిని దాటటానికి వారివారి బలాలను లెక్కించుకొని సామర్థ్యం చాలక కడలేని దుఃఖంలో మునిగిపోయారు. అప్పుడు జాంబవంతుడు హనుమ సామర్థ్యాన్ని ఎఱిగిన వాడు కనుక అతనికి తెలియచెప్పి "మారుతీ! సముద్రుణ్ణి ప్రతిఘటించవోయీ! అతడు అభంగ తరంగ భీషణ ఘోషలతో భయపెడుతున్నా నీ చేతిలో భంగపడటం నిజం! సముద్రాన్ని తరించు... నీ కీర్తిని విస్తరించు!" అని ప్రోత్సహించాడు. వెంటనే హనుమ ఉత్సాహంతో "ఓ కపివీరులారా! దుస్తరమైన ఈ వార్ధిని లంఘిస్తాను. లంకను చేరతాను. సీతాదేవిని సందర్శించి రామకార్యాన్ని నెరవేరుస్తాను. అలాకాని నాడు జలధులను గాలిస్తాను. భూమిని తూలిస్తాను. నక్షత్రాలు నేల రాలునట్లుగా ఆకాశాన్ని వంచుతాను" అని భీషణ ప్రతిజ్ఞ చేశాడు.

**హనుమ సముద్ర లంఘనం.**

జబ్బలు చరిచి నిలబడ్డాడు. నిజరూపాన్ని ఔద్ధత్యంతో పెంచి కాలసర్పం వంటి తోకను చేత్తో పట్టుకొని ముద్దాడాడు. తేజోహంకారంతో సముద్రుని వైపు చూపు స్థిరంగా ఉంచి నన్ను మదిలో ధ్యానించి సంతుష్టాంతరంగుడై సమీప గిరి శిఖరాన్ని ఎక్కాడు. లంకవైపు చూపానించి లంఘించాడు. ఆ దృశ్యాన్ని చూడటానికి వచ్చిన ఖేచర బృందమంతా లంకకు చేటు వాటిల్లింది – రావణునికి కీడు మూడిందని ముక్త కంఠంతో హర్షధ్వానాలు చేశారు.

వాలాన్ని తిప్పుతూ సుడిగాలుల్ని సృష్టిస్తూ లవణ సముద్రాన్ని లంఘిస్తూన్న మారుతి ఉద్ధతికి భూ పరాగం మేఘాలుగా అతణ్ణి కప్పేసింది. ఆ దృశ్యాన్ని చూచిన ప్రాజ్ఞులు...సీతాన్వేషణ నిమిత్తం వెడుతున్న హనుమ వెంట నా కూతురును చూడటానికి నేనూ వస్తాను అని భూదేవి కూడా అతన్ని వెంబడిస్తోందేమో అని ఉత్ప్రేక్షించారు. అతని సింహ గర్జనలకు కొండలు ప్రతిధ్వనించాయి. గమన వేగానికి సముద్రం పాయ విచ్చగా సప్త పాతాళాలు కనిపించాయి. రామకార్యార్థమై వెడుతున్న హనుమకు సముద్రుని ఆజ్ఞ మేరకు విశ్రాంతినిచ్చే నిమిత్తమై మైనాకుడనే పర్వతం మధ్యలో అడ్డం వచ్చింది.

తన ప్రయాణానికి విఘ్నం కల్పించే నిమిత్తం రాక్షసులు పన్నిన మాయ కాబోలు! దీనిని శిక్షించాల్సిందే అని తన వక్షస్థలంతో దానిని ఢీకొన్నాడు. ఆ దెబ్బకు తూలిపడిన మైనాకుడు నిలద్రొక్కుకొని మనుష్య రూపంలో “ఓ కపిశ్రేష్ఠా! సర్వలోక హితాన్ని కోరి వెడుతూన్న నీకు అపకారం తలపెట్టి నేను అడ్డు నిలువలేదు. సముద్రుని ఆజ్ఞ మేరకు నేను నిలిచాను. కందమూలాలను, ఫలాలను తృప్తిగా ఆరగించి మార్గాయాసాన్ని తీర్చుకొని మళ్ళీ కొనసాగించు నీ ప్రయాణాన్ని” అన్నాడు. “నాకు మేలు తలపెట్టిన నీకు మేలగు గాక! కాని నన్నేలిన స్వామి కార్యార్థమై వెడుతున్న నాకు జాగుసేయటం తగదు” అని ముందుకు సాగాడు.

మధ్యలో తనకంటే దీర్ఘరూపంతో అడ్డం వచ్చిన సురసా గర్భాన్ని సూక్ష్మరూపంలో జొచ్చి బయటకు వచ్చి రాహుగ్రస్తమై వెలువడిన సూర్యుని వలె ప్రకాశించాడు. గరుడ వేగంతో లక్ష్యం వైపు సాగిపోయాడు. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి తీరాన్ని చేరి దిక్కులను పరికించి పలువిధములైన వృక్షములతో కూడిన లంకా నగరాన్ని వీక్షించి సువేలాచలం మీద వాలేడు. ఎదురుగా లంకాపురి! భూమి మీదకు దిగిన స్వర్గంలా ఉంది! ఇంతలో సూర్యాస్తమయమైంది.

దేవీ! ఆపైన లంకాపురి అంతా శోధించటం అశోక వనంలో నిన్ను దర్శించటం ఆపైన అతడు చూపిన ప్రతాపం అంతా నీ వెతిగినదే గదా... అని చెప్పి ఊరుకొన్నాడు రాముడు.

సకల సద్గుణ వరిష్ఠుడైన వసిష్ఠుని జూచి శతానందుడు "మునీంద్రా! పరమ కరుణారస పావని ఐన పావని లంకను శోధించటం, సీతా సందర్శనం, లంకాదహనం ఇత్యాదిగా జరిగిన అవతలి వృత్తాంతాన్ని తెలియ చెయ్యండి" అని ప్రార్థించగా మహర్షి ఇలా చెప్పారు:

**లంకలో హనుమ సీతాన్వేషణ.**

సరిలేని సాహస విలాసాలు గల హనుమ అలా లంకను సమీపించి భటుల కలకలం తగ్గేదాకా వేచి ఉన్నాడు. క్రమంగా లంకలో కోలాహల ధ్వనులు తగ్గాయి. కోటకావలి వాండ్ర గుఱకలు హెచ్చాయి. దైత్యకాంతల కటువు మాటలు తగ్గి వారు క్రమంగా నిద్రలోకి జారుకోగా కలవరింతలు మొదలయ్యాయి. కొందరు కామినుల సరసోక్తులుడిగి ఊర్పులు హెచ్చాయి. ఇంద్రియాలన్నీ అలసటను పొందగా పౌరజనులు వివశత్వాన్ని పొందారు. అట్టి సమయాన హనుమ ఉత్తర ద్వారం నుండి లంకలో ప్రవేశించాడు. అడ్డుకొన్న లంకిణిని పరిమార్చాడు. లంకంతా వెతికాడు. రావణాసురుని శయన మందిర పరిసర భవనాలను శోధించాడు. సీతాదర్శనం మాత్రం కాలేదు. అప్పుడిలా అనుకొన్నాడు, 'నువ్వు బహుదొడ్డవాడవు' అని ఎల్లకపులు నుతింపగా తగుదునమ్మాయని తోక పెంచుకొని వచ్చాను. పైగా శుభవార్త తెస్తానని మాట ఇచ్చి భీషణ ప్రతిజ్ఞ చేశాను. ఈ విషజ్వాలిక వంటి వార్త స్వామికి ఎలా విన్నవించను?

**సీతను కానక హనుమ రౌద్రమూర్తి యగుట.**

అలా కొద్ది క్షణాలు నిరుత్సాహపడి అంతలోనే పౌరుషం తెచ్చుకొని ఉగ్రుడై ఇలా అన్నాడు: "ఈ పర్వతాన్ని మ్రింగెయ్యనా!

ఆదిశేషువు, ఆది వరాహం, ఆది కచ్ఛపం వీళ్ళ వీపు పచ్చడి అయ్యేటట్లుగా హేమాచలాన్ని అణగద్రొక్కనా? పూలు రాలినట్లు నక్షత్రాలను నేల రాల్చనా? అష్ట దిగ్గజాలను ఒక్క చోటుకు చేర్చి కట్టి పారెయ్యనా? ఇంత చేస్తే కాని బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు వచ్చి సీతాసాధ్వి ఉన్న నెలవు చూపించరు కాబోలు!" అని అలుకతో ఒక ఎత్తైన భవనాన్ని అధిరోహించి అక్కడ నుండి చూచాడు.

సూర్య కిరణాలు కూడా చొరరాకుండా లతలతో అల్లుకుపోయిన ఒక పెద్ద శింశుపా వృక్షం కనిపించింది. అచ్చట సీతాన్వేషణ చెయ్యాలనే సంకల్పంతో కదిలాడు. ఆ సమయంలో శుభసూచకంగా హర్మ్యాగ్రం మీది కేతు ఘంటికలు మ్రోగాయి. సూక్ష్మాకారుడై శింశుపా వృక్షాగ్రాన్ని ఆశ్రయించాడు. దాని పాదభూమిని పరికించాడు. అక్కడ కొంతమంది రాక్షస స్త్రీలు కనుపించారు.

**సీతా సందర్శనం.**
**రామముద్రిక నిచ్చుట.**

ఆ రాక్షసస్త్రీల మధ్య ధూళిధూసరితమైన మేను, బాష్పవారి సంకులమైన నేత్రాలు, భర్తృవియోగ దుఃఖంచే వన్నె తరిగిన తేజం, వేడి నిట్టూర్పు గాడ్పులు, శూన్యమైన మనస్సు, వ్యోమంలో జగత్కారణమైన చిత్కళా స్వరూపంలా... ఒకానొక స్త్రీమూర్తి కనుపించింది. ఆ మూర్తి మాటిమాటికి "రామా! రఘురామా! అనాథ శరణ్యా! నా మొఱ ఎందుకు ఆలకించవు స్వామీ?" అంటూ విలపిస్తోంది. ఆ విలాపాన్ని విన్న హనుమ ఆమె తప్పక సీతాసాధ్వియే అని నిశ్చయించుకొన్నాడు. లంకనంతా వెదకి నా భాగ్యవశం చేత సీతను కనుగొన్నానని పొంగిపోయాడు. మళ్ళీ అంతలోనే "ఆహా రఘురాముని ఇల్లాలికా ఈ ఇక్కట్లు!" అని కన్నుల నీరు పెట్టాడు.

రాక్షసవధూ మధ్యంలో అప్పటి ఆమె స్థితి ఆడపులుల మధ్య హరిణిలా ఉంది. ఆడ ఏనుగుల గుంపుకు చిక్కిన లేత తామర తూడులా ఉంది. దుర్దాంత వ్యథతో కుమిలిపోతున్న ఈ సతిని నేనే త్రోవలో

పల్కరించాలి? అని మథన పడుతున్నాడు హనుమ. అంతలో సకల దోషాకరుడైన రావణుడు కస్తూరీ చందన కుంకుమాది పరిమళ ద్రవ్యాదుల నలదికొని రత్నభూషణాదుల నలంకరించుకొని సరిలేని రాజసంతో వచ్చి సీతాసాధ్విని నానా దుర్భాషలాడటాన్ని విన్నాడు ఆంజనేయుడు.

అప్పుడే రావణుని మదమణగిద్దామని మారుతి తలపోశాడు కాని బుద్ధిబలాన్ని ఉపయోగించి కార్యం చెడుతుందని వెనక్కు తగ్గాడు. సమయం కనిపెట్టి చెట్టుదిగి సంతోషంతో సీతకు నమస్కరించి "రాముని బంటును నేను. వాయువర ప్రసాదం చేత అంజనాదేవికి పుట్టిన వాణ్ణి. హనుమంతు డంటారు నన్ను. మీ క్షేమ మెరింగి రమ్మని నా స్వామి ఐన రాముడు పంపించాడు. నన్ను నమ్మండి. ఇదుగో! రామముద్రిక!" అంటూ అందించాడు.

రామముద్రిక ఐన రత్నాంగులీయకాన్ని ఆదరంతో కనుగొన్నంత మాత్రాన ఆనందాశ్రువులు చెక్కిళ్ళ జారాయి. అంగులీయకాన్ని అందుకొన్న మాత్రాన మేన పులకాంకురాలు పొడమాయి. కళ్ళకద్దుకొన్న మాత్రాన కంపం కలిగింది. ఉరముపై చేర్చుకొన్న మాత్రాన పారవశ్యంతో మేను మరచింది. చెలువుడు చెంతనున్నప్పుడు ఏ సుఖాన్ని పొందిందో ఆ మోదాన్ని ముద్రికా యుక్తితో స్మృతిజ్ఞానంలో అనుభవించింది.

ఆ విధంగా చెలువుడే చెంతనున్నట్లు ప్రమోదాన్ని పొంది ముందర ప్రాంజలియైన అంజనాసుతుని చూచి "నీ దయ వల్ల గదా రామభద్రుని ముద్రికా ప్రసన్నత చేకూరింది. ఇంతసేపు ఆ ప్రమోదంలో నిన్ను పట్టించుకోలేదు. లోకులకు ప్రాణమే ముఖ్య వస్తువు. అలాటి ప్రాణాన్ని నిల్పిన నీకు ఈ స్థితిలో ఎలాటి ప్రత్యుపకృతి చేయగలను? ఒక్క దీవెన తప్ప! రఘు వంశాన్ని రక్షించిన పావనీ నీవు ఆకల్పాంతం వర్ధిల్లు!" అంటూ దీవించింది...సీత. అది విన్న పావని "బంటు కేల ప్రశంసలు? మీ శిరోమణిని దయచేస్తే నే తిరిగి వెడతాను" అన్నాడు.

అప్పుడు జానకి "లోకంలో జనుల ఆకారం వారి ప్రజ్ఞను తెలియచేస్తుంది. ప్రస్తుతపు నీ ఆకారం నీ ప్రజ్ఞకు తగినట్లుగా లేదు. సత్యమైన

నీ రూపాన్ని చూపకపోతే నా శిరోమణిని ఈయను" అని సందేహాన్ని వెలిబుచ్చగా హనుమ తన నిజ రూపాన్ని చూపించాడు. ఆ విరాట్ స్వరూపాన్ని చూచిన సీత ఆశ్చర్యాన్ని కించిత్ వెఱపును పొంది "జగత్త్రయమంతా వ్యాపించి సర్వాత్ముడవైన నిన్ను సామాన్యునిగా తలపోశాను. నీ రూపం భయాన్ని కలిగిస్తోంది. కృపతో ఎప్పటి సూక్ష్మరూపాన్ని ధరించవలసింది" అని వేడగా హనుమ తొలుతటి రూపంలో నిలిచాడు.

**రామునికి సీతాసందేశం.**

"ఓ! మారుతీ! ఈ దుఃఖవారిధి నుండి నన్ను దాటించటానికి నా పాలిభాగ్యరేఖ నీ రూపంలో వచ్చింది. నా స్వామిని విడిచి ఇప్పటికి పది నెలలైంది. ఇప్పటి వరకు ఏదోలా ప్రాణాలను నిలబెట్టుకొన్నాను. ఈపైన ఆలస్యమైతే జీవాలను నిలుపుకోవటం కష్టమని విభునకు విన్నవించు" అని పలికి కన్నీళ్ళతో శిరోమణిని అతని చేతిలో పెట్టి ఇంకా రాఘవుడాడిన మాటలను ఇలా గుర్తు చేసింది.

"నిన్ను భార్యగా పొంది నేను కృతార్థుడ నయ్యాను. నా విభుత్వం హెచ్చింది !" అని పల్కిన గారవపు మాటను గుర్తుచేయి.

"నువ్వు నా చెంత లేకపోతే నాకే సుఖాలు భోగాలు అక్కరలేదని పల్కిన అబ్బురపు మాటను జ్ఞప్తికి తెచ్చుకోమను.

"నిన్ను ఎడబాసి క్షణం కూడా నేనుండలేను. అది యుగం అవుతుంది. జగమంతా శూన్యంగా తోస్తుంది" అని ఆడిన నిండు మాటలను తలపునకు తెచ్చుకోమను.

"నీ సుగుణాలు ఇన్ని అని చెప్పటం సాధ్యమా ? " అని సన్నుతించిన చనవుమాట మనసులో పెట్టుకోమను.

సర్వసాక్షి ఐన తానాడిన మాటలకు తానే సాక్షి. మరిప్పుడీ ఉపేక్షకు కారణమేమని అడుగు. మరేం జంకులేదు. నేను తనను నిందిస్తూనే

మాట్లాడానని విన్నవించు" అని ఈ విధంగా సీత తన మనసులోని భావాలన్నిటిని బయటపెట్టి ఇక ఓర్చుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేసింది.

అప్పుడు హనుమ "అమ్మా! శోకించకండి! మీరాడిన మాటలన్నీ రామునికి తప్పక విన్నవిస్తాను. మీ సంతోషమనే వర్షానికి ఆది గర్జయైన రాఘవ ధనుర్గుణ ఘోషణాన్ని మీరు త్వరలోనే వింటారు. ఇది నిజం. నమ్మండి నా మాట" అని ఊరడించి సెలవు తీసికొని బయలుదేరాడు.

**అశోక వన ధ్వంసం.**

బయలుదేరాడే గాని ఎక్కడచూచినా ధరాత్మజ ఐన సీతాదేవి దీన వదనమే కనిపిస్తోంది. విచారం చుట్టుముట్టింది. వెంటనే క్రోధం పెల్లుబికింది. తన బాహుబలాన్ని ప్రకటించకుండా వెళ్ళటానికి మనసొప్పటం లేదు. రావణునికి తన శక్తి సామర్థ్యాలను తెలియ చెయ్యాలనుకొన్నాడు. ఎదురుగా అశోకవనం నందనవనాన్ని మించి కనుపించింది. దశకంఠుని వైభవశ్రీ అంతా అందులో గోచరించింది. ముందు దానిని మట్టుబెట్టాలను కొన్నాడు. అతనిలో కపిస్వభావం హెచ్చు మీరింది. అంతే! ఒక్కసారి విజృంభించాడు. కొమ్మలను కూల్చాడు. మొగ్గలను త్రుంచాడు. పువ్వులను నలిపాడు. ఫలాలను రాల్చాడు. వనపాలకులను గెల్చాడు. కిలకిల నవ్వుతూ కింకరుల పొంక మణగించాడు.

**బ్రహ్మాస్త్ర ప్రయోగానికి హనుమ కట్టువడుట.**

హనుమ సృష్టించిన బీభత్సాన్ని వనపాలకుల ద్వారా తెలిసికొన్న రావణుడు హనుమను శిక్షించమని ఇంద్రజిత్తును పంపించాడు. మేఘనాథుడు ఆంజనేయుని మీద బ్రహ్మాస్త్ర ప్రయోగం చేశాడు. రావణుని ప్రత్యక్షంగా గమనించాలనే ఉద్దేశంతో ఆ అస్త్రాన్ని వమ్ము చెయ్యగలిగి ఉండి కూడా కట్టుబడినట్లుగా నటించాడు హనుమ. బ్రహ్మాస్త్ర ప్రయోగ బంధితుడైన హనుమను అది చాలదన్నట్లు, దాని సత్వాన్ని తెలుసుకోలేక సాధారణ పాశముల చేతకూడా బంధించాడు ఇంద్రజిత్తు.

అతని తామస చర్యకు బ్రహ్మాస్త్రం విఫలం ఐంది... ఐనా హనుమ వివశుడైనట్లు నటించాడు. రావణుని సముఖంలో నిలబెట్టారు. అద్భుత రూప ధైర్య కాంతి ద్యుతులతో వెలిగిపోతూ స్ఫాటికరత్న సింహాసనం మీదున్న రావణుడు హనుమను చూచాడు... అంతే! ఒక్కసారి ఉలికిపడ్డాడు! అప్రయత్నంగానే పలవరించినట్లు... "కిమేష భగవాన్నందీ భవేత్సాక్షా దిహాగతః" "ఏమీ! ఈతడు సాక్షాత్తుగా ఇటకు వచ్చిన భగవంతుడగు నందీశ్వరుడు కాడు కదా!" అని పైకి అనేశాడు! అంతలోనే ఆ జ్ఞానం కనుమరుగైంది. తామసం కమ్మేసింది. మహాక్రోధంతో మండిపడి అమర్షంతో దంతఘట్టనం చేస్తూ ఇలా అన్నాడు దశకంఠుడు.

"ఓరీ! కోతీ! ఆ శక్రాదుల కసాధ్యమైన లంకాపురిని జొచ్చి, నన్ను లక్ష్యపెట్టక నా కేళివనాన్ని కూల్చి రక్షకభటాళిని సంహరించిన మదోన్మత్తుడవు. ఎవరు పంపారు నిన్ను చెప్పు?"

చంద్రకాంతశిలా నిర్మితమైన సభాభవనం పాలసముద్రంలా ప్రకాశింపగా చుట్టచుట్టుకొని ఉన్న ఆదిశేషువులా తన వాలాన్ని పెంచి చుట్ట చుట్టుకొని కూర్చొని మేఘగంభీర స్వనంతో ధైర్యంగా ఇలా అన్నాడు హనుమ.

**హనుమ రావణునికి హితవు పలుకుట.**

ఓరి! స్వామిద్రోహి! రావణా! విను! సాక్షాత్తు ఆ రమావల్లభుడైన శ్రీరాముని బంటును. వాయుపుత్రుడను. భూపుత్రి ఐన సీతా మహాసాధ్వి క్షేమాన్ని తెలియగోరి వచ్చాను. ఆమెను చూచాను. తిరిగి వెడుతూ నా భుజబలాన్ని నీకు కొంచెం చూపించాను. నా అప్రతీప ప్రతాపాన్ని భండనంలో ఎదుర్కోగల బంటు ఎవడున్నాడీ లంకలో ? నావంటి వాళ్ళు కోట్ల మంది ఉన్నారు రాముని సైన్యంలో! ఆయనతో పగవద్దు. అవనిజను అప్పచెప్పు. హాయిగా బ్రతుకు. నా మాట విను. కైలాసాన్ని కదల్పబోయిన నీ భుజబలాన్ని లీలగా అణగించిన శివుని విల్లును హేలగా విరిచిన సర్వాస్త్ర కోవిదుడైన రాఘవునికి సీతను అప్పగించు. సుఖంగా జీవించు.

**రావణునికి విభీషణుని సలహా.**

ఆ మాటలు విన్న దశగ్రీవుడు దురాగ్రహంతో ఆజ్యాహుతికి భగ్గుమన్న అగ్నిహోత్రంలా మండిపడి చెంతనున్న వారిని చూచి "వీడు మనకు ద్రోహం చేసి కూడా ఇంకా తుళ్ళి పడుతున్నాడు. ఈ కోతిని మీరు అగ్నికి ఆహుతి చెయ్యండి" అని ఆజ్ఞాపించాడు. ఆ మాటలు విన్న విభీషణుడు "అన్నా! స్వామి కార్యం మీద వచ్చిన దూతలు ఎన్ని వెడమాటలైనా మాట్లాడతారు. అది దూతల స్వభావం. ఈ విషయంలో నీవు ఆగ్రహించటం తగదు. ఈ కోతికి బుద్ధి చెప్పి నీ ఆగ్రహాన్ని చల్లార్చు కోవాలనుకొంటే వేఱే దండన విధించు" అని సలహా చెప్పాడు.

అది విన్న రావణుడు "ఈ కోతికి తోకను కాల్చి పంపండి" అని ఆజ్ఞను ఇయ్యగా దైత్యులంతా మహదానందంతో మారుతిని పట్టారు... మోకులను కట్టారు... నూనె గుడ్డలను తోకకు చుట్టారు...మంటలు పెట్టారు. నిలువెత్తు మంటలు ఆకాశాన్ని చుంబిస్తూంటే జ్వాలామండిత వాలంతో మారుతి రాక్షసవంశ వినాశన హేతుభూతమైన ధూమకేతువులా కనిపించాడు. సీతాదేవి ప్రార్థనతో స్వాహావధూ వల్లభుడు హనుమకు చల్లనై వెలుగుతున్నాడు.

**హనుమ లంకాదహనం.**

ఆగ్రహంతో హనుమ తన వాలాగ్ర వహ్ని శిఖలతో లంకకు నిప్పుపెట్టాడు. లంక పూర్ణాహుతి అయింది. దేవతలు ఉపద్రష్టలు అనగా యజ్ఞకార్య పర్యవేక్షకులుగా, సింహనాదం వేద మంత్రాలుగా, దైత్యకులం పశువులుగా, గృహదారువులు ఇంధనంగా, కోపవహ్ని – ప్రతాప వహ్ని – లాంగూల వహ్ని వహ్నిత్రయంగా **'రామార్పణ'** బుద్ధితో లంకను పూర్ణాహుతి చేశాడు. ఆనందవార్ధిలో అవభృథ స్నానం చేశాడు. ఆహవకళా విశారదుడై సీతాదేవిని సందర్శించి సముద్రాన్ని లంఘించి; తన కోసం ప్రతి రోమకూపము కన్నుగా ఎదురు చూస్తున్న వానర సంఘాన్ని వచ్చి చేరాడు... హనుమ.

ఉఋము ఉఱిమినట్లు సింహగర్జన చేస్తూ వచ్చిన మారుతిని చూచి మనవాడు విజయుడై తిరిగి వచ్చాడు – శుభవార్త తెచ్చాడు అని సంతోష తరంగితాంతః కరణులై వనచరులంతా మధువనం ప్రవేశించి కొన్ని దుండగాలు చేశారు. దధిముఖునిచే విషయం తెలుసుకొన్న సుగ్రీవుడు కినుక మాని కపిముఖ్యులతో కలిసి రామసందర్శనం చేశాడు.

**సీతా వృత్తాంత విన్నపం. రాముడు హనుమను స్తుతించుట.**

ఏ వికారము లేకుండా నిలబడి హనుమ రెండు చేతులు జోడించి శిరసున చేర్చి తన సీతాదర్శన వృత్తాంతాన్ని ఏ తొట్రుపాటు లేకుండా రామునితో ఇలా చెప్పసాగాడు. "చూచాను జానకిని. తరువు క్రింద ఉన్న తరుణీమణిని చూచాను. స్థిరదృష్టిని వహించి ఉపవాసాల చేత చిక్కి జడలు కట్టిన కురులతో ఉన్న సీతను చూచాను. వేడి నిట్టూర్పు గాడ్పుల వాడి, భావాన్ని నిన్ను చేర్చి బాధల కోర్చి నీ నామమె జపంగా ఉగ్ర తపస్సు చేస్తున్న సీతాసాధ్విని చూచాను. అశోకవనంలో ఉన్నా శోక వనరాశి గాసి చెందియున్న భూపుత్రిని చూచాను." ఈ విధంగా శుభస్థితిని ముందు తెలిపి తాను సముద్రాన్ని దాటింది మొదలుగా లంకలో జరిగిన విషయాలన్నీ తాత్సారం లేకుండా సవిస్తరంగా యుద్ధనీతి పురస్కారంగా చెప్పాడు. చెప్పి భద్రంగా తెచ్చిన శిరోమణిని కళ్ళకద్దుకొని కాకుత్థ్సుని కందించాడు.

శిరోమణిని చూడగానే సీతను చూచినట్లై తాపోప శమనాన్ని పొంది ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడే రాముడు హనుమను ఇలా స్తుతించాడు: "మారుతీ! అనితర సాధ్యమైన ఈ కృత్యాలను నీవుగాక మరెవ్వరు నెరవేర్చ గలరు! మా రఘు వంశాన్ని రక్షించటం కొరకే జన్మనెత్తిన వాడవు. వాయువేగంతో వారాశిని దాటవశమా? దాటితే మాత్రం సర్వ సుపర్వ భయద ప్రతాపుడైన దశగ్రీవుని లంకను తేరిచూడ తరమా! శౌర్య సముద్రేకంతో సముద్రాన్ని దాటి శత్రునాశనం చేసిన నీవు సామాన్యుడవు

కావు! వాయువు, గరుడుడు వీరిద్దరు పారావారాన్ని దాటగలరేమో కాని నీవలె కార్యసాధకులు కాగలరా? అది సరే! లంకజొచ్చిన రుద్రుడైనా ప్రాణాలతో తిరిగి రాగలడా? నీకే చెల్లింది. కృతకృత్యుడవు. నిన్ను ఆ చతురాస్యుడు కూడా కీర్తించలేడు. అన్యజనుల కసాధ్యమైన దానిని అలవోకగా నెరవేర్చావు. దీనికి ప్రత్యుపకారం చెయ్యలేను... ఒక్క ఆలింగనం తప్ప.”

ఈ విధంగా అందరిలోను మిన్నగా హనుమను కీర్తించి కపిసేన సహాయంతో వార్ధిని తరియించి రావణుని వధించి సీతాసమేతుడై అయోధ్యకేతెంచి మహావైభవంతో పట్టాభిషిక్తుడయ్యాడు శ్రీరామచంద్రుడు.

ఇంతవరకు విన్న శతానందుడు వసిష్ఠునితో జగత్ప్రాణాత్మజుడైన మారుతి వృత్తాంతాన్ని ఇంకా వినాలని ఉంది. సెలవీయండి మహాత్మా! అని కోరగా దయాగరిష్ఠుడైన వసిష్ఠుడు అవతలి వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు:

“శతానందా! చతురాస్యుడైన నుతించలేని సంజీవరాయని వృత్తాంతం నే చెప్పగలనా? సీతారాములకు పునర్జీవనాన్ని కల్పించటమే కాదు. రామహితాన్ని కోరి పెక్కురకు ఉపకారం చేసిన అతని ఆశ్చర్యకర ప్రభావాన్ని సంక్షేపంగా చెపుతా! విను!

**హనుమ లోకోపకార కృత్యాలు.**

విభీషణుని సహృదయతను రామునికి చెప్పి అతనిని లంకా రాజ్యాభిషిక్తుని చేయించాడు. యుద్ధంలో మరణించిన కపుల నందరిని విశల్యకరణిని తెచ్చి పునర్జీవితులుగా చేశాడు. రణభూమిలో మూర్ఛితుడైన లక్ష్మణుని ప్రాణాలను రక్షించాడు. తన వాగమృత ధారలతో భరతుని శోకాన్ని పోగొట్టాడు. యుద్ధంలో అనేకమంది దనుజుల మదాన్ని అణిచాడు. అపురూపమైన మహిమలను అనేకం చూపించాడు. శతకోటి ప్రవిస్తరమైన రామాయణ కథ అనే హేమ మాలికకు మహానాయక రత్నం... హనుమ.

శతానందా! విను! హనుమ విభీషణునకు చేసిన ప్రత్యుపకారం చెపుతాను. లంకలో జానకి స్థితిని ఆంజనేయుని ద్వారా విన్న రాఘవుడు దశకంధరుని సంహరించాలనే జిగీషతో వీరవానర సైన్యంతో దక్షిణ సముద్ర తీరంలో విడిది చేశాడు. ఆ వార్త తెలిసిన రావణుడు తన మంత్రులతో ఆలోచన చేశాడు. వారందరు చతుర్విధ పురుషార్థాలకు విరుద్ధమైన దుర్మంత్రాన్ని బోధించారే కాని ధర్మబోధ చేసిన వాడొక్కడూ లేదు. ఒక్క విభీషణుడు మాత్రం పరస్త్రీ వ్యామోహం చెడ్డదని బోధించి లోకైక మాత ఐన సీతను రాముని కప్పగించి శుభస్థితిలో జీవించమని హితవు చెప్పాడు.

ఆ మాటలు రావణుని చెవి కెక్కలేదు సరిగదా విభీషణుని దూషించాడు. ఇక లంకలో ఉండటం తగదని భావించి అతడు తన నలుగురు సహచరులతో కలిసి ఎగిరివచ్చి మింట నిలిచి తాను శరణార్థిగా వచ్చిన విషయాన్ని దక్షిణసముద్ర తీరంలో వానర సైన్యంతో కలిసి విడిది చేసిన రామునికి విన్నవించాడు.

అప్పుడు రాజైన సుగ్రీవునితో సహా అంగదుడు, జాంబవంతుడు, శరభుడు, మైందుడు ఇత్యాది వానర ప్రముఖులంతా ఇలా అన్నారు: "దూషిత స్వాంతులు, దోషాటులు, బహువేషధారులు, మదాంధులు ఐన రాక్షస కులంలో పుట్టి శత్రు పక్షం వాడైన రావణుని తమ్మునికి శరణు ఇవ్వటం తగదు." అని తమ అభిప్రాయంగా రామునికి విన్నవించారు.

**విభీషణుడు గుణశాలి యని రామునకు హనుమ చెప్పట.**

అప్పుడు ఆర్తరక్షా పరాయణుడైన హనుమ ఇలా అన్నాడు: "రామా! శరణాగత వత్సలా! ఈ ప్రధానులు పలికిన పలుకులు కార్యబాహ్యములు, దోషహేతువులు గాను నాకు తోస్తున్నవి. ఈ విభీషణుడు మన మర్మాలను తెలియగోరి వచ్చిన గూఢచారి ఐతే వేషం మార్చుకొని వస్తాడే కాని నిజరూపంలో వస్తాడా? ఒకవేళ

రూపాంతరంలో వచ్చినా పలుకులలోని దుర్భావ సద్భావాలను పరిశీలించ వద్దా? ఆ బ్రహ్మ సైతం లోనున్న ప్రబలమైన భావాన్ని ఆకార వైఖరి మాటున దాచగలడా? శరణుగోరి వచ్చిన  రావణుని తమ్మునికి అభయ ప్రదానం చేశాడు రాముడు అంటె ఇంతకంటె దేవరకు ప్రతిష్ఠ ఏముంటుంది! శరణుకోరి వచ్చినవాడు శత్రువు ఎలా అవుతాడు? మనం వార్ధి దాటి లంకా ప్రవేశం చేసిన మీదట ఈ విభీషణుడు శరణార్థియై వచ్చి ఉంటే అది శత్రుదేశం కావున మనం అనుమానించవచ్చు.

ఇతడు ఉచిత కాలజ్ఞుడు కనుకనే రావణుని మూర్ఖత్వాన్ని రాక్షస వంశ వినాశాన్ని, ఎదుటి వారి విజయాన్ని ముందే ఊహించి యుద్ధం ప్రారంభం కాకముందే వచ్చి శరణు కోరాడు. ఈతడు గుణశాలి! ఇతని మాటలలో భేదం నాకేమీ గోచరించటం లేదు. నన్ను వధించమని ఆజ్ఞాపించిన రావణునకు నీతిబోధ చేసి నా మదికి హితవుగా పలికిన పుణ్యమూర్తి! ఇతని రాకలోని ఆంతర్యాన్ని చెపుతాను. ఆలకించండి. వాలిని వధించి సుగ్రీవునికి పట్టాభిషేకం చేసిన మీ ప్రతాపాన్ని, ఔదార్యాన్ని, శరణాగతత్రాణ బిరుదాన్ని విని... రావణుని వధించి తనను లంకారాజ్యానికి పట్టాభిషిక్తుని చేస్తారనే కాంక్షతో అభయాన్ని అర్థించి వచ్చాడు.

ఇతడు మన పక్షంలో ఉంటే దానవుల మర్మాలన్నీ తెలుసుకోవచ్చు. ఇతడు ధార్మికుడు. తమరు అభయాన్ని ఇవ్వటంలో తప్పేమీలేదు. నాకు తోచింది విన్నవించాను. ఆపై దేవర చిత్తం."

ఎంతో యుక్తియుక్తంగా మాట్లాడిన హనుమ పలుకులలోని దూరదృష్టిని, రాజనీతిజ్ఞతను విని "మ్రొక్కిన వారి చేతులు నరకటం మా వంటి క్షత్రియులకు తగని పని. అభయప్రదానం చేశాను. సగౌరవంగా స్వాగతమియ్యండి రాక్షసరాజుకు" అన్నాడు రామచంద్రుడు. విభీషణుని భావి రాక్షస రాజుగా రాఘవేశ్వరుడు సంబోధించి సంభావించటంలోని ఆంతర్యాన్ని గుర్తెరిగిన హనుమ ఆనందించాడు.

శతానందా! ఇదీ హనుమ యొక్క పరోపకార పారీణత! బుద్ధి కుశలత! సుగ్రీవ అంగద జాంబవంతాదులు చెప్పినా వినకుండా హనుమ మంత్రాంగమును పాటించాడు రాముడు. రాముని నియమం హనుమకు తెలుసు. సమీరసుతుని స్వాంతం రామునికి తెలుసు. లంకలో రావణునికి సలహా చెప్పినట్లు చెప్పి తనకుపకారం చేసిన విభీషణుడు లంకారాజ్య పట్టాభిషిక్తుడు కావటానికి కారకుడయ్యాడు...హనుమ.

కార్యసాధనకు సమయోచితంగా ఆలోచన చెప్పటంలో మంత్రి. చెప్పిన పనిని వంచన లేకుండా చెయ్యటంలో భృత్యుడు. దుఃఖం వచ్చినప్పుడు ధైర్య వచనాలను చెప్పి శోకార్తిని తీర్చటంలో బాంధవుడు. మాట పొందిక తెలిసి మనసున మనసై మెలగటంలో ఇష్టసఖుడు. ప్రస్తుతించటంలో బట్టుకవి. తోడుగా నిలవటంలో కొడుకు. ఇన్ని సుగుణాల వారాశి కనుకనే హనుమ రాముని చిత్తాన్ని చూఱగొన్నాడు. బల, నీతి, బుద్ధి, సరసోక్తి, మృదుభావ, కార్యనిర్వహణ, సత్య, వివేక, ఇత్యాది శుభ లక్షణాలు కలవాడు కనుకనే రాఘవేశ్వరుని మెప్పుపొందాడు. లేకపోతే నరనాథుల కొల్వు చేయటం తరమా ?

అఖిలభూత దయానిష్ఠుడైన వసిష్ఠుడు హనుమ యొక్క అవతల వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు. శతానందా! విను!

విభీషణుని సలహా మేరకు రాముడు సముద్రుని మూడు రోజులు ప్రార్థించాడు. ప్రయోజనం లేకపోయింది. శిక్షించటానికై బాణప్రయోగం చేయబోయే సరికి దారి ఇచ్చాడు. విశ్వకర్మ కుమారుడైన నలుని సారథ్యంలో వానరులంతా పెద్ద పెద్ద చెట్లను ఏనుగంత బండరాళ్ళను తెచ్చి సేతు నిర్మాణం చేశారు.

**హనుమ చేసిన ఇతర అద్భుత కృత్యాలు.**

ప్రతి రోమం చేత మహాశిలలను బంధించి పువ్వుబంతుల్లా అలవోకగా తెచ్చిన మారుతి మాహాత్మ్యాన్ని దేవతలు సైతం

ప్రశంసించకుండా ఉండలేక పోయారు. రాముణ్ణి తన భుజపీఠంపై ఎక్కించుకొని హనుమ ముందు నడువగా తక్కిన వానర సైన్యమంతా సేతువును దాటి లంకానగర ప్రవేశం చేశారు. యుద్ధంలో ఆంజనేయుడు జంబుమాలిని, ధూమ్రాక్షుని, అకంపనుణ్ణి యమసదనానికి పంపించాడు. అలాగే రావణుని పుత్రులైన దేవాంతకుణ్ణి, త్రిశిరస్సును సంహరించాడు.

పోరు ఘోరంగా సాగుతోంది. లక్ష్మణుని చేతిలో ఇంద్రజిత్తు వధింపబడ్డాడు. రావణుడు మహాక్రోధంతో లక్ష్మణుని మీదికి శక్త్యాయుధాన్ని ప్రయోగించాడు. ఆ ప్రయోగానికి సౌమిత్రి మూర్ఛపోయాడు. అప్పుడు రాముడు చింతాక్రాంతుడై పావనిని సమీపించి ఇంతకు ముందు ఇంద్రజిత్తు యొక్క శక్త్యాయుధ ప్రయోగానికి వానరసేన మూర్ఛితమైనప్పుడు జాంబవంతుని ఆదేశం మేరకు హిమాలయాల నుండి ఓషధులను తెచ్చి వానరసేనకు ప్రాణదానం చేశావు. ఇప్పుడు కూడా నా తమ్మునికి ప్రాణదానం చేసి నా ప్రాణాలను నిలబెట్టు అని ప్రార్థించాడు.

రాముని ప్రార్థన మేరకు ద్రోణాద్రికి బయలు దేరాడు మారుతి. మార్గ మధ్యంలో ఒక తాపసాశ్రమం కనిపించింది. నానావిధ పుష్ప పరిమళంతో, తుమ్మెదల ఝుంకారంతో, వివిధ ఫలాలతో, శుకశారికాది విహంగ కలకలారవంతో ఆ ఆశ్రమం హృదయాభిరామంగా ఉంది.

ఇంతకు ముందు నా ప్రయాణంలో ఈ ఆశ్రమం లేదు. ఇప్పుడెలా వచ్చింది! అని సందేహిస్తూనే ఇక్కడి తాపసిని సందర్శించి ఇతని ఆశీర్వచనాన్ని తీసికొని వెడతాను అని క్రిందికి దిగాడు. మావిగున్నలను చుట్టుకొన్న మల్లికాలతలు తావులను వెదజల్లుతుండగా ఒకానొక లతానికుంజం చెంత సమాధి నిష్ఠలో కూర్చున్న మునిపుంగవుడు కనుపించాడు. అతణ్ణి నిజమైన మౌనిగా తలచి దాహానికి మంచినీరిమ్మని కోరాడు హనుమ. నిజమైన నిష్ఠలో ఉన్న వానిగా కొంతసేపు, కుశల ప్రశ్నలచే కొంతసేపు కాలహరణం చేసి ఒకానొక జలాశయం చూపించాడు ఆ ముని.

**ధాన్యమాలిని శాప విమోచనం.**
**హనుమను స్తుతించుట.**

దప్పిక తీర్చుకొందామని సరోవరంలోకి దిగాడు హనుమ. వెంటనే భయంకరమైన మొసలి అతని పాదాలను పట్టి లోనికి ఈడ్వడం మొదలుపెట్టింది. వాయువర ప్రసాది కావున దాని దౌడలు పట్టి చీల్చివేశాడు. వెంటనే అది ఒక అందమైన స్త్రీ రూపాన్ని ధరించి ఎదుట ప్రత్యక్షమైంది. రాహువు నోట్లోంచి వెలువడిన పున్నమ చంద్రునిలా మెఱుపుతీగ వంటి మేని సౌందర్యంతో జగన్మోహనంగా ఉన్న ముద్దుగుమ్మను చూచి ఆశ్చర్యపోయాడు.

అరజాఱు పయ్యెద చెఱగును బిగియతీసి ముందు కటిమీద చేర్చి, కరకంకణాలను వెనక్కు త్రోసి, అలిక భాగాన్ని అంటుకొన్న ముంగురులను చెవి వెనక్కి నునులేత వ్రేలికొనల సవరించి, ముద్దుపెంగా, ముగ్ధ మనోహరంగా మెట్ట తామరల బోలిన పాదాలు ఎదుటి వారి చూపులను అట్టె ఆకర్షించగా, పగడముల వంటి పాణిపల్లవముల హనుమ పాదాలు పట్టి కాటుకకంటి చూపుల నల్లకలువలు విరియగా పూజలు చేసి ఇలా స్తుతించింది.

**మ॥ జయ! సంసార మహాంధకారతరణీ! సౌవర్ణ భూభృద్ఘృణీ!**
**జయ! నానాగమ తత్త్వ భవ్యసరణీ! సద్భక్త చింతామణీ!**
**జయ! దుష్టాసుర జీవమారుత ఫణీ! చంచత్ప్రతాపారణీ!**
**జయ! సాధూత్తమ చిత్త వారణ సృణీ! శాఖామృగ గ్రామణీ!**

“వార్ధిని దాటి రామముద్రను సీతకిచ్చి లంకను దహించి రాక్షసుల పొంక మణగించిన ఓ విబుధాగ్రగణ్యా! మారుతీ! ఆర్తశరణ్యా! నీకు నమస్కారం. ఈ క్రూరమైన మొసలి రూపాన్ని ధరించి బురదలో పొర్లుతూ సుడినీళ్ళలో తిరుగుతూ ఇంతకాలంగా నే పడిన దురవస్థ నీ పాదస్పర్శతో తొలగిపోయింది. నీ విచిత్ర మహిమను ఏమని స్తుతించాలి! నీకొక్క కార్యాన్ని సూచిస్తాను. నీకు నే చెప్పటం అంటే అమృతోత్పాదికి నీరును చూపించటం

వంటిదే! దొంగజపం చేస్తూ మునివేషంలో ఉన్నవాడు కాలనేమి అనే రాక్షసుడు. నీ ప్రయాణానికి ఆటంకం కల్పించటం కొరకే రావణుడు పంపగా వాడక్కడున్నాడు. వాణ్ణి వధించి ముందుకు సాగిపో" అని మనవి చెప్పింది.

ఎంతో విస్మితుడై హనుమ ఆమెనిలా అడిగాడు: "ఓ! మగువా! మకరివై నా పాదాన్ని పట్టి పిమ్మట మందయానవై నా ముందు నిలిచిన నీ వృత్తాంతాన్ని చెప్పు."

**ధాన్యమాలిని తన శాప వృత్తాంతాన్ని చెప్పట.**

అప్పుడామె తన విచిత్రమైన శాప వృత్తాంతాన్ని ఇలా చెప్పసాగింది: "ఓ! కరుణామూర్తీ! విను! నా కథ చాలా అద్భుతావహమైనది. నేను దివ్యాంగనను. నా పేరు ధాన్యమాలిని. రంభోర్వశీ హరిణీ తిలోత్తమ శశిరేఖాది అంచయానలు నా ఇష్టసఖులు. అగ్నిష్టోమ జ్యోతిష్టోమ పౌండరీకాది వైదిక క్రతువులు చేసిన సోమయాజులు నా మేటి కాముకులు. మహాఘోర రణరంగంలో వైరివీరులను చెండాడి సంగర ముక్తులైన శూరులు నా పార్శ్వవర్తులు. రంజకమైన గాంధర్వ విద్య నా మంత్రసిద్ధి.

ఒకరోజున కైలాసంలో శంకరుడు ప్రమథగణ పరివృతుడై పేరోలగ మున్నవేళ నేను నా మేళంతో వెళ్ళి శ్రుతులను సరిగూర్చుకొని రాగంలో రంజకత్వానికి లోటు రానీయక, రూప లావణ్య రేఖా సౌష్ఠవ గాంభీర్య హావ భావ విభ్రమ హేలా విలాస లీలా చాతురీ విశేషాల చేత అక్కడున్న వారందరికి 'ఆహా' పుట్టించి ఒక 'జక్కిణి' దరువు ఆడాను. దానికి శంభుడు మెచ్చి నాకొక విమానాన్ని బహూకరించాడు. నేనా విమానమెక్కి భువి అన్ని తావుల సంచరిస్తూ ఒకనాడు ఈ జలాశయంలో పాటలు పాడుకొంటూ జలకేళి సలిపాను.

**ధాన్యమాలినిని చూచి శాండిల్యుడు మోహపరవశుడగుట.**
**మునిని ఆమె నివారించుట.**

చెంతనే శాండిల్యుడనే మునీంద్రుడు కనులు మూసికొని తీవ్ర తపోనిష్ఠలో ఉన్నవాడు... నాపాట చెవిని పడగానే నిష్ఠచెదరి కనులు తెరిచి నన్ను చూచి నివ్వెరపోయాడు. చెఱకు విలుకాడు వింట సంధించిన బాణంలా ఉన్న నన్ను చూడగానే మునికి తాలిమి దూరమైంది. చరణాలు చూడగానే రక్తి కలిగింది. ముఖదర్శనంతో తమి పుట్టింది.

వెంటనే జపతపాలు చాలించి శాంతిని విడిచి తమి నిల్పుకోలేక అడుగులు తడబడ మేను పులకింప పలుకులు తొట్రుపడ వడివడిగా వచ్చి నా ముందు నిల్చి ఇలా అన్నాడు. "ఓ ఓయారంపు లతకూనా! ఎఱ్ఱని నీ పాదాలు పగడపు కాంతులను విరజిమ్ము తున్నాయి! నీ మేని నిగనిగలు బయలంతా స్వర్ణమయం చేస్తున్నాయి. నీ కాటుకకంటి చూపులు నీలోత్పల మాలికలను వర్షిస్తూ హృదయానికి తత్తరపాటును కలిగిస్తున్నాయి. నడయాడుతున్న మెఱుపుతీగలా ఉన్న ఓ పడుచా! తట్టుకోలేకపోతున్నాను. చిఱునవ్వు వెన్నెలలు చిలకరించే మోమెత్తి ఒక్కసారి చూడు!"

ఈ విధంగా తన ఆశ్రమ ధర్మానికి విరుద్ధమైన మాటలను మాట్లాడుతున్న ముని పుంగవుణ్ణి చూచి నయ వినయ సంపన్నతతో నేనిలా అన్నాను: "ముని నాథా! మీ వంటి పెద్దలకు ఇంత వలపు తగునా? అల్ప సుఖాన్ని కోరి తపస్సంతా వృథా చేసికొంటారా? యోగంలో సమాధి స్థితిలో మీరు ఆకర్ణించే అంతర్నాద సుఖంకంటే గొప్పవా...ఈ కరకంకణ నిక్వాణాలు? చరణమంజీర ఝుళంఝుళా రావాలు? కాంచీమౌక్తిక తారహార గ్రైవేయ భూషావళీ కాకలీ నిస్వనాలు? ఇంత మాత్రానికే ఈ విభ్రాంతి ఏలనయ్యా? వద్దు ఈ మోహం మీకు తగదు. క్షణిక సుఖానికి మొత్తం జీవితాన్ని నాశనం చేసికోకండి."

**ముని బ్రతిమాలుట.**

పూర్తిగా కామం మత్తులో మునిగి పోయిన మునికి అపథ్య రోగికి ఔషధం లాగ నా

మాటలు చెవికెక్కలేదు... సరిగదా...ఇంకా ఇలా బ్రతిమాల సాగాడు. "రాజ బింబాననా! నీ ముఖ సందర్శనమే నాకు ద్విజరాజ సందర్శన ఫలం! చంద్రముఖీ! నీ చిఱునవ్వే నాకు చంద్రికా విభవ వీక్షా ఫలం! బింబాధరీ! తాంబూలరాగ రసరంజితమైన నీ మోవి వీక్షా ఫలమే నాకు అరుణ బింబాలోకనఫలం! కంబుకంఠీ! నీ గళసందర్శనమే నాకు దక్షిణావర్త శంఖ వీక్షాఫలం. తపస్సు చేసి పొందే ఫలం మాత్రం ఇంత కంటె ఏపాటి గొప్పది? కాదని కాలహరణం చెయ్యకు. నన్ను కాదనకు. నా కోర్కెతీర్చు" అంటూ తీవ్రమైన ఉద్వేగంతో నా మీద పడ్డాడు.

అప్పుడు నేను... "మునీంద్రా! అశుచినై ఉన్నాను. శుచినైవచ్చి మీ పాదసేవ చేసికొంటాను" అని నా సమ్మతిని తెలిపాను. ఆ మాట విన్న మునికి ముఖం ఇంతైంది. "మగువా! గొప్ప ధర్మ సంకటం తెచ్చిపెట్టావు? ఎలా ఈ విరహాన్ని ఓర్చుకోవాలి? మన్మథుని ఆయుధశాల వంటి వనం! విరహాన్ని రెచ్చగొట్టే భ్రమరకుల ఝుంకారం! కోకిలల కలగానం! శుకశారికా కలకలారావం. వీటన్నింటినీ ఈ పేద బ్రాహ్మణుడెలా ఓర్చుకోగలడు? సరే! నీ నామమె మంత్రంగా నీ సందర్శనమె తపః ఫలంగా ఎలాగోలా ఓర్చుకొంటాను గాని తప్పక రావాలి సుమా!" అంటూ దుఃఖం వెక్కసం కాగా కన్నీళ్ళతో వీడ్కోలు చెప్పాడు... ముని. నేను గంధమాదనాద్రిని చేరుకొన్నాను.

**రావణుని బలాత్కారం శాండిల్యుని శాపం.**

చంద్రోదయమైంది. ఆకాశలక్ష్మి కంఠసీమకు తళుకు లీనే తాళిబొట్టువలె, దేవతలు ఆహారంగా గైకొనే అమృతకలశంవలె పున్నమ చంద్రుడు పండు వెన్నెలలు కురిపిస్తున్నాడు. హెచ్చైన పూల తావులు గుబాళింపగా ఒక పచ్చరాగట్టు మీద కూర్చొని వీణను శ్రుతి చేసికొని జగన్మోహనంగా గానం చేసికొంటున్నాను నేను. దూరాన్నుండి నా పాటను విన్న రావణుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. "మూడు లోకాలను జయించిన నన్ను పంచబాణుడు హింసిస్తున్నాడు. ఓ! అచ్చర మచ్చెకంటీ! నా కోరిక తీర్చు! కాదనకు" అంటూ నన్ను బలాత్కరించాడు.

నేను అబలను! పరాధీనను! అశుచినై ఉన్నాను! నన్ను కాంక్షించడం నీకు న్యాయంకాదని ఎంత ప్రార్థించినా వినక నన్ను బలవంతంగా అంటుపరిచాడు. వెంటనే అతికాయుడనే కుమారుడు పుట్టాడు. కొడుకును తీసికొని వెళ్ళిపోయాడు... దశగ్రీవుడు.

ఆ తర్వాత శుచినై మునికిచ్చిన మాట ప్రకారం ఆశ్రమానికి వచ్చి చేరాను. వాడిన మేను, విన్ననైన ముఖం, తడబడే అడుగులతో వచ్చిన నన్ను చూచి నా జాడ ఎఱిగి ఆ కోపదారి జేడదారి నిందించి నన్నిలా శపించాడు.

“ఓ! మాయలాడి! నేను వరించినప్పుడు అశుచినై ఉన్నానని నాకు చెప్పి నీ జవ్వనాన్ని ఎవ్వరికి అప్పగించి వచ్చావు? నియతి గైకొని బంధాలను త్రెంచుకొని, ధైర్యాన్ని వహించి, చిత్తాన్ని బంధించి, శ్రీహరిని భజించటం అనేది మా వంటి తాపసుల కర్తవ్యం. దానికి స్వస్తి చెప్పి నీవంటి మాయలాడి వెంటబడటం నా తప్పిదం. నిన్ను నమ్మటం నా బుద్ధి హీనత. నన్ను వంచించిన దానికి ఫలంగా ఏ మన్మథ భావానికి నన్ను గురిచేసావో ఆ మన్మథుని ధ్వజ చిహ్నమైన మొసలివై ఈ సరస్సులో పడి ఉండు. నిన్ను కామించిన నికృష్టుడు స్త్రీ వ్యామోహం వల్లనే నాశనమవుతాడు.”

భయంకరమైన ముని శాపానికి పరితాపాన్ని పొంది నా కన్నీళ్ళతో ఆ జేడదారికి పాద్యమిచ్చి ఇందులో నా తప్పేమీ లేదని ఆ కుటిల దానవుని బలాత్కారమే నన్నింత గాసి చేసిందని చెప్పి శాపావధిని తెల్పమని అర్థించాను. ఆ మునిశ్రేష్ఠుడు కోపం చల్లారగా దయార్ద్ర హృదయుడై...పరోపకార కుశలుడు, సకల జన శోకార్తి హరుడు, దాశరథి ప్రియుడు ఐన ఆంజనేయుని వలన నీ శాపం తీరుతుందని శాపావధిని సూచించాడు. ఆ శాండిల్య మునీంద్రుడు చెప్పినట్లు నీ విక్రమ స్ఫురణచే నా శాపం తీరింది. నేను స్త్రీని. నిన్ను పొగడలేను. ఓ ఆశ్రిత రక్షణ ప్రవణ! ఈ దాసిని దయాదృష్టితో చూడండి!” అని కృతజ్ఞతలు తెలిపి విమానం ఎక్కి వెళ్ళిపోయింది...ధాన్యమాలిని.

**కాలనేమి వధ.**
**హనుమ ద్రోణాద్రిని చేరుట.**

కపట మునివేషంలో ఉన్న కాలనేమిని యమునికి అతిథిగా పంపి ఉత్సాహంతో గగన మార్గాని కెగసి ద్రోణాద్రిని చేరుకున్నాడు హనుమ. రత్నమాణిక్య కాంతులతోను, జ్యోతిర్లతా దీపికలతోను వేదండ తండములతోను, గంధర్వ శ్రేణితోను వెలిగిపోతోంది... ద్రోణాద్రి. ఆ పర్వతాన్ని ఇలా ప్రార్థించాడు. "ఓ నగాధి రాజమా! రామానుజుడు, కీర్తి వర్ధనుడు ఐన లక్ష్మణుని ప్రాణరక్షణకు అవసరమైన ఓషధులను నాకు కనిపింపచెయ్యి." అతని సామర్థ్యాన్ని గణించక, ప్రార్థనను మన్నింపక మొఱకుదనాన్ని వహించి ప్రమత్తతతో ఉండి పోయింది ద్రోణాద్రి. దాని కఱకుదనాన్ని సహింపలేక ఇలా అన్నాడు హనుమ.

"ధరాభార ధూర్వహుడైన ఆదిశేషువే సుమిత్రానందనుడై పుట్టి రావణ శక్త్యాయుధంచే మూర్ఛితుడై పడి ఉన్నాడు. అతనిని పునర్జీవితుణ్ణి చెయ్యటానికి తగిన ఓషధులను చూపమంటె నువ్వు మేలు తలపకుండా ఉన్నావు. నీ మొఱకుదనాన్ని సహించేది లేదు..." అని క్రోధంతో సింహనాదం చేశాడు. అతని గర్జనకు గజయూధాలన్ని పరువులెత్తాయి. విద్యాధరస్త్రీలు భయకంపితులై తమ పతులను గాఢంగా అదుముకొన్నారు. ఆ గిరి బెదరి 'రక్షించండి!' అని పిలుస్తోందా అన్నట్లు గిరి గహ్వారాలలో హనుమ సింహనాదం ప్రతిధ్వనించింది. మందర పర్వతాన్ని వాసుకి చుట్టినట్లు తన తోకను కొండకు చుట్టి పెకలించే సరికి పర్వతం మీది సెలయేఱులన్ని గతులు తప్పి ఆ గిరి దుఃఖిస్తోందా అన్నట్లు అనిపించింది.

**గంధర్వులతో యుద్ధం.**
**మాల్యవంతుని వధ.**

అప్పుడు పదమూడుకోట్ల గంధర్వులు మహాక్రోధంతో ఎఱ్ఱబడిన కండ్లు గలవారై సముద్రఘోషలా కేకలు అరుపులతో ఆక్షేపించి గర్వాంధకారంతో ఆ కొండను ఎక్కడికి తీసికొని వెడుతున్నావు? అంటూ మదగజాన్ని ఎదుర్కొన్న దోమల గుంపులా ఎదుర్కొన్నారు. వారి మదమనే బురదను ఎండింపజేసే పదివేల సూర్యుల ప్రకాశంతో వాలాన్ని

వారి గొంతుకలకు చుట్టి గగనానికి ఎగురవేశాడు...హనుమ. కాలుసేతులు విరుగగా, మేను నుగ్గునుగ్గై నెత్తురు కారగా, ఊమ్ములు గీరుకుపోగా నీ సత్వాన్ని తెలుసుకోలేక నిన్నెదుర్కొనటానికి వచ్చిన మా నేరాన్ని క్షమించు తండ్రీ! ఈ గిరిని తీసికొని వెళ్ళు అంటూ మ్రొక్కారు. ఆదరంతో వారిని మన్నించి తన భుజపీఠంపై ద్రోణాద్రి నుంచి గిరిమీది రత్నకాంతుల ప్రభలు తనకు దారి చూపగా బయలుదేరాడు హనుమ.

అతని కార్యానికి విఘ్నం కల్పించే నిమిత్తమై రావణుడు పంపిన మాల్యవంతుడనే రాక్షసుడు మహాశౌర్యంతో రాక్షస సైన్యంతో, అనేక ఆయుధాలతో ఎదుర్కొని ఇలా అన్నాడు: “ఓరీ! వానరా! బలం ఉందన్న కారణంగా ఇలా ఎన్నిసార్లు ఈ మందుల కొండను పెకలించి పట్టుకు పోతావు? ఈశ్వర కేశవాదులు సైతం నా ముందు నిలువలేరు. ఈ కొండను సముద్రంలో పారవేసి అప్పుడు కదలు.”

అది విన్న హనుమ ప్రదీప్త పావక జ్వాలలు కన్నుల జ్వలింప వరుణపాశం వంటి వాలాన్ని త్రిప్పి “ఓరీ! రాక్షసాధమా! కొండకు బదులు నిన్ను పారేస్తాను సముద్రంలో! నిలు. నీ పాలిటి యముణ్ణి నేను!” అని హెచ్చరించాడు. దానిని లెక్క చేయక మాల్యవంతుడు “రాక్షస వీరులారా! రండి! ఈ కోతి బింకపు మాటలతో మనలను వెఱపించి పారిపోదామని చూస్తోంది. వెళ్ళనియ్యకండి! పట్టండి. కట్టండి, కొట్టండి” అని ప్రోత్సహించగా వారు అనేక ఆయుధాలతో అడ్డునిలిచారు. వారందరిని నిశ్శేషంగా వధించగా మాల్యవంతుడు కినిసి శరసంధానం చేశాడు. వాటిని హస్తములతోను తోకతోను చెదరగొట్టి వాణ్ణి వాలాగ్రంతో చుట్టి వార్ధిలో పడవేశాడు.

**రాముని ప్రశంస.**

బృందారక సందోహం జయజయ ధ్వానాలతో పూలవాన కురిపింపగా మహోత్కర్ష హర్షంతో అజేయుడై సమయానికి వచ్చి లక్ష్మీవర్ధనుడైన లక్ష్మణుని పునర్జీవితుణ్ణి చేశాడు...హనుమ. అప్పుడు శ్రీరామచంద్రుడు హనుమను దగ్గరికి పిల్చి

"మారుతీ! రఘువంశం అనే పైరు...నా తమ్ముడైన లక్ష్మణుని మూర్ఛనే వడపు చేత ఎండిపోగా నీవు మేఘం మాదిరిగా వర్షించి పూర్వ విధిగా వృద్ధి పొందించావు. దీనికి నే చేయదగ్గ ప్రత్యుపకారం ఏముంది! నా చిత్తమే భవదాయత్తం చేస్తున్నాను" అని గాఢంగా ఆలింగన పూర్వకంగా సంభావించాడు.

శతానందా! శ్రద్ధాభక్తులతో వింటున్నావా ఆంజనేయుని దివ్య చరిత్రను. ఆ మూర్తి యొక్క నిజస్వరూపం ఎవరికీ అందదయ్యా ఈ లోకంలో. వేయి జిహ్వలు గల ఆదిశేషువు కూడా వర్ణించలేడు. ఆయన చర్యలను బట్టి...ఓహో! హనుమ యొక్క శక్తియుక్తులు, జవసత్వాలు, మైత్రీబంధం, శౌర్యోత్సాహాలు, కార్యదీక్ష, స్వామిభక్తి ఇట్టివి గదా అని అనుకోవలసిందే గాని ఎంత ఊహించినా కొంత మిగిలే ఉంటుంది. వేల్పులందరి కీర్తులు అతని సామర్థ్యంలో శతాంశం కూడా కాదు. ఒక్క తోక చాలయ్యా పిండి బొమ్మను చేసి లంకను సముద్రంలో నిమజ్జనం చెయ్యటానికి!

తన స్వామి శ్రీరామచంద్రునికి శాశ్వత కీర్తి ప్రతిష్ఠలను కట్టపెట్టగోరి తన ఆగ్రహాన్ని నిగ్రహించుకొన్నాడు. అతని కసాధ్యమైనది ఏదీ లేదీ లోకంలో! అతడు చిరంజీవి! భక్తుల కోర్కెలను తీర్చడంలో కల్పవృక్షం!

అప్పుడు శతానందుడు ఇలా అన్నాడు: "మహర్షీ! హనుమ యొక్క సాహసోపేతమైన దివ్య వృత్తాంతం రోమ హర్షణంగా ఉంది. పాతాళ లంకాధిపుడైన మైరావణుని చేత ఏ విధంగా బధింపబడ్డారు రామలక్ష్మణులు? వారిరువురిని సమీర కుమారుడు ఎలా రక్షించాడు? చెప్ప వలసింది."

**ఫలశ్రుతి**

శతానందా! విను ఈ పవిత్ర చరిత్ర వ్రాసినా, చదివినా, విన్నా ఆయా దేవతానుగ్రహం కలిగి ఇహపరాలలో సుఖ శాంతులు ప్రాప్తిస్తాయి.

**తృతీయాధ్యాయం సమాప్తము.**

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## చతుర్థాధ్యాయము

అఖిల భూత దయాగరిష్ఠుడైన వసిష్ఠుడు శతానందునికి హనుమ నెరవేర్చిన ఆశ్చర్యకరమైన కార్యాన్ని ఇలా చెప్పసాగాడు.

## మైరావణ వృత్తాంతం

శతానందా! విను! ఆంజనేయుని పరాక్రమాన్ని, రాముని కోదండ పాండిత్యాన్ని విన్న రావణుడు రాక్షస కులానికి కీడును శంకించి భయపడసాగాడు. చింతాక్రాంతుడై విజయానికి ఉపాయాన్ని తలపోసి నాగలోక లంకకు విభుడైన మైరావణునికి వార్త పంపాడు. వాడు తక్షణం వచ్చి వాలాడు. వచ్చిన వానికి కాలోచిత సత్కారం చేసి రాముని వలన తనకు ప్రాప్తించిన ముప్పును, రాక్షస వీరుల మరణాన్ని చెప్పి ఉడికిపోతూ ఇలా అన్నాడు:

"సోదరా! నీ వంటి హితుడు, మాయోపాయజ్ఞుడు నాకు చెలికాడై ఉండికూడా వానర బలం నా మీద ఆధిక్యతను కలిగి ఉంది. దానికి నువ్వు ఉపాయాన్ని చెప్పక ఉపేక్షించటం తగునా?"

రావణుని బేలతనం చూచి మైరావణుడు నవ్వి "సోదరా! అదెంత పని? విచారించకు. నరవానరు లందరినీ పాతాళలంకలోని కంకాళమ్మకు

బలి ఇస్తాను” అని రావణునికి ధైర్య వచనాలను చెప్పి తన నగరానికి వచ్చి తన ప్రయత్నాన్ని భార్యతో చెప్పాడు.

**మైరావణునికి భార్య హితవు చెప్పట.**

ఆ మాటలను విన్న ఆమె భయపడి నోరెండి పోగా “నాథా! ఈ విధంగా ఎవరైనా ఒప్పుకొని వస్తారా? అవతలి వారి మాటలలోని మాయను తెలుసుకోవద్దా? హనుమ వంటి మేధాశాలి మంత్రియై భృత్యుడై ఉండగా రఘురాముని సాధించటం తరమా? హనుమ సామాన్యుడా? త్రిజగన్నుత గాంభీర్యుడు! శంకర విరించి ప్రముఖ నానా దిక్పాలకదత్త వరప్రభావుడు! మరుత్సూనుడు! అతడు వానర మాత్రుడా? శుభ చరిత్రుడు! రిపు భయంకరుడు! అతని ముందు యుద్ధంలో నిలవటం సాధ్యమా?

నాథా! కపటముని వేషంలో కాలనేమి కడతేర లేదా? ప్రతిఘటించిన మాల్యవంతుడు మడియలేదా? స్థూలజంఘాదులు తూలిపోలేదా! గంధర్వ సేనాధిపతులు చిత్రసేనాదులు పడ్డపాట్లు మీరెరుగరా? అక్ష, ధూమ్రాక్ష, దేవాంతకాది దుష్టదైత్యులు దుర్మరణాన్ని పొందిన సంగతి అప్పుడే మరిచారా? ఇవన్ని కని విని కూడా చిచ్చును ఒడికట్టుకోనేల? చుట్టాలకొచ్చిన కీడుపై మీరు మరణాన్ని కోరితెచ్చుకొంటారా?

శైశవంలోనే ఉదయార్కుని చూచి పండని భ్రమించి మింటి కెగసిన మేటి వీరుడు గదా హనుమ! అట్టి వాని ముందర మీ వెడ మాయలు చెల్లుతాయా? నాథా! నా ప్రియోక్తులు వినండి! హనుమపై భక్తిని కలిగి ఉండండి. మనకు బహుసుఖ సంపత్తి కలుగుతుంది” అని పల్కిన ఆమె భావి శుభోక్తులను లక్ష్యపెట్టక వైరాన్ని పూని ఆ ప్రయత్నంలో ఉన్నాడు మైరావణుడు.

మైరావణుని ప్రయత్నాన్ని చారుల ద్వారా వినిన సరమ ఆ విషయాన్నంతా తన భర్తయైన విభీషణునకు విన్నవించింది. వెంటనే

విభీషణుడు భయకంపితుడై హనుమను చేరి ఆ వృత్తాంతాన్ని చెప్పి ఇలా అన్నాడు: “పావనీ! రాక్షసులు టక్కరులు! తుంటరులు, క్రూరులు, బహువేషధారులు. ఏ మాయను ఎలా ప్రయోగిస్తారో కూడా తెలుసుకోవటం కష్టం. ఈ కపికోటికి మాకు రాఘవులకు నీవు గదా బహిరంగ జీవనం. ఇందరిలో ప్రతి ఒక్కరిని ప్రేమతో రక్షించే భారం నీదే.”

ఆ పలుకులు విన్న హనుమ... పర్వతోత్పాటన సామర్థ్యము, ప్రత్యర్థి రాక్షస ప్రాణానిల గ్రసన కాలవ్యాళము ఐన వాలాన్ని పెంచి సేన చుట్టు కోటగా కట్టి తానొక పట్టున కూర్చొన్నాడు. వజ్రపంజరం కంటె దృఢమైన ఆ కోటలో రామలక్ష్మణులతో కూడి కపికోటి నిర్భయంగా నిదురపోయారు. విభీషణుడు ప్రహరి తిరుగుతున్నాడు.

ఆ సమయంలో... ఎఱ్ఱని కుంకుమ బొట్టు, మొలకు కన్నపు కత్తి, నీలిరంగు తొడలాగు, లోపల దాచిన సొక్కుబూడిద పొడి ఇంకా మచ్చు మందుల సామగ్రితో దొంగవేషంలో వచ్చాడు మైరావణుడు. తోకతో కట్టిన కోట రహస్యాలన్ని తెలుసుకొనే నిమిత్తం కొంతమంది వేగులవారిని నియమించాడు. వాళ్ళు నేలను త్రవ్వి వెనుక ముందులన్నీ తెలుసుకొని మైరావణునికి విషయాలన్ని వివరించారు. వాడు వెంటనే విభీషణుని వేషంలో హనుమను చేరి జరిగిన కొన్ని వృత్తాంతాలను నమ్మికకై ముచ్చటించి కోట లోపల ప్రవేశించి తన నిజ ప్రభావంతో రామలక్ష్మణులను తీసుకొనిపోయి భద్రకాళి ఆలయంలో ఆమె ముందుంచాడు.

### మైరావణ, ఖడ్గరోముల వధ.

జరిగిన ప్రమాదాన్ని పసిగట్టిన విభీషణుడు వెంటనే హనుమకీ విషయాన్ని తెలిపాడు. ప్రళయకాల మహానటునిలా మండిపడి లంకాధిపుడైన మైరావణుని పట్టణాన్ని తన కుమారుడైన మత్స్యవల్లభుని సహాయంతో ప్రవేశించాడు హనుమ. అక్కడ ఉన్న దుర్దండి అనే పేరుగల ఒక రాక్షసి సహాయంతో కోటలోని మర్మాలన్నీ తెలుసుకొన్నాడు. మైరావణుని

సేనను వాడిని, పుత్రమిత్రపౌత్ర సహితంగా పరిమార్చి రామలక్ష్మణులను భద్రంగా తెచ్చాడు. దుర్దండి కొడుక్కి ఆ పాతాళ లంకాధిపత్యాన్ని కట్టబెట్టాడు.

శతానందా! ఇట్టి అసహాయ శౌర్యం, ఇట్టి నిగూఢ ప్రయత్నం హనుమకు తక్క ఎవరియందైనా ఉంటుందా? అవతలి వృత్తాంతాన్ని చెపుతాను విను!

తనకాప్తుడైన మైరావణునకు పట్టిన దుర్గతి విని దుఃఖించి రావణుడు ఖడ్గరోముడనే వానిని పంపించాడు యుద్ధానికి. సమీర కుమారుడు వానిని తన ముష్టిఘాతంతో ముద్దచేసి మెడలు నులిమి చంపాడు. నిజానికి రావణుడనగా ఎంత? ఒక మశకం! దశకంఠుని మట్టుపెట్టటానికి హనుమ ఒక్కడు చాలు. కేవలం రామభద్రుని కీర్తిని ఇనుమడింప చేయటానికై రావణుని విషయంలో తన ఉగ్రతను ఉపసంహరించుకొన్నాడు. అతని సాహస కృత్యాలన్నిటిలోను మరణించిన గంధమాదనుని పునర్జీవితుణ్ణి చెయ్యటం వింతల్లో వింత.

అని చెప్పిన వసిష్ఠుని చూచి శతానందుడు మహర్షీ! ఆ వృత్తాంతాన్ని శ్రవణానందంగా చెప్పవలసింది అని అడుగగా వసిష్ఠుడిలా చెప్పాడు.

**గంధమాదనుని వృత్తాంతం.**

శతానందా! రామరావణ యుద్ధంలో చనిపోయిన వానరు లందరిని దేవతలు బ్రతికించారు. రఘువంశ స్వామిని నుతించారు. సీతతోను, వానరులతోను పుష్పక విమానారూఢుడై అయోధ్యకు బయలుదేరాడు రామచంద్రుడు. పుష్పకంలో గంధమాదనుని కానక గంధమాదనుడేడి? అని అతని ప్రశంస చేశాడు. కుంభకర్ణునితో జరిగిన పోరులో వీరస్వర్గాన్ని అలంకరించాడని విషాద వార్తను చెప్పాడు విభీషణుడు. రాఘవుడు ఆ వార్తను విన్నంతనే ఎంతో తల్లడిల్లి విచార వదనంతో “అయ్యో! ఎంత విషాదవార్త ఇది. నాకు సహాయం చేయవచ్చి అసువులు కోల్పోయాడా తాను! ఈ దురవస్థను తప్పించే ఘనులెవ్వరు?” అని కన్నీరు పెట్టుకొన్నాడు. వెంటనే జాంబవంతుడు “పావని

మన పజ్జనుండగా మీకేల దురవస్థ సంప్రాప్తిస్తుంది? మీ ఆజ్ఞ కొఱకే ఎదురు చూస్తున్నాడు. ఆజ్ఞాపించండి! మీ వ్యథ మానుతుంది" అని శుభాన్ని పలికాడు.

అప్పుడు రామభద్రుడు సంతోషించి ప్రియమార హనుమను సంభావించి "మారుతీ! మా ఆపదలన్నిటిని మాన్పిన మహిమాన్వితుడవు. యుద్ధంలో విజయం లభించింది కాని గంధమాదనుడేడి? సమస్త కపీంద్ర కోటిలో నా కార్యానికై తెగువ చూపిన వారిలో అతనొక్కడే తెగిపడ్డాడంటె తెంపులేని దుఃఖం ముంచుకు వస్తోంది. ఆంజనేయా! ఆలోచించు. ఎక్కడున్నా తేగల అహీన బలాఢ్యుడవు! ఉపేక్ష వద్దు" అని అక్కున చేర్చుకొని మూర్ధాఘ్రాణం చేసి ఆశీర్వదించాడు.

అందరిలోను తనను మిన్నగా సంభావించి పలికిన రాముని మాటలకు ఉప్పొంగి హనుమ ఇంత వాడంతై అందుకోసమే ఎదురు చూస్తున్న వానిలా తోక ఝాడించి ఇలా అన్నాడు: "రామా! రఘుకుల సార్వభౌమా! ఈ భృత్యుణ్ణి ఆజ్ఞాపించాలే కాని మీ ఆశీర్వాద బలంతో నే చెయ్యలేని పనేముంది? ఇప్పుడే మృత్యుగర్భాన్ని చీలుస్తాను! దండపాణిని భటవర్గంతో కలిపి కోదండం వేయిస్తాను! చూడగల చోటులను చూచి నిముసంలో గంధమాదనుని మీ ముందుంచుతాను."

**హనుమ యమలోకాని కేగుట.**

అలా వినయోక్తులను పల్కి తన ఔద్ధత్యాన్ని ఇలా ప్రకటించాడు మారుతి. పాద తాడనంతో భూమిని ధట్టించాడు. భుజాస్ఫాలనం చేశాడు. మూర్తిమంతమైన ప్రణవ స్వరూపంలా నిబ్బరంగా నిల్చున్నాడు. ఇంద్రధనుస్సు లాంటి వాలాన్ని పెంచాడు. తన లాంగూలాన్ని నొసలికి తాకించి కుండలినీ శక్త్యుల్లాసంతో ఆజ్ఞాచక్రాన్ని భేదించి సహస్రారాన్ని చుంబించిన యోగిలా సర్వాంతర్యామియై నిలిచాడు. లాఘవంతో ఉప్పరానికి గుప్పించాడు. ఆ ఉబ్బులో అతను చేసిన ఫెళఫెళార్భటులకు దిక్పాలకుల

గుండెలు దిగ్గుమన్నాయి. బిరబిరా త్రిప్పిన వాల విస్ఫూర్తికి కులగిరులు తూలాయి. కహకహ నవ్విన కఠిన అట్టహాసానికి దిక్కులన్ని మార్మోగాయి. విసవిస ఎగురుతున్న గమన వేగానికి మేఘమండలం పటాపంచలవుతోంది. నిబ్బరంగా యముని పట్టణమైన సంయమిని పురానికి చేరి కోటద్వారం ముందు నిల్చాడు. ఒక్క అఋపు అఱిచాడు. ఆ అఋపుకు కాలుని సింహాసనం తూలింది. బిత్తరపోయిన పరేతరాజు తత్తరపాటుతో వచ్చి నిలిచాడు హనుమ ముందు. అర్ఘ్యపాద్యాదులు అర్పించాడు. సద్భావంతో వినయంగా ఇలా అన్నాడు: "ఓ! అద్భుత విక్రమ! గంధమాదనుడు నా లోకంలో లేడయ్యా. ఇప్పుడతను బ్రహ్మలోకంలో ఉన్నాడు."

**హనుమ బహ్మ లోకానికేగి గంధమాదనుని భూలోకానికి తెచ్చుట.**

ఆ మాటలు విన్న హనుమ మంచిదని పలికి యమునికి మ్రొక్కి లోకాలను దాటి సత్యలోకాన్ని చేరుకొన్నాడు. దాని వైభవానికి ఆశ్చర్యపోతూ బ్రహ్మదేవుని కొలువుకూటాన్ని దర్శించాడు. ద్వాదశ సూర్యులు తలలు వంచి నమస్కరించగా, బృందారక బృందమంతా చేతులు జోడించి ఫాలాన్ని చేర్చి నుతించగా, అప్సరసలు నటించగా, యతీశ్వరులు ఉపనిషత్తులను పఠింపగా, నారదుడు మహతిని మీటగా... పలుకుబోడితో కూడి పద్మాసనాసీనుడై కొలువున్న పద్మగర్భుణ్ణి దర్శించాడు. అచటి ముక్తజీవు లందరు తన రాకకు అచ్చెరువును పొందగా నలువకు మ్రొక్కాడు... హనుమ. మ్రొక్కిన హనుమను కౌగిట గ్రుచ్చి... వచ్చిన కారణమేమని మచ్చికతో వచింపుమని కోరగా "తాతా! సమస్తము నీ వెఱుగుదువు కదా! గంధమాదన కపీశ్వరుడు మీ లోకంలో ఉన్నాడు. అతణ్ణి వెంట బెట్టుకు వెళ్ళకపోతే రామచంద్రుడు కదల నంటున్నాడు. అతనిని నాతో పంపు" అన్నాడు.

"ఆంజనేయా! అతను రామకార్యార్థమై శరీరత్యాగం చేసి అమరుడయ్యాడు. తిరిగి భూలోకానికి పంపకూడదు, ఐనా నీ రాక కారణంగా పంపవలసి వస్తోంది. తనువుడిగిన వానిని తెస్తానని ప్రతిన పట్టి ఇలా చెల్లించుకోవటం నీకే చెల్లింది" అని సార్థకమైన వాక్కుల సన్నుతించాడు చతుర్ముఖుడు. చెంతనే నమ్రుడై ఉన్న గంధమాదనుని ప్రేమాభిమానాలతో కౌగిలించుకొన్నాడు. వాణీపతి అనుమతితో అచటి వియచ్చరులంతా ఆశ్చర్యంతో మెచ్చగా రఘురాముని చెంతకు గంధమాదనునితో కూడా వచ్చి చేరాడు...సమీర కుమారుడు.

**వానరుల సంతోషం.**

వారిద్దరి చుట్టూ చేరారు వానరమూక. గంధమాదనుని ఒడలంతా తనివితీర తడిమి "వచ్చావా!" అని ఆప్యాయంగా అడిగారు... కొందరు. "ఒరే! మన స్నేహం మఱచిపోలేదు గదా" అని కొందరు, "నువ్వు లేకపోతే అందరూ లేనట్లే ఉందిరా" అని కొందరు, "ఒరే! నీకు గుర్తుంటే ఏదీ నా పేరు చెప్పు అప్పుడు నేనేమన్నాను చెప్పు" అని పాత విషయాలను ప్రశ్నించే వారు కొందరు, "మమ్మల్ని విడిచి ఇంతకాలం ఎక్కడున్నావు?" అని కొందరు ఇలా అందరు పునర్జీవితుడైన గంధమాదనుని చూచి సంభ్రమాశ్చర్యాలతో కుశల ప్రశ్నలడిగారు. హనుమా! నీవు సాక్షాత్తు విధాతవు! కాకున్న మరణించిన వానిని మళ్ళీ బ్రతికించగల వారెవరు? అని వానరులంతా చేతులూచుతూ జయజయధ్వానాలు చేశారు.

అంత రాముడు కూడా గంధమాదనుని గాఢంగా ఆలింగనం చేసికొని మారుతిని కొనియాడి సేతుతటాన శివుని ప్రతిష్ఠించాడు... అని చెప్పేరు వసిష్ఠ మహర్షి. అంత శతానందుడు "మహర్షీ! శ్రీరామచంద్రుడు శంభులింగాన్ని సేతువుచెంత ప్రతిష్ఠ చెయ్యటానికి గల కారణమేమిటి? ఆ సందర్భంలో సమీర కుమారుడు ఏమైనా అద్భుత కర్మలను చేశాడా? ఆ

విషయాలన్నిటిని శ్రవణానందంగా చెప్పవలసింది" అని అడుగగా వసిష్ఠ మహర్షి తన మకరంద మాధురీ ధురీణమైన వాక్కుల ఇలా చెప్పసాగారు.

"శతానందా! విను! రామకథా సముద్రంలో ఉన్న అద్భుతాలన్నీ హనుమవే కదయ్యా! సేతుతీర్థంలో రామేశ్వర ప్రతిష్ఠా సందర్భంలో రాముని ప్రతిష్ఠను త్రిలోక వ్యాప్తం చేసిన అద్భుత కథను చెపుతాను! విను!

**ఋషులు రాముని సందర్శించుట.**

దాశరథి గంధమాదన పర్వతం దగ్గర ఉండగా దండకారణ్యంలోని మునులందరు వచ్చి ఆయనను పూజించి ఇలా స్తుతించారు.

**శ్లో॥ శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయమ్**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం ।**
**ఆజానుబాహు మరవింద దళాయతాక్షం**
**రామం నిశాచర వినాశకరం నమామి ॥**

ఋషుల స్తోత్రానికి ప్రీతుడైన రాఘవుడు మునులకు అంజలి బంధంతో నమస్కరించి ఇలా అన్నాడు: "అఖిల జీవులకు ఆశ్రయభూతుణ్ణి నేనే! నే విశుద్ధాత్ముడను! నా దృష్టిగోచరమైన జంతువేదైనా కైవల్యార్హమైనదే. జ్ఞానులకు, వైరాగ్య సంపన్నులకు, శిష్టులకు, సంతుష్టులకు, సర్వభూత హితులకు, నిరహంక్రియులకు, శాంతులకు, జితేంద్రియులకు నేను సాష్టాంగ నమస్కారం చేస్తాను. పులస్త్యబ్రహ్మ కుమారుడైన రావణుడు వేదవేదాంగ పారంగతుడైన బ్రాహ్మణుడు. బ్రాహ్మణు డెప్పుడూ బ్రాహ్మణుడే. బ్రహ్మహత్య మహాపాతకమని శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి. నేనా దుష్కృతిని తొలగించుకొనే నిష్కృతిని సెలవీయండి."

# రామేశ్వర లింగ ప్రతిష్ఠా వృత్తాంతం

అప్పుడు మునులు సంతసించి "పరమాత్మా! నీకు దోషం అంటుతుందా? లోకాన్ని అనుగ్రహించటానికి అడిగావు. ఇక్కడ శంభు ప్రతిష్ఠాపన చెయ్యండి. మీరనుకొన్న దురితాలు పోతాయి. శివప్రతిష్ఠ వల్ల వచ్చే పుణ్యాలను పరమేష్ఠి కూడా నుతింపలేడంటె మాదృశులు శక్తులా? కాశీవిశ్వనాథుని సందర్శిస్తే వచ్చే ఫలం కంటె శతకోటి గుణిత మహాఫలం నీపేర ఈ గంధమాదనంలో ప్రతిష్ఠ చేయబోయే శివలింగ దర్శనం వలన వస్తుంది" అన్నారు. మునుల మాటలకు సంతోష తరంగితాంతః కరణంతో రాముడు ముహూర్త ప్రసంగం చేసి చెంతనున్న సమీర కుమారుని చూచి "కైలాస పర్వతం మీది లింగాన్ని నాల్గు గడియలలో తేవాలి ! తేగలవా?" అని అడిగాడు. "స్వామీ! ఆజ్ఞాపించాలే కాని అదెంత పని?" అని మారుతి ప్రయాణోన్ముఖు డయ్యాడు.

**హనుమ కైలాసాని కేగుట.**

భుజాస్ఫాలనం చేశాడు. కుప్పించి ఎగసిన అతని జవానికి గంధమాదనం ఉయ్యాల లూగింది. ఖేచర బృందమంతా ఈ విజృంభంతో కైలాసాన్నే పెకలించి తెస్తాడేమో అని భయభ్రాంతు లయ్యారు. అలా ఎగిరి తెగువమీరి కైలాసాన్ని చేరుకొని శివలింగాన్ని వెతికాడు. కాన రాలేదు. వెఱగుతోను, దిగులుతోను నిలిచాడు. తపస్సు చేత మాత్రమే ఇలాటి పనులు నెరవేరుతాయి అని తలచి చరణాంగుష్ఠం మీద నిలిచాడు.

సూర్యుని మీద చూపు నిలిపాడు. ఊర్ధ్వబాహుడై చేతులు జోడించాడు. నిశ్వాసాన్ని బంధించాడు. విశ్వాసంతో తపశ్చర్యకు పూనుకొన్నాడు. వెంటనే శివుడు ప్రత్యక్షమై ఇష్టార్థాన్ని కోరుకొమ్మన్నాడు. ఇలా ప్రార్థించాడు హనుమ: "శంకరా! అవ్యయమైన మీ లింగప్రతిష్ఠా కార్యక్రమాన్ని భూలోకంలో గంధమాదనం దగ్గర చెయ్యాలని సంకల్పించాడు

రాముడు. వేళ తప్పకుండా వెళ్ళాలి. మీ అవ్యయ లింగాన్ని దయ చేయించండి.” తక్షణం లింగద్వయాన్నిచ్చి అంతర్హితుడయ్యాడు హరుడు.

**సీతారాముల సైకత లింగ ప్రతిష్ఠ.**

ఇక్కడ మునులంతా ముహూర్తం సమీపిస్తుండటంతో, “రామా! హనుమ తామసం చేశాడు. ముహూర్తం సమీపించింది. నిర్మలస్వాంత ఐన సీతాసాధ్వి చేసినట్టి సైకత లింగాన్ని వెంటనే ప్రతిష్ఠించండి” అని కర్తవ్యాన్ని గుర్తు చెయ్యటంతో ‘మంచిది’ అని అంగీకారాన్ని తెలిపి సీతతో కలిసి మంగళ స్నానాలు చేసి...

జ్యేష్ఠ మాసంలో శుక్లపక్షంలో దశమి తిథిని బుధవారం నాడు హస్త నక్షత్రంలో వ్యతీపాత యోగంలో సూర్యుడు వృషభంలోను చంద్రుడు కన్యలోను ఉండగా మహాపుణ్యదశా యోగంలో గంధమాదనం దగ్గర సేతు మధ్యమందు లింగ ప్రతిష్ఠను చేశారు మహాపుణ్య దంపతులైన సీతారాములు.

సదాశివుని ఆవాహనం చేసి, అర్ఘ్యపాద్యాదులిచ్చి, పురుష సూక్త నమక చమకాది వేద మంత్రాలతో పంచామృత స్నానం చేయించి గంగా గోదావరి నర్మద కావేరి ఇత్యాద్యనేక నదీజలాల అభిషేచనం చేసి, వసనభూషణాదు లిచ్చి శివసహస్ర నామాలతో పూజసలిపి, ప్రదక్షిణ నమస్కార మాచరించి అనేక విధాల స్తుతించారు... సీతారాములు.

**నాగ బంధము :**

**జయ జయ సామగేయ! హర! సారసగర్భ శిరోహరా! పురం**
**జయ విమలాభిధేయ ! మృగ సంగత హస్త ! మఖాతి భంగదా !**
**భయ దహనాగణేయ ! భవ భావజగర్వభిదా ! అమోహ ! అ**
**వ్యయ మతిదా ! శివా ! అసుర వారక పుణ్యద ! రామలింగమా!**

(సమీర కుమార విజయము)

వారి స్తుతులకు మిక్కిలి ప్రీతుడై ప్రత్యక్షమైన శివుడు మీరు ప్రతిష్ఠించిన లింగం ఈ మీద సకల జనపూజ్యము, సకల దోషహరము,

పుణ్యఫలదము అవుతుందని వరమిచ్చి అంతర్హితు డయ్యాడు. రామేశ్వరునకు అభిషేకించటానికై రాఘవుడు తన వింటికొనతో త్రవ్విన నూయి 'కోటి తీర్థము' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆ తీర్థం...తన నామాన్ని విన్నంతనే సుకృతాన్ని, చూచినంతనే జ్ఞానాన్ని ఇచ్చి, ఆ జలాలలో స్నాన మాచరించిన వారికి జన్మాంతరమందు సాక్షాత్తు శివ సాయుజ్యాన్ని ప్రసాదిస్తుందని శ్రీరామచంద్ర ప్రభువు వరమిచ్చాడు. అనేక శుభాలను అభిమతాలను పరంపరగా సమకూరుస్తుంది... ఆ కోటి తీర్థం. దేవమునులు, సిద్ధ సాధ్యులు అనేక శోభన క్రియలతో ఆ ఈశ్వర లింగానికి పూజలు చేశారు. వానరులు పరమానందంతో ఓలలాడారు. బ్రహ్మేంద్రాదులు పరమభక్తితో నుతించారు.

శతానందా! ఈ విధంగా శ్రీరామచంద్రుడు ఈశ్వర ప్రతిష్ఠ చేసిన మీదట మారుతాత్మజుడు శివదత్తమైన లింగ ద్వయాన్ని తీసికొని మహావేగంతో వస్తూ ఇలా అనుకొన్నాడు. "నా స్వామి ఐన రాఘవుడు ముహూర్తం తప్పకుండా ఉండాలని లింగప్రతిష్ఠ చెయ్యడు కదా? నా యందు ఆదరము ఉదారత్వము గల నా స్వామి అలా ఎప్పుడూ చెయ్యడు! నన్ను కైలాసానికి పంపించి అన్యలింగ ప్రతిష్ఠ చేస్తాడా?" ఇలా అనేక విధాల ఆలోచనలతో సంశయాస్పదుడై వస్తూండగా...

గగనాన నున్న హనుమకు శ్రీమన్మహారామేశ్వర జ్యోతిర్లింగ సంస్థాపనోత్సవ మహా సంరంభం కన్నుల పండువుగా గోచరించింది. ఆ దృశ్యం ఎలా ఉందంటే...

## శ్రీమన్మహా రామేశ్వర జ్యోతిర్లింగ సంస్థాపనోత్సవ సంరంభం.

**జడివానలా కురిపిస్తున్న దేవతల పుష్పవృష్టికి మూగిన భ్రమరకుల ఝంకారం బయలంతా వ్యాపించి...తంబుర నాదంలా, వేణు రావంలా శ్రుతి పక్వంగా ఉంది.**

ఋషి పాఠ్యమాన వేద మంత్రాల ఘోష శ్రవణానందంగా ఉంది.

"హర! హర! మహాదేవ! శంభో! అంటూ నుతించే వేల్పుల స్తోత్ర పాఠాలు చెవికింపుగా ఉన్నాయి.

పంచ మహా వాద్యాలైన శంఖ – కాహళ – భేరి – పటహ – జయ ఘంటికల వాద్య ఘోష ప్రావృట్కాల పయోధర గర్జనలను మించి ఎడతెగని సముద్ర ఘోషలా ఉత్సాహ ఉద్రేకాలను నింపుతోంది.

వాదిత్ర మనగా తత – అనవద్ధ – ఘన – సుషిర (వీణ – మృదంగ – కంచుతాళ – వేణువు) ఈ చతుర్విధ వాద్యాల నిపుణులు పూర్వరంగ విధిగా సమహస్తపు వాయింపుతో రెండు చేతులతోను ఒక్కసారిగా మృదంగాలను "దందం దందందం ధణాంధణాంధణాంధణాం ధణాంధని" అని లయ బద్ధంగా జంపె – ధ్రువ – ఆది – అట... ఇత్యాది అనేక తాళ గతులతో జరిపిన శుష్క పద్ధతి 'మేళప్రాప్తి' శ్రవణపేయంగా ఉంది.

తంత్రులను సారించి నారదాదులు "సరిగమ పదనిస సనిదప మగరిస గరిమపామ సాగమ" అంటూ వీణలను మీటుతూ గానం చేసే గీతి పరంపరలు వీనుల విందుగా ఉన్నాయి.

సోగ కన్నుల తళుకు చూపులు గండు చేపలై కదలాడగా... శంఖం వంటి కంఠానికి ప్రదక్షిణం చేసినట్లు హారాలు కంఠం చుట్టూ మెలిగొనగా.... స్వేద బిందువులు ముత్యాలై జాఱగా...పూవింటి వాని అల్లెత్రాటి మ్రోతలా అందెల సవ్వడి రవళించగా... వక్షస్థలంపై ముత్తెపు సరులు దూకగా... "తతై ధ్రికృదు తకదిత త్తతై తత్తళంగ" యని దూకుతూ తొలకరి మెఱుపుల్లా ఆడే అప్సరసల నృత్యం నేత్ర పర్వంగా ఉంది.

మహా నటునకు సాక్షాత్తు కల్పవృక్షమే 'పుష్పాంజలి' సమర్పింపగా దిక్కులన్ని పరిమళాన్విత మయ్యాయి.

శతానందా! వింటున్నావా! ఇదయ్యా...చంద్రకళావతంసుదు రామేశ్వరుడై సేతువు చెంత కొలువు తీరిన కథ!

**హనుమ దుఃఖించుట.**

ధరణికి దిగాడు హనుమ.
రామచంద్రునకు మ్రొక్కాడు.
జానకికి పాదాభివందనం చేశాడు.
లక్ష్మణునకు వినతుడై నమస్కరించాడు.

సమస్త వానరులను యథోచితంగా పల్కరించి మనః ప్రమదాంబుధిలో ముంచాడు. సైకత స్థిరలింగ పూజ చేస్తూన్న రఘురాముని చూచి ఖిన్నుడయ్యాడు. పెదవి కంపింప, కనుగొనల జాఱిన కన్నీట చెంపలు తడియగా హఠాత్తుగా పొంగిన కొండ వాగులా వెల్లువై ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక రామునితో ఇలా అన్నాడు:

"రామా! రఘుకుల సార్వభౌమా! లోకంలో ఏ తల్లి నావంటి కొడుకును కనకూడదు. పనికి మాలిన ఈ తనువు ఉంటేనేం? లేకపోతేనేం? అందరి ముందు నన్ను ప్రియమారగా పిల్చి 'మారుతీ'! నీకు అసాధ్య మైనదేదీ లేదు! వెండికొండకు వెళ్ళి శంభులింగం తెమ్మని ఆజ్ఞాపించి ఇంతలోనే సైకతలింగ ప్రతిష్ఠ చెయ్యటం తగునా? నేనెంత? నా బలమెంత? అనంత శక్తి సంపన్నులైన మీకు నేనా కార్యాలు చక్కపెట్టేది? ఈ పరితాపాగ్నిని భరిస్తూ బ్రతకటం కంటె ప్రాణాలెడబాసి మీ పాదసాన్నిధ్యాన్ని పొందటం మేలు."

ఇలా తీవ్ర వేదనతో పలికి వేడి నిట్టూర్పు సెగల వాడిన మోముతో నిలబడియున్న హనుమను చూచి కరుణారస పూరితమైన చూపులు, చిఱునగవు, ప్రసన్న ముఖంతోను రామదేవుడిలా అన్నాడు.

## రాముడు హనుమకు చేసిన అద్వైత బోధ

"మారుతీ! నేను వేఱు – నువ్వు వేఱు అనే భేద భావంతో కూడిన ద్వైత బుద్ధి నీ మనస్సులో ఉన్న కారణంగా ఈ దుఃఖం నీకు సంప్రాప్తించింది. అద్వైత సిద్ధి కలిగేటంత వరకు దుఃఖం తప్పదు. మానావమానాలు రెండూ దేహగతమే కాని ఆత్మ సంబంధం కలవి కావు. నీవు సహజంగా

చిత్స్వరూపుడవు. ఈ శరీరమే నేను అనే అహంకారం పోయిన నాడు తత్త్వసిద్ధికి అధికారం కల్గుతుంది. నిత్యానిత్య వివేకం కలిగి వైరాగ్యం వలన దేహాత్మభావం నశించి ఆత్మస్థితి యందు నిశ్చలత్వం కలిగిన నాడు జీవన్ముక్తుడవుతాడు.

ఈ దేహం అనిత్యం. ఇది లోకానుభవమే కదా! ఇక దేనికి విచారం? ఈ సుఖాలు, ఈ దేహం ఎప్పటికీ శాశ్వతమని అనిపిస్తుంది. మాయ పోదు. దానికి కారణం పరమ కారుణ్యమూర్తి ఐన గురువు లభింపక పోవటమే. నిత్యము మృత్యువు సన్నిహితమై నీడలా వెంటాడుతూనే ఉన్నా ఈ శరీరం మీద అధికస్పృహ కలిగి ఉన్నారే కాని ఆత్మజ్ఞానాన్ని గురించి ఆలోచించటమే లేదీ మానవులు! తత్త్వంలో "నేను" అని అనబడే దానికి దేహానికి ఏ సంబంధం లేదు. అలాటప్పుడు దేహ సంపాదిత వస్తువు "నాది" ఎలా అవుతుంది?

కోరికల ననుసరించి కర్మ, కర్మ ననుసరించి సుఖ దుఃఖాలు కలుగుతాయి. జీవి అనేక జన్మ పరంపరలలో వివిధ దేహాలను ధరించటానికి అదే బీజం. అందుకని ముందు "దేహ–దేహి" ఈ విభేదాన్ని తెలుసుకోవాలి. "నేను – నాది" అనే అభిమానం వల్లనే జనన మరణాలు కలుగుతున్నాయి. దేహాభిమానం నశించిన నాడు ప్రమాదం లేదు. వత్సా! దేహాభిమానాన్ని విడిచిపెట్టు. సత్యం చెపుతున్నాను విను. కనుపించే ఈ జగత్తు ప్రకృతి మాయవల్ల ఉన్నట్లుగా అనిపిస్తోంది కాని నిత్యమైన ఉనికి దానికి లేదు. రజ్జువు నందు ఆరోపింపబడిన సర్పభ్రాంతి వలెనే పరమాత్మ యందు ప్రపంచం ఆరోపింపబడింది అనే విషయాన్ని జ్ఞాని ఒక్కడే తెలుసుకోగలడు.

ఆంజనేయా! గురుభక్తిలేక అవివేకులైన జనులు సంసారంలో చిక్కి ఎలా దుఃఖాన్ని అనుభవిస్తున్నారో చెపుతాను విను. గురూపదేశము, శాస్త్ర పరిచయము ఈ రెంటిలో ఏ ఒక్కటి లేక ప్రత్యక్షంగా కనుపించే ప్రపంచం అసత్యమని – కనుపించని ఆత్మ సత్యమని మేం ఎలా నమ్మాలి? అని సంశయిస్తారు. కర్మాచరణ అనగా పురుష ప్రయత్నం వల్లనే కదా పనులు నెరవేరుతాయి. ధనార్జన సాధ్యమవుతోంది. ధనం వల్లనే కదా సుఖ ప్రాప్తి అని

కర్మలను నుతిస్తారు. ఈశ్వరునకు – జీవునికి అభేదం ఎలా కుదురుతుంది? అని అనుమానిస్తారు. ఈ విధంగా విపుల విపరీత సంశయాత్ములై అజ్ఞులై స్త్రీ ధనాసక్తిలో మునిగి తేలుతూ అన్యమెరుగక జ్ఞానులను పరిహసిస్తూ భ్రష్టులవుతున్నారు. ద్వైతం ఎప్పుడూ భయాన్ని కలిగిస్తుంది. ద్వైతబుద్ధి కలిగి ఉండటం ఆత్మహత్య కంటె నీచమైనది.

పవన నందనా! ప్రపంచం మిథ్య – పరమాత్మ సత్యం. ఇందులో సందేహం లేదు. స్వప్నంలో కనుపించే ప్రపంచం మనం కలను కంటూన్నంత వరకు బయట ఉన్నట్లే కనిపిస్తుంది...అనిపిస్తుంది. కాని తెలివి వచ్చాక తెలుస్తుంది ఆ ప్రపంచం నిజంగా బయటలేదు మన లోపలే ఉందని. అలాగే ఏ జాగ్రదవస్థ నిజమని నమ్మి మనం బ్రతుకుతున్నామో, ఆ జాగ్రదవస్థలో కనుపించే ప్రపంచం కూడా బయటలేదు లోపలే ఉంది. అంతేకాదు! ఈ ప్రపంచం కూడా స్వప్న ప్రపంచం వలెనే మిథ్య! అదెప్పుడు తెలుస్తుంది? స్వప్నప్రపంచం మిథ్య అని మనకెప్పుడు తెలిసింది? జాగ్రదవస్థలోకి వచ్చాక తెలిసింది. అలాగే ఈ జాగ్రదవస్థ కంటె భిన్నమైన అవస్థ ఇంకొకటుంది. దానిని తురీయావస్థ అంటాం. అదుగో! ఈ జాగ్రదవస్థ నుండి చిత్త వృత్తుల్ని అరికట్టి మనోలయాన్ని సిద్ధింపచేసికొని ఆ తురీయావస్థలోకి ప్రవేశింప కలిగితే అప్పుడు తెలుస్తుంది...ఈ ప్రపంచం మిథ్య అని. అంటే జాగ్రదవస్థలోని స్వప్నం మన బ్రతుకు.

ఆంజనేయా! పంచభూతాలకు, పది ఇంద్రియాలకు, విషయములకు, చిత్తవృత్తులకు తెలియబడక తానె తెలివియై అన్నిటిని తెలిసికొంటున్న తెలివి ఏదైతే ఉందో ఆ తెలివిని తెలిసికో. లోక వ్యవహారం అంతా జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయము లనబడే త్రిపుటి మీద ఆధారపడి నడుస్తోంది. ఈ త్రిపుటి జ్ఞానం నశిస్తే అసలు జ్ఞానం అఖండాద్వైత చైతన్యమే. పంచభూతాత్మకం శరీరం. దాని మీది మోహమే జన్మకు కారణం. అందువల్ల పంచభూతాలనే కాదు దాని పుట్టుకకు కారణమైన సత్వరజస్తమోగుణాలనే

త్రిగుణాలను కూడా ఆవలకు నెట్టి విశాల బుద్ధితో పరికించి నప్పుడు 'తత్త్వమసి' వాక్యార్థం బోధపడుతుంది.

మారుతీ! కూడికలన్నీ ఎడబాటుతోనే అంతమవుతాయి. ముఖ్యంగా ద్వైత బుద్ధిని తొలగించుకో. దేహాభిమానాన్ని విడిచిపెట్టు. అద్వయ జ్ఞాన నిష్ఠతో అహర్నిశలు ఆత్మనే చింతించు. అప్పుడు భవరోగాలు నశిస్తాయి. "నువ్వు చేసిన పని – నేను చేసిన పని" అని ద్వైత భావన పెట్టుకోకు.

సైకతలింగ స్థాపనను నీవాచరించిన సత్కృతిగా భావించు. లగ్నం చేరువౌతోందని మునులు హెచ్చరించగా సీత చేసిన సైకత లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయాల్సి వచ్చింది. అంతమాత్రానికే శోకింప తగునా? వీరాగ్రేసరా! నీవు తెచ్చిన లింగాన్ని ఇప్పుడే నీ పేర ప్రతిష్ఠ చేయి. జనులందరు ముందు నీవు ప్రతిష్ఠించిన లింగానికే మొదట పూజలు చేసి ఆపై నాపేర వెలసిన రామేశ్వర లింగానికి పూజలు చేస్తారు. నువ్వు కూడా అనేక మంది బ్రహ్మరాక్షసులను యుద్ధంలో సంహరించావు.

తద్దోష పరిహారార్థం నీ పేర శంభుప్రతిష్ఠ చెయ్యి. పాపాలన్ని పరిహార మవుతాయి. మహేశ్వరదత్త లింగదర్శనం చేసినవారు ధన్యులౌతారు.

మరొక్క విషయం: ఇప్పుడు ప్రతిష్ఠ చేసింది సైకత లింగమే కదా...దీనిని తీసి కైలాసం నుండి తెచ్చిన లింగాన్ని ప్రతిష్ఠ చేస్తాను అని అనుకోకు. ఆ పని అసాధ్యం. ఎందువల్లనంటె సైకతలింగం సప్త పాతాళాలను దాటి ఆక్రమించుకొని ఉంది. దానిని పెకలించటం ఏ బలశాలికైనా అసాధ్యం. నీవు పెకలించ గలిగితే నువ్వు తెచ్చిన లింగాన్ని ప్రతిష్ఠించు." ఆ మాటలు విన్న హనుమ సంతోషంతో స్వామి అనుజ్ఞ ఐంది గదా అని "రామా! దేవర చేసిన ప్రతిష్ఠ కదా అని జంకాను. నాకిదెంత పని. మేరువునైనా పెకలిస్తాను" అని సైకత లింగాన్ని పెకలించటానికి పూనుకొన్నాడు.

వసిష్ఠ మహర్షి చెప్పిన ఈ కథ విని శతానందుడిలా ఆశ్చర్యంతో అడిగాడు. "మహర్షీ! రాముని నోట పరతత్త్వ మార్గాన్ని వినికూడా, సైకత

లింగాన్ని పెకలించటం అసాధ్యమని తెలిసి కూడా స్వామి భృత్య న్యాయాన్ని ఉల్లంఘించి హనుమ ఈ దుర్ఘటమైన కార్యానికి ఎలా పూనుకొన్నాడు? ఎఱిగి చేశాడా? ఎఱుగక చేశాడా? యథార్థాన్ని చెప్పవలసింది."

**హనుమ సైకత లింగాన్ని పెకలించటానికి పూనుకొనుటలో అంతరార్థం.**

శతానందుని సందేహ నివారణ చేస్తూ, వసిష్ఠ మహర్షి ఇలా అన్నారు. "లోకుల భ్రాంతులను నివారించటం కోసం హనుమ అసాధ్యమని తెలిసి కూడా ఆ పనికి పూనుకొన్నాడు. అంతే కాని స్వామిభృత్య న్యాయాన్ని ఉల్లఘించటం అతని అభిమతం కానేకాదు. శ్రీరామనాథేశ్వర లింగం కేవలం ఇసుక లింగంగా భావించే లోకుల భ్రాంతిని పొగొట్టే నిమిత్తం ఆ పని చేశాడు. శివద్రోహానికి సిద్ధపడే వారికి అవమానం తప్పదు, నాశనం తప్పదు అనే విషయాన్ని లోకులకు తెలియచెప్పటం కోసం అసాధ్యమైన ఆ పనికి పూనుకొన్నాడు. అన్ని లోకాలలోను వ్యాపించి ఉన్న వాడు శివుడు అని పల్కిన రాముని వాక్యానికి నిదర్శనంగా ఆ పని చేశాడు. రాముడు నిల్పిన అణువునైనా కదల్చటం అసాధ్యం... అనే దానికి ప్రమాణంగా ఆ పని చేశాడు. అంతేకాని సకల ధర్మవేది, పరమపుణ్యుడు, ప్రత్యక్ష పరమేశ్వరుడు ఐన హనుమ శ్రీరామనాథేశ్వర సైకత లింగోత్పాటనా కార్యక్రమానికి పూనుకొనేటంత అవివేకియా ఏమి?

**హనుమ మూర్ఛితుడగుట. సీతారాముల ఓదార్పు.**

శతానందా! శ్రీమన్మహాదేవ రామనాథేశ్వర సైకత లింగాన్ని పెకలించటానికి హనుమ చేసిన అద్భుత ప్రయత్నాన్ని చెపుతాను విను!

మత్తవేదండం తన శుండాదండంతో పుండరీకాన్ని పెకలించినట్లు తన లాంగూలాన్ని లింగానికి చుట్టి లాగబోయిన హనుమ గర్వాటోపానికి

సర్వమంగళ భయకంపితయై గంగాధరుణ్ణి దృఢాలింగనంతో బంధించింది. ఇసుక లింగం ఇసుమంతైనా చలించలేదు. అయినా దిగులుమాని కలకల నవ్వుతూ కిలకిలార్భటులతో రెండు చేతులతో లింగాన్ని పట్టి దిట్టతనంతో ఇట్టట్టు ఊగించాడు. కొండకంటె దండియై నిలకడగా ఉన్న దానిని చూచి అలుకతో అహంకరించి హుంకారం చేసి పండ్లు కొఱుకుతూ... కండ్ల నిప్పులు రాల అజాండం పగులునట్లు అట్టహాసం చేసి క్రోధావేశంతో శ్రీరామనాథ లింగాన్ని పెకలించబోయిన మారుతాత్మజుని వీరావేశాన్ని, వృథాప్రయత్నాన్ని చూచి అచ్చటి వారంతా పరిపరి విధాల ఇలా తలపోశారు.

"ఇట్టి ఈశ్వరాపరాధం వల్ల ఎట్టి కీడు పుట్టునో?" అని పుడమి పట్టి భయకంపితురాలైంది.

"ఇంత అహంకారం పనికిరాదు" అని లక్ష్మణుడు హితోక్తులు పలికాడు.

"ఇంత బలవంతునికి సైతం సైకత లింగం కదలకుంట వింత" అని సుగ్రీవుడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

"రామ ప్రయుక్తమైనది బ్రహ్మాస్త్రం కంటె మిన్న అని తెలిసి కూడా రామ ప్రతిష్ఠిత లింగానికి భంగాన్ని కల్పించటం అవివేకం" అన్నాడు విభీషణుడు.

ఇలా...అంగద, కుముద, నల, నీల, జాంబవంతాది వనచర బృందమంతా తలకొక రీతిగా తలపోశారు. రఘుకులస్వామి కరుణా కటాక్షం వల్ల సమీర కుమారునికి ప్రాణహాని లేకుండుగాక! అని మహర్షులు ఆశీర్వదించారు. గగన భాగాన ఇంద్రాది దిక్పాలకులతో కూడి గరుడ గంధర్వ కిన్నర కింపురుష యక్ష రాక్షస సిద్ధ సాధ్యాది ఖేచర బృందమంతా తమ తమ ప్రియురాండ్రతో కూడి ఆశ్చర్యంతో చూస్తున్నారు. కుమారాభిమానంతో సప్త మారుతాలు హనుమ వాలానికి బలాన్ని కల్పిస్తూ అనుకూలంగా వీచాయి. సాటిలేని రౌద్రంతో ప్రళయకాల రుద్రునికి అకాల

రుద్రుడై ఘోర వీరావేశంతో కహకహార్భటులతో దిక్కులు పిక్కటిల్ల అరుస్తూ సాటిలేని భుజబలంతో సైకత లింగాన్ని పట్టి ఊపుతున్నాడు... హనుమ.

**సప్త సాగరాలు ఒక్క పెట్టున ఘోషించాయి.**
**సప్త కులపర్వత కానన సహితంగా క్షోణీమండలం క్షోభించింది.**
**సప్తాశ్వ ప్రముఖ గ్రహాలన్ని వక్రగతిలో సంచరించాయి.**
**పంచభూతాలు సంచలించాయి.**
**అష్టదిగ్గజాలు గగ్గోలు పడ్డాయి.**
**కాకోదర స్వామి వ్యాకులచిత్తు డయ్యాడు.**
**సప్తర్షుల నిష్ఠ చెదరగా అమర్షంతో పరికించారు.**
**సృష్టికి మహోత్పాతం పుట్టిందని కమలాసనుడు కలత పడ్డాడు.**
**కార్తికేయాది ప్రముఖ ప్రమథులు ఆయుధాలతో నిలిచారు...**
**వారణముఖుడు వారిని వారించాడు.**

**సృష్టి క్షోభించినా ఇసుమంత కూడా భంగం లేని లింగాన్ని చూచి, రెట్టించిన పట్టుదలతో మిట్టిపడి... ముట్టె బిగపట్టి... కరచరణాలను నేలమీద పెట్టి...వాలాన్ని ఆమూలంగా లింగానికి చుట్టి, పట్టి...దిట్టతనంతో పట్టుజాఅనీక...బెట్టు సడలనీక...గుట్టు రట్టు కానీయక...ఇట్టట్టు ఊగి... కట్టల్కా అట్టహాసం చేసి...మట్టు మీరి నింగి కెగిరిన ఆ జగజెట్టి... నవరంధ్రాల బుడబుడ నెత్తురు కక్కుకొంటూ నేలకు రాలాడు. చుట్టూ ఉన్న వారందరూ హాహాకారాలు చేశారు. హనుమరక్తం కారిన చోటు రక్తకుండం ఐంది. రెండు ఘడియలు వశంతప్పి ఒడలెరుగక పుడమి మీద పరవశుడై పడి ఉన్నాడు... హనుమ.**

శతానందా! వింటున్నావా! అప్పుడు...

సీ॥ గమన వేగంబున – ఘనజటా బంధంబు
గళితమై అంసభాగమున గునియ
కేల కుచ్చెల కొంగు – గీలించి తగమించ
అసురుసురై సీత అరుగుదేర

**భుజముల వెడజాఱు - భుజపత్ర వల్కలాం**
**చలము చేఁబూని లక్ష్మణుడు నడవ**
**కైదండయొసగుట - కై దండసాచిన**
**శయము తోడనె విభీషణుడు రాగ**

**తే॥ ఏరిపై చింతలేక హాహా రవంబు**
**తోడ కన్నీటి మున్నీట త్రోవ తడియ**
**తడయ కప్పుడు దశరథాత్మజుడు వచ్చె**
**పవన తనయుండు మూర్ఛిల్లి పడిన యెడకు.**

(సమీరకుమార విజయము)

లోకపావని ఐన సీత గమనవేగం చేత ఘనమైన జటాబంధం ఊడి భుజముల మీద పారాడగా చీర కుచ్చెళ్ళను చేతపట్టి అసురుసురంటూ వచ్చి చేరింది. నేలకు జీరాడే భుజ వల్కలాన్ని చేపట్టి లక్ష్మణుడు వెంట నడవ కైదండ ఇస్తూ విభీషణుడు వెంట రాగా రామచంద్ర ప్రభువు అన్యచింతన లేక హాహాకారాలు చేస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆ కన్నీటికి త్రోవ తడియగా పవన నందనుడు పడియున్న చోటికి వచ్చి చేరాడు.

**సీతారాములు దుఃఖించుట.**

ధూళి ధూసరితమై, రక్త సిక్తమైన శరీరంతో కన్నులు మోడ్చియున్న హనుమను చూచి ధరాతనూజ "అన్నా! ఒక్కసారి కన్నులు తెఱచి చూడవా! మా యప్పా! ఇదేమిరా!" అంటూ కన్నీట జలకమాడించి తన చేలాంచలంతో ధరాపరాగాన్ని తుడిచింది.

రామచంద్రుడు తన తొడమీద మారుతాత్మజుని శిరాన్ని పెట్టుకొని, నెత్తురు ముద్దైన శరీరాన్ని తడిమి కన్నులు మొగిడ్చి ఉన్న అతని మోముచూచి తల్లడిల్లి ఈ విధంగా దుఃఖించాడు.

"హా! అసహాయశూర! శత్రువుల శూల, ముద్గర, గద, పరశు క్షురికాది ఆయుధాల చేతకూడా గాయంకాని కాయం గదా నీది! నేటికి ఈ

అపాయం వచ్చింది. ఎందుకు మాటలాడవు తండ్రీ? నాకు మీరే తల్లిదండ్రులు అని సీతకు నాకు చేతులు మొగిడ్చి సేవ చేసే వాడివి కదా! ఇప్పుడెందుకు చెయ్యవు? చిన్ననాట నుండి చెలిమితో పెనవేసికొన్న కన్న తల్లిని, సోదరులను నీవు ఉండబట్టి మఱచి ఉన్నానయ్యా! అశోకవనిలో సీతను దర్శించి ఆమె ప్రాణాలను నిలబెట్టిన మేటి హితుడవు. ఇలా స్థాణువులా పడి ఉండటం న్యాయమా? ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం కూడా నిన్నేమీ చెయ్యలేక పోయిందే అలాటిది ఇప్పుడు వశంతప్పి పడి ఉన్నావంటె ఏమనాలి? క్షేమంగా నువ్వుండి మూర్ఛాగతులైన మమ్ములను రక్షించావు. తండ్రీ! మేమిప్పుడు క్షేమంగా ఉండి కూడా నిన్ను మూర్ఛ నుండి తప్పించ లేకుండా ఉన్నాం! సంజీవినీ ఔషధాన్ని తెచ్చిన నీకా జీవాలు సన్నబడటం! ఓ! సంజీవరాయ! నువ్వు లేకపోతే నాకు రాజ్యం వద్దు! లక్ష్మణుడు వద్దు! సీత కూడా అక్కర లేదు! తక్కిన వారసలే వద్దు! నీ వంటి గుణాఢ్యుడు నా కెలా దొరుకుతాడు?"

**హనుమ మూర్ఛ నుండి తేఱుకొని సీతారాములను స్తుతించుట.**

అని ఈ విధంగా అనేక విధాల హనుమ ముఖాన్నే చూస్తూ విలపిస్తూ కన్నీటితో అతని కాయాన్ని తడిపాడు శ్రీరామచంద్రుడు. అంతలో రెండు ఘడియలకాలం గడవగా మూర్ఛ నుండి తేఱుకొని సీతారాములను చూచి తనను తాను నిందించుకొని...ఇలా స్తుతించాడు.

**శ్లో॥ మాతారామో మత్పితా రామభద్రో**
**భ్రాతా రామో మత్సఖారాఘవేశః ।**
**సర్వస్వం మే రామచంద్రో దయాళు**
**ర్నాన్యం దైవం నైవ జానే న జానే ॥**

శ్లో॥ నమోస్తు రామాయ స లక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై ।
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః ॥

అని ఈ విధంగా సీతారాములను అనేక విధాల స్తుతించాడు హనుమ. మూర్ఛ తేటిన మారుతాత్మజుని చూచి సంతసించి సీతాదేవి ఇలా ఓదార్చింది. "పుత్రా! సకలజ్ఞాన కళానిధి అయిన రాఘవుడు లోకహితాన్ని కోరి శాశ్వతభక్తి యుక్తి శంభు ప్రతిష్ఠ చేస్తే నువ్వు దానిని కేవలం సైకత లింగంగా భావించటం తగునా? నేటి నుండి నువ్విలాటి గాయకపు పనులు చెయ్యకు. తప్పుచేశానని, స్వామిపట్ల అపరాధం చేశానని మనసులో పెట్టుకోకు. నీ మనశ్శుద్ధి దాశరథికి తెలుసు. పిల్లల ఆటలు తల్లిదండ్రులకు మనఃప్రమోదాలు అవుతాయి గదా! స్వామి నిజమర్మమంతా నీకు బోధించారు. నా మర్మాన్ని చెపుతాను విను.

## సీత హనుమకు తన అవతార తత్త్వాన్ని తెలుపుట.

హనుమా! నా భక్తుడవైన నీకు నా యథార్థ స్వరూపాన్ని చెపుతాను విను. ఈ సర్వమైన సృష్టికి కారణ భూతమై అజరము, అమేయము ఐన ఒక మహాశక్తి విశ్వవ్యాప్తంగా ఉంది. నామ రూపాదులను విసర్జించి విమర్శ దృష్టితో చూచే వారికి ఆ శక్తి తరంగం విదితమౌతుంది. అదే 'చిత్‌శక్తి.' అది అనాది సిద్ధమైనది. స్వతంత్రమైనది. అది నేనే!

ఆదిలో మహా పురుషుడు లేక సత్య పురుషుని యొక్క జగత్కారణ భూతమైన తపశ్శక్తియే... ఆ మహాశక్తి. ఆ మహా పురుషునిలో పుట్టిన సృష్టి చెయ్యాలనే సంకల్పశక్తియే...ఆ తపశ్శక్తి. అందువల్ల ఆయనకు ఆయన తపశ్శక్తికి భేదం లేదు. ఆ మహాపురుషునికే సదాశివుడని – ఆ మహా శక్తికే

హైమవతి అని పేర్లు. లోకానుగ్రహ నిమిత్తమై వారిద్దరు శివ – పార్వతులుగా లీలారూపాలను ధరించారు. అది ఆధిదైవిక రూపం. ఆ శివ–శక్తులు రెండూ మానవ శరీరంలో కుండలినీ శక్తి రూపంలో ఉండి జీవ వ్యాపారానికి ఆధారమై నిలిచి ఉన్నది. అది అధ్యాత్మరూపం.

ఈ అనంత విశ్వానికి కేంద్రం...ఆ సత్యపురుషుడే. అదే సత్యలోకం. ఆయన చుట్టూ ఆయన యొక్క జగత్సిద్ధి హేతువైన తపశ్శక్తి ఆవరించి ఉంటుంది. అదే తపోలోకం. ఈ రెంటికి శివ – శక్తులని పేర్లు. రెంటికి అభేదం. ఆ మహాపురుషుని తపశ్శక్తి నుండి ఇంకొక శక్త్యావరణం వ్యక్తమైంది. దానికి జనోలోకము అని నామధేయం. ఈ మూటికి సత్ – చిత్ – ఆనందము అని శాస్త్ర వ్యవహారం. ఈ జనోలోకానికే వ్యోమము, అంతరిక్షము, గగనము అని పేర్లు. ఈశ్వరుని యొక్క ప్రమోదకలా రూపమైన ఆ తపశ్శక్తికే దాక్షాయణి, సతి, హైమవతి, శివా, భవాని, ఉమ, కామేశ్వరి, శివకామిని, గిరిజ, పార్వతి...ఇత్యాది నామాలున్నాయి. ఆ మహాశక్తికి ఆశ్రయభూతుడు 'సత్' ఐతే ఆమె 'సతి' అవుతుంది. ఇది వైదికుల పరిభాష. భవుడైతే ఆమె 'భవాని' అవుతుంది. ఇది తాన్త్రికుల పరిభాష. కొందరు ఈమెనే 'ప్రాణము' అని వ్యవహరిస్తారు. ప్రమోద కలావాదులు ఈ మహాశక్తినే 'ఆనంద రూపిణి' అంటారు. వీరు రసవాదులు. "రసోవై సః" అనే శ్రుతివాక్యం వీరికి ప్రమాణం.

వైదికులలో ప్రాచీనులైన పూర్వమీమాంసావాదులు మంత్ర పూర్వకంగా అగ్నిహోత్రంలో ఆహుతులను సమర్పించటం ద్వారా ఆ శక్తినే ఉపాసిస్తున్నారు. తాన్త్రికులు శ్రీ విద్యోపాసనతో ఆ శక్తినే ఆరాధిస్తున్నారు. దేవాలయాలలో అర్చనామూర్తులను అర్చించటం తాన్త్రికోపాసనలో భాగమే. యోగులు కుండలినీ శక్త్యుల్లాసాన్ని పొంది అమృతసిద్ధిని పొందుతున్నారు. ఇక సంగీత – సాహిత్య – నాట్యాదులతో రసవాదులు ఆనందరూపిణి ఐన ఆ శక్తినే నాదరూపిణిగా ఆరాధిస్తున్నారు. మనుష్యులందరు రుచి భేదం చేత

ఏర్పడిన మతభేదంతో కొలుస్తూన్న ఆ శక్తిని నేనే. నా కంటె అన్యమేదీ లేదు ఈ సృష్టిలో.

హనుమా! నీ తను – మనః – ప్రాణాలను, సమస్తాన్ని అర్పించి మమ్ములను కొలుస్తున్నావు గదా. సాక్షాత్తు సత్యపురుషుని యొక్క అవతారమేనయ్యా.... శ్రీరామచంద్ర ప్రభువు. ఆయన సత్యసంధుడు. ఆయన మహాపురుషుడు. ఆయనే సృష్టి కేంద్రం. ఆయనే సదాశివుడు. భవుడు. సర్వరసాశ్రయుడు. ఆయనే ధార్మికుడు.

ఆయన శక్తిని నేనే! శివ శక్తులకు అభేదం. నేను చిన్మయ రూపిణిని! నేను సావిత్రిని. గాయత్రిని. నేనే సతిని. సతీత్వధర్మం ఏమిటంటే పురుషునితో నిరంతర సహచర్యం. ఈ శక్తినే "సంహిత" అంటాం. సీతారాములుగా పిలువబడే మేము "సంహితా స్వరూపులం"! నేను వేదమాతను. సరస్వతిని. నేనే 'శ్రీ'ని. సర్వజనులకు నయనానందాన్నిచ్చే సూర్య, చంద్ర, విద్యుత్, అగ్ని, పుష్ప, పల్లవ, మణి, మౌక్తిక, హిరణ్యాదుల కాంతిని 'శ్రీ' అంటారు. ఆ శోభను నేనే. మేమిద్దరం అవతార మూర్తులం.

**అవతార నిర్వచనం.**
**నిష్కామ కర్మాచరణ నిర్వచనం.**

అవతరణం అంటే క్రిందికి దిగటం, ఆ క్రిందికి దిగటం లోకానుగ్రహం కోసమే. ఒక దేవత కాని ముక్త పురుషుడు కాని లోకానుగ్రహం నిమిత్తం భూమి మీద అవతరిస్తూ ఉంటారు. భూమి మీది జనుల నిష్కామ కర్మాచరణ ఫలంగా అవతారాలు సంభవమవుతాయి.

నిష్కామ కర్మాచరణ అంటే: భూమి మీది జ్ఞానులు, ఋషులు, మునులు, తాపసులు, యోగులు, నిస్సంగులు, భక్తులు, సత్పురుషులు ఐన వారు స్వార్థం ఇసుమంతైనా లేకుండా నీ వలె నిష్కామంగా లోకక్షేమాన్ని, అభ్యుదయాన్ని, సుఖశాంతులను కోరి ఆ సత్య పురుషుని ప్రార్థించటమే.

లోకం లోని జనులందరు ఫలాన్ని ఆశించే కర్మలను చేస్తారు. ఫలకాంక్ష లేకుండా ఎవరూ ఏ పని చెయ్యరు కదా.

"మారుతీ! భౌతిక ప్రపంచం ధనం మీద ఆధారపడే జీవిస్తోంది. 'ధనమూల మిదం జగత్' అనే న్యాయం ఉండనే ఉంది గదా. లోకంలో ఏ ఉపాయం చేతనైనా ధనార్జన చెయ్యవచ్చు. ధనం నిమిత్తమై పరమేశ్వరుని అర్చన గాని ప్రార్థన గాని చెయ్యనక్కర లేదు. ఉపాసనా పద్ధతులు అందుకొఱకు ఉద్దేశింపబడినవి కావు. అంత వరకు వెళ్ళగలిగిన జనుడు... ఆ పరమాత్మను అర్థించవలసింది అర్థాన్నా లేక పరమార్థాన్నా? భగవంతుణ్ణి ఎప్పుడూ భౌతిక వాంఛలతో లేదా సమస్యలతో సమీపించకూడదు. అలా సమీపిస్తే అది కామ్యకర్మ అవుతుంది. సర్వలోక హితాన్ని కోరి ఉపాసిస్తే అందులో స్వార్థం లేదు కనుక...అది నిష్కామ కర్మ అవుతుంది.

హనుమా! గృహస్థు సంసారం ఉన్నంత వరకు సంఘంలో బ్రతకాలి కనుక కామ్యకర్మల్ని తప్పక చెయ్యాలి. ధనార్జన, గృహంలో వచ్చే ఈతిబాధలు వీటిని గూర్చి పరమేశ్వరుని ప్రార్థించ నక్కరలేదు. **మనిషికి కావలసినవన్ని ఈశ్వరుడు సృష్టించే ఇచ్చాడు.** ఇక ప్రార్థించటానికి ఏముంది? ఆ కారణంగా ధనార్జనను లోకంలో చెయ్యాలి. ఈతిబాధలను ఇంట్లో పరిష్కరించుకోవాలి. సమస్యలను తను సృష్టించుకొని పరమాత్మను పరిష్కరించమంటె ఎలా?

ఆపై సన్న్యాసాశ్రమ స్వీకారం చేసి నిష్కామ కర్మాచరణ ద్వారా ముక్తుడు కావాలి. గృహస్థుకు నిష్కామ కర్మాచరణ పనికి రాదు. సన్న్యాసికి కామ్య కర్మాచరణ నిషిద్ధం. ఈ రహస్యాన్ని తెలుసుకోలేక విపరీత ఆచరణ కలవారై కొందరు ఇహపరాలు రెంటికి దూరమవుతున్నారు.

హనుమా! ఈ నిష్కామ కర్మాచరణనే యజ్ఞంగా చెప్పింది వేదం. యజ్ఞం అంటె పరిపూర్ణ త్యాగం. యావత్ సృష్టి మానవునికి త్యాగ గుణాన్ని అలవర్చుకోమని బోధిస్తోంది. జ్ఞాని ఐనవాడు దానిని తెలుసుకొని ముక్తుడవుతున్నాడు. అజ్ఞాని ఐనవాడు ప్రకృతి మాయలోపడి మరింతగా బంధితు డవుతున్నాడు.

స్థావర జంగమాత్మకమైన ఈ సృష్టి ఉద్భిజ్జములు – స్వేదజములు – అండజములు – జరాయుజములు అని నాలుగు విధాలుగా ఉంది. అవి ఉత్తరోత్తరాధిక్యత కలవి. కొందరు... కొండలను జడ ప్రాయంగా ఎంచుతారు. వాటికి ప్రాణం ఉంది. తమోగుణాధిక్యత కలవి కనుక కొండలలో ప్రాణం సుషుప్త్యవస్థలో ఉంటుంది. వాటిలోని ప్రాణాన్ని ఆధారం చేసికొనే కొండలపై అడవి సమృద్ధిగా పెరుగుతోంది. అడవిని ఆశ్రయించుకొని పక్షులు, జంతువులు, పశువులు, మృగాలు ఇలా అనేకమైన జీవరాశి మనుగడ సాగిస్తోంది. వాటిని ఆశ్రయించుకొని మనుష్యులు బ్రతుకుతున్నారు. ప్రాణ వికాసం ఎప్పుడూ ఊర్ధ్వగతిలో ఉంటుంది. ఈ గతిలో ప్రాణం తనకు అత్యంత ప్రేమాస్పదుడైన పరమాత్మను (సత్య పురుషుని) చేరుకొనే క్రమంలో క్రింది తరగతి సృష్టి, పై తరగతికి చెందిన సృష్టికోసం ఆహుతియై తీరుతుంది. ఇదే యజ్ఞం అంటే. ఈ యజ్ఞక్రియ నిరంతరాయంగా నిష్కామంగా సాగిపోతూ ఉంటుంది. ఇదే స్థితికారకుడైన విష్ణుకథల అంతరార్థం!

శుద్ధ సత్త్వ స్వరూపుడైన సత్యపురుషుని నుండి వ్యక్తమైన ఈ సృష్టి తమోగుణ, రజోగుణాలను వదిలించుకొని శుద్ధసత్త్వాన్ని సంతరించుకోటంతో సృష్టిచక్రం పూర్తవుతుంది. ఈ క్రమంలో తమోగుణ, రజోగుణ ఆధిక్యత గల సృష్టి అంతా సాత్త్విక సృష్టి ముందు నిలువలేక ఆహుతియై తీరుతుంది. ధర్మం జయిస్తుంది. అధర్మం నశిస్తుంది అనే దానికి వ్యాఖ్యాన ప్రాయమైన నా మాటలు విన్నావుగా హనుమా! ఎంత తపస్సు చేసినా ఎన్ని వరాలు పొందినా సత్యధర్మ స్వరూపుడైన శ్రీరాముని ముందు రావణాదులు నిలువలేక నాశనం అయ్యారంటె... దానికిదే విధివాక్యం! సూర్యుని ముందు చీకట్లు నశించవా? అయ్యో! అనుకోటానికి ఇందులో ఏముంది ? చివరకు జీవులందరు ముక్తులు గావలసిందే. ఇక్కడ మనుష్యుల కర్తవ్య మేమంటె, లోకస్థితి హేతుభూతమైన యజ్ఞ స్వరూపాన్ని లెస్సగా అర్థం చేసికొని తాము కూడా నిష్కామ కర్మాచరణతో ఆ యజ్ఞపురుషుని, దేవతలను ఆరాధించి సత్త్వగుణాన్ని

పెంపొందించుకొని యజ్ఞ భాగస్వాములై శాంతి సౌభాగ్యాలతో జరామృత్యువులను జయించి జీవన్ముక్తులు కావాలి.

**అవతార రహస్యం.**

హనుమా! మా ఇద్దరి అవతార రహస్యాన్ని చెపుతా విను.

భూమి మీది సత్పురుషులు సమష్టిగా ఈశ్వరార్పణ బుద్ధితో చేసిన నిష్కామ కర్మరాశికే... యజ్ఞమని పేరు. ఆ యజ్ఞమే విష్ణువు. విష్ణువు స్థితి కారకుడు. అంటె లోక స్థితికి హేతుభూతమైన శక్తి రాజులు కారు – శాసనాలు కావు – సైన్యము కాదు. కేవలం ఋషుల, మునుల, జ్ఞానుల యోగుల నిష్కామ కర్మాచరణ రూపమైన ఈశ్వర శక్తి. ఒక దేశం ఎంత సంస్కృతి సంప్రదాయాలు కలదైనా పూర్తిగా తమోగుణంలో నిద్రిస్తూన్నప్పుడు... రజోగుణాధిక్యత గల మరొక దేశం దానిపై తప్పక విజయాన్ని సాధిస్తుంది. ఆ దేశం మీద సత్త్వ గుణాధిక్యత గల మరొక దేశం విజయాన్ని సాధిస్తుంది. ఎందుకంటె త్రిగుణాలు మూడూ పూర్వోత్తరంగా ఒకదాని మీద మరొకటి ఆధిక్యాన్ని కలిగి ఉన్నాయి. రజోగుణం దాడి చెయ్యకపోతే తమోగుణం నిద్రలేవదు. సత్త్వగుణం రజోగుణాన్ని మట్టు పెట్టకపోతే... సృష్టి అంతా వికృతిరస రూపంతో అల్లకల్లోలంగా ఉంటుంది. ప్రకృతి రసరూపమైన శాంతి ఉండదు. ప్రకృతి సిద్ధము, సహజము ఐన శాంతరసం తన సహజస్థితిని కోల్పోయినప్పుడు కదా వికృతి రసాలైన శృంగార, హాస్య, కరుణ, రౌద్ర, వీర, భయానక, బీభత్స, అద్భుత రసాలు రాజ్యమేలతాయి.

హనుమా! ఇది సృష్టి నియమం. దీనిని ఎవరూ ఉల్లంఘించలేరు. అయ్యో! ఎంత రక్తపాతం జరిగింది అని రోదిస్తే... అది అవిద్యా విలసితమే! జ్ఞాను లెప్పుడూ శోకించరు... కారణం... వారెప్పుడూ వెలుగులో ఉంటారు.

వ్యష్టి (వ్యక్తి) సకామ కర్మాచరణ ఫలితంగా సంసారి అవుతాడు. సత్పురుషుల సమష్టి నిష్కామ కర్మమయుడైన పురుషుడు అవతారంగా

ఆవిర్భవిస్తాడు. ఒక వ్యక్తి కామ్యంతో కూడబెట్టిన సంపద ఫలితాన్ని అతని సంతానం వందల కొలది సంవత్సరాలు అనుభవించ వచ్చుగదా! అలాటప్పుడు... సత్పురుషుల సమష్టి నిష్కామ కర్మాచరణ ఫలితంగా ఆవిర్భవించిన అవతార ప్రయోజన ఫలాన్ని గురించి చెప్పేదేముంది! మానవాళి ఆ అవతారం చూపిన వెలుగులో పయనించి కర్మలను ఆచరించి పరిశుద్ధులై వేలవేల సంవత్సరాలు ప్రయోజనాన్ని పొందుతారు.

హనుమా! సీతారాములుగా అవతరించిన మా అవతార ప్రయోజనాన్ని, ఏకపాద రుద్రుడవైన నీ అవతార ప్రయోజనాన్ని ఈ భూ మండలం మీది మానవాళి సూర్యచంద్రులు ఉన్నంత వరకు పొందుతారు. సందేహంలేదు.

రావణుని వలన బాధలనుభవించిన దేవతలు, వేలాది మంది దండకారణ్యా వాసులైన ఋషులు తదితర సత్పురుషులు వీరందరి సమష్టి నిష్కామ కర్మాచరణ ఫలితమే మా అవతారాలు. రాముడు యజ్ఞ పురుషుడు. అగ్ని సంభవుడు. నేను అయోనిజను. ధరాతనూజను. వీర్యశుల్కను, వీరారాధ్యను.

యజ్ఞమయుడైన అవతార పురుషుని భోగానికి అవసరమైన సమస్తము సృష్టించబడే ఉంటుంది. దాని కొఱకు ఒక దేవత ఉంది. ఆమె కూడా ధర్మాచరణ కొఱకే అవతరిస్తుంది. ఆమెనే లక్ష్మి లేక 'శ్రీ' అని అంటారు. ఆ 'శ్రీ' ని నేనే. ఆయన కొఱకు అవతారమెత్తిన దానిని.

**లోకంలో జీవుల పుట్టుక పంచాహుతి క్రమం.**

హనుమా! లోకంలో ప్రాణుల యొక్క పుట్టుక లేక అభివ్యక్తి పంచాహుతి క్రమంలో ఉంటుంది. ఇది సాధారణ సృష్టి నియమం. కాని అవతారాల విషయంలో ఈ నియమం సర్వే సర్వత్ర పాటింప బడదు. అలాటి వారిని అయోనిజులు అంటారు.

**ప్రథమాహుతి:** సూర్యుడు తన కిరణ ప్రసారానికి అందినంత మేరకు జలాలను గ్రహిస్తున్నాడు. దాని వలన సోముడు పుడుతున్నాడు. ఉదకములకు సూర్యుని యందు ప్రథమాహుతి.

**ద్వితీయాహుతి:** ఆ సోముడు పర్జన్యుని యందు ఆహుతి అవుతున్నాడు. వర్షం పుడుతోంది. సోమునకు పర్జన్యునియందు ద్వితీయాహుతి.

**తృతీయాహుతి:** ఆ వర్షం భూమి యందు ఆహుతి అవుతోంది. దాని వలన ఓషధులు అనగా అన్నం పుడుతోంది. వర్షానికి భూమియందు తృతీయాహుతి.

**చతుర్థాహుతి:** ఆ అన్నం పురుషుని (ప్రాణి) యందు ఆహుతి అవుతోంది. దాని వలన రేతస్సు అనగా వీర్యం పుడుతోంది.
అన్నానికి పురుషునియందు చతుర్థాహుతి.

**పంచమాహుతి:** ఆ వీర్యం స్త్రీ గర్భంలో ఆహుతి అవుతోంది. దాని నుండి పురుషుడు (జీవుడు) పుడుతున్నాడు. వీర్యానికి స్త్రీ గర్భమందు పంచమాహుతి.

హనుమా! ఇది పంచాహుతి క్రమం. ఈ క్రమంలో తృతీయాహుతిలో అనగా వర్షం భూమి మీద పడగానే ఆ ఉదకముల నుండి జనించిన దానను. ఈ సృష్టి అంతా పంచభూతాత్మకం. ఎన్ని లోకాలు తిరిగినా పంచ మహాభూతములే కాని ఆరవ భూతం లేదు. పంచ మహాభూతముల మీద కూడా నేను ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాను.

**హనుమా! చంద్రునిలో చాంద్రీరూపంలో ప్రకాశించే ఆ సోమకళ నేనే!**

**మేఘంలో క్షణికావిర్భావాన్ని పొంది మెఱుపు రూపంలో గోచరించే ఆ ఐంద్రీశక్తి నేనే!**

**ఇంద్రునకు వజ్రము, అగ్నికి జ్వాల, సూర్యునకు కాంతి, చంద్రునకు వెన్నెల, జీవునకు నేత్రము ఇవన్నీ నా జ్యోతిర్విశేష వైభవాలు!**

**జీవులకు జాగ్రదవస్థలో బుద్ధిరూపంలోను, తరుణులలో వృద్ధి రూపంలోను, ధీరుల యందు నిష్ఠరూపంలోను, కార్యసాధకులకు ప్రేరణ శక్తిగాను ఉన్నది నేనే!**

**యోగులకు అమృత సిద్ధికి కారణ భూతమై శిరసునందు చంద్రకళగా ఉన్నది నేనే!**

**అవిద్యా విలసిత భేద దృష్టిగల ద్వైతులకు భయంకర రూపిణిగాను, శ్రుతి శిరో సీమంతవీధీ ఉపనిషద్విహార పరితోషిత స్వాంత నిత్య పరమానంద జీవబ్రహ్మైక్య స్వరూపులైన జ్ఞానులకు అనిర్వచనీయ అనవచ్ఛిన్న అఖండ అద్వైతానంద చిన్మాత్రస్వరూప పరమ శాంతరూపిణిగాను దర్శనమిచ్చేది నేనే!**

**గౌరి – ఉమ – పార్వతి – అపర్ణ – శ్రీమాత – లలిత అని ఇంద్రాది బృందారకులచే నిత్యము స్తుతింపబడే సర్వోత్కృష్టమైన లోకమాతను నేనే!"**

అని ఈ విధంగా సీతా మహాసాధ్వి హనుమకు తన నిజ మర్మాన్ని బోధించి ఇంకా ఈ విధంగా ఊరడించింది.

**హనుమత్కుండ మాహాత్మ్యము.**

మారుతీ! నీ తనువు నుండి ఓడిన రక్తం ఇందుచేరిన కారణంగా ఈ ప్రదేశం నీ పేర హనుమత్కుండం అనే పేరుతో జగత్ప్రసిద్ధిని పొందుతుంది. ఘోరమైన పాపాలను పోగొట్టగలదు. ఈ తటాకంలో స్నానం చేసిన వారికి వెళ్ళిన చోటల్లా మన్నన కలుగుతుంది. గురు కటాక్షం లభిస్తుంది. ఆరోగ్యం సిద్ధిస్తుంది. మానసిక తాపాలు పోతాయి. ఇది జగజ్జన జీవనం. ఇది సుధైక జీవనం. ఇది లోకైక పావనం. జనుల అస్థులు ఈ జలాల్లో ఎంతకాలం ఉంటాయో అంతకాలం యముని లోకానికి వెళ్ళకుండా అమర సదృశులై దివ్యులై ఉంటారు. ఇందులో మునిగిన వారికి కష్టాలన్ని తొలగుతాయి. గోదావరిలో కంటె, గంగలో కంటె, త్రివేణీ సంగమంలో కంటె నీ పేరిటి కుండంలో మునిగిన వారికి అధిక పుణ్యం కలుగుతుంది. ఈ

కుండంలో ఏ జనులు తమ పితరులకు తిలోదకాలిస్తారో ఆ పితరులు శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తిని పొందుతారు.

ఈ విధంగా ఊరడించిన సీతారాముల పల్కులకు కలత తీరి కైలాసం నుండి తాను తెచ్చిన శివలింగాన్ని హనుమత్కుండంలో ప్రతిష్ఠించాడు... హనుమ. సీతారాములు ప్రతిష్ఠించిన రామేశ్వర సైకత లింగాన్ని తోకతో చుట్టి పట్టి లాగిన కారణంగా ఆ లింగం మీద జగజ్జన నిదర్శనంగా మూడు ముడుతలు ఏర్పడ్డాయి. ఇది రామలింగ ప్రతిష్ఠాపనా మహోత్సవ కథనం.

ఈ కథను భక్తి శ్రద్ధలతో చదివిన వారికి, విన్న వారికి శివాలయ నిర్మాణ పుణ్యం కలుగుతుంది. శివానుగ్రహం లభిస్తుంది. కార్యసిద్ధి జరుగుతుంది. మనస్సు నిర్మలమవుతుంది. మృత్యుభయం తొలగుతుంది. హనుమ అనుగ్రహం ఎల్లవేళలా వెన్నెలై విరియగా దుఃఖాలన్నీ నశిస్తాయి. ధనాన్వితులై శ్రేయస్సును పొందుతారు. దీర్ఘాయుష్మంతు లవుతారు.

అని చెప్పిన వసిష్ఠ మహర్షిని చూచి శతానందుడిలా కోరాడు. “మహర్షీ! సమీర కుమారుని దివ్య వృత్తాంతం ఎంత విన్నా తనివి తీరటం లేదు. ఎక్కడికక్కడే అద్భుతాశ్చర్యాలతో కూడి ఉంది. తరువాత వృత్తాంతాన్ని కరుణతో చెప్పవలసింది” అని వేడగా మహర్షి ఇలా చెప్పసాగారు.

**హనుమ భరతుని వద్ద కేగుట.**

రాజకుల భూషణుడైన రాముడు జానకీ సహితుడై పుష్పకాన్ని ఎక్కి అయోధ్యకు వెడుతూ భరద్వాజాశ్రమంలో విడిది చేసి...హనుమను పిల్చి ఇలా అన్నాడు. “హనుమా! పరేంగిత జ్ఞానము, ప్రౌఢ వచోరచనా చమత్కృతి, సరసత్వము నీ సొమ్ములు. నువ్వు వెంటనే నందిగ్రామంలో ఉన్న భరతుని సన్నిధికి వెళ్ళి నా ఆగమన వార్తను...చెప్పిరా.” అలా ప్రియంతో చెప్పిన రాముని ఆజ్ఞను ఔదల దాల్చి మానవ రీతిలో భరతుని చేరి రామకథామృతాన్ని వర్షించి అతని శోకాన్ని హరించి అతనిచే తగిన

మర్యాదలను పొందాడు. హనుమత్సందేశాన్ని విన్న క్షణమే భరతుని శోక తిమిరం పటాపంచలైంది. వదనాన దరహాస చంద్రికలు వెల్లివిరిశాయి. కన్నుల హర్ష బాష్పాంబుధారలు కురిశాయి. కళానిధిలా భరతుడు వెలిగిపోయాడు.

## సీత హనుమకు మణిహారాన్ని బహూకరించుట.

రామ పట్టాభిషేక సమయంలో ఆ వైభవమంతటికి తాను కారణమై శాకద్వీపం నుండి ఉత్తర సముద్రపు నీరు క్షణంలో తెచ్చిన హనుమ సామర్థ్యాన్ని ఎవరు కీర్తించగలరు! మారుతిని గూర్చి రఘుకుల సార్వభౌముడు మిక్కిలి బహుమానం చేశాడు. స్వామి అనుమతితో భూపుత్రి ఐన సీత "దీనమందార! రారా! కుమారా!" అని పిలిచి తులలేని మణిహారాన్ని హనుమ కంఠసీమను ఆమె స్వయంగా అలంకరించింది. ఏ మాదృశ్యం! ఏమా అదృష్టం! హనుమపై ఆమెకెంత కూరిమియో గదా! ధరాత్మజాదత్త మణిహారాన్ని వక్షమందు ధరించిన హనుమ అనేక తారకామండల పరివృతుడైన మేరువులా గోచరించాడు.

అప్పుడు వసిష్ఠ మహర్షిని చూచి శతానందుడిలా అడిగాడు. "మహర్షీ! రామచంద్రుడు హనుమ సహాయంతో శతకంధర వధను దిగ్విజయంగా నెరవేర్చేడన్నారే! అదంతా సవిస్తరంగా చెప్పవలసింది." అని ఔత్సుక్యంతో అడుగగా అద్భుతము, దేవతా ప్రీతికరము, జగదానంద కారకము ఐన ఆ వృత్తాంతాన్ని వసిష్ఠ మహర్షి వేద సమంచిత వాక్కులతో ఇలా చెప్పసాగారు.

"శతానందా! విను! ఏ రణరంగంలో సీతామాత తారకమంత్ర రాజాన్ని జపించి ఒకేఒక్క బాణంతో శతకంధరుణ్ణి సంహరించి తనకు వాహనమైన హనుమను మచ్చికతో చూచి చిఱునవ్వు నవ్విందో అట్టి లోకైక మాతకు ముందుగా నమస్కరిస్తున్నాను.

**శతకంధర వధ**

శతానందా! ఏకపాద రుద్రావతారమే హనుమ అని సీతకు రాముడు చెప్పిన కథనాన్ని, నేను నీకు ఇంతకు ముందు చెప్పాను. ఆపై జరిగిన వృత్తాంతాన్ని చెపుతాను విను! ఆ కథను విన్న సీత.... నాథా! మీ భృత్యుడైన హనుమను ఇంతగా కీర్తిస్తున్నారు గదా! అతని సహాయంతో శతకంధర వధకు పూనుకొనక ఆలస్యం చేస్తున్నారేమిటి? అని హెచ్చరించింది. కర్తవ్యాన్ని గుర్తు చేసిన సీత పల్కులు విని వెంటనే రాఘవుడు ఆ పనికి పూనుకొన్నాడు.

ముందుగా పురరక్షణకు అనురూప బుద్ధి సంపన్నుడైన మహామాత్యుణ్ణి నియమించాడు. సైన్యాన్ని సిద్ధం చేయమని సేనాధిపతులకు ఆజ్ఞలిచ్చాడు. కౌసల్యాది తల్లులకు మ్రొక్కి వారి దీవెనలను పొందాడు. తన అత్తలకు మ్రొక్కి వారి అనుమతితో తాను కూడా యుద్ధ రంగానికి వస్తానన్న సీత కోర్కెను అంగీకరించాడు. మణిమకుటాన్ని ధరించాడు. బంగారు కవచాన్ని తొడిగాడు. హారకేయూర కరకంకణాది బిరుద భూషణాలను అలంకరించుకొని వెంటనే యుద్ధసన్నద్ధు డయ్యాడు.

తన వామహస్తాన్ని మృదువైన దక్షిణ పాణితో పట్టుకొని ధరాతనూజ పార్శ్వవర్తురాలై నడువగా...

సిద్ధతూణీరుడై శరచాపాలను ధరించి సౌమిత్రి వెంటరాగా...

ఎంతో సంభ్రమంతో సీతారాములను చూడవచ్చే ప్రజలను భరత శత్రుఘ్నులు హెచ్చరికలు చేయగా... ఉభయ పార్శ్వాల సుగ్రీవ విభీషణులు కొలువుచేయగా... రథగజ తురగ బలాలతో, మనుజ దనుజ వానరసేనతో హనుమ కుడిభుజం మీద హస్తాన్నుంచి కోదండపాణియైన రాముడు ఉపవనాన్ని చేరాడు. భరతసుగ్రీవ విభీషణులను చూచి మన బలాలన్ని సిద్ధంగా ఉన్నాయా అని అడుగగా అన్నీ సిద్ధంగా ఉన్నాయని వారు విన్నవించారు.

**హనుమ విశ్వరూపం**

సాభిప్రాయంగా హనుమకేసి చూచాడు. వెంటనే అతను విజ్ఞుడు, సమయజ్ఞుడు,

పరేంగితజ్ఞుడు కనుక సాష్టాంగ నమస్కారం చేసి చుక్కలు మొల పూసలుగా అక్కజంగా మేనుపెంచి దిక్కులంతా ఎక్కడ చూచిన తానై ఆ కపిశేఖరుడు నిలిచాడు.

శతానందా! ఆ విశ్వరూపం ఎలా ఉందో చెబుతాను! విను! ఉత్తుంగ తరంగ భీషణ ఘోషణలతో గర్జించే సప్త సముద్రాలు అతని ఒక్క అంగకు చాలవు. చండభాను హిమంశు ఉద్యద్గ్రహ మండలాలన్ని ఒక ప్రక్కకు రావు. సర్వ వసుంధరా భారధూర్వహులైన ఆదిశేషు ఆదివరాహ ఆది కమఠాలు అతని ఒక్క పద ఘట్టనకు ఓర్చుకోలేవు. అతని ఉద్ధతికి ఊర్ధ్వలోక గర్భిత బ్రహ్మాండ కర్పరం కానరాదు. బలి చక్రవర్తి విభవాన్ని ఆక్రమించిన త్రివిక్రమ స్ఫూర్తితో నిలిచిన విష్ణువు లాగ ఆ మేటి వీరుడు కమలగర్భాండ పేటి నిండి నిజరూపంలో నిలిచాడు.

మేను కదపడుగాని కదిపితే ఊర్ధ్వ లోకాలన్ని చూర్ణమై రాలవా! చక్కగా నిల్వడు గాని నిగిడితే బ్రహ్మాండ కర్పరం కుప్ప కూలదా! పదం కదపడు గాని కదిపితే పై మోపుకు ఆది కమఠం అడుగంటి పోదా! బిగువు చూపడు గాని చూపితే దిశావలయం పెటిలి బీటలు వాఱదా! లోకులకు తన నిజ స్వరూపాన్ని చూపించగోరి నిలిచాడు కాని ఆ విగ్రహానికి ఆగ్రహం వస్తే లోకాలన్ని నిగ్రహించగలవా? సముద్రానికి చెలియలికట్ట వంటి వాలం, బృహత్కాయం, రక్తాననం, అంజలిబంధం, రామచంద్ర పాదాంభోరుహాల మీద నిశ్చలమైన చూపులు, దుర్నిరీక్ష్యమైన తేజస్సు, బ్రహ్మాదులు కూడా తేరిచూడలేని తనుద్యుతులతో వెలిగిపోతున్నాడు...హనుమ.

**హనుమ విశ్వరూపాన్ని చూచి రామాదులు స్తుతించుట.**

ఆపదుద్ధారకుడని భక్తితో విభీషణుడు పొగిడాడు. కేవల మంత్రిగా తలపోసిన దుర్మదుడనని చేతులు జోడించి నమస్కరించాడు సుగ్రీవుడు. సాక్షాత్తు విష్ణువే అని అభినుతించాడు జాంబవంతుడు. ఇంతవాడై ఉండి ఇసుమంత కూడా గర్వం లేదని కాకుత్థ్సుడు శిరఃకంపం చేశాడు. సీతాదేవి కనులు మూసికొంది.

భరతుడు మన్ననతో నమస్కరించాడు. లక్ష్మణుడు మనసులో ఉప్పొంగి పోయాడు. శత్రుఘ్నుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. మిగతా వారిని గురించి చెప్పేదేముంది? కన్నులు తెఱచి చూడలేకపోయారు.

అలా తన నిజస్థితిని ఎఱిగించిన తదుపరి హనుమ ఆకాశమంటిన దీర్ఘదేహాన్ని ధరకు వంచాడు. సీతతో కూడి రామాదులు, సమస్త నర వానర నిశాచర సైన్యం ఆ దేహ కందరంలో ప్రవేశించారు. శతానందా! ఏ రాజు సైన్యం లవణాబ్ధికి సేతువును నిర్మించిందో, ఏ రాజు సైన్యం లెక్కకు చుక్కల కంటె ఎక్కువో అట్టి రాముడు ససైన్యంగా హనుమ వీపు మీద ఎక్కి కూర్చున్నాడంటె అతని మహిమను ఊహించు. అతని భుజం మీద సీతారాములు మేరు శిఖరాగ్రం మీద మెఱుపుతో కూడిన మేఘంవలె ప్రవేశించారు. తొక్కిసలాట లేకుండా చిందరవందర కాకుండా మూకంతా సర్దుకొని కూర్చున్న తదుపరి రామాజ్ఞతో హనుమ ఆకాశానికి ఎగిరాడు. ఎత్తిపెట్టిన అతని తోక కాడకాగా చుక్కలతో నిండిన బ్రహ్మాండం సీతారాములకు పట్టిన ముత్యాల గొడుగులా మురువు చూపింది.

**హనుమ ఆకాశ మార్గ ప్రయాణం.**

అలా ఆకాశ మార్గాన పయనిస్తూ భూమి మీద కనిపించిన పుణ్యాశ్రమాలు, కొండలు, అడవులు, సరోవరాలు, నదులు, గ్రామాలు ఇత్యాది విశేషాలన్నిటిని సీతకు చూపించాడు రాముడు. "సీతా! ఈ ఆకాశ గంగను చూడు! తన తరంగాలనే హస్తాలతో తుంపరలనే ముత్యాలను చల్లుతూ జయార్థం సేసలతో హనుమను ఆశీర్వదిస్తున్నట్లుగా లేదూ! ఆకాశాన్నంటే అనేక గిరి శిఖరాలతో శిరసున ఆకాశగంగ పరవళ్ళు తొక్కుతుండగా లోకానందకరుడైన చంద్రుడు దేదీప్యమానుడై ప్రకాశిస్తూండగా సుర సంసేవ్యమానుడై ధవళ కాంతులతో వెలుగొందుతున్న హిమగిరీశుణ్ణి చూడు! ఈ ఉత్తర సముద్రాన్ని తిలకించు! ఇక్షుసముద్రాన్ని అవలోకించు! సురానీరధిని చూడు! ఘృత వారాశిని పరికించు! దేవీ! ఇదే శాకద్వీపం! అదే మాయాపట్టణం! ఉన్నతమైన ప్రాకారాదులతోను, అనేక

బురుజులతోను, అంబర చుంబితమైన సౌధ రాజములతోను ఎంత గంభీరంగా ఉందో చూడు! శతకంఠుని ప్రతాపాగ్ని జ్వాలలతో చుట్టబడి ఉందో అన్నట్లుగా హేమ ప్రాకారం కాంతిచ్ఛటలతో జాజ్వల్యమానంగా ఉంది. త్రినేత్రుడు కూడా చొరలేడు. ఈ దానవుణ్ణి తృణీకరించి మారుతి మనలను తీసికొని వచ్చాడు.

నర వానర దానవ సైన్య మంతటిని వీపుపై ఎక్కించుకొని ఆకాశ మార్గాన నాలుగు సముద్రాలు దాటి మాయాపురిని చేరటం ఎవరికి సాధ్యం? మారుతి కనుక ఇంతపని అవలీలగా చేశాడు. ఇతనికి లవణ సముద్రాన్ని లంఘించటం ఏమంత కష్టం. నా కీర్తికి శాశ్వతత్వాన్ని కల్పించటం కోసమేకాని... ఇతనికి రావణ కుంభకర్ణాదులను మట్టుపెట్టటం అసాధ్యమేమీ కాదు. ఈ దీవుల వింతలన్నీ మనం చూడాలనే ఉద్దేశంతో వేగాన్ని తగ్గించి లోభత్వాన్ని చూపాడు గాని కాకపోతే మనోజవంతో వచ్చి వ్రాలడా!" అని ఇలా మారుతిని స్తుతిస్తూ ఉపవనాన్ని చూచి సేనను అక్కడ దించమని ఆజ్ఞాపించగా భూమికి దిగాడు హనుమ. అతనిని చూచి వనపాలురు అజాండం అంతా నిండిన ఒక కోతి వస్తోంది అని ఆయుధపాణులై యుద్ధానికి సిద్ధమై నిలువగా వాళ్ళమీదే దిగాడు. వారంతా నుగ్గు నుగ్గు అయ్యారు. సైన్యమంతా దిగింది. సైన్యానికి మాయాపురిపై యుద్ధానికి దిగమని ఆజ్ఞలను ఇచ్చాడు రాఘవుడు.

వసిష్ఠ మహర్షి ఇంత వరకు చెప్పిన కథ విని అట మీది వృత్తాంతం చెప్పవలసిందని శతానందుడు కోరాడు.

**ఫలశ్రుతి**

శతానందా! విను ఈ పవిత్ర చరిత్ర వ్రాసినా, చదివినా, విన్నా ఆయా దేవాతానుగ్రహం కలిగి సకల శుభాలు కలుగుతాయి.

## చతుర్థాధ్యాయం సంపూర్ణం

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## పంచమాధ్యాయము

అఖిలభూత దయాగరిష్ఠుడైన వసిష్ఠుడు గౌతమాత్మజుడైన శతానందునికి హనుమత్ చరిత్రాన్ని ఇలా చెప్పసాగాడు: శతానందా! శ్రీరామ చంద్రుని ఆజ్ఞచే వానరసేన చేసిన యుద్ధాన్ని, అందులో హనుమ చూపిన జగదాశ్చర్యకర అద్భుత ప్రతాపాన్ని చెపుతున్నాను విను.

## మాయానగర ముట్టడి

రామాజ్ఞచే రామదండు ఉపవనంలో విడిది చేసింది. సుగ్రీవ అంగద విభీషణాది సైన్య ప్రముఖు లందరిని పేరుపేరున పిలిచి సైన్య విభాగాన్ని కల్పించి శతకంఠుని పట్టణాన్ని ముట్టడించమని ఆజ్ఞాపించాడు దాశరథి. కిలకిలార్భటులతో కపిసేన కదిలింది. సైన్యం యొక్క సంచలనంచే రేగిన ధరాపరాగం సూర్య మండలాన్ని కప్పేసింది. ముట్టడి ప్రారంభమైంది. నరవానర దనుజ సైన్యం పెచ్చురేగింది. చెట్లు, బండరాళ్ళతోను అగడ్తలను పూడ్చివేశారు. కోటగోడను కూలగొట్టారు. గోపురాలను పడగొట్టారు. నగర పౌరులంతా ఆశ్చర్యపోయారు.

నగర రక్షకులైన కాలకేయులు ఇలా తలపోశారు. లోక భీకరుడైన శతకంధరుని పట్టణమేమి! ఈ కోతిమూక ముట్టడించటమేమి! అని విస్మితులై ససైన్యంగా యుద్ధసన్నద్ధులై నిలిచారు. చిక్కింది కోతి మూక... ఇక ఎక్కడికి

పోతుంది? అని సింహనాదం చేశారు. ఆయుధ పాణులై ఏనుగులు, గుఱ్ఱాలు, కంచర గాడిదలు, రథాలను అధిరోహించారు. వాళ్ళు ధరించిన వజ్రకవచాల కాంతులు కండ్లకు మిరుమిట్లు గొలుపు తున్నాయి. వాళ్ళ అట్టహాస సంరంభ రావానికి దిగ్గజాల చెవులు గళ్ళు పడ్డాయి. కన్నుల విస్ఫులింగాలు రాల, వింటి మ్రోతల బ్రహ్మాండం పగుల, సింహగర్జనలకు గుండెలదర కాలకేయుల సేన రామదండు మీదకు దూకింది. కాలసర్పం వంటి కత్తుల తళతళలు వ్యోమ మండల మంతా నిండి సూర్య బింబం అద్దపు బిళ్ళలా కనుపించింది.

"పొడు! పొడు! పట్టుకో! పట్టుకో! అరె! పోతున్నాడు! పోతున్నాడు! పోనీయకు!" ఇలాటి హెచ్చరిక మాటలతో ఉభయ సైన్యాలు ఢీకొన్నాయి. వానర సైన్యం కోటగోడలకు ఎగబ్రాకుతోంటే... శతకంధరుని సైన్యం బల్లేలతో పొడుస్తోంది.

## కాలకేయాదులతో యుద్ధం

స్పర్ధతో మహాబాహాటోపంతో ఢీకొనే దైత్యులను ఎదుర్కొన లేక పారిపోతూన్న కపిసేనను విభీషణుడు హెచ్చరిక మాటలతో ప్రోత్సహించి నిలిపాడు. పర్వతాకారులై ఉన్న కాలకేయులను చూచాడు. తన దనుజ సైన్యానికి ఎదుర్కోండి అని చేయూచాడు. వారితో వానరులు కూడా కలిశారు. ఉభయ సైన్యాల కేతన పటపటా రావాలు, పంచమహావాద్య ధాణంధణ భూరి భాంకారాలు, నిర్భరాట్టహాస క్రేంకారాలు ఏకమై హాలాహల ఆవిర్భావ కాలంనాటి సముద్ర కోలాహలాన్ని మించి పోయింది. గర్భనిర్భేద్యమైన కేకలతో అరుపులతో కపిసేన కాలకేయుల సైన్యవ్యూహాన్ని బాహాబాహి కచాకచి హోరాహోరీగా ఎదుర్కొంది. వానరసైన్యం ఎత్తివేసే పెద్ద పెద్ద బండరాళ్ళను రక్కసులు ఉక్కు గదలతో ఎదుర్కొంటూంటే ఘణిల్లు ఘణిల్లు మంటూ మిణుగురుల్లా నిప్పు రవ్వలు రాలుతున్నాయి. పొగలు రేగుతున్నాయి. చేతులతోను, గోళ్ళతోను, కాళ్ళతోను, తోకల తోను కపిసైన్యం

రక్కసి మూకను చీల్చి చెండాడుతూంటే వారు కూడా శరములతోను పరశువుల తోను కుంతములతోను తోమరములతోను కరవాలములతోను వారిని ఎదుర్కొంటున్నారు. కపులు విసిరే చెట్లను, రాళ్ళను దనుజులు ఆయుధాలతో ఎదుర్కొని చూర్ణం చేస్తున్నారు. కపులు నిర్భయంగా సింహనాదం చేస్తూ పోరాడుతున్నారు. ఎదుటి వారి మత్తేభాల మీదికి తొండం మీది నుండి ఎక్కి గోళ్ళతో వాటి కుంభస్థలాలను చీలుస్తున్నారు. అప్పుడు కాలకేయులు వారి సేనను కపిసైన్యం మీదికి పురిగొల్పారు. కపిసైన్యం మహోత్సాహంతో సింహనాదం చేస్తూ విభీషణుని సైన్యంతో కలిసి శత్రు సైన్యాన్ని ఎదుర్కొంది. ఆ సంకుల సమరంలో రేగిన ధరాపరాగం సముద్రాన్ని ఇంకింప చేయగా ఉభయ సేనలు భుజాభుజి తలపడ్డారు. ఈ విధంగా పరస్పర జిగీషతో అహోరాత్రాలు రెండు నెలలు హోరాహోరి యుద్ధం చేశారు.

**శతకంఠుడు యుద్ధ వార్తను వినుట**

ఇక్కడిలా యుద్ధం సాగుతూండగా అక్కడ శతకంఠుడు కోటలో శివధ్యానంలో ఉండి రణధ్వనులను విన్నాడు. ద్వార పాలకులను పిల్చి ఆ ఘోష ఏమిటని అడిగాడు. వాళ్ళప్పుడు వినయంతో మ్రొక్కి భయంతో చేతులు జోడించి “స్వామీ! పరాకు! ఒక రాజు వానరుని మీద ఎక్కి నర అసుర వానర సైన్యంతో ఇక్కడ దిగి రెండు నెలలైంది. ఈ రెండు నెలలుగా మన నగర రక్షకులైన కాలకేయుల సైన్యం వారితో పోరాడుతూనే ఉంది. మీరు విన్న రణగుణ ధ్వని అదే!” అని విన్నవించారు. విన్న వెంటనే మితిమీరిన కోపంతో శతకంఠుడు “ఆహా! ఏమేమీ! రాజైన ఒక నరుడు కోతిమూకతో వచ్చి నా నగరాన్ని ముట్టడించి బాహాబలంతో రణసన్నాహం చేస్తున్నాడా? ఈ మాట విన్న లోకులు నవ్వుతారు. బిడౌజుడు మొదలుగా దిక్పాలకులు ఆజిలో నాకు జేజేలు పలుకుతూ ఉంటే కేవల నరుడా వనచరులతో కూడి రణం చేసేది.

భలే! రానీ! నా పురిలో ప్రవేశించట మంటే బెబ్బులి ఉన్న పొదలోకి లేడి కొదమలు వచ్చినట్లే! సింహం ఉన్న గుహలోకి ఏనుగుల గుంపు చొరబడినట్లే! మహాసర్పం పుట్టలోకి పిల్లతెమ్మెఱలు దూరినట్లే! పిల్లి ఆకలితో పొంచి ఉన్న చోటికి చిట్టెలుకలు దరిచేరినట్లే! మత్తులై వచ్చిన వారి పచ్చి మాంసాన్ని శూలాలకు గ్రుచ్చి భూతతృప్తి చేస్తాను" అని రోష కషాయితాక్షుడై ఆ రాక్షసేశ్వరుడు జపమాలను క్రింద పెట్టి సచివులను ఆప్తులను రావించి యుద్ధ సన్నద్ధుడై రణభేరులు మ్రోయగా ధాణంధణ ధ్వనులు మిన్ను ముట్ట కోలాహలంగా ఆలానికి సన్నద్ధుడయ్యాడు.

**శతకంఠుడు యుద్ధానికి బయలుదేరుట**

రెండు వందల చేతులతో అతను ధరించిన ఆయుధాల కాంతులు సూర్య ప్రభలను వెక్కిరిస్తున్నాయి. కర కంకణాంగద గ్రైవేయ మణి భూషణావళుల రోచిస్సులు బ్రహ్మాండమంతా అల్లుకొన్నాయి. నూరు శిరస్సుల ధరించిన కిరీట ద్యుతులు నక్షత్రాల గర్వాన్ని అణచి వేస్తున్నాయి. చీకటి కొండలా ఉన్న నల్లని మేని ఛాయ నింగిని మ్రింగుతోంది. వికట రోష భయంకర భృకుటి దుర్నిరీక్ష్య దుర్భర దుస్సహ తేజో విరాజమానుడై, చటులోగ్ర నిష్ఠుర గంభీరాట్టహాసంతో, భూరి కరాళ విస్ఫార దంష్ట్రలతో, సమర సంరంభ సంభృతోత్సాహంతో, ఉగ్రశౌర్యోప కంఠుడై శతకంఠుడు రెండవ కాలకంఠునిలా నిశిత త్రిశూలాన్ని త్రిప్పుతూ నిలింపులు కంపమొంద చండ ప్రతాపుడై భండన భూమికి బయలుదేరాడు.

**అపశకునాలు గోచరించుట**

భూరి భేరీ పటహ శంఖ కాహళ మర్దళ ఢక్క హుడుక్కా ఇత్యాది రణవాద్య విశేషాల రొదలకు కర్ణభేరి పగుల ... కహకహ ధ్వనులతో సేన కదిలింది. ఆ సమయంలో అనేక అపశకునాలు తోచాయి. ఘోరంగా నింగి నుండి నిప్పు కణికలు రాలాయి. దానికి తోడు ఏనుగుల, గుఱ్ఱాల తోకల

నుండి మంటలు పుట్టాయి. ఎడలేక పడిన ఉల్కాపాతానికి పుడమి గడగడ వడకింది. దానికి తోడు ఏనుగులు ఏడ్చాయి. ఆకాశం మీద రాబందులు విహరించాయి. కేతనాల మీద గ్రద్దలాడాయి. భూతబేతాళాలు సంచరించాయి. నక్కలు యథేచ్ఛగా తిరిగాయి. అంతటా మృత్యుచ్ఛాయలు గోచరించాయి. దానికి తోడు ప్రతికూల వాయువులు వీచాయి. మొఱకుదనంతో వాటిని లెక్క చేయకుండా శతకంధరుడు రణ రంగానికి కదిలాడు.

వాని శతశిరస్సుల కిరీట ద్యుతులు, వాని విభూషణోజ్జ్వల కాంతులు, రెండు వందల చేతుల ఆయుధాల తళతళలు, వాని శరీర జృంభణం, వాని మదోద్ధతి చూచి రాఘవుడు మహదాశ్చర్యంలో మునిగిపోయాడు. అంత మారుతి వంగి నమస్కరించి "స్వామీ! అవ్యయ తత్త్వ స్వరూపులైన మీరా ఇంత వింతగా చూస్తున్నారు. మీ దృష్టిలో వీడొక లెక్కా? చింత మాని శర సంధానం చెయ్యండి" అని కర్తవ్యాన్ని గుర్తు చేశాడు. అన్నాడే కాని అంతవరకు ఆగకుండా మొదటి దెబ్బ తనే కొట్టాడు.

**శతకంఠునితో హనుమ యుద్ధం**

కండ్ల నిప్పులు రాల, పండ్లు పటపట కొఱుకుతూ హుంకార ఆర్భాటానికి శత్రుమూకల గుండెలదర, రాక్షసుల పాలిటి తోక చుక్కలా వచ్చి అదలించి పిడికిలి బిగించి కోపంతో 'ఇదుగో తిను' అంటూ శతకంధరుని ఱొమ్ము మీద బలంగా ఒక్క పోటు పొడిచాడు. ఆ పోటుకు భూమి మీద పడ్డాడు శతకంఠుడు. ముహూర్త మాత్రానికి మళ్ళీ లేచి ఎదురుగా ఉన్న సమీర కుమారుని చూచి "బాపురే! బలశాలివే! త్రిజగద్భయంకరుడైన నన్నే నొప్పించావే! నీ పిడికిలి పోటు గట్టిదే! లోకాలన్ని తిరిగాను. ఇంద్రాది దిక్పాలకులను గెలిచాను. ఇంత వాడనయ్యాను. నీ వలె నన్ను నొప్పించిన వాణ్ణి నేనెఱుగను. నీ పిడికిలి పోటు రుచి నే చూచాను. నా శూలపు పోటు రుచి కూడా నువ్వు చూడు" అని బీరపుమాట లాడుతూ తనకంటె పొడవైన

శూలాన్ని ఆంజనేయుని మీద ఊచి ఊచి వేశాడు. నిప్పులు కక్కుతూ వచ్చిన శూలాన్ని పట్టి పాదంతో విరిచి వేశాడు హనుమ. “మేలు! మేలు! నిన్ను మెచ్చాను” అని అంటూనే రెండువందల చేతులతో ముసల, ముద్గర, తోమర, పరశు, భిండివాల, కరవాల ఇత్యాది ఆయుధాలను విసిరాడు. వాటన్నిటిని నడుముకు త్రుంచాడు పావని.

**హనుమ వాల సేతువును నిర్మించుట**

ఆ వేళ రాఘవుడు మారుతి శరీరాటోపాన్ని, వీరవిక్రమ స్ఫూర్తిని చూచి ఆనందంతో ఉప్పొంగి పోయాడు. అదే సమయంలో ఒక్కసారి పై నుండి క్రింది వరకు శతకంధరుణ్ణి చూచి ఆగ్రహావేశు డయ్యాడు. లక్ష్మణుని చేతి కోదండాన్ని అందుకొన్నాడు. ప్రళయకాల గర్జనలా వింటి నారిని సారించాడు. రాముణ్ణి చూచిన శతకంఠుడు కుటిలంగా భృకుటిని ముడిచి కన్నుల నిప్పు కణికలు రాల కొండ గుహల్లాంటి నోళ్ళు తెఱచి పెద్దగా అఱచి ద్విశత బాహువులతో శర పరంపర గుప్పించాడు. కోదండ పాండితీ మండనుడైన రాముడు తన బాణాలతో వాటిని ఎగుర గొట్టాడు.

దాశరథికి బాసటగా సుగ్రీవ విభీషణులు వచ్చి నిలిచారు. శైల శస్త్రాదుల చేత దైత్యుణ్ణి కప్పారు. దైత్యుడు అత్యుగ్రుడై తన పాదాహతితో వారిద్దరిని ఎగర గొట్టాడు. తల దిమ్మెక్కగా వారిద్దరు లంకలో పడ్డారు. ఆహవంలో ఉన్న హనుమ వారి చేడ్పాటు చూచి లంక దాకా తన వాలాన్ని పెంచి వంతెన కట్టాడు. లజ్జాస్వాంతులైన వారిద్దరూ ఆ వాలవారధి మీదుగా వచ్చి చేరారు. నాలుగు సముద్రాలను నాలుగు ద్వీపాలను ఆక్రమించి సకల లోకాద్భుతమై ఇంద్రధనుస్సులా ఉన్న ఆ వాలసేతువును చూచి ద్వీప వాసులంతా భయభ్రాంతులయ్యారు. కాలానికి విలయం వచ్చినప్పుడు కనుపించే తోకచుక్కలా ఉన్న తోకను చూచి లోకాలన్ని ఆకులపాటు చెందాయి.

శతానందా! సమరాన్ని వదలడు. తానున్న చోటు కదలడు. గగనమే తుదయైన మేనితో ఉదధులపై వాలసేతువు కట్టిన హనుమ మాహాత్మ్యాన్ని ఏమని పొగడాలి!

**శతకంధరుని పరాక్రమం**

అలా వచ్చి సుగ్రీవ విభీషణులు కపిసేనతో కలిసి యుద్ధం చేయటం మొదలు పెట్టారు. శత్రుసైన్యాన్ని తరులతో గిరులతో మొత్తుతున్నారు. శతకంఠుని శరీరం మీద పడ్డ బండరాళ్ళు బంతులై తూలుతున్నాయి. దైత్యునిలో ఒక్క సారిగా ఆగ్రహం పెల్లుబికింది. లోక భయంకరుడై నిలిచాడు. కపులను బాధించటం మొదలుపెట్టాడు. కొందరిని పాద తాడనం చేత, కొందరిని మోకాలి పోటుల చేత, కొందరిని చెంప దెబ్బల చేత, కొందరిని ముష్టిఘాతాల చేత హింసిస్తూ ఇలా రుద్రుడై చెలరేగేడు. అతని ధాటికి కపులంతా కాందిశీకులై పారిపోయారు. అంగద, నల, నీల, జాంబవంతాది కపివీరులు ప్రాణాలు దక్కితే చాలనుకొని పలాయితు లయ్యారు. మిగతా కపులు కుప్పలు కుప్పలుగా నేలకూలారు. విభీషణుని సేన పంట బరువుకు తలలు వాల్చిన వరి చేనులా నేలకొరిగింది. అప్పుడు తన సేనకు సంప్రాప్తించిన దీనస్థితిని చూచి భరత లక్ష్మణులు అక్షీణ పరాక్రమంతో రాక్షస రాజును ఎదుర్కొన్నారు. కృశానుకీలా లాలితంబైన శరపరంపరతో కప్పేశారు. వాడు దర్పంతో కన్నులు ఉదయార్కుని వలె అగ్నిగోళాలై జ్వలింప ఆకలి గొన్న సింహంలా గర్జించి ప్రతిఘటించాడు. వారి మధ్య పోరు ఘోరంగా నాల్గు నెలలు సాగింది.

**శ్రీరామ శతకంధరుల యుద్ధం**

అంతం లేకుండా రాత్రి పగలు సాగిన సమరంలో అలసిన లక్ష్మణ భరతులను చూసి రాముడు "సోదరులారా! శతకంఠునితో నాల్గు నెలలు శస్త్రాస్త్ర ప్రయోగం చేసి యుద్ధంలో అలసిపోయారు. మీరు ప్రక్కకు తొలగండి. నే వీణ్ణి మట్టు పెడతాను" అంటూ ముందు కొచ్చి హనుమ

భుజపీఠంపై నిలిచాడు. లోక భీకరంగా ధనుష్టంకారం చేశాడు. దైత్యుని మేను జల్లెడలా చిల్లులు పడేటట్లు క్రూర నారాచాలను గుప్పించాడు.

దైత్యుడు నవ్వి కినుకతో ఇలా అన్నాడు: "రాముడంటె నువ్వేనా! భేష్! పేరుకు తగ్గట్టే ఉన్నావు సుందరంగా! ఇంత సుకుమారంగా ఉన్న వాడివి ఏ పూల వనంలోనో ఇల్లు కట్టుకొని సుందరీమణులతో క్రీడించక నాతో యుద్ధానికి సిద్ధమయ్యావా? రావణుడో గీవణుడో వాడితో సమరం సలిపినట్లు కాదు నాతో రణమంటే! నా ముందు నిలువగలవా? పైగా ఈ కోతొకటి నీకు తోడు. ఎంత వెంగలివి! రుద్రుడు కూడా నా ముందు నిలువ లేడే! నువ్వా భండనంలో నన్నెదిరించేది! శతకంధరుడంటె ఎవరను కొంటున్నావు? నా పేరువింటే సమస్త లోకాలు బెదరుతాయి. నువ్వే పురుష రూపంలో ఉన్న స్త్రీలా ఉన్నావు. నీకు తోడు ఇంకొక ఆడకూతురుని సిగ్గు లేక వెంట పెట్టుకొని రణరంగాని కొచ్చావు."

ఇలా దురుసుగా ప్రేలుతున్న దైత్యుణ్ణి చూచి ధర్మ విగ్రహుడైన దాశరథి ఇలా అన్నాడు: "ఓ దానవ వీరా! వీరుడవైతే నీ వీరత్వాన్ని ప్రకటించు. బీరాలు పలికిన మాత్రాన వీరుడంటారా? సమరంలో నీ నూఱు తలలను ఇఱునూఱు బాహువులను ఖండించి భూత బేతాళ పిశాచ కోటికి విందు చేస్తాను. నక్కలు, రాబందులు గ్రద్దలు వాటికి సంతోషాన్ని కలిగిస్తాను."

ఆ మాటలకు ఉగ్రుడైన దైత్యుడు ఘోర శరపరంపరచే ముంచేశాడు. అంత రాముడు సక్రోధుడై తన దివ్య బాణాహతిచే రాక్షసుని మేను రుధిర ధారలు కారేటట్లుగా నొప్పించాడు. వాడు మాయావి కావున చిత్రంగా ఎన్ని రక్తపు బొట్లు నేలరాలాయో అంతమంది శతకంధరులు కోట్ల సంఖ్యలో ప్రత్యక్షమయ్యారు. పెడ బొబ్బలు, ధనుష్టంకారాలు, గంభీరాట్టహాసాలు, పిడుగు చప్పుళ్ళై చెవులు చిల్లులు పడగా భీకర కరాళ రూపంతో ఎక్కడ చూచిన శతకంధరమయమై రణరంగం కనిపించింది. వాళ్ళందరు తనను చుట్టు ముట్టి ప్రయోగించిన శస్త్రాస్త్రాలను, శ్రీరాముడొక్కడే నడుముకు

త్రెంచుతూ, త్రుంచుతూ, చించుతూ, చీలుస్తూ వాళ్ళ కిరీటాలను పడగొట్టి కోదండాలను విరిచి, కవచాలను భేదించి గుండెలను చీల్చి బృందారకులు కీర్తింప తన కోదండ కళా పాండిత్యాన్ని ప్రకటించాడు. బహు రూపియై యుద్ధం చేస్తూన్న దైత్యునిపై శైవ, బ్రాహ్మ్య, నారాయణాది అస్త్రాలను ప్రయోగించాడు. వాటిని శాంతింప చేసి తిరిగి వివిధ శస్త్రాస్త్రములచే శ్రీరాముని దేహాన్ని నొప్పించాడు దైత్యుడు. శరపరంపరాహత రుధిరదేహులై వారిద్దరు పూచిన మోదుగ చెట్లలా కనుపించారు.

నెత్తురులు కారే కొలది ప్రతి రక్తపు బొట్టు నుండి శతకోటి శతకంధరులు పుట్టుకొస్తూంటే ఆ సంఖ్య అసంఖ్యాక మైంది. తానొకడైనా తలకొక రూపై అందరి కందరై నిలిచి యుద్ధం చేస్తున్నాడు శ్రీరాముడు. ఈ రహస్యం హనుమ కొక్కడికే తెలుసు.

శతానందా! వింటున్నావా! యుద్ధరంగంలో మదోద్ధరుడై నిలిచిన శతకంధరుని జగద్భీకర వికట స్వరూపం ఎలా ఉందో చెప్తాను విను. హార కేయూర కిరీట కాంతులు తొలకరి మెఱుపులై తోచ; ధగధగద్ధగిత నేత్రాలు అగ్ని గోళాలై వెలుగ; కఱకు కోరల వివృత శతాస్యుడై రాహువును తలపింప; ఆకాశాన్నంటిన దేహం మహాకాల భైరవుణ్ణి మఱపింప; పదఘట్టనలు పాతాళాన్ని పగల్చ; రెండు నూర్ల చేతుల కత్తుల తళతళలు సూర్య ప్రభలను కప్పివేయ బహురూపుడై వివిధాస్త్ర ప్రయోగం చేస్తున్నాడు శతకంఠుడు. రాఘవుడు కూడా దారుణ మారణాస్త్రాలను ప్రయోగిస్తున్నాడు. శతముఖుడు చావటం లేదు సరిగదా ఇంకా అసంఖ్యాక శతాననులు పుట్టుకొస్తున్నారు.

**పంచముఖ ఆంజనేయుని వీర విక్రమం**

ఈ మాయా యుద్ధాన్ని చూస్తున్నాడు హనుమ. ఇక ఆగ్రహం ఆగలేదు. వీరావేశంతో కుప్పించి ఎగిరి శతకంఠుని శిరస్సును తన్నాడు. కసితీర తిట్టాడు. కాలితో తన్నాడు. తోకతో కట్టాడు. కొట్టాడు. రక్తధారలు కారగా చెంపచెళ్ళు మనిపించాడు. పిడికిలితో

పొడిచాడు. పండ్లు పటపట కొరుకుతూ మొత్తాడు. ప్రళయకాల సూర్యప్రభలతో వెలిగిపోతున్నాడు. కోపం రూపు దాల్చినట్టున్నాడు. రాఘవ చండ కోదండ విముక్త బాణాహతికి దైత్యుని కాటుకకొండ వంటి శరీరం నుండి బొటబొట కారుతున్న క్రొత్త నెత్తురు వరదలై పారుతుంటే మరీ రెచ్చిపోయాడు హనుమ. లెక్క కెక్కువ ఐన రక్కసులు ఒక్కసారిగా చుట్టు ముట్టారు. వారందరిని పిక్కటిల్లిన ఆ జగజెట్టి పాదతాడనంతో నెట్టి వేశాడు.

చేతులతో గోళ్ళతో కాళ్ళతో తోకతో పిడికిలితో చిత్ర విచిత్రంగా దెబ్బలు కొడుతూ; రక్కసి మూక చేతులు నరుకుతూ, శిరములను ఖండిస్తూ, నరాలను త్రెంచుతూ, బొమ్మలను చీలుస్తూ, పిక్కలను వ్రక్కలిస్తూ, తొడలు మెడలు నులుముతూ, ఎముకలను దుమ్ము చేస్తూ, చర్మాలను ఒలుస్తూ, మర్మాలను నిర్మూలిస్తూ, పొట్టల్లో పొడుస్తూ, నోళ్ళను పెకలిస్తూ, దంతాలను పీకుతూ, వెన్నులను తన్నుతూ, మెదడును ముద్దజేస్తూ, కపాలాలను పగుల కొడుతూ ప్రళయ తాండవం చేస్తున్నాడు. అసంఖ్యాకంగా కనిపిస్తూన్న శతముఖులను దోమలను, చెదపురుగులను నలిపినట్లు నలిపేస్తున్నాడు.

ఆకాశంలా అంతటా వ్యాపించి ఘోషిస్తున్నాడు హనుమ. సమీర కుమారుడు కనుక ఝుంఝూ సమీరంలా దిక్కులను ధూళి ధూసరితం చేస్తున్నాడు. కాలాగ్నిలా మంటలు పుట్టిస్తున్నాడు. ప్రళయ కాల సముద్రంలా ఉద్రేకంతో రౌద్రావతారుడై బహుళంగా తోచిన శతకంఠుల్ని వాడి సైన్యాన్ని నెత్తుటి ఏఱుల ముంచుతున్నాడు.... పంచముఖుడైన ఆంజనేయుడు. ఎప్పుడూ చూడని ఆ పంచముఖ ఆంజనేయ స్వరూపాన్ని చూచి వియచ్చరులు అచ్చెరువును, దైత్యుడు రౌద్రాన్ని, వాడిసేన భయాన్ని పొందారు. కపి సైన్యానికి సంతోషాన్ని, రామునికి భృత్య భావాన్ని, సుగ్రీవునికి సౌహార్దాన్ని తోపింప చేసింది ఆ దివ్యరూపం.

**సీత శతకంధరుని వధించుట.**

ఈ విధంగా హనుమ పెక్కుమంది రక్కసులను మట్టుపెట్టగా

రాఘవుడు కూడా తా నొక్కడై చూచువారలు అక్కజపడగా అనేక మంది దైత్యులను సంహరించాడు. వీర విక్రమ రసావతారుడై ఘోరంగా పోరు సలుపుతూన్న దాశరథిని చూచి సీతా సాధ్వి సంభ్రమాశ్చర్య చకితురాలై కించిత్ గర్వాన్ని కూడా పొందింది. ఆమెను చూచిన రాఘవుడు అలసినట్లు నటించి తన కోదండాన్ని తూణీరాలను ఆమె కందించాడు. వీరపత్ని కావున మచ్చికతో ఇచ్చిన కోదండాన్ని తీసికొని రణం చెయ్యాలనే ఇచ్ఛ ఉన్నా హెచ్చైన సిగ్గుతో మోమరవంచి నిలబడింది. ఆమె ముచ్చట ఎఱిగిన రాముడు లీలగా వంగిన అరవిందంలా ఉన్న ఆమె ముఖాన్ని చూచి చుబుకాన్ని పట్టుకొని పైకెత్తి రాక్షసులతో రణం చెయ్యమని అనుజ్ఞ ఇచ్చాడు.

ముఖాన చిఱునవ్వు వెన్నెలలు మొలకెత్త సరసపు చూపులతో భర్తకు మ్రొక్కి నాథుడందించిన కోదండ తూణీరాలను గైకొని దనుజులు కంప మొంద ధనుష్టంకారం చేసి కుడికాలు వంచి ఎడమ కాలు ముందుకు చాచి నిండు విక్రమంతో నిలిచి దైత్యునికి కాళరాత్రిలా కనుపించింది సీత.

మొదటిసారి శతకంధరుణ్ణి కోపంతో ఎఱ్ఱబడిన ముఖంతో చూచి నప్పుడు ఆమె కెంపు ఛాయ వంటి చూపు...

ప్రథమ ప్రయోగంలోనే రక్కసుని ఱొమ్ము చీల్చి వెన్ను దూసిన రక్తసిక్తమైన తూపు...

ఈ రెండూ లోకాలకు ఒక్కలా కనుపించాయి.

ధనుర్మధ్యాన్ని పిడికిటితో పట్టుకొన్న ఆమె పెంపు...

వింటినారికి వాడి బాణాన్ని సంధించే సొంపు...

శత్రువుపై దట్టంగా శరపరంపరలను కురిపించే ఆమె తెంపు...

అరి వీరుల క్రూర నారాచాలను నడుముకు త్రెంచే నేర్పు...

ఇవన్నీ రామచంద్రునికి కన్నుల పండువై తోచాయి. ప్రత్యాలీఢ పాదాబ్జయై శత్రువుపై శరపరంపరను గుప్పుతున్న సీతను చూచి ఆశ్చర్య చకితుడై ఇలా అనుకొన్నాడు రాఘవుడు.

ఎప్పుడూ తెలివాలు కన్నుల ఈ కలికి... చూపుల కాలానల జ్వాలలను ఎలా గ్రుమ్మరించ గలుగుతోంది!

ఎల్లవేళల సుందర మందహాస వదనారవిందయైన ఈ చంద్రముఖి చండమార్తాండ ప్రభలను ఎలా కురిపించ గలుగుతోంది!

గండు కోయిల కూతకు బెదిరిపోయే ఈ భీత హరిణేక్షణ... శింజిని మ్రోతలో కల్పాంత మేఘ గర్జనలను ఎలా ప్రకటించ గలుగుతోంది!

చిలుక పలుకుల ఈ కలకంఠి... హుంకారంలో విలయకాల ఝంఝూ మారుతాన్ని ఎలా సృష్టించ గలుగుతోంది! మృదుస్వభావ ఐన ఈమె ఇంత క్రౌర్యాన్ని ఎలా చూపించ గలుగుతోంది!

ఇలా శృంగార వీరాలను ఏక కాలంలో ప్రకటిస్తూ యుద్ధం చేస్తూన్న సీత... తన బాణాలను నడుమకు త్రుంచుతూ తనపైకి నిప్పులు కక్కుతున్న అలుగులను వేస్తున్న దనుజుని ఎలా సంహరించాలా అని ఆలోచించి తారక బ్రహ్మ మంత్రాన్ని జపించి ఇలా అస్త్రప్రయోగం చేసింది.

**సీ॥ ఏ మంత్ర రాజంబు నేమంబున స్మరింప**
**వివిధ సంసృత్యుపద్రవము లడగు**
**ఏ మంత్రము జపించి పామరత్వము డించి**
**వాల్మీకి సత్కవీశ్వరత చెందె**
**ఏ మంత్ర మహిమచే ఈశ్వరత్వము గాంచి**
**హాలాహలా హారి అతిశయిల్లె**
**ఏ మంత్రమణి తా వహించిన విభునందు**
**ప్రకటించె తారక బ్రహ్మ సంజ్ఞ**

**తే॥ అట్టి శ్రీ రఘురామ మాలాభిధాన**
**మంత్రము స్మరించి వింట అంబకము పూన్చి**
**సత్యనిధి రాముడేని నే సాధ్వినేని**
**వీని దునిమెడు నిది యని విడుచుటయును.**

(సమీర కుమార విజయము)

ఏ మంత్ర రాజమును నియమంగా స్మరిస్తే వివిధ కర్మబంధాలు నాశన మవుతాయో...

ఏ మంత్రాన్ని జపించి వాల్మీకి తన అజ్ఞానాన్ని తొలగించుకొని బ్రహ్మవేత్త ఐన సత్కవీశ్వరుడు అయ్యాడో...

ఏ మంత్రాన్ని జపించి రుద్రుడు మహాదేవుడై ఈశ్వరత్వాన్ని పొందాడో...

ఏ మంత్రం తారక బ్రహ్మ సంజ్ఞచే అలరారుతూ ఉందో..

అట్టి శ్రీరఘురామ మాలా మంత్రాన్ని స్మరించి శరసంధానం చేసి; రాముడు సత్యసంధుడేని నేను సాధ్వినేని ఈ అస్త్రంచే శతకంధరుడు తెగుగాక అని ప్రయోగించింది. ఆ అస్త్రం ప్రళయ కాలాభీల వహ్నిజ్వాలలను కురిపిస్తూ, దిక్కులను మండిస్తూ, శరధులను ఘూర్ణిల్ల చేస్తూ శతకంఠుని నూరు తలలను నరికింది.

ఆ వేళ బృందారకుల ఆనందబాష్ప వర్షానికి తోడు కల్పవృక్షం పుష్పవృష్టిని కురిపించింది. నారదాది ఋషుల వీణావాదనానికి తోడు గంధర్వుల గానం వ్యాపించింది. సకల లోకాల చల్లని నిట్టూర్పులకు తోడు మలయానిలం వీచింది. ముని మానసాల కలతలు తీరటంతో పాటు జలధులన్ని కలక తేఱాయి. కారాగార విముక్తులైన దేవతలు సీత–రామ–ఆంజనేయులకు ప్రణతులు చేశారు.

**రాముడు సీతకు మణిహారాన్ని బహుమతిగా ఇచ్చుట.**

తన చేతనున్న కోదండ తూణీరాలను రామాజ్ఞచే సౌమిత్రికిచ్చి చిగురుటధరం మీద చిఱునవ్వు చిందులాడ చిఱుచెమటలు చెక్కుటద్దాల మీద చెమర్ప సీతా మహాసాధ్వి గౌరవంతో రఘుకుల స్వామికి మ్రొక్కింది. అలా మ్రొక్కిన చక్కెర బొమ్మను అక్కున జేర్చి మక్కువతో మన్నించి ఎక్కువగా గారవించి తన మణిహారాన్ని సీతకిచ్చాడు రాఘవుడు. మణిహారాన్ని అందుకొన్న సీత ఇలా

వినయోక్తులను పలికింది: "నాథా! అసంఖ్యాకంగా పుట్టుకొచ్చిన శతకంధరులను మశక ప్రాయంగా కాళ్ళతోను చేతులతోను నలిపి చంపి విక్రమాన్ని చూపించిన మారుతికే గాక ఈ మణిహారాన్ని ధరించటానికి అర్హత అన్యులెవరికి ఉంది? ఇందులో నా పరాక్రమం ఏముంది? అర్బుదాల సంఖ్యలో ఉన్న రక్కసులను చంపిన మీరు శతకంఠుని చంపలేరా? లోకంలో నా కీర్తిని వ్యాపింప చేయగోరి విల్లంబులు చేతికిచ్చి నా చేత ఆ పని చేయించారు.

ఈ పావని మనకు పుత్ర సమానుడు, బంధువు, హితుడు, భృత్యుడు, అమాత్యుడు, ఆప్తుడు. ఏతాదృశుడు లేనే లేడు. మీ కారుణ్య నిధాన మీతడు. మీకు నాకు బహిః ప్రాణం. యుద్ధం చేసి విజయాన్ని సమకూర్చాడు. దౌత్యాన్ని నెఱపాడు. మన జీవాలను నిల్పిన ఆపద్బంధువు. అనేక మహోపకారాలు చేశాడు. ఇతని ఋణాన్ని ఎలా తీర్చుకోగలం? లోకంలో మహావీరులు మీరొకరు మీ వెనుక ఈ మారుతాత్మజుడు. ఈతడు అనేక మందిని నేలకూల్చాడు. ఇక్కడకు మనల నందరిని తెచ్చిన వాడు, దనుజులను తెగటార్చి విజయాన్ని చేకూర్చిన వాడు ఈ ఆంజనేయు డుండగా ఈ హారాన్ని ఎవరి కిస్తారు?

**మణిహారాన్ని హనుమకిమ్మని సీత చెప్పట.**

**ఏ మహనీయుని సత్కథలనే రత్నహారాలను భావి కవులు కంఠాభరణాలుగా ధరిస్తారో....**

**ఏ మహామహుని దృష్టికి ఈ ఏడు లోకాలు కుండల దొంతుల్లా కనబడుతాయో ...**

**ఏ వీరవరుని దివ్యదేహాన్ని ఆవహించిన దీప్తి సూర్యునికి సైతం మిఱుమిట్లు గొలుపుతుందో...**

**ఏ కపి ముఖ్యుని సఖ్యం మీ కీర్తి వల్లికి ఆలంబనం అయిందో...**

**నరవానర అసుర సైన్యాన్నంతటిని తానొక్కడై మోశాడో...**

**అట్టి విశ్వాధికుడైన హనుమకు ఈ మణిహారాన్ని మీరు సమర్పించండి" అంది సీత.**

ప్రియురాలాడిన మాటలను విని బహుకార్య నిర్వహణా ధురంధరుడు, ప్రతాపయశుడు ఐన మారుతిని కరుణాదృష్టుల తిలకించి రామభూపాలుడు ఇలా అన్నాడు.

"హనుమా! నువ్వెప్పుడూ మమ్ములను జననీజనక భావంతోనే సేవించావు. కనుక ప్రళయానంతరం ఈ సృష్టికి భావి బ్రహ్మవు నీవే! కుమారా! హనుమా! పూర్వం ఈ రత్నహారాన్ని నారాయణుడు సృష్టికి ప్రభునిగా చేసి బ్రహ్మకిచ్చాడు. ఇక్ష్వాకుడు చేసిన ఉగ్రతపస్సుకు మెచ్చి బ్రహ్మగారు దీనిని ఆయన కిచ్చాడు. ఆ రాజు అయోధ్యకు పట్టాభిషిక్తుడైన సమయంలో దీనిని ధరించాడు. ఆ విధంగా ఇక్ష్వాకు వంశ సార్వభౌములు పట్టాభిషేక సమయంలో తరతరాలుగా దీనిని ధరిస్తూ వచ్చారు. ఇది సార్వభౌమ చిహ్నం. దీనిని ధరించిన వారు కామరూపు లవుతారు. దీనిని ఇతరులు ధరించటానికి అనర్హులు. నీవు వాయుపుత్రుడవైన కారణంగా అర్హుడవు. దీనిని ధరించు" అని పల్కి శ్రీరాముడు ఆ రత్నహారాన్ని హనుమ మెడకు అలంకరించాడు. సీత సంతోషం రెట్టింపయింది. భర్తలు తమ మాటను మన్నించి నప్పుడు స్త్రీలకు సంతోషం కలగటం సహజమే కదా!

**అందరు అయోధ్యకు చేరుట**

ఈ విధంగా హనుమను సమ్మానించి; దేవతలు చేరి నుతింపగా వారి నుతులు చేకొని వారిని సగౌరవంగా సాగనంపి; తనకు విజయాన్ని చేకూర్చిన సేనలను సుధామయ దృష్టుల అవలోకించి వారందరిని తృప్తులను చేశాడు రాముడు. ఆపై సీతతో సోదరులతో సైన్యంతో హనుమ భుజపీఠాన్ని అధిరోహించి కైలాసాన్ని చేరుకొని చంద్రశేఖరుని దర్శించి అతని బహూకృతులను గైకొని సర్వవ్యాపి ఐన తన యథార్థ స్వరూపాన్ని చూపించాడు. ఆ రూపాన్ని దర్శించిన వారందరు అనేక విధాల స్తుతించారు.

అచట నుండి అయోధ్యకు పయనం సాగించారు. మధ్యలో ప్రయాణంలో గోచరించిన అనేక దృశ్యాలను సీతకు వివరించాడు రాముడు. శుభ లగ్నంలో అయోధ్య ప్రవేశించాడు. నగరి వాకిట నిలిచి దండనాథులను విడిదికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. హనుమ కైదండ ఈయగా, ధరాత్మజ ఎడమ వైపున నడవగా, సోదరులు కొలువగా, కొంతమంది ప్రముఖులు తన్ననుసరించి రాగా తమ రాకను విని సంతసిస్తున్న తల్లులను సందర్శించి పాదాభివందనం చేశాడు.

**తల్లుల ఎదుట రాముడు హనుమను నుతించుట.**

అలా మ్రొక్కిన కుమారులను అక్కున చేర్చుకొని తలనిమిరి ఆనంద బాష్పాల శరీరాలు తడిసి ముద్దవగా తల్లులిలా అడిగారు: " రామా! లోక కంటకుడైన శతకంధరుణ్ణి యుద్ధంలో ఎలా గెలిచావు?" వారి ప్రశ్నకు సమాధానంగా మారుతిని చూపించి రాఘవుడిలా అన్నాడు.

"తల్లులారా! తన మహిమతో ఆకాశాన్ని కప్పిన లోక విఖ్యాతుడు ఈ ఆంజనేయుడు. లెక్కకు మిక్కిలి ఐన మన నరవానర దనుజ సైన్యాన్ని తానొక్కడే మూపున మోసిన మహాసత్త్వుడు... ఈ హనుమ.

నిముషంలో సముద్రాలన్ని దాటిన ఘన వేగశాలి.... ఈ మారుతి.

శాకద్వీప మాయా పట్టణం నుండి లంక వరకు వాల సేతువును నిర్మించిన జగద్వంద్యుడు... ఈ సమీర కుమారుడు. అసంఖ్యాక శతకంధరులను మట్టు బెట్టిన జగజెట్టి... ఈ పావని. వేయి మాట లెందుకు? పోరులో మా విజయానికి కారణం... ఈ వాయుపుత్రుడు. తల్లులారా! ఇతని వల్లనే ఈ కార్యం నెరవేరింది." అనగానే తలవంచుకొని నిల్చున్న హనుమను ప్రీతితో చూచారు స్త్రీజనం.

**సీతారాములు హనుమతో కలిసి విందు ఆరగించుట**

అత్తలకు మ్రొక్కింది సీత. ఉత్తమ సతివని వారందరు ఆమెను అభినందించారు. చిత్తమున సంతోషించిన రాముడు విభీషణ సుగ్రీవాదులతో కలిసి నగర ప్రవేశం చేశాడు. తరువాత అభ్యంతర మందిరానికి వెళ్లి కొద్దిసేపు ఇష్టాగోష్ఠి జరిపి పన్నీట జలకమాడి పట్టు పుట్టాన్ని ధరించి మాధ్యాహ్నికాలను నెరవేర్చాడు.

చెంతనే ఉన్న హనుమను చూచి "రావోయి! పావనీ!" అని చేయి పట్టుకొని భోజనశాలకు నడిచాడు రాఘవుడు. భూసురులు వేదమంత్రాలను పఠిస్తున్నారు. పూజింప తగిన పెద్దలు, సోదరులు, హితులు, ఆప్తులు ఇలా చాలా మంది.... ఉన్నారు ఆ శాలలో. ఒక ఉత్తమ రత్న పీఠం మీద కూర్చున్నాడు. ఎదురుగా బంగరు పళ్ళెరం. ప్రక్కనే కొన్ని హేమ పాత్రలు. వినయంతో ప్రక్క ప్రక్కకు ఒదిగి ఉన్న హనుమ చేయి పట్టుకొని "హనుమా! అలా ఎక్కడికి వెడుతున్నావు? అదేం కుదరదు. రా! నా ప్రక్కన కూర్చో! నువ్వెప్పుడూ నా పార్శ్వవర్తివి! " అని తన కుడివైపున కూర్చోపెట్టుకొన్నాడు.

" ఒక్కడివి ఇంత మంది భారాన్ని వహించావు! చాలా అలసి పోయావు. నీ బడలిక తీరిందా? ఒడలు నొప్పులు తగ్గాయా? అని దయారస దృష్టులతో వీక్షించి లోకపాలన సామర్థ్య ప్రశస్తములైన హస్తములతో స్పృశించి మాటిమాటికి అతని అద్భుత కృత్యములను మెచ్చుకొంటూ కళ్ళల్లోకి చూస్తూ ఎంతో వాత్సల్యంతో ప్రశంసించాడు. సంతోషంతో మిన్నుముట్టాడు.. హనుమ.

**సీత భోజన పదార్థాల వడ్డన**

శతానందా! ఈ చిత్రం చూచావా! అలా మెచ్చు మాట లాడిన ఇక్ష్వాకు వంశ వర్ధనుడైన శ్రీరామచంద్రమూర్తి సరసన అంతవాడింతై చంటి పిల్లాడిలా ముడుచుకు కూర్చున్నాడయ్యా హనుమ! ముఖాన్ని కొంచెం వంచి చేతులు జోడించి కుండలాల కాంతులు గండ భాగాన మెరయగా

ముఖాన ముగ్ధభావం కనుపించగా చూపుల భయ, వినయ, ప్రియములు పెనగొన శ్రీరామచంద్రుని పాదారవిందాలను నిశ్చలంగా చూస్తూ కూర్చున్నాడు.

ఆ నాడు బంతికి వడ్డించింది ఎవరను కొంటున్నావు? సాక్షాత్తు శ్రీ విద్యా స్వరూపిణి! లోకపాలకురాలైన శ్రీమాత! కమలాత్మికా స్వరూపమైన సీత! శ్రీదేవి! ఆమె ఎవరను కొంటున్నావు? సర్వజనులకు నయనానందాన్నిచ్చే సూర్య, చంద్ర, విద్యుత్, అగ్ని, పుష్ప, పల్లవ, మణి, హిరణ్యాదుల సమాహార కాంతి స్వరూపమే శ్రీదేవి! ఆనాడు ఆ దృశ్యాన్ని చూచిన వారిదే జన్మంటే! ఎలా ఉందను కొంటున్నావు ఆ రూపం!

**సీత స్వరూప వర్ణన**

ఎఱ్ఱ తామరల వంటి పాదాలతో చంద్రకాంత శిలా నిర్మితమైన వేదిక మీద నడుస్తూంటే ఆమె అడుగు పెట్టిన చోటల్లా మెట్ట తామరలు పూస్తున్నాయి. కెంపులై సొంపు లీనుతున్నాయి. మేలిమి బంగరు జలతారు అంచుతో మెరిసిపోయే తెల్లని పట్టు పుట్టపు ధావళ్యం నక్షత్రాల వంటి నఖ కాంతులకు మేలి ముసుగు వేస్తోంది! మొలనూలి చిఱు మువ్వల సవ్వడి హస్తాలంకృత నవరత్న ఖచిత కరకంకణ ధ్వనులతో శ్రుతి కలిపి వీణారావంలా కర్ణ పర్వంగా ఉంది. కెంపుటందియల సందడి, గిలుకు మట్టెల మ్రోతలు వీనులకు విందుగా ఉన్నాయి. కౌను చలింప, మోము చెమర్ప, పాపట ధరించిన చేర్చుక్క చిందులాడ చెలు లందించిన హేమ పాత్రలను పగడముల వంటి చేతుల పట్టుకొని రామ భూపాలుని పంక్తిని వడ్డించింది జానకి.

**రాముడు విందారగించుట**

సన్నబియ్యం అన్నం, పప్పు, కూరలు, అప్పడాలు, ఊరగాయలు, గారెలు, వడలు, బూరెలు, క్షీరాన్నం, ఫలాలు, పనస తొలలు, చక్కెర, పచ్చళ్ళు, దొన్నెలతో నేయి, తేనెలు, రసాలు, మోదకాలు, పానకాలు, మీగడలు,

పులుసులు, బొబ్బట్లు, అరిసెలు, పెరుగు ఇలా అనేక రకాల భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయాలను వడ్డించింది సీత. పాపరహితులు, వేద వేదాంగ పారంగతులైన విప్రులకు 'సర్వత్ర సుభోజ్యమస్తు' అని రఘుశ్రేష్ఠుడు ఆపోశనాన్ని వడ్డించి ప్రాణాహుతులైన వెనుక మారుతి ముఖం చూచి "కుమారా! ఆహారం తీసికో! నీ క్షుధాగ్నిని చల్లార్చుకో!" అని ఆప్యాయంగా పలికాడు. ఆ మాటలకు హనుమ ఎంతో భయంగా వినయంగా చేతులు జోడించి "స్వామీ! ముందుగా మీరు భుజింపక నే భుజింప తగునా?" అని పలికాడు.

అతని పలుకులను మన్నించి అలాగే అని ముందుగా కొన్ని ముద్దలను తానారగించి "పావనీ! ఈ పైన తినవోయి!" అని ప్రియంగా పలికాడు. మీరు తింటూ ఉంటే కాని నేను తిననని ప్రతిజ్ఞగా పలికిన హనుమ పలుకులను పాటించాడు రాముడు. అలా ప్రతి ముద్దకు 'తినవోయి హనుమా!' అని శ్రీరాముడు హెచ్చరించగా 'నా భాగ్యం! నా భాగ్యం! అని అనుకొంటూ ఊరకే కూర్చున్నాడే కాని భోజనం చెయ్యనే లేదు హనుమ. శ్రీరాముడు మాత్రం తన భోజనాన్ని పరితుష్టిగా ముగించాడు.

అంతసేపూ వినయంగా కూర్చున్న హనుమ రాముని భోజన పాత్రను వెంటనే అందుకొన్నాడు. అతని చర్యకు విస్తుపోయిన రాఘవుడు "మారుతీ! నా ప్రక్కన కూర్చుని భుజించవోయీ అంటే తినని వాడివి ఇప్పుడీ భోజన పళ్ళెరంతో పనేమి?" అని ప్రశ్నించాడు.

**హనుమ శ్రీరాముని భుక్త శేషాన్ని కోరుట.**

"స్వామీ! నా దైవమా! దేవర భుక్తశేషం మా కులము వారందరికి ప్రసాదంగా వినియోగించే నిమిత్తమై ఈ బంగరు పళ్ళెరాన్ని తీసికొని వెడుతున్నాను "అంటూ నమస్కరించాడు! చిఱునవ్వుతో "అలాగే! మంచిది! అట్లే చెయ్యి!" అని సమ్మతించి అక్కడున్న వారి నుద్దేశించి ఇలా అన్నాడు రాముడు.

"చూచారా! హనుమ యొక్క నిరహంకారత! నా భుక్త శేషాన్ని మనసులో వాంఛించి దానికి తాను అధికారిని ఔనో కాదో అని అడగటానికి కూడా సందేహించాడు. నా పొత్తున భుజియించమని కోరితే భృత్యునికది తగదని ప్రక్కనే నిలబడ్డాడు. నే సంతుష్టిని పొందక ముందే తానాపని చెయ్యకూడదని నిర్ణయించుకొని తామసం చేశాడు. నా భుక్తశేషాన్ని ప్రసాదంగా తానొక్కడే ఆరగించకుండా కులము వారందరికి పెడతానని అభిలషించాడు. ఇట్టి వినయం, భయభక్తులు ఎవరియం దుంటాయి?" అని స్తుతిస్తూ ఉత్తరాపోశనం పట్టాడు రాముడు.

**ప్రసన్నాంజనేయుడు**
**శ్రీరామ భుక్త శేషాన్ని కపులకు ప్రసాదంగా పంచుట.**

బంగారు కుండలాలు చలింపగా, హారాలు జందెంతో పెనయగా, పళ్ళెరాన్ని చేతులతో పట్టుకొని వనంలో ఉన్న అగిసె చెట్టు మీదకు ఎక్కి కూర్చున్నాడు మారుతి. కూర్చుని "ఓ! కపులార! మన దైవత శిఖామణి ఐన శ్రీరామచంద్ర మూర్తి ప్రసాదాన్ని మీ కోసం తెచ్చాను. మీ కిష్టమైతే వచ్చి స్వీకరించండి" అని ప్రకటించాడు.

ఆ మాట వినగానే ఎక్కడెక్కడ ఉన్న కోతిమూక హనుమ దగ్గరకు వచ్చి చేరింది. మేఘ గర్జనలను వినగానే కొక్కెర గుంపు ఆకాశంలో బారులు తీరినట్లు; పూర్ణచంద్రోదయాన్ని చూచి చకోరాలు గుమిగూడినట్లు; వసంతంలో వికసించిన కుసుమ మంజరుల చుట్టు తేనెటీగలు మూగినట్లు వానరులంతా మాకు మాకు మాకంటూ మోములెత్తి చేతులు చాపుతూ నిక్కినిక్కి చూస్తూ వచ్చి చేరారు. వచ్చిన వారందరికి ఒక్కొక్క మెతుకు ప్రసాదంగా పెట్టాడు. ఒక్క మెతుకు కూడా నేలమీద పడకుండా తీసికొని జన్మ సాఫల్యం చెందినట్లు భావించారు కపులు. శ్రీరాముని దయచేత భుక్తశేషం అక్షయం ఐంది.

**కపులు హనుమను నుతించుట.**

కపులంతా హనుమను ఇలా నుతించారు. “హనుమా! రామ ప్రసాదాన్ని ఎక్కువ తక్కువలు లేకుండా అందరికి పంచి మా కలుషాలను కడిగి వేసిన దీనవత్సలుడవు! నిన్ను నుతించ వశమా? యుద్ధంలో మాకు ప్రాణదానం చేసి ఐహికాన్ని, ప్రసాదాన్నిచ్చి ఆముష్మికాన్ని కలుగ జేశావు! భవపాశాలు తొలగినట్లే భావించుకొంటున్నాం” అని ఆనందాశ్రువుల రాల్చారు.

ఇంకా ఇలా అన్నారు. “పావనీ! ద్వాదశి నాడు అగస్త్యమౌని అగిసె చెట్టు ఎక్కి ప్రసాదాన్ని పంచగా అయిపోయింది. అప్పుడు ముని అగిసె ఆకులనే ప్రసాదంగా ఇచ్చాడు. అప్పటి నుండి ప్రతి ద్వాదశికి అవిసె ఆకులను ప్రసాదంగా ఇచ్చే ఆచారం ఆర్యసమ్మతంగా వస్తోంది. తారక మంత్రాన్ని నిత్యము జపించే అగస్త్య ఋషి పేరుతో ఈ అగిసె చెట్టు లోకంలో అత్యంత పుణ్య వృక్షంగా లోకులచే పూజింపబడుతోంది. ఈ రహస్యాన్ని ఎఱిగిన విజ్ఞుడవు కనుక రామ ప్రసాదాన్ని అవిసె చెట్టు ఎక్కి పంచావు. కాకపోతే ఎక్కటానికి ఎన్ని చెట్లు లేవు? మేం ధన్యుల మయ్యాం” అని వృద్ధులైన జాంబవంతాదులు స్తుతించారు.

**రాముని రాజ్యంలో హనుమ దినచర్య**

ఇంతవరకు విన్న శతానందుడు వసిష్ఠ మహర్షికి నమస్కరించి “మహర్షీ! రఘురాముని రాజ్య పాలనలో పావని యొక్క దినచర్య ఎలా నడిచింది? తెలుపవలసింది” అని అడుగగా ఇక్ష్వాకువంశ పురోహితుడైన వసిష్ఠుడు ఇలా చెప్పసాగాడు.

శతానందా! విను! హనుమ లేకుండా రాముని రాజ్య పాలన లేదు. రామస్వామి వినా పరకార్యం లేదు హనుమకు. అలా శతకంధరుని వధించి సీతాసమేతుడై సాకేతపురిలో ఉండి.. ఒకనాడు తన సైన్యాధిపతులను విభీషణాది మిత్రులను రావించి కృతజ్ఞతా పూర్వక కరుణారస దృష్టులతో ఇలా అన్నాడు శ్రీరామ చంద్రుడు.

"అన్నలారా! అనేక యుద్ధాలు చేసి మీరు అలసి ఉన్నారు. మీ సఖ్యం వల్ల నాకు కార్యాలు నెరవేరాయి. మీరు మీ మీ యథాస్థానాలకు తిరిగి వెళ్ళండి" అని సెలవొసంగి అనేక మణి స్వర్ణ విభూషణాంబరాలను ఇచ్చి యథోచితంగా సత్కరించి పంపించాడు.

హనుమ ఒక్కడు మాత్రం రాముని సన్నిధిలో ఉండి పోయాడు. స్నాన, పాన, భోజన, శయనాసనాదులతో సహా నిరంతర రాజ్యపాలనా నిమగ్నుడైన రాముణ్ణి ఒక్క క్షణం కూడా ఎడబాసి ఉండటం లేదు హనుమ.

సీతారాముల శయన మందిరం ప్రక్కనే ఉంటూ ఎప్పుడు రాముడు తలుపు తీసి బయటకొస్తే అప్పుడే సాష్టాంగ నమస్కారం చేసి నిల్చునే వాడు. స్నాన సంధ్యాజపానుష్ఠానాదుల నెరవేర్చుకొనే నిమిత్తమై సరయూ నదికి భద్రగజంపై రాకపోకలు సాగించే రామభద్రునికి మౌక్తిక ఛత్రాన్ని పట్టేవాడు. భద్రగజాన్ని దిగేటప్పుడు కైదండ ఇచ్చేవాడు. కొలువున్న వేళల్లో రామపాదుకల చెంత కుడిపాదాన్ని పట్టుకొనే కూర్చునే వాడు.

కొలువులో ప్రసంగాలు నడిచేటప్పుడు రాముడు " నీ అభిప్రాయం ఏమిటి? హనుమా!" అన్నట్లుగా సాభిప్రాయంగా చూచేవాడు. దానికి తగినట్లుగా యథోచితంగా హితవు చెప్పేవాడు హనుమ. ధర్మకార్య నిర్వహణలోను, ఆలోచన చెప్పేటప్పుడు అన్నిటా సమర్థుడై రాముని అంతరంగాన్ని తెలుసుకొని తదనురూపమైన బుద్ధివిశేషాలను ప్రకటిస్తూ వచ్చాడు. కొలువు చాలించి పీఠాన్ని దిగేటప్పుడు పాదుకలను తొడిగేవాడు. కుడిభుజం మీద చేయి వేసి నగరిలోకి వెళ్ళే రాముని వెంట తానూ వెళ్ళేవాడు. స్నాన, పాన, భోజన కృత్యాలను నిర్వర్తించుకొని ఉద్యానవన విహారానికి వెళ్ళేటప్పుడు హనుమను తోడు పెట్టుకొని వెళ్ళేవాడు రాముడు. అక్కడ ఆయన చెప్పే వేదాంత విషయాలను ఆనందబాష్పాలు రాలగా పరవశుడై శిరఃకంపం చేస్తూ వినేవాడు హనుమ.

ఒక రోజున ఉద్యానవనంలో మంతనాలాడుకొనే వేళ ఉపనిషత్ప్రతిపాదితమైన తత్త్వాన్ని గురించి హనుమ అడుగగా రామచంద్రుడు వివరంగా

చెప్పాడు. ఇంతలో సూర్యాస్తమయమైంది. సాయంసంధ్యా కృత్యము లాచరించి ఆభరణాదు లలంకరించుకొని  కొలువు తీర్చాడు రామభద్రుడు. ఆ కొలువులో హనుమ రచించిన శ్రీరామ బిరుదావళి గద్యపద్యాలను వంది మాగధులు చదివారు. హనుమ దగ్గర శిక్షణ పొందిన వైణికులు తను కూర్చిన గీత ప్రబంధాలను వినికి చేస్తున్నారు. కావ్యాలలోని అలంకార, రసధ్వని, వక్రోక్తి, వ్యంగ్య, చమత్కార, శయ్యా, సౌభాగ్య విశేషాలను కవులు వివరిస్తున్నారు. హనుమ వ్రాసిన రామచరితను ప్రసంగవశాన సభాసదులు స్తుతిస్తున్నారు. తన కంటె ముందు చెప్పిన భరతాచార్యులను మించి తను చెప్పిన భరతశాస్త్ర ఫణితిని గణికలు నటిస్తున్నారు. హనుమ రఘునాయకుని చెంతనే కొలువులో ఉన్నాడు.

రాత్రివేళల రామానుమతిని పుత్రులకు సైతం అనుమతి లేని సీతారాముల శయన మందిరం చెంతనే ఉంటున్నాడు. “హనుమా! ఏదీ! నీ మనసుకు నచ్చిన ఒక్క రాగాన్ని మధురంగా ఆలపించవోయీ” అని శ్రీరాముడు కోరిన వెంటనే స్వామికి ఇష్టమైనట్లుగా పాడేవాడు. రాళ్ళు సైతం కరిగే ఆ రాగరక్తికి చొక్కి కౌగిలించుకొనే వాడు ప్రభువు.

ఒకప్పుడు... తెల్లవారక ముందే నిద్రలేచి నగర వార్తలను స్వయంగా తెలిసికొనే నిమిత్తమై నిశీథిలో తనే గూఢచారిగా సంచరించే వాడు రాముడు. ఆయనను రహస్యంగా అనుసరించే వాడు  హనుమ. ప్రభువు విషయంలో నిద్ర అనేది ఎఱుగడు గదా! తిరిగి ప్రభువు అంతఃపురానికి చేరుకొనే వేళకి మారుతి ముందుగానే వచ్చేవాడు. రాజు ఎంతటి వీరాధివీరుడైనా రాత్రిపూట ఎక్కడా కూడా ఒంటరిగా సంచరించ రాదు అనే రాజనీతి తెలిసిన వాడు కనుక హనుమ అలా అనుసరించే వాడు. అలా రాముని నీడలా వెన్నాడుతూనే ఉండే వాడు.

**అశ్వమేధ క్రతువుల్లో హనుమ సహాయం**

శతానందా! ఇదయ్యా మారుతి యొక్క దినచర్య. పావని యొక్క మాహాత్మ్యం ఇంత మాత్రమే కాదు. శ్రీరాముడు వెయ్యి

అశ్వమేధాలు చేశాడు. అన్ని సందర్భాలలోను హనుమ సహాయం చేశాడు. ఆ వృత్తాంతాన్ని చెపుతాను విను.

శ్రీరాముడు అశ్వమేధ యాగాన్ని చేయ సంకల్పించి హనుమతో సముచితంగా ఇలా అన్నాడు: "హనుమా! వనచరుడవైనా లోకాలన్నీ మెచ్చే శౌర్య పరాక్రమాలు కలవాడివి. నా యాగాశ్వాన్ని రక్షించటానికి వెంట వెళ్ళు. నువ్వుంటే ఎదురేముంది." ఆ ఆజ్ఞను శిరసున ధరించి యాగాశ్వం వెంట రక్షణకై బయలు దేరాడు.

అశ్వానికి ముఖ పట్టం కట్టారు. దాని మీద ఇలా వ్రాసి ఉంది: "నిముషంలో నాలుగు సముద్రాలను దాటిన వాడు తన పాద తాడనం చేత శతకంధరుని గర్వాన్ని అణచిన వాడు ఐన హనుమద్దేవుడు రామభూపాలుని...యాగాశ్వానికి రక్షణగా ఉన్నాడు. వీరులైన వారు ఈ యాగాశ్వాన్ని పట్టవచ్చు." దానిని చదివిన కొందరు భూమిపతులు గర్వంతో హనుమను ఎదుర్కొని పరాజయాన్ని చవిచూచారు. నాలుగు దిక్కులూ జంబూ ద్వీపమంతా నిరాఘాటంగా సంచరించి యాగాశ్వం అయోధ్యకు చేరుకొంది. రఘుకుల సార్వభౌముని అశ్వమేధం దిగ్విజయంగా పూర్తయింది. ప్రతాపశాలి ఐన మారుతి అండదండలతో రామచంద్రుడు అనేక క్రతువులను నిర్విఘ్నంగా పరిసమాప్తి చేశాడు.

ఈ విధంగా స్వామి కైంకర్యమే జీవిత పరమార్థంగా భావించి క్షణం కూడా ఎడబాయకుండా అనన్య భక్తితో కొలుస్తూన్న హనుమను చూచి ఒక రోజున రామచంద్రుడిలా అన్నాడు:

**రాముడు హనుమను గంధ మాదనానికేగి నివాసముండు మనుట.**

"హనుమా! నీ ప్రపత్తికి సంతుష్టాంత రంగుణ్ణయ్యాను. గుణంలో కాని వినయంలో కాని నా మదికి నచ్చిన వాడవు నీవొకడివే. నీవు సకల సద్గుణ సంపన్నుడవు. వేదరాశి ఉన్నంత వరకు సూర్య చంద్రులున్నంత వరకు లోకంలో నువ్వు చిరంజీవివై ఉంటావు. ఈ వరం నీ కిస్తున్నాను.

కింపురుష వర్షంలో గంధమాదన పర్వతం ఉంది. దాని అగ్రభాగంలో దివ్య ప్రకాశంతో ఒప్పారే కాంచన కదళీవనం ఉంది. అతి విశాలమైన ఆ వనంలో కామరూపివై కల్పవృక్ష తరుమూలంలో నివసించు. ఆ వర్షవాసులు విజ్ఞాన సౌఖ్య మోక్షార్థులై నిన్ను పూజిస్తారు. వాళ్ళకు అధిపతివై వాంఛితాలను నెరవేరుస్తూ ఉండు. ప్రతియుగంలోను మాతోపాటు నీ విగ్రహానికి పూజలు చేస్తారు."

ఆ పలుకులు విన్న హనుమ రఘువంశ స్వామికి సాష్టాంగ దండ ప్రణామా లాచరించి "స్వామీ! నా జీవమా! మీ పాద పద్మాలను విడిచి వేఱొకచోట నే నివసించ లేను. నా మనసులో మీ రెప్పుడూ నివసించేటట్లు, ఎప్పుడూ మీ కథలనే వినేటట్లు కోరుకొంటున్నాను. అనుగ్రహించండి!" అని ప్రార్థించాడు.

అందుకు రాఘవుడు "మారుతీ! నీవు కోరుకొన్నట్లు నీ మనసులో నేను కొలువై ఉంటాను. తైలధారావచ్ఛిన్నంగా నీ తలపు నా యందు నిలిచి ఉంటుంది. నీ చెంత విద్యాధరులు, అప్సరసలు, నారద తుంబురులు నా ఆత్మకథను ఎప్పుడూ వినిపిస్తూ ఉంటారు. హనుమా! అనేక జన్మల సుకృత పరిపాకం వల్ల లభించిన పుణ్యులకు మాత్రమే ఆ కదళీవనం కనిపిస్తుంది. అన్యులకు గోచరించదు" అని వరాలిచ్చి అనర్ఘ వైడూర్య ఖచిత హారాన్నిచ్చి వాత్సల్యంతో వీడ్కోలిచ్చి పంపాడు.

శతానందా! ఈ విధంగా రామానుమతిని మారుతి గంధమాదన పర్వతాన్ని చేరుకొని కాంచన కదళీవనంలో పారిజాత తరుమూలంలో నివాస ముంటున్నాడు. హనుమ మాహాత్మ్యాన్ని వర్ణింప ఎవరితరం? రామచంద్రుడే ఆశ్చర్యపోయాడు. అతని మహిమలు అనేకం అని చెప్పి ఊరుకొన్నారు మహర్షి.

అంత శతానందుడు "మహర్షీ! హనుమ దివ్య చరిత్ర వినగా వినగా వేడుక ఇనుమడిస్తోంది. తరువాత కథ సెలవియ్య వలసింది" అని ప్రార్థించాడు.

**ఫలశ్రుతి**

శతానందా! విను! విరించి వాసవాది సురలకు దుర్లభమైన శ్రీరామ భుక్త శేషాన్ని కపిజాతి కిచ్చి పుణ్యపదాన్ని చూపి, వారందరకు సంతోషాన్ని కలిగించిన వానర కుల ప్రభువు హనుమ. స్వసుఖాన్ని త్యాగం చేసి ఐనా పరోపకారం చెయ్యటం పెద్దల శీలం కదా. మారుతి వంటి వంశోద్ధారకుడు జన్మించిన కారణంగా కపికులం పూజనీయమైంది. సద్గుణ వరిష్ఠుడు ఒకడు పుట్టినా ఆ వంశం గౌరవ భాజన మవుతుంది. శ్రీ రఘుకుల స్వామికి ప్రియుడై కులానికి ప్రియాన్ని చేకూర్చి వర్ధిల్లిన హనుమ యొక్క లీలలను విన్న భక్తుడు కృతార్థుడవుతాడు. నిత్యవైభవ శ్రీలతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో అలరారుతూ ఉంటాడయ్యా! సద్గుణ సంపత్తి కలవాడవుతాడు. ఎక్కడకు వెళ్ళినా గౌరవాన్ని పొందుతాడు. కార్యసిద్ధి అవుతుంది. విద్యాలాభం కలుగుతుంది.

శతానందా! భక్తులు ఏ కోరికను మనసులో పెట్టుకొని ప్రసన్నాంజనేయ స్వామిని ఇలా ప్రార్థించినా ఆ కోరిక తప్పక నెరవేరుతుంది.

**సీ॥ రమణీయ మణికుండల మరీచి వల్లిక**
**లంబర న్యగ్రోధ మావరింప**
**తనుకాంతి హరిదంత దంతిదంతములకు**
**నికరంపు బంగారు నీరుపూయ**
**కటి కట్టు కొనిన బంగరు పట్టు పంచెపై**
**ముప్పేట మిసిమి క్రొమ్ముంజి వెలయ**
**మాకు మాకనుచు ఉద్రేకించు కపులందు**
**తన చూపు కరుణామృతంబు కురియ**

**తే॥ ముని మహీరుహ శాఖాగ్రమున ఒకింత**
**యొఱగి డాకేల పళ్ళెరంబూని రామ**
**చంద్రుని ప్రసాద మొసగు ప్రసన్న మూర్తి**
**మారుతి ఘటించు కోరికల్ మాదృశులకు.**

(సమీర కుమార విజయము)

రమణీయమైన మణికుండలాల కాంతులు ఆకాశమనే మఱ్ఱి చెట్టును ఆవరింపగా; తన శరీర కాంతి ఇంద్రుని యొక్క పట్టపు టేనుగు  ఐన ఐరావత ధవళ దంతాలకు బంగారు నీరు పూయగా; మొలకు కట్టుకొన్న బంగారు పట్టుపుట్టం మీద మూడుపేటల అపరంజి మౌంజీ బంధం (మొలత్రాడు) ప్రకాశించగా; మాకు మాకు అంటూ ప్రసాదం కోసం ఎగబడే కపులమీద కరుణామృత దృష్టులు కురియగా మౌని వృక్షంగా పిలువబడే అగిసె చెట్టు ఎక్కి కొంచెం వంగి ఎడమ చేత పళ్ళెరాన్ని పట్టుకొని కుడిచేతితో శ్రీరామచంద్ర ప్రసాదాన్ని పంచిపెట్టే ప్రసన్నమూర్తి ఐన శ్రీ ప్రసన్నాంజనేయ మూర్తి మాకు కోరికలను తీర్చుగాక.

**పంచమాధ్యాయం సంపూర్ణం.**

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## షష్ఠాధ్యాయము

అఖిల భూత దయా గరిష్ఠుడైన వసిష్ఠుడు గౌతమాత్మజుడైన శతానందుని జూచి హనుమ దివ్య చరిత్ర తరువాత కథను ఇలా చెప్ప సాగారు.

## సకుంభ నికుంభుల వృత్తాంతం

శతానందా! విను! దశకంఠుని సోదరుడు కుంభకర్ణుడు. వాడి ఉద్ధతికి భూమి కంపిస్తుంది. దేవలోకంలోని సరస్సుల యందలి సరోజాలను గోళ్ళతో గిల్లగల బాహుధురంధరుడు. వాడు పుత్రార్థియై శంకరుని గూర్చి తపస్సు చేశాడు. భస్మోద్ధూళిత ధూసరాంగుడైన శంకరుడు పార్వతీ సహితుడై నంది వాహనారూఢుడై ప్రత్యక్షమై... ఉగ్ర శౌర్య పరాక్రమ శోభితులైన కొడుకులు ఇద్దరు కలుగుతారని వరమిచ్చి అదృశ్యుడయ్యాడు. భూతనాథుని వరప్రభావంచే సకుంభ, నికుంభులనే ఇద్దరు కొడుకులు ఘటకర్ణునికి కలిగారు. పుట్టగానే వాళ్ళు చేసిన రోదనానికి ఆకాశం అల్లకల్లోలమైంది. దిక్కులు ఉక్కిరిబిక్కిరయ్యాయి. తండ్రి కంటె భయంకరులు వారు. వారు పెరిగి పెద్ద వాళ్ళయే కొలది సకల భువన జంతు కోటికి భయం కూడా పెరిగి పెద్దదైంది. ఆ కుంభకర్ణుడు తన పుత్రులకు తగిన నివాసం ఏదీ అని విచారించి సముద్రుని భయపెట్టి వార్ధి మధ్యంలో జయద్వీపం అనే నగరాన్ని

నిర్మించి సకుంభుని దానికి రాజుగా చేశాడు. మాయోపాయజ్ఞుడైన నికుంభుని వానికి తోడుంచాడు.

### సకుంభ నికుంభులు దేవయానిని చూచి మోహించుట

వాళ్ళలా జయద్వీపంలో ఉంటూ మదోన్మత్తులై దేవతలను, ఋషులను, స్త్రీలను, శిశువులను బాధించ సాగారు. ఒకనాడు వారిద్దరు సముద్ర తీరానగల అడవిలో తిరుగుతూ యౌవ్వన ప్రాయంలో ఉన్న ఒక మహా సౌందర్యరాశిని చూచారు. తక్షణం వాళ్ళ మనస్సు ఆమె యందు లగ్నమైంది. వారామెను సమీపించి "ఓ! సుందరీ! నీ సౌందర్యం అనన్య సామాన్యంగా ఉంది. నీ మేని సౌందర్యం ఈ వనానికి బంగారపు నీరు పూసినట్లుంది. నర కిన్నర రాజ కన్యకామణుల యందు గాని; ఫణాధర విద్యాధర వీణాధర శోణాధర మత్తకాశినుల యందు గాని, దేవతాప్సర శంపాలతాంగుల యందు గాని నీ వంటి ఉజ్జ్వలాంగిని మేమిది వరకు చూడనే లేదు. నిన్ను చూచినప్పటి నుండి మదనుడు చాలా తొందర పెడుతున్నాడు. నిగ్రహించుకొనటం చాలా కష్టంగా ఉంది. మాలో ఒకరిని వరించు! ఈ బాధను హరించు" అని అధార్మికమైన పరవధూ వ్యామోహ కాంక్షాతత్పరులై ఆమెను బాధింపసాగారు.

### దేవయాని శాపం

వారి దుష్ట సంకల్పానికి దుశ్చర్యలకు ఆమె అసహ్యించుకొని రోషకషాయితాక్షయై "ఓరీ! మదాంధులార! బ్రాహ్మణ శ్రేష్ఠుడు, తపోనిష్ఠుడు, శ్రుతి, స్మృతి, శాస్త్ర, పురాణ, ఇతిహాస, లోకానుభవ, ఆప్తవాక్య, పూర్వాచార, గత చరిత్రానుభవ, శాస్త్రోపదేశ, సకల నీతిశాస్త్ర కోవిదుడు అసుర గురువు, భృగువంశ మండ నాయమానుడు ఐన శుక్రాచార్యుల వారి కొమార్తెను నేను. నా పేరు దేవయాని. గురుసుతనైన నేను మీకు తోబుట్టువు వంటి దానను. మదాంధులై తామసగుణ ప్రేరితులై నన్ను కామించిన మీరు మదగజాలై సంచరించండి!"

అని శపించింది. వారు భయార్తులై ఆమెను శాపమోక్షాన్ని అనుగ్రహించమని వేడుకొన్నారు. ఆమె సోదర వాత్సల్యంతో పులస్త్యుడనే మహర్షి కరుణచే మీకు శాప విముక్తి కలుగుతుందని శాప విమోచనాన్ని చెప్పి వెళ్ళిపోయింది.

శతానందా! రాఘవుడు లంకా విభుడైన రావణుని పుత్ర పౌత్ర భాతృ ఆప్త మిత్ర సహితంగా వధించి విభీషణుని లంకా రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసిన సమయంలో ఈ సకుంభ నికుంభులు మదగజ రూపులై ఉన్నారు. అందుకనే వారు యుద్ధానికి వెళ్ళలేదు. రాముని చేత హతులవలేదు. ఆ తరువాత పులస్త్యుని దయవల్ల పూర్వరూపాన్ని పొందారు. పొందినా కించిత్తైనా ధర్మచింతనలేక పూర్వం వలెనే తమ బలాన్ని ఎదుటి బలాన్ని తెలియక సుర భూసుర ఋషి సంఘాలను, స్త్రీ బాల వృద్ధులను, అనాథ దీన జన కృపణులను మునుపటి కంటె ఎక్కువగా హింసింప సాగారు.

"యుద్ధంలో దశకంధరాదులు హతులయ్యారు కాని వీరు మరణించ లేదే. ఆనాడు వీరు కూడా మరణించి ఉంటే దేవతలను శూలంలా బాధిస్తున్న వీరి ముప్పు తప్పి ఉండేది" అని ఎంతో భీతితో ఇంద్రాదులు బెదర సాగారు.

**సకుంభ నికుంభుల సభకు నారదుని రాక**

ఒకనాడు త్రిలోక సంచారియైన నారదుడు సకుంభ నికుంభుల నిలయానికి వెళ్లాడు. వారిచ్చిన అర్ఘ్య పాద్యాది మర్యాదలకు సంతసించి కుశలప్రశ్న లడిగి లోకవార్తా ప్రసంగంలో ఇలా అన్నాడు: "ఓ! రాక్షస నాయకులారా! మీరు కత్తి ఎత్తితే సహస్రాక్షుడు సైతం హడలి పరుగెత్తుతాడు. మీరు గర్జిస్తే సాక్షాత్తు లక్ష్మీదేవి కూడా కంట నీరు పెట్టాల్సిందే! ఆ హిరణ్యాక్ష హిరణ్యకశిపులను నే నెరుగుదును. బాహు పరాక్రమంలో వారు కూడా మీకు సాటి రారు! ప్రస్తుతం ఇంద్రుని స్థితి ఎలా ఉందో చెపుతాను వినండి!

మీ నిమిత్తంగా వచ్చిన బెదురు వల్ల శరీరానికి కాక వచ్చి జ్వరంతో ఒడలు మరిగిపోతోంది.... ఇంద్రునికి. గుండెల మీద వడ్ల గింజ నుంచితే పేలగింజ అవుతోంది. వాసవుని శరీరం మీద చేయి వేసి శచీదేవి నాథా! మీ శరీరం ఇంతలా మఱిగి పోతోంది! కారణమేమిటి? అని అడిగితే అసలు విషయం చెపితే తన దిక్పాలకత్వానికి అవమానమని తలచి దేవీ! నీవు చెంతలేని కారణంగా పట్టుకొన్న విరహ జ్వరం! అని అబద్ధం చెప్పి పరువు కాపాడు కొంటున్నాడు. మీ గర్జనలకు బాహు బలానికి మూడు లోకాలు కంటి మీద కునుకు లేకుండా జోగుతూ ఉలికి పడుతున్నాయి. యశః ప్రతాపాలలో మీ సాటి ఎవరూ లేరు!"

**విభీషణునిపై దండెత్తుట**

నారదుని మాటలకు వాళ్ళిద్దరు ఉబ్బితబ్బిబ్బై మీసాలు మెలివేసి "అవును! నారదా! ముల్లోకాలలోను మమ్మల్ని ఎదిరించగల వీరుడెవడున్నాడు?" అన్నారు అహంకారంతో. కలహప్రియుడైన నారదుడు వెంటనే "అక్కడే మీరు పొరబడుతున్నారు. జ్ఞాతిద్రోహం చేసి లంకారాజ్యానికి పట్టాభిషేకం కట్టుకొన్న విభీషణు డున్నాడుగా! అతనొక్కడే మీకు శత్రువు" అని అగ్నిమంథనం చేసి అదృశ్యుడయ్యాడు నారదుడు. ఆ మాటలు విన్న రాక్షసులు పిన తండ్రి మీది ద్వేషంతో మండిపడి లంక మీదికి దండెత్తారు. సైన్యం విడిది చేసింది. దూతను పిలిచి వాడికి కొన్ని మాటలు చెప్పి; తమ మాటలుగా తిట్టి రమ్మని పంపించారు.

వాడు వెళ్ళి "ఓ! విభీషణా! అతిప్రశస్తమైన పులస్త్య వంశంలో పుట్టి నీచుడైన ఒక నరుణ్ణి సేవిస్తూ నీ అన్నగారికి ద్రోహం చేసి వంశ నాశనానికి కారకుడవయ్యావు. నీవు నికృష్టుడవు! నీదీ ఒక బ్రతుకేనా?" ఈ విధంగా నిందించిన దూతకు తగిన రీతిగా సమాధానం చెప్పి యుద్ధ సన్నద్ధుడై నిలిచాడు విభీషణుడు.

**విభీషణుడు హనుమను ప్రార్థించుట**

పోరు మొదలైంది. ఉభయ పక్షాల సైనికులు నేలకొరుగుతున్నారు. సూర్యాస్తమయమైంది. ఆ చీకటి రాత్రి విభీషణుడు చింతాక్రాంతుడై ఇలా తలపోశాడు. "ఈ సకుంభ నికుంభులు ఎవరి చేతుల్లోను హతులవరు! నాకు రామచంద్రుడే దిక్కు . ముందుగా ఈ విషయాన్ని హనుమకు తెలుపుతాను." అని తలపోసి వెంటనే మింటి కెగసి ఉత్తర దిక్కున గంధమాదన పర్వతాగ్రాన కదళీ వనాంతరమందు శశికాంతమణి పీఠిపై కల్పవృక్ష తరుమూల వాసియై ఉన్న మారుతిని సందర్శించాడు. చేతులు రెండు శిరసున చేర్చి "ఓ కరుణామూర్తీ! రక్షించు!" అని ప్రార్థించాడు. అంత హనుమ కనులు తెఱచి "రావోయి! విభీషణ! ఈ వనానికి నీవు వచ్చిన కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

దానికి విభీషణుడు కన్నీళ్ళతో ఇలా ప్రార్థించాడు.

"పావనీ! నీ కరుణా కటాక్షం వల్లనే కదా రాక్షస రాజ్య రమావైభవానికి ప్రభువు నయ్యాను. ఇప్పటి వరకు ఏ ఆపద రాకుండా సుఖస్థితిలో ఉన్నాను. నేడిద్దరు దాయలు నా లంకను చుట్టు ముట్టారు. వారెవ్వరంటావా? నా అన్నగారు కుంభకర్ణుని కొడుకులైన సకుంభ నికుంభులు. వాళ్ళు దురహంకారులు. దుర్జయులు. మా బోంట్లు పోరులో వారిని మార్కొనలేం! ఆనాడు నన్ను సాధువని రాఘవునితో చెప్పి నా దైన్యాన్ని పోగొట్టావు. నేడు కూడా నీవే దిక్కు. నాకు శత్రుబాధ లేకుండా నివారించు."

**శ్రీరాముని సహాయం కోరుట**

అప్పుడు పవన నందనుడు "రాక్షసరాజా! నీ కెందుకీ పరితాపం. వెంటనే మనం రామస్వామిని కలుద్దాం. ఆశ్రిత జన మందారుడు, శరణాగత వత్సలుడు ఐన కాకుత్థ్సుడు మన చెంత నుండగా ఆ నికృష్టులు రణంలో నిలువ గలరా?" అని ధైర్యం చెప్పి తక్షణం సాకేత నగరానికి చేరుకొన్నారు వారిద్దరు. జానకీపతికి సాష్టాంగం చేశారు. "ఇంత రాత్రివేళ మీరు వచ్చిన

రాచకార్యం ఏమిటి?" అని అడిగిన సీతాపతికి హనుమ విభీషణుని దైన్య స్థితిని వివరించాడు.

అది విన్న రాముడు కించిదాశ్చర్యంతో వారి నుద్దేశించి "లంకలో జరిగిన పోరులో వారు సమసిపోలేదా? ఆ నికృష్టులు అప్పుడెక్కడ ఉన్నారు?" అని ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా మారుతి కుంభకర్ణుడు పుత్రార్థియై చేసిన తపస్సు, సకుంభ నికుంభుల జననం, దేవయానిపై మరుల్గొనుట, ఆమె శాపం, శాపవిమోచనం... ఈ కథంతా చెప్పాడు. చెప్పి నాటి పగ తీర్చుకోటానికే నేడు వారిలా వచ్చి లంకను చుట్టుముట్టారని విన్నవించాడు. తక్షణం రామభద్రుడు నవ్వి "వీరేమి శతకంఠుని కంటె దుర్జయులా? ఇదెంత కార్యం. ఈ వీరాంజనేయుడు సహాయుడై రాగా రేపే వస్తున్నాం రణానికి" అని విభీషణుని ఊరడించి ధైర్యం చెప్పి హనుమను చూచి " హనుమా! తక్షణం వెళ్ళు! రేపు సూర్యోదయానికి ముందే సేనలను సిద్ధం చేయి" అని ఆజ్ఞాపించాడు.

**భరత శత్రుఘ్నుల మూర్ఛ- సకుంభ నికుంభుల వధ**

కీర్తి వర్ధనుడైన లక్ష్మణుని అయోధ్యలో ఉంచి భరత శత్రుఘ్నులు వెంటరాగా ససైన్యంగా లంకలో దిగాడు రామచంద్రుడు. ఆ వృత్తాంతాన్ని వేగుల వారు తెల్పగా సకుంభ నికుంభులు రాముణ్ణి రణంలో ఎదుర్కొన్నారు. భరత శత్రుఘ్నులు రాముని ముందు నిలబడి రాక్షసులపై శరసంధానం చేసి కప్పేశారు. దానికి దానవు లాగ్రహించి తమ తండ్రి ఐన కుంభకర్ణునికి యముడిచ్చిన యమదండాన్ని భరత శత్రుఘ్నులపై ప్రయోగించారు. సుడిగాలికి నేల కూలిన మహా వృక్షాల్లా రామానుజులు ధరణిపై ఒరిగారు. సోదరుల పాటు చూచి రామభద్రుడు రోష విషాద స్వాంతుడై సకుంభ నికుంభులపై వాయువ్యాస్త్ర ప్రయోగం చేయగా ఆ అస్త్రం వారిద్దరిని లవణాబ్ధిలో ముంచేసింది.

**హనుమ అమరావతి కేగి అమృతాన్ని తెచ్చుట.**

తన తమ్ముల పాటు జూచి రామచంద్రుడు దుఃఖాక్రాంతు డయ్యాడు. అతని శోకాన్ని చూచి మంత్రులు "రాజా! ప్రాజ్ఞులైన మీరిట్లు శోకింప తగునా? దుష్కర కార్యఘటనా ధురంధరుడైన మారుతిని సంజీవిని తెమ్మని పంపండి. మూర్ఛాగతులైన మీ సోదరులు మేల్కొంటారు" అని పలికారు. వెంటనే దైన్యాన్ని విడిచిన దాశరథి హనుమను చూచి "ఆంజనేయా! రఘు వంశాన్ని రక్షించటానికై వ్రతాన్ని పూనిన వాడవు. సంజీవినిని తెచ్చి నా తమ్ములను బ్రతికించ వోయీ" అని వేడగా హనుమ ఇలా అన్నాడు. "రఘునాయకా! సంజీవినినే కాదు ఇంద్రునితో కలహించి ఐనా సరే అమృతాన్ని తెస్తాను" అని చెప్పి బయలుదేరాడు.

## అమరావతీ నగర వర్ణన

శాతకుంభ దీప్తులచే ఏ నగరం ప్రకాశిస్తూ ఉంటుందో...

నందనవనంలోని పారిజాతక లతా పల్లవాలను మేసి ఉద్యాన వన పుంస్కోకిలలు కోమల కూహూకార పంచమ స్వరంతో ఏ పట్టణ ప్రజలకు ప్రభాత గీతికలను ఆలాపిస్తుంటాయో...

ఐరావత కంధరా గ్రైవేయ కనక ఘంటికా ప్రణవనాదం దిక్పూరితమై ఏ పట్టణ ప్రజలకు అభ్యుదయ ఆశీర్వచనాన్ని అందిస్తుందో...

కల్పవృక్ష ప్రసూన బంధుర పరిమళంతో మిళితమై శీతల మందాకినీ వీచికా మారుతం ఏ పట్టణ ప్రజలకు సుఖస్పర్శ చేకూరుస్తుందో...

సప్తర్షి పావనాశ్రమ వనాంతరాలలో ఆమ్నాయ ఘోష ఏ పట్టణంలో అభ్యధికమై శ్రవణానందంగా వినిపిస్తుందో...

నాక విద్యాధరీ నాట్యశాలల యందు తూర్యత్రయ ఘోష చరణ మంజీర నిస్వనంతో కలిసి ఏ పట్టణంలో శ్రవణ పేయంగా వినిపిస్తుందో...

ఏ పట్టణ భోగాలను ఆశించి వీరవరులు అకుంఠిత పరాక్రమంతో రణరంగంలో పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా పరిత్యజిస్తారో...

చతుర్వేద పారంగతులు, ఆహితాగ్నులు ఐన కర్మఠులు ఏ నగర సౌభాగ్యం మీది వ్యామోహంతో ఇహంలో అత్యంత కఠినమైన కర్మలను ఆచరిస్తారో...

అట్టి అమరావతీ పట్టణాన్ని చేరుకొన్నాడు హనుమ. ఆ వార్త విన్న దేవతా సార్వభౌముడు చింతామణీ పీఠాన్ని దిగి భయ భక్తులతో ఎదురేగి వచ్చిన వార్త ఏమని ప్రశ్నించాడు. రాముని పంపున వచ్చిన పనిని మారుతి చెప్పగా శచీపతి ఇంతకంటె భాగ్యమేమి! అని అంతరంగంలో ఆనందించి అమృత కలశాన్ని అందించాడు. ఆలస్యం చేయకుండా ఆంజనేయుడు తిరుగు ప్రయాణం సాగించాడు. తండ్రియైన వాయువు రంగత్తుంగ గంగా తరంగ శీకర శీతలత్వంతో అలసటను అపనయింపగా వచ్చి చేరాడు మారుతి. రామచంద్రునికి చేతులు జోడించి మ్రొక్కాడు. ఆనందం పట్టలేక ఆలింగనం చేసికొని రాఘవుడిలా అన్నాడు:

**రాముడు హనుమను స్తుతించుట**

"అన్నా! ఆంజనేయా! ఆనాడు లక్ష్మణుని ఈనాడు భరత, శత్రుఘ్నులను పునర్జీవితులను చేశావు! నాకు పునర్జన్మ నిచ్చావు. అలా కాకపోతే అనుజులను ఆహవరంగంలో పోగొట్టుకొని అయోధ్యకు తిరిగి వెళ్ళి తల్లులకు నా ముఖం ఎలా చూపించను? నువ్వు మానస వేగివి! క్షణ మాత్రంలో స్వర్గానికి వెళ్ళి అమృతాన్ని తెచ్చావు! అద్భుతం! అద్భుతం నీకు కాదు మాకు."

అప్పుడు హనుమ "స్వామీ! ఇది మీ ప్రతాపం. నాదేముంది. మీ బంటును కదా. బంటును పొగడనేల?" అని వినయాన్ని ప్రకటించాడు. సోదరుల సర్వాంగాలకు సుధారసాభిషేచనం చేశాడు రాముడు. భరత శత్రుఘ్నులు నిద్రనుండి లేచిన వారిలా లేచి కూర్చున్నారు. తిరిగి అమృత

కలశాన్ని స్వర్గపురికి చేర్చాడు హనుమ. ఆ జయద్వీపాన్ని కూడా విభీషణునికి పట్టం కట్టాడు రాఘవుడు.

ఈ కథను చదివినా విన్నా వ్రాసినా దీర్ఘాయువు, ఆరోగ్యం శ్రేయస్సు కలుగుతుందని హనుమకు ప్రియుడైన శ్రీరామచంద్ర ప్రభువు లోకులకు వరంగా అభయ మిచ్చాడు.

వింటున్నావా! శతానందా! రాబోవు కలియుగంలో ఇహానికి గాని పరానికి గాని రక్షించేది హనుమ న్నామం ఒక్కటే సర్వులకు శరణ్యం. ఇది ముమ్మాటికి సత్యం. కావలసినవి భక్తి శ్రద్ధలు.

ఇంత వరకు విన్న శతానందుడిలా అన్నాడు.

"మహర్షీ! అనిలాత్మజుడైన హనుమ చరిత్ర అమృతరస పూరంగా ఉంది. అగస్త్యునకు శ్రీరాముడు ఉపదేశించిన హనుమన్మంత్ర మాహాత్మ్యాన్ని కూడా ఆనతీయండి" అని కోరగా వసిష్ఠుల వారిలా చెప్పసాగారు.

**శ్రీరాముని వద్దకు అగస్త్య మౌని వచ్చుట**

శతానందా! విను! దినమణి వంశ తిలకాయ మానుడైన రామభూపాలుడు లక్ష్మీ విలాసంతో సాకేతపురిలో దినాలను గడపుతూ ఉండగా ఒక రోజున అగస్త్య మౌని విచ్చేశారు. వచ్చిన మహర్షిని వివిధ అర్చనలచే సంభావించి తన చేరువ మణిమయ రజత పీఠాన్ని అధిరోహింప చేసి "మహర్షీ! మీరు సుఖులే కదా! ఏ రాక్షస బాధలు లేవు కదా?" అని క్షేమ సమాచారాన్ని అడిగాడు. దానికి సమాధానంగా మహర్షి "సీతారమణా! సాధుజన రక్ష, దుష్టజన శిక్ష చెయ్యటం కోసం అవతార మెత్తిన వాడవు! నీవు సార్వభౌముడవై విశ్వాన్ని రక్షిస్తూంటే సాధువులకు బాధలు ఎందుకు ఉంటాయి? శతకంధర సంహారంతో వేల్పులకు వెఱపు తీరింది. వేలుపు వెలదులకు చెఱలు తీరాయి. తపసి మూకల మొఱలు అణిగాయి. ఇదంతా నీ కటాక్షం" అని రామగుణ కీర్తనం చేశారు.

**శ్రీరాముడు హనుమను స్తుతించుట**

మహర్షి మాటలకు ప్రత్యుత్తరంగా సౌశీల్యనిధియైన

రామభద్రుడిలా అన్నాడు: "కుంభసంభవా! నూఱు తలకాయల రక్కసి పేడును మట్టు పెట్టటం లోకాలకు అచ్చెరువును కలిగించవచ్చు. కాని అదంతా హనుమ మాహాత్మ్యమే! బలవంతుడైన బంటు ఉంటే దొరకు కీర్తి ప్రఖ్యాతులు రాకుండా ఉంటాయా? హనుమన్నామ జపమే కార్యసిద్ధికి కారణమవుతుంటే సాక్షాత్తు అతడే తోడుగా నిలిస్తే ఆహవంలో విజయాన్ని సాధించటంలో వింతేముంది? రణంలో పంచముఖుడై వీరవిహారం చేసి వైరులను మట్టుబెట్టి విజయాన్ని చేకూర్చిన వాడు హనుమ. అంతెందుకు! హనుమన్నామ స్మరణ చేసే కుమార స్వామి సైతం తారకాసుర సంహారం చేశాడు. శతకంఠు డనగా ఎంత?

**శ్రీరాముడు అగస్త్యునకు హనుమన్మంత్ర మాహాత్మ్యము చెప్పుట మరియు తత్త్వ బోధ.**

ఆ మాటలు విన్న అగస్త్య భగవానుడు విస్మయము, ముదము, భయము, వినయము గ్రమ్ముకొనగా రాముని ముఖాన్ని చూచి చేతులు మోడ్చి ఇలా అన్నాడు: "రామభద్రా! ఈ హనుమ యొక్క నిజ స్వరూప మేమి? కుమారస్వామి ఈ కపి ముఖ్యుని సంస్మరించి రిపులను గెల్చిన ఆ వృత్తాంతమేమి? మాలా మంత్ర జప లక్షణ మేమి? దాని ఫలమేమి? ఉపదేశించండి."

ప్రత్యుత్తరంగా శ్రీరామచంద్రుడిలా హనుమ యొక్క దివ్య స్వరూప రహస్యాన్ని చెప్పసాగాడు.

"ముని శ్రేష్ఠా! నీవు సత్పురుష శ్రేష్ఠుడవు! హనుమ మంత్రమూర్తి కావున ఆయన రహస్యాలను విన సంకల్పించావు. నాకు చాలా సంతోషంగా ఉంది. దాని స్వరూప మంత్ర విధులన్నీ సూక్ష్మంగా చెపుతాను. నీవు దక్క అన్యు లెవ్వరు దీనిని వినటానికి అర్హులు కారు.

"మహర్షీ! ఈశ్వరుడు పంచముఖుడు. సృష్టి, స్థితి, సంహారము, తిరోభావము, అనుగ్రహము ఈ పంచకృత్యములను తన ఐదు ముఖములచే

నిర్వహిస్తూ ఉంటాడు. త్రిపురహరుడు, శక్తి సహితుడు, త్రిలోచనుడు, మదన వైరి ఐన సాక్షాత్తు ఆ ఈశ్వర స్వరూపమే.. ఈ హనుమ! అందులో సందేహం లేదు. 'అ' కార 'ఉ' కార 'మ' కారము లనబడే బీజాక్షర సంయోగమైన ప్రణవ స్వరూపమే హనుమ.

భార్యను ప్రేమించటం ఈశ్వరుని కొక్కనికే తెలుసు. అందుకనే ఉమకు సగం దేహాన్నిచ్చాడు. అతడు రాగులలో కడురాగి.

తపోధనులలో అతడు శ్రేష్ఠుడు. తపస్సు యొక్క స్వరూపం అతని కొక్కనికే తెలుసు. అతడు విరాగులలో కడు విరాగి. అందుకనే సతీ వియోగానంతరం ఏమాత్రం మన్మధ వికారానికి లోను కాకుండా తీవ్ర తపోనిష్ఠలో ఉండి పోయాడు. శ్రీవర్ధనుడైన శంకర స్వరూపమే ఈ హనుమ!

నా ఏకాంత భక్తుడీతడు. నాకు అన్యుడు లేడు. నేనీ అవతారాన్ని దాల్చటానికి ఇతని లోకోత్తర భక్తియే కారణం. శరీరాన్ని, అంతఃకరణాన్ని, ఆత్మను కర్మలను నా కర్పించి స్వాతంత్ర్యాన్ని విడిచి నన్నే భజిస్తూ ఉన్నాడీ.. హనుమ! కుంభ సంభవా! విను బరువును మోసేవాడు ఆ బరువును దించితే తేలికవుతాడు. అలాగే ఈ పదార్థ ప్రపంచంలోని వస్తుజాతాన్ని చూచి 'నాది! నాది! నాది!' అని అనుకొనే నానాత్వ భావనను విడిచి పెడితే జీవితంలో దుఃఖ భారాన్నుండి విముక్తుడవుతాడు.

వస్తువును విడిచి పెట్టటం అంటే వీథిలో పారెయ్యటం కాదు. విడిచి పెట్టవలసింది 'నాది' అనే గాఢమైన మమకారాన్ని, నానాత్వ భావనను మాత్రమే. మనం ఎంత గాఢంగా గుండెలకు హత్తుకొన్నా కాలం తీరి నప్పుడు కౌగిట్లో వస్తువైనా కనుమరుగై తీరుతుంది! అప్పుడు దుఃఖించటం కంటె సంయోగాలన్నీ వియోగం కొఱకే అనే జ్ఞానం కలిగి ఉండటం మంచిది కదా! వియోగం నుండి ఎప్పుడూ తప్పించుకొనలేం కాని దుఃఖం నుండి ఉపశమనాన్ని పొందవచ్చు.

మనకు కష్టసుఖాలు, లాభ నష్టాలు ఇత్యాదులు కలగటానికి నిత్యకారణం వేరే ఉంది. దానికి నిమిత్త కారణాన్ని ఆపాదించుకొని

రాగద్వేషాదులను పెంచుకొంటున్నాం. మనం చెయ్యవలసింది రాగద్వేషాదులకు లోను కాకుండా ప్రతిక్రియ మాత్రమే. అంతేకాని చేతులు ముడుచుకొని కర్తవ్యదూరులం కాకూడదు. సృష్టి అంతా ద్వంద్వం ద్వైతమూను. సృష్టికర్త అద్వైత స్వరూపుడు. అందువల్ల కర్మ ద్వైతం. జ్ఞానం అద్వైతం. జ్ఞాన కర్మ సముచ్చయం కుదరదు. అలా చేస్తే పెఱుగులో వడ్లగింజలను వేసికొని తినటానికి ప్రయత్నించినట్లే అవుతుంది.! కర్మకు భక్తికి పొత్తు కుదురుతుంది... పెఱుగులో పంచదార వేసికొన్నట్లే. జ్ఞాన మార్గం అత్యుత్కృష్టమైనది.

సృష్టిలో ద్వైతం అదెక్కడికి పోతుంది? అందుకని మనిషి జీవితంలోని ద్వంద్వాన్ని తప్పించుకోలేడు. కాగా మనిషికి ఈ లోకంలో 'కర్తవ్యం' ఒక్కటే మిగిలి ఉంది. శత్రువు విషయంలో ప్రతీకారం, స్నేహితుని విషయంలో సహకారం, సమస్యల విషయంలో పరిష్కారం , సంసారం విషయంలో మమకారం, సంఘం విషయంలో పరోపకారం, తల్లిదండ్రుల విషయంలో ప్రతిజ్ఞా పాలన, అఖిల జీవుల యందు భూత దయ.. ఇవన్నీ మనిషి యొక్క కర్తవ్య పాలనలో భాగాలే.

కర్తవ్యం అంటే చలికి దుప్పటి కప్పుకోటమే. లోకంలో చలి అదెక్కడికి పోతుంది? కాళ్ళుకాలుతుంటె కాళ్ళకు పాదరక్షలు ధరిస్తాం. అంతే కాని భూమండల మంతా తోలుతో కప్పగలమా? రోగానికి ఔషధసేవ ప్రతిక్రియ. ఆకలికి అన్నం పరిష్కారం.

"మహర్షీ! ఈ లోకంలో పుట్టిన ప్రతి మనిషికి కర్తవ్య పాలన తప్పించి వేరే ఆచరణ కృత్యం లేనే లేదు. మనిషి దినచర్య అంతా అదే కదా! ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అరుణోదయంతో దినచర్య ప్రారంభమవుతోంది. రైతు పొలానికి వెడుతున్నాడు. సైనికుడు యుద్ధభూమికి వెడుతున్నాడు. పొలంలో కృష్ణ సర్పం కాటుకు రైతు, శరాఘాతానికి సైనికుడు ప్రాణాలు కోల్పోతున్నారు. సూర్యాస్తమయంతో దినచర్య ముగుస్తోంది.

ఇందులో మనిషికి స్వతంత్రత ఎక్కడుంది? దీనినే అఖిల జీవులు కర్మపాశ బద్ధులు అంటున్నారు జ్ఞానులు.

దీనిపై కొంత పూర్వ పక్షం ఉంది. ఆకలికి అన్నం, చలికి దుప్పటి అందరికి లభ్యం కావటం లేదు కదా? అంటారు మా ఆస్థాన చార్వాక పండితుడైన జాబాలి వంటి వారు. నిజానికి జాబాలి నాస్తికుడు కానే కాదు. నైష్ఠికుడు. మా కొలువులో నాస్తిక వాదం చెయ్యటానికి మేం నియమించుకొన్న అదొక ఉద్యోగ ధర్మం. తరతరాలుగా ఇక్ష్వాకుని కాలం నుండి ఆ పదవి వస్తోంది. అదొక నాటకంలోని పాత్ర వంటిది. దీనిని తెలుసుకోలేక రాగ ద్వేషాదులను పెంచుకొంటున్నారు మూఢులు. వారు సంప్రదాయం తెలియని అవివేకులు. పూర్వ పక్షం లేకుండా సిద్ధాంతానికి బలమెక్కడిది? పూర్వ పక్షం ఎంత బలంగా ఉన్నట్లు కనిపించినా దాని బలం అంతా సిద్ధాంతాన్ని బల పర్చటానికే. కావ్యంలో ప్రతినాయకుని పరాక్రమ వర్ణన పరోక్షంగా నాయకుని ధీరోద్ధతను సమర్థించటానికే. పూర్వపక్షం ఎంత దీర్ఘంగా బలంగా ఉన్నట్లనిపించినా అది రోగం యొక్క వాపు వంటిది. సిద్ధాంతం ఎంత చిన్నదైనా అది మందు మాత్ర యొక్క బలం వంటిది. అందుకే ఉపనిషత్ సిద్ధాంత వాక్యాలు పొట్టిగా అల్పాక్షర సమన్వితమై ఉంటాయి.

అడవి నరక్క పోతే దారి ఏర్పడదు కదా? కలుపును పీకి పారేస్తే అది పరోక్షంగా పైరు వృద్ధికే దోహదపడుతుంది. పూర్వ పక్షీయులకు సమాధానంగా ప్రజలందరకు గృహారామ అన్న వస్త్రాదులను, విద్యావైద్య జల వనరులను ఇత్యాది ఇతర సౌకర్యాలను సమకూర్చవలసిన బాధ్యత ప్రజలను పాలించే రాజుదే అని రాజుకు విధిగా చెప్పబడింది. శ్రీమంతులకు దాన ధర్మాలను, సప్తసంతాన ప్రతిష్ఠను పుణ్యకార్యంగా చెప్పబడింది. పాలకులకు విధిగా చెప్పబడింది.

ఈ విధిని తరతరాలుగా మా వంశం నెరవేర్చుకొంటూ వస్తోంది కనుకనే ఇక్ష్వాకు వంశ రాజుల పాలనలో తల్లిదండ్రులు తమ బిడ్డలకు కేవలం

జన్మ హేతువులు మాత్రమే. మిగతా బాధ్యత అంతా రాజ్యానిదే అంటే రాజుదే అనే సదాచారపు మాట వ్యాప్తిలో ఉంది.

కుంభ సంభవా! 'నా శరీరం' 'నాది' ఇలాటి భావాల బరువును వదిలి బాహ్యాభ్యంతర విషయాలన్నిటిలోను నన్నే ఆత్మాకృతిగా భావిస్తూన్న పుణ్య పురుషుడు... ఈ హనుమ.

ఇతణ్ణి హరి యొక్క అవతారంగా వైష్ణవులు పూజిస్తారు. పరమేశ్వర స్వరూపంగా శైవులు ఆరాధిస్తారు. భవిష్యద్బ్రహ్మగా హిరణ్యగర్భోపాసకులు అర్చిస్తారు. జ్ఞానఖని అని వేదాంతులు కొలుస్తారు. తానొక్కడే అయ్యు పెక్కురీతుల వందనీయుడై పూజలందు కొంటున్నాడు... ఈ హనుమ! ఇతడు అన్నిట సమర్థుడు, అనవద్యుడు, అందరికి ఆత్మహితుడు. అఖిల లోకనుతుడు. ఇతని కంటె నాకు ఇష్టుడు లేడు. ఇతనికి నా కంటె ఇష్టవస్తువు లేదీ లోకంలో. బ్రహ్మరుద్రేంద్రాది దేవతానీకం నాకు సహాయులుగా ఈ లోకంలో అవతారమెత్తి వనచరులుగా పుట్టినప్పుడు వారందరిలో శ్రేష్ఠుడీ హనుమ. పుట్టీ పుట్టగానే త్రిమూర్త్యాత్మకుడైన సూర్యుణ్ణి మ్రింగబోయిన దిట్ట ఈ హనుమ. ఇతడు షడ్భావ విదూరుడు, త్రిగుణాతీతుడు. పంచేంద్రియాలను, మనస్సును, బుద్ధిని, అంతఃకరణాన్ని, శరీరాన్ని తన సమస్తాన్ని నాకే అర్పించి నా నామము నందే రమిస్తూ నన్నే జననీ జనక భావంతో కొలుస్తూ ఉండే పరమ భక్తాగ్రేసరుడీ హనుమ.

**భక్తులకు హనుమ ఇచ్చే వరాలు**

శంక మాని నిశ్చల భక్తితో అన్యచింతలు విడిచి మత్పరాయణుడైన హనుమను ఎవరైతే కొలుస్తారో వారికి అతని వంటి మహత్త్వాలు వస్తాయి. అజేయత్వం, అమర్త్యత్వం, ఇష్టకామ్యార్థ సిద్ధి, అమిత వాక్పటుత్వం, సుకవిత్వం, కామరూపత్వం, కాలజ్ఞానం, ఆకాశగమనం, సర్వజ్ఞత్వం, తత్త్వజ్ఞానం, నిగ్రహానుగ్రహం, నిర్మలత్వం, అవ్యయత్వం ఇంకా అనేక ప్రభావాలు ఆంజనేయోపాసకులకు కలుగుతాయి. మహర్షీ!

అందువల్ల మీరు ఇలాటి సూక్ష్మ భావాన్ని భావించి హనుమ దుపాసనను చెయ్యండి.” అని రామచంద్రుడు హితోపదేశం చేశాడు.

శ్రద్ధగా విన్న అగస్త్యుల వారిలా అర్థించారు “రామా! హనుమ పంచముఖుడన్నారే! ఆ విషయాన్ని తెలియ చెయ్యండి.”

**పంచముఖ ఆంజనేయ వృత్తాంతం.**

శ్రీరాముడిలా చెప్పసాగాడు. “మహర్షీ! ఒకప్పుడు కైలాసగిరి మీద గిరిజకు శంకరుడు చెప్పిన ఈ రహస్యాన్ని మీకు తెలియజేస్తున్నాను. వినండి.

ఒకనాడు ఏకాంతంలో పార్వతి శంకరుని జూచి “నాథా! లోక రక్షణకై హరి అనేక అవతారాలు ఎత్తాడు గదా! మీరు కూడా ఈ రూపం కాకుండా అన్యాకృతులను ధరించారా?” అని ప్రశ్నించగా....

“దేవీ! దుర్వాసుడు నా అవతారమే కదా! కాని ఆ అవతారం నా వలె మహత్త్వాన్ని పొందలేదు. ఆ లోపాన్ని తీర్చి భక్తులకు కొంగు బంగారమై కోర్కెలన్నిటిని తీర్చే నిమిత్తమై పంచకృత్య పరాయణుడనైన నేను... ఈ పంచముఖ ఆంజనేయ అవతారమై ఆవిర్భవించాను. ఈ అవతారంలో జ్ఞాన, విరక్తి, భక్తి, నయ, సాత్విక, సాహస, శాంతి, దాంతి, విద్య, నిపుణత, సత్వ, జవ, ధర్మ, దయ, గుణ, ధైర్య, నిశ్చలత, ధ్యాన, తపః ప్రభావాలన్నీ రూపుకట్టి ఉన్నాయి. ఈ అవతారాన్ని మించినది లేదు. నిశ్చల బ్రహ్మచర్యం ఈ అవతారం లోని విశిష్టత. ఈ పదునాలుగు లోకాలలోని జనులు ఈ అవతారాన్ని సంపూర్ణంగా అర్థం చేసికొని తమతమ సకల కర్మలను చక్కదిద్దుకొంటే వారికి ఇహపరాలు రెండూ కరతలామలకమే. పార్వతీ! నా ఈ రూపం ఆ పంచముఖ ఆంజనేయ రూపం రెండూ ఒకటే! కాని సగందేహం నీవైన ఈ రూపం ఎప్పుడూ నిన్ను విడిచి ఉండనిది. ఆ రూపం ఎప్పుడూ నిస్సంగత్వంతో అలరారేది.

దేవీ! పంచముఖ ఆంజనేయ స్వరూపం వానర, నారసింహ, గరుడ, వరాహ, హయ ముఖములు కలది. అనేక అలంకారములు కలది. పదిహేను నేత్రములు కలది. కాంతితో ప్రకాశించునట్టిది. పది చేతులలోను కత్తి, డాలు, పుస్తకము, అమృత కలశము, అంకుశము, పర్వతము, నాగలి, మంచపు కోడు, పాము, చెట్టు ఈ పది ఆయుధాలుగా ఉంటాయి.

ఉదయ భానుని వలె రమ్యమై కామితార్థాలనిస్తూ కపిముఖం తూర్పు దిక్కుగా ఉంటుంది.

శ్రీకరమై భయంకరమైన కోరలు గలిగి కనుబొమల ముడి తోటి చూపులు గలిగి మహాద్భుతమైన నారసింహ ముఖం దక్షిణ దిక్కుగా ఉంటుంది.

అద్భుత తేజో విరాజ మానమై, భయంకరమై, భక్తులకు భయాన్ని నివారిస్తూ, గొప్ప బలము, వజ్రాయుధం వంటి ముక్కు గలిగి విషభయాన్ని తొలగించే గరుడముఖం పశ్చిమ దిక్కుగా ఉంటుంది.

సమస్తమైన రోగాలను పోగొడుతూ, విషభూతములను నివారిస్తూ నల్లని దీప్తులతో అలరారే వరాహముఖం ఉత్తర దిక్కుగా ఉంటుంది.

హయముఖం ఊర్ధ్వ ముఖంగా ఉంటుంది. జ్వరాలను, రోగాలను పోగొడుతుంది.

పది ఆయుధాలను స్మరిస్తే చాలు అఖిల శ్రేయస్సులు కలుగుతాయి. ఆయా ముఖాలుగల దేవతలు ఇచ్చే ఫలాలను పంచముఖ ఆంజనేయు డొక్కడే ఈయగలడు. అనేక దివ్యాభరణ శోభితుడు, ఎఱ్ఱ చందనాన్ని మైపూతగా అలంకరించుకొన్న వాడు, ఎఱ్ఱని చీనాంబరాన్ని ధరించిన వాడు, ఎఱ్ఱని పుష్పాలను ధరించిన వాడు, రక్త వర్ణుడు ఐన పంచముఖ ఆంజనేయుణ్ణి ఏ యేవేళల ఎప్పుడు మనసులో స్మరించినా ఈప్సితార్థాలు వెంటనే నెరవేరుతాయి.

ఈ మంత్రాన్నే బ్రహ్మ కుమార స్వామికి ఉపదేశించాడు. అతడు విజయాన్ని పొందాడు. ఆ కథ చెపుతాను విను!

పూర్వం తారకుడనే రాక్షసుడు లోకాలను బాధిస్తూ ఉండేవాడు. కుమారస్వామి వానితో చాలా కాలం యుద్ధం చేసికూడా విజయాన్ని పొందలేక పోయాడు. వేలుపులు ఆ విషయాన్ని బ్రహ్మకు విన్నవింపగా షణ్ముఖునకు ఆయన పంచముఖ ఆంజనేయ మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ విధంగా తారకాసుర సంహారం పూర్తయింది.”

హనుమ మాహాత్మ్యాన్ని శ్రద్ధతో విన్న పార్వతి “నాథా! హనుమకు సంబంధించి ఇంకా ఎన్ని మంత్రాలున్నాయి? ఇంకా ఎన్ని దివ్యరూపాలున్నాయి. చెప్పవలసింది” అని అడుగగా ఈశ్వరుడిలా చెప్పసాగాడు.

“దేవీ! అక్షరాలన్నీ అతని స్వరూపమే! అక్షరాధిష్ఠాన దేవత లందరు ఆయన స్వరూపాలే. వేదరాశి అనంతం కదా! హనుమ కూడా అనంతుడు.”

శతానందా! ఈ విధంగా శివుడు పార్వతికి చెప్పిన హనుమత్ స్వరూప మంత్ర జపవిధాన మహిమ లన్నిటిని రాముడు సవిస్తరంగా అగస్త్య మహర్షికి బోధింపగా శ్రద్ధతో విని కృతార్థుడ నయ్యానని పలికి స్వస్థానానికి చేరుకొన్నారు మహర్షి. హనుమ యొక్క అవతారం కేవలం లోకోపకారం కొఱకే.

దీనిని పఠించినా వినినా శాశ్వత భోగ భాగ్య అష్టైశ్వర్యాలు కలుగుతాయి అని వసిష్ఠుడు తెలుపగా శతానందుడు “మహర్షీ! హనుమత్కథలు వినగా వినగా చాలా చిత్రంగాను, ఇంపుగాను ఉన్నాయి. తరువాత వృత్తాంతం చెప్ప వలసింది” అని కోరగా వసిష్ఠుల వారిలా చెప్ప సాగారు.

## శ్రీకృష్ణుడు హనుమచే సత్యభామా, గరుత్మంతులకు నారద - తుంబురులకు గర్వభంగము చేయించుట.

**గరుత్మంతుని బలపరాక్రమాల వర్ణన**

“శతానందా! విను! విష్ణు వాహనమైన గరుడుని గర్వాన్ని

ఖర్వం చేసిన హనుమ యొక్క చిత్ర వృత్తాంతాన్ని చెపుతాను. గరుడుడు సామాన్యుడు కాడు. సర్వ లోకాలను తన కుక్షిలో దాచుకొన్న విష్ణువును భరించే వాడు. ఇంద్రుని వజ్రాయుధం దెబ్బకు అతనికి ఒక రోమం మాత్రమే ఊడింది. అతని పేరు విన్నంత మాత్రాన సర్పకులం వణకి పోతుంది. అతని ధాకకు తట్టుకోలేక స్వర్గం గడగడ లాడింది. అటువంటి విష్ణు వాహనమైన గరుడుని తన వాలాగ్ర రోమంచేత నేలకు కొట్టాడు హనుమ! తుంబురు నారదులను గానంలో ఓడించాడు."

అంత శతానందుడు ఇలా ఆశ్చర్యంతో అడిగాడు. "భగవాన్! మీరు చెప్పిన విషయం చాలా వింతగా ఉంది. రామ బంటు ఐన హనుమ ఏ యుగంలో గరుడునికి గర్వభంగం చేశాడు. నారద తుంబురులకు ఎలా గర్వభంగం చేసాడు? అసలు వివాదం ఎప్పుడు ఎందుకు వచ్చింది? చెప్పవలసింది" అని కోరగా వసిష్ఠుల వారిలా చెప్పసాగారు.

## ద్వారకలో కృష్ణుని వృత్తాంతం

" శతానందా! విను! ద్వాపరాంతంలో భూభారాన్ని తగ్గించటానికై అవతార మెత్తిన కృష్ణుడు ద్వారకను రాజధానిగా చేసికొని అమానుష మహామహిమోజ్వలంగా పరిపాలిస్తున్నాడు. ద్వారక యొక్క వైభవం వర్ణించలేం! ఏ యుగంలోను అలాటి పట్టణం లేదు. కృష్ణుడు తన మహిమను, చాతురిని ఉపయోగించి దానిని కట్టాడు. శ్రీరుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద, భద్ర, సుదంత, కాళింది, లక్షణ ఇలా అష్టమహిషులే కాకుండా ఇంకా అనేక మంది ఇంతులతో కూడి ఇష్టకథా వినోదాలతో ప్రొద్దుపుచ్చుతూ ఉండేవాడు.

## సత్య గర్వం

అందునా భోజకన్య ఐన సత్యభామను విశేషించి చనవుగా లాలించే వాడు. ఆ కారణంగా సత్యభామలో కించిత్ గర్వం పొడసూపింది. సవతులందరిలోను తనను ఎక్కువగా కృష్ణుడు

మన్నిస్తాడని అహంకరించేది! నారదమౌని ఇచ్చిన దేవపారిజాతాన్ని రుక్మిణి కిచ్చినప్పుడు తాను అలుక పూనగా తన పాదాలంటి ప్రార్థించాడని ఉబ్బిపోయేది! గరుడ వాహనం మీద తనను ఎక్కించుకొని దేవతా పూజ లందించాడని విఱ్ఱ వీగేది. పాక శాసనుని గెల్చి పారిజాతాన్ని తెచ్చి తన పెరటి చెట్టుగా నాటించాడని పొంగిపోయేది! సకల సౌభాగ్య సౌందర్య సౌకుమార్య లక్షణాలలో తానే అధికురాలనని తోటి వారలను సరకు సేయక సంచరించేది! ముఖ్యంగా నరకాసుర వధ, పారిజాత కథతో ఆమె అహంకారం హద్దులు మీరింది.

**గరుడుని గర్వం**

పారిజాతాన్ని పెకలించి పెరటి చెట్టుగా నాటిన సందర్భంలో కృష్ణుడు గరుడుని చూచి "ఓ! వైనతేయా! నువ్వు ఉండబట్టి గదా ఈ దుష్కర కార్యాలు నెరవేరాయి" అని ప్రశంసించాడు. ఆ మాటకు గరుడినిలో గర్వం పొంగింది. తనలో తానిలా తలపోసి ఉబ్బితబ్బిబ్బయ్యాడు. "జవసత్వాలు కలవారిలో సకల లోకాలలోను నా అంతవాడు లేనే లేడు. విష్ణుభక్తులలో వైనతేయుడనైన నేనే అగ్రగణ్యుణ్ణి! ఏ కార్యానికైనా జనార్దనునకు నేనే సహాయం. విశ్వంభరుని భరించు వాడిని నేనే!"

**తుంబురు నారదుల వృత్తాంతం**

ఈ విధంగా గర్వంతో విఱ్ఱవీగుతున్న సత్యను, గరుడుని చూచి ఎలాగైనా వీరిద్దరికి గర్వభంగం చేయాలనే సంకల్పంతో ఉపాయాన్ని వెతుకుతున్నాడు కృష్ణ పరమాత్మ. ఆ సమయంలో ఒక రోజున కైలాస శిఖరిపై పార్వతీ సహితుడై మహాదేవుడు ప్రమథగణ పరివృతుడై పేరోలగంలో ఉన్నవేళ తుంబురు నారదులు వచ్చి నాద శరీరుడైన శంకరునకు తమ గానాన్ని వినిపించారు. ప్రణవ వాచ్యుడైన పరమాత్మ వారిద్దరిని చాలా ఎక్కువగా మెచ్చుకొన్నాడు. దానికి నిర్భర సంతోష తరంగితాంతఃకరణులైన

తుంబురు నారదులు ఆ మెచ్చుకోలు చాలదన్నట్లు మా ఇద్దరి గానంలోను మీకు ఎవరి గానం ఎక్కువ రక్తిగా తోచింది అని అడిగారు. దానికి సమాధానంగా సర్వజ్ఞుడైన ఈశ్వరుడు మీ విషయం బ్రహ్మను అడిగి తేల్చుకోండి అని చెప్పి పంపించాడు.

**కలహం**

వారిద్దరు బ్రహ్మ సన్నిధికి బయలు దేరారు. దారిలో నేనెక్కువ అంటె నేనెక్కువ అని ఇద్దరూ కలహించుకొన్నారు. సత్యలోకంలో ఉన్న విధాతను సందర్శించి తమ తగవును ఆయన ముందుంచి న్యాయ నిర్ణయం చేయమని కోరారు. సరస్వతీ స్వరూపమైన సంగీత – సాహిత్యాలను అభ్యసించి కూడా దాని పరమార్థాన్ని గ్రహింపలేక ఎక్కువ తక్కువ లెంచుకొంటూన్న వారి అహంకారానికి తగిన గుణపాఠం చెప్పాలని తలపోసి వారిద్దరిని ద్వారకాధీశుడైన శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళమని సూచించాడు బ్రహ్మ.

**తుంబురు నారదులు ద్వారకకు వచ్చుట.**

విధాత ఆలోచన మేరకు తుంబురు నారదులిద్దరు భూమికి దిగి దారిలో కనుపించిన విశేషాలను అవలోకిస్తూ ద్వారకను చేరారు. ద్వారకలో కృష్ణుడు సత్యభామా మందిరంలో ఉన్నాడని తెలుసుకొని అంతఃపురంలో కొన్ని కక్ష్యలు నడిచి తమరాకను కంచుకికి ఎఱిగించారు. వాడు లోపలికి పోయి భామా సమేతుడై ఉన్న హరికి ఆ విషయాన్ని విన్నవించాడు. ఆ వార్త విన్న వెంటనే వాసుదేవుడు బంగరు తూగుటుయ్యేల దిగి పుక్కిటి పచ్చకప్పురపు తాంబూలాన్ని పన్నీరుతో పుక్కిలించి ఉమిసి కనుసన్నతో సత్య బంగారు పళ్ళెరంలో అర్ఘ్యపాద్యాదులను తీసికొని రాగా తుంబురు నారదులకు ఎదురు వచ్చాడు. వచ్చి నమస్కరించి తగురీతి మర్యాదలను జరిపి మేడపైకి తోడుకొని వెళ్ళాడు. వారిద్దరిని తమ్మిపూ గద్దియపై ఆసీనులను చేసి వారి అనుమతితో తాను కూడా

ఉచితాసనాసీనుడై "ఓ! గాయక సార్వభౌములారా! వచ్చిన పని చెప్పవలసింది" అని ప్రార్థించాడు. విద్యాహంకారంతో విఱ్ఱవీగుతున్న వారిద్దరు తమ తగవును మాధవుని ముందుంచి న్యాయనిర్ణయం చెయ్యమన్నారు.

జగన్నాటక సూత్రధారి, లీలామానుష విగ్రహుడు ఐన దేవకీ నందనుడు వాళ్ళ అహంకారం అణగించ వలసిందే అనుకొన్నాడు. వీరిద్దరితో పాటుగా గరుడునికి, సత్యభామకు కూడా అహంకార నిర్మూలనం చెయ్యవలసిందే అని సంకల్పించాడు. అన్నీ కలసి వచ్చాయి. ఇదే తగిన సమయం అని అనుకొని తుంబురు నారదులతో ఇలా అన్నాడు. "గాయక సమ్రాట్టులారా! మీ సంగీత విద్యలో ఎక్కువ తక్కువ లెంచటానికి... సకల విద్యా రహస్యవేది, సకలామ్నాయ శేముషీ ధురంధరుడు, భవిష్యద్బ్రహ్మ ఐన హనుమ సమర్థుడు. అతణ్ణి పిలిపిస్తాను" అని గరుడుని స్మరించాడు.

**గరుడుని హనుమను తోడి తెమ్మనుట**

వెంటనే అక్కడ శ్వేత ద్వీపంలో ఉన్న గరుడుడు పైకి ఎగిరాడు. ఆ చలనానికి అక్కడి బంగారపు ఇసుక మేఘాల్లా లేచింది. ఱెక్కల గాలికి చుక్కలు రాలాయి. సముద్రం పాయ విచ్చగా పాతాళంలోని పాములు పారిపోయాయి. మేని కాంతులకు రవిబింబం అదృశ్యమైంది. పంకజనాభుడు సంకల్పించిన మాత్రంలోనె ప్రత్యక్షమైన గరుడుని చూచి లేత నవ్వొలయ ఇలా అన్నాడు.

"సుపర్ణా! తేజోబల ప్రావీణ్యాలలో నీతో సముడెవ్వరు లేరు! ఈ తుంబురు నారదు లిద్దరు సంగీత విద్యలో తమ మధ్యగల ఆధిక్యతను నిర్ణయించమని కోరారు. నిర్ణయించగల సమర్థుడు గంధమాదనగిరి మీద కదళీవనంలో కల్పవృక్షచ్ఛాయలో ఉన్న హనుమద్బ్రహ్మ మాత్రమే. కనుక నువ్వు వెళ్ళి తక్షణం అతనిని తీసికొనిరా. "

**గరుడునకు అవమానంగా తోచుట.**

కృష్ణుడు చెప్పిన పని తనకు అవమానంగా తోచి గరుడుడిలా అన్నాడు. "నందకుమారా! నా సత్వం నా జవం నా భక్తి నా ఔన్నత్యం నా ఆభిజాత్యం అన్నీ తెలిసి కూడా నన్నిలాటి నీచ కార్యానికి ఆజ్ఞాపించటం తగునా? ఒక కోతిని తీసికొని రావటానికి నా అంతటి వాడు వెళ్ళాలా? అతను నా కెందులో సమానుడు? ఒక పనిని చెప్పేముందు హెచ్చు తగ్గులు చూడవద్దా? చివరకు మంచి సమ్మానమే చేశావు! సరే మీరాజ్ఞాపించాక కాదనకూడదు కనుక వెడుతున్నాను.

అలా తానేదో తనను అవమానించినట్లు భావించి కుమిలిపోతున్న వైనతేయుణ్ణి చూచి జాలిపడి ప్రేమతో ఆలింగనం చేసికొని హరి ఇలా అన్నాడు "సుపర్ణా! విచారించకు. ఇది నీకు అవమానం కాదు. గౌరవమే. సాక్షాదీశ్వరుడు, రామ భక్తుడు, భవిష్యద్బ్రహ్మ ఐన హనుమ సామాన్యుడా? ఆ కదళీవనాన్ని చేరటం ఇతరులకు దుర్లభం. అందుకే ఈ పనిని నీకు చెప్పాను."

**గరుడుడు హనుమ వద్దకేగుట**

అని పలికిన వాసుదేవునితో "కృష్ణా! ఉత్తమ జాతి కెంపును ఇత్తడిలో పొదిగితే రత్నానికి నిందరాదు గదా? తారతమ్యాన్ని తెలుసుకోకుండా దాసుణ్ణి ఏలిన యెడల ఆ కొఱత ఏలిన రాజుకే కాని దాసుని కేమి కొఱత? నీ ఆజ్ఞను నెరవేరుస్తాను. వెడతాను. ఆ వానరుణ్ణి పిలుస్తాను. రాకపోతే నా లావు చూపిస్తాను" అని మింటి కెగిరాడు. అతని ఱెక్కల సుడిగాలికి పర్వతాలు కంపించాయి. విమానాలు చెదిరాయి. దిక్కులు అదిరాయి. అమిత వేగంతో వచ్చి కాంచన కదళీ వనాన్ని ప్రవేశించాడు వైనతేయుడు.

చాలా కాలంగా భూభారాన్ని వహించి విశ్రాంతి తీసికొంటూన్న ఆదిశేషువులా... తన తోకను పెంచి కోటలా చుట్ట చుట్టుకొని నడుమ కూర్చున్నాడు హనుమ. తనను గౌరవించ నందుకు గరుడునికి కోపం

వచ్చింది. ఇలా అనుకొన్నాడు. ఎంత రాజసం! అవును ఎంతైనా కోతి కోతే గదా! కృష్ణుడేవో చాలా చెప్పాడు గాని జాతి కొలది బుద్ధులు. అవెక్కడికి పోతాయి? లోకంలో మనుష్యులలో బ్రహ్మచారిని శతమర్కట తుల్యుడు అంటారు. కోతులలో బ్రహ్మచారిని ఏమనాలి? నా పక్ష విక్షేపం ముందు ఇతడు ఏ పాటి నిలువగలడు? మశకంలా ఎగిరిపోడా? అని అహంకరించి ప్రళయ సాగరాన్ని ఎదుర్కొన్న సైకత ద్వీపంలా, విలయాగ్నిని మార్కొన్న మిడుతలా హనుమ వాలాన్ని కదల్పబోయాడు గరుడుడు.

### గరుడుని అహంకారం

దిక్కు లల్లాడేటట్లు ఱెక్కలను విసిరాడు! త్రిలోకాలు కంపించేటట్లు కహకహార్భటులతో ముక్కుతో పొడిచాడు. ఆకాశం అంటుకొనేటట్లు కండ్ల మంట లెగయ గోళ్ళతో చీరాడు. దేవతల గుండె లదిరేటట్లు మింటి కెగిరాడు. ఎలాగైనా తోకను కదల్చుదామని తన తోకను ఝాడించాడు. ప్రయోజనం లేకపోయింది. ఆది మధ్యాంత రహితమైన ఆ వాలాన్ని తూలింపలేక కూలబడి జాలిని పొంది ఇలా అనుకొన్నాడు.

"నా ఱెక్కల గాడ్పుకు చక్రవాళం కూలుతుంది. నా ముక్కు పోట్లకు ఆదికూర్మం వీపు పగులుతుంది. నా వాడి గోళ్ళ పదునుకు ఇంద్రుని వజ్రాయుధం పొడియై రాలుతుంది. నా శరీరం రాపిడికి ఆదివరాహం శరీరం చిట్లుతుంది. అలాటిది ఈ కోతి తోక కూలదు! పగులదు! రాలదు! చిట్లదు! దీనికి ఇంత మహిమ ఎలా వచ్చింది?

ఇలా పరిపరి విధాల చింతించి కోటలా ఉన్న తోకను దూకి లోపలకు ప్రవేశిద్దామని ఎంచి పైకి ఎగిరాడు. తన బంగరు ఱెక్కల కాంతి సూర్య మండలాన్ని కప్పేయగా హనుమ తోక ఎత్తుకి పైకి ఎగిరాడు. హనుమ వాలం ముందు సుపర్ణుడు సూర్యుని ముందు మిణుగురు పుర్వులా, ఏనుగు ముందు దోమలా, చంద్రుని ముందు చుక్కలా ఉన్నాడు. ఎంత ఎత్తు ఎగిరినా వాలం యొక్క అంతం కనిపించ లేదు సరిగదా... గరుడినికి చెమట

లెక్కువయ్యాయి. గుండె తల్లడిల్లింది. ముఖం వెలవెలబోయింది. పాదాలు తడబడ్డాయి.

మాయను దాటలేక వైనతేయుడు ఇలా అహంకరించాడు. "ఈ కోతికి ఉచితజ్ఞత లేదు. విష్ణు వాహనమైన నన్ను అవమానిస్తాడా? ముందు ప్రియంగా పిలుస్తాను. పలుకక పోతే నా చేవ చూపుతాను" అని నిశ్చయించుకొని "ఓ! కపీంద్రా! అచ్యుతుడు, పద్మదళాయతాక్షుడు, ద్వారకాపుర వాసుడైన కృష్ణుడు నిన్ను పిల్చుక రమ్మన్నాడు" అని పలుమార్లు పిలిచాడు. రామభక్తి సామ్రాజ్యంలో ఉన్న హనుమకు ఆ మాటలు చెవికెక్క లేదు.

**గరుడిని గర్వభంగం**

వైనతేయునికి ఆగ్రహం కట్టలు త్రెంచుకొంది. ఇలా అనుకొన్నాడు. "ఔరా! ఈ కోతికి ఎంత గర్వం! బ్రహ్మాది దేవతలు, పంచభూతాలు సైతం ఎవని ఆజ్ఞకు లోబడి భక్తితో కొలుస్తూ ఉంటారో అట్టి హరి రమ్మంటే విని రాడు! మారు మాటాడడు! ఇట్టి వివేకహీనుని శిక్షించాల్సిందే" అని గోళ్ళతో అదిమి ముక్కుతో పొడిచి అటు ఇటు ఊపసాగాడు. దానిని గమనించిన హనుమ అలవోకగా ఒక్కసారి తోకను కదిలించాడు. ఆ కాస్త విదళింపుకే పట్టు తప్పి, ఱెక్కల బలముడిగి, చక్రంలా గిరగిర తిరుగుతూ, ఒడలు తెలియక, చెమటలు కారగా, నిస్సత్తువ ఆవహింపగా, మేరునగం ఎగిరి వచ్చి పడిందో అన్నట్లుగా ద్వారకాధీశుని కొలువులో వచ్చిపడ్డాడు. నెత్తురు కారగా, శరీరం తేజోహీనం కాగా సొంపు దిగజారగా, ఱెక్కలను కదల్పలేక విన్నదనంతో మూర్ఛిల్లిన సుపర్ణుని చూచాడు కృష్ణుడు.

**కృష్ణుని పరిచర్యలు**

గరుడుని భంగపాటుకు గల కారణాన్ని ఎఱిగి కూడా ఏమీ ఎఱుగని వానివలె "అయ్యో! పన్నగవైరీ! ఈ విన్నబాటు నీకెలా సంప్రాప్తమైంది? మున్నెన్నడు ఇట్టి

పాటెరుగవు కదా? ఎవరి వల్ల నీకీ కీడు సంప్రాప్తమైంది?" అని ఊరడింపు మాటలతో అదిరిపాటుగా పీఠం దిగి ఉత్తరీయం జాఅగా రెండువైపుల రుక్మిణీ సత్యలు తత్తఅపాటుతో రాగా గరుడుని ఎత్తి తొడమీద కూర్చుండ పెట్టుకొని రక్తాన్ని తుడిచి దయతో ఎన్నో సేవలు చేసి తిరిగి తెలివి రప్పించాడు. ఉత్తరీయంతో తడియొత్తి, చిక్కుపడ్డ ఱెక్కల ఈకలను సవరించి, తలక్రింద చేయి ఉంచి శిరసెత్తి కర్ణ మధురంగా మేలి పలుకులాడి, సురటితో విసరి, శరీరం అంతా తన చేత్తో తడిమి వేదనను తొలగించి తన కటాక్షామృతంతో జీవాలను నిలిపాడు... కృష్ణుడు.

మెల్లగా కన్నులు తెఱచి చూచాడు గరుడుడు. కృష్ణుని ముఖం చూచి సిగ్గుపడ్డాడు. అప్పుడు పద్మనాభుడిలా పలుకరించాడు. "విష్ణు భక్తాగ్రగణ్యా! నీ వంటి వానికీ చేటు ఎలా వచ్చింది? కేవల వనచరునిగా భావించి హనుమను ఢీకొన లేదుగదా? అతడు వినా నిన్నెదిరించే వీరుడు లేడు ఈ లోకంలో. హనుమ పేరు విన్న మాత్రాన బ్రహ్మరుద్ర ఇంద్రాదులు చేతులు జోడించి నమస్కరిస్తారు. నీవు వివేకివి కనుక వినయంగా మాట్లాడతావని అతని చెంతకు నిన్ను పంపాను. నువ్వు కొంచెం తొందరపడి ఉంటావు. అవునా? రామభక్తి రసాయనంలో మునిగి తేలుతూ హనుమ నిన్ను పట్టించుకొని ఉండడు! దానిని నీవు గర్వంగా భావించి ఉంటావు! అంతే జరిగి ఉంటుంది. అవునా?"

దానికి వైనతేయుడు ప్రణామం చేసి సన్నని ఎలుగుతో గ్రుడ్లనీరు గ్రుక్కుకొంటూ "అచ్యుతా! ఇంత జరిగాక నాకేలా జంకు. విను! హనుమ తోక దెబ్బకు నా శౌర్యలీలావైభవం అంతా పనికిమాలింది ఐంది. ఇదంతా నీ ఉపదేశాన్ని పెడచెవిని పెట్టటం వల్ల సంప్రాప్తించింది" అన్నాడు.

దానికి వాసుదేవుడు నవ్వి "ఓ విష్ణు వాహనా! ఎంతటి వారికైనా ఒక్కొక్కప్పుడు బుద్ధి మందగిస్తుంది. పరితపించకు. సీతారాములు పిలుస్తున్నారు. అని పిలువు. హనుమ వెంటనే వస్తాడు" అని రామమంత్రాన్ని ఉపదేశించాడు.

**గరుడుడు హనుమను వినయంతో ద్వారకకు తోడి తెచ్చుట**

ఖగరాజు తక్షణమే గంధమాదనాన్ని చేరుకొన్నాడు. హనుమ వాలం చెంత నిల్చాడు. మనసులో ఇంకా భయం పోలేదు. ఐనా ధైర్యం చేసి "ఓ సీతాశోక వినాశకా! శ్రీరామ పాదసేవా ధురంధరా! ఓ! మహావీరా! ఓ భవిష్యత్ చతురాననా! అంజనాగర్భ సంభూతా! సీతారాములు మిమ్ములను పిలుస్తున్నారు. వారిప్పుడు ద్వారకలో సుఖస్థితిలో ఉన్నారు" అని వినయంగా పిలిచాడు.

సీతారాములనే మాట చెవిని పడగానే శీఘ్రంగా లేచి కనుగొలకుల ఆనందాశ్రువులు రాల శిరసువంచి చేతులు జోడించి వినయంతో విష్ణురథుని చూచి "మహాత్మా! నీ వల్ల కదా సీతారాముల పవిత్ర నామాలను నేడు వినగలిగాను. నా తపసు ఫలించింది. నా సంకల్పం నెరవేరింది. సీతారాములు పిల్వుమని చెప్పిన వార్తను తెచ్చిన నీ విషయంలో అపరాధం చేసిన అజ్ఞానిని! మన్నించు!" అని పల్కి పారవశ్యంలో మునిగి పోయాడు...హనుమ.

అప్పటికి మాయతెఱ తొలగగా జ్ఞానబోధ కలిగి వైనతేయుడిలా అన్నాడు: "త్రిజగత్సేవ్యుడవు! మహామహిమాన్వితుడవు! నిరంతర రామనామ జపధ్యాన ధురీణమతివి! ఆమ్నాయార్థ నిర్ణేతవు! తమరిలా అర్థించవచ్చా? నేనే అజ్ఞానిని! నన్ను మీరు మన్నించాలి." ఆ మాటలకు ప్రీతుడై ఖగరాజును కౌగిలించుకొని వెంటనే అతని వెంట ద్వారకాపురికి బయలుదేరాడు హనుమ. ఇదే సీతారాములు ఉంటున్న ద్వారకా నగరం అని గగనాన నుండి సుపర్ణుడు చెప్పగానే చేతులు మోడ్చి నమస్కరించాడు హనుమ. ఇద్దరూ క్రిందకి దిగారు. కృష్ణ మందిరాన్ని సమీపించారు. పక్షిశ్రేష్ఠుడు కృష్ణుని సందర్శించి మీ బంటైన హనుమ మీ ఆజ్ఞ మేరకు విచ్చేసి వేచియున్నాడని చెప్పాడు.

**సత్యభామా గర్వభంగం**

వెంటనే కృష్ణుడు సత్యభామను చూచి "సత్యా! సీతారాములు నిన్ను రమ్మన్నారని

పిలిపిస్తే వచ్చాడు హనుమ. మనం ఆ రూపాల్లో దర్శన మివ్వక పోతే కార్యం చెడుతుంది. కనుక నేను రామత్వాన్ని వహిస్తాను. నువ్వు సీతగా రూపాంతరం పొందు” అన్నాడు. ఆ మాటలకు సత్యభామ నివ్వెరపోయి అదెలాగో తెలియక సిగ్గుతో ముఖం దించుకొని అహంకారం నశించగా గోడమీది బొమ్మలాగ నిలబడిపోయింది. అంత జగన్నాటక సూత్రధారి ఐన కృష్ణుడు రుక్మిణి వైపు చూచాడు.

### రుక్మిణీ కృష్ణులు సీతారాములుగా దర్శన మిచ్చుట

శతానందా! వింటున్నావా! ఈ చిత్రం విను! ఏ శ్రీదేవి నాగేటి చాలున పుట్టి జనకుని ఇంట పెరిగిందో; ఏ శ్రీలక్ష్మి శివధనుర్భంగాన్ని అలవోకగా నెరవేర్చిన శ్రీరామునికి ఇల్లాలైందో; ఏ శ్రీమాత అహల్యా శాప విమోచనాన్ని కల్పించిన రామునికి ప్రాణప్రియ ఐందో; ఏ చిత్‌శక్తి స్వరూపిణి, పరాశక్తి రావణ సంహారం కొఱకు సీతగా అవతరించి రాఘవునికి సహధర్మచారిణి ఐందో; ఆ సీతా స్వరూపమే రుక్మిణీకాంత కావున ఆమె క్షణంలో సీతగా దర్శనమిచ్చింది. కొలువున ఉన్న వారంతా ఆశ్చర్యపోయారు.

ఇక మాధవుడు శ్రీరామ చంద్రమూర్తిగా దర్శన మిచ్చిన వైనం చెపుతాను విను. ఇంద్రనీలాలంకృత సౌధాగ్రం మీద మెఱిసే రత్నకుంభాల వలె శిరమున మణికిరీటం విరాజిల్లగా; వికసించిన కల్పవృక్ష ప్రసూన మకరందేచ్ఛతో భ్రమరకులం మూగినట్లు ముంగురులు చలించగా; లేత తమలపాకుల వంటి చెక్కిళ్ళ మీద వికసించిన కుసుమ శోభను మించి మందహాసం మెఱయగా; శరీరానికి మైపూతగా అలదుకొన్న శ్రీగంధ పరిమళానికి ఆశించి వచ్చిన మహాభుజంగాల వలె దీర్ఘ బాహువులు కనువిందు సేయగా ఆయా అవయవాలకు తగినట్లు అలంకరించుకొన్న రత్న భూషణోజ్వల కాంతులతో శ్రీరుక్మిణి వామాంకము నందు అధివసింపగా రుక్మిణీ కృష్ణులు సీతారాములై దర్శన మిచ్చారు.

హనుమను తోడితెమ్మని ఖగరాజును ఆజ్ఞాపించాడు మాధవుడు. అధిక భక్తియుక్తులతో వచ్చాడు ఆంజనేయుడు. ఎదురుగా... మొలక నవ్వుల జిలుగు వెన్నెలలు కురిపిస్తూన్న వారిని; కొలిచిన వారి కోరికలను తీర్చే కూరిమి దంపతులను, మెఱుగు చెంతనున్న మేఘంలా కళలుట్టిపడే కాంతిమూర్తులను, నిశ్చలమైన మనస్సుతో చింతింప తగిన జ్ఞాన స్వరూపులను, సీతారాములను సందర్శించి సంభ్రమంతో 'కృతార్థోస్మి' అని పలికి సాష్టాంగ నమస్కార మాచరించి చేతులు జోడించి పరిపరి విధాల స్తుతించాడు హనుమ.

**నారద తుంబురుల గానాధిక్యతను హనుమను నిర్ణయించమనుట**

రామునిగా దర్శన మిచ్చిన హరి హనుమను గాఢంగా ఆలింగనం చేసికొని ఇలా అన్నాడు: "కుమారా! మారుతీ! నీ ఉల్లంలో ఎల్లవేళలా మమ్ములనే చింతిస్తూ తపస్సులో ఉన్న నిన్ను పిలిపించిన వార్త ఏమంటే: ఈ తుంబురు నారదుల గానంలో ఉన్న తారతమ్యాన్ని పరీక్షించి గానాధిక్యతను నిర్ణయించాలి. అందుకే నీ యొద్దకు వైనతేయుని పంపించాను."

ఆ మాటలు విన్న హనుమ చేతులు జోడించి "స్వామీ! మీ ఆజ్ఞ కాదనరాదు గాన నెరవేరుస్తాను. "గాంధర్వేచ భువిశ్రేష్ఠో బభూవ భరతాగ్రజః" అని సత్కవీశ్వరుడైన వాల్మీకిచే స్తుతింప బడిన గాంధర్వ విద్యాధురంధరులు కదా మీరు! సరే! దీనిని దైవ సంకల్పంగా భావించి నే నెఱిగిన మేరకు నిర్ణయిస్తాను. బొమ్మలాట వాడు బొమ్మలను ఆడించినట్లు జంతువులను త్రిప్పేవారు మీరే కదా! జీవులకు స్వాతంత్ర్యం ఎక్కడుంది?" అన్నాడు.

**నారద తుంబురులు తమ గానాన్ని హనుమకు వినిపించుట**

రాముని పాద పీఠాన వసించి "ఓ! గాయక మణులారా! త్రిజగన్నుతులైన

మీ గానకళా తారతమ్యాన్ని ఎంచటానికి నేనెంత వాణ్ణి? ఈ సీతారాముల సన్నిధిలో ఒక్క రాగాన్ని ఆలాపించండి” అన్నాడు హనుమ.

హనుమ పలుకు లాలించి నారద తుంబురు లిద్దరు గవుసెన లూడదీసి వీణలు చేబూని తంత్రులు మీటి బిరడలు బిగించి రాగానుసారిగా శ్రుతులను సరిచేసికొని వీణకున్న తుంబీఫలం యొక్క ముఖాన్ని అంటె కరివెను నిమిరి ఒక్కసారి జాఱువాటుగా మీటి స్వరశుద్ధిగా గమక యుక్తంగా అలంకారాలు, కొన్ని గీత ప్రబంధాలను సుధామధురంగా పలికించి తానమానాలతో రాగాన్ని రక్తిగా పలికించారు. వారి గానాన్ని ఆలకించి హనుమ “స్వర సందర్భం సెహబాసు! శ్రుతులు మేలుమేలు! ఠాయం అద్భుతం! ఆలాపన బాపురే! గమకాలు కర్ణపర్వం! గీత సరణి ఔరౌరా! ముక్తాయి భళా!” అంటూ మెచ్చుకొన్నాడు. “ఇలాటి సంగీతాన్ని తేల్చి చెప్పటం నా తరమా? ఐనా నే నేర్చిన కొన్ని గీతాలను సీతారాములకు వినిపిస్తాను. మీరుకూడా వినండి!” అన్నాడు.

మారుతి మెచ్చుకోలు వారిద్దరికి ఆనందదాయకమే ఐనా ‘నా సంగీతం వినండి’ అని హనుమ అనటం వారిద్దరికి నచ్చలేదు. ‘కోతులన్ని కలిసి సభ తీరిస్తే కొండముచ్చు అగ్రాసనాధిపత్యం వహించినట్లు’... ఈ కోతి సంగీతాన్ని తాము వినాలా అని విసుక్కొన్నారు. అంత సంగీతాన్ని తాము వినిపించాక ఇంకా వినిపించటానికి ఏం మిగిలింది? అని వారి అహంకారం. తమ గానం ముందు ఇతరుల గానం రక్తి కట్టదని వారి నమ్మకం. అతి వినయం, ధూర్తత వెల్లడి కాగా వారిద్దరు తమ వీణలను హనుమ కందించారు. నారదుని చేతి వీణెను తీసికొని తంత్రులను బిగించి రక్తిగా పలికించసాగాడు హనుమ.

## హనుమ సంగీత పాండిత్యం

**ఓం కార స్వరూపం**

శతానందా! విను! హనుమ యొక్క సంగీతశాస్త్ర పాండిత్యాన్ని కొద్దిగా చెపుతాను. ‘అ’ కార ‘ఉ’

కార 'మ' కారము లనబడే బీజాక్షర త్రయం కలసి 'ఓం' కారమైంది. దీనినే ప్రణవం అంటాం. 'అ' కారం రజోగుణాత్మకం: బ్రహ్మ. 'ఉ' కారం సత్వగుణాత్మకం: విష్ణువు. 'మ' కారం తమోగుణాత్మకం: రుద్రుడు. ఈ విధంగా 'ఓం' కారం త్రిగుణాత్మకము, త్రిమూర్త్యాత్మకము ఐంది. 'అ' కారం వామనాసాపుట: ఇడ. 'ఉ' కారం దక్షిణ నాసాపుట: పింగళ. 'మ' కారం తన్మధ్యమైన: సుషుమ్న. ఈ విధంగా 'ఓం' కారం నాడీత్రయమైంది. 'ఇడ' యే చంద్రుడు! 'పింగళ' యే సూర్యుడు. 'సుషుమ్న' యే అగ్ని. ఈ విధంగా 'ఓం' కారం అగ్నిత్రయమైంది. ఆ 'ఓం' కారంలో దశవిధ నాదాలు పుట్టాయి. నాభి, ఉదర, కంఠ స్థానాలు వాటి ఉత్పత్తి స్థానాలు. ఆ నాదాలే వాయు చలనం వలన హృదయ, కంఠ, శిరః స్థానాల నుండి అభివ్యక్తమై మందర, మధ్యమ, తారకము లనబడే మూడు స్వర భేదాలను పొందాయి.

**స్వర వివేకం**

ఆ స్వరాల నుండి 'స,రి,గ,మ,ప,ద,ని' అనే సప్తస్వరాలు క్రమంగా మహాదేవుని యొక్క పరశివ, ఈశ్వర, సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన అనబడే ఏడు ముఖాల నుండి పుట్టి షడ్జ, రిషభ, గాంధార, మధ్యమ, పంచమ, ధైవత, నిషాదలనబడే నామాలతో వ్యాప్తిలో ఉంది. వాటి జన్మ స్థానాలు వరుసగా కంఠ, శిరః నాస, హృదయ, ముఖ, నాలుక, పూర్వాంగములు. మయూర, రిషభ, అజ, సింహ, కోకిల, అశ్వ, మదగజ ధ్వనులే షడ్జాది స్వర ధ్వని భేదాలు.

ఈ సప్త స్వరాలకు జన్మ కాలాలు; జన్మ తిథులు; జన్మ నక్షత్రాలు, ఋషులు; అధిష్ఠాన దేవతలు; వర్ణములు; జాతులు; రసాలు; ఫలాలు వేరువేరుగా ఉన్నాయి.

**శ్రుతి వివేకం**

షడ్జ స్వరం నుండి నాలుగు శ్రుతులు, రిషభం నుండి మూడు, గాంధారం నుండి రెండు, మధ్యమ నుండి

నాలుగు, పంచమం నుండి నాలుగు, ధైవతం నుండి మూడు, నిషాదం నుండి రెండు ఈ విధంగా సప్తస్వరాల నుండి ఇరవై రెండు శ్రుతులు పుట్టాయి. ఈ శ్రుతులకు ఇరవై రెండు శ్రుతి గమకాలు ఏడు దేశీ గమకాలు ఉన్నాయి.

**రాగ గీతాదుల లక్షణ వివేకం**

ఈ స్వర శ్రుతి గమకముల యందు ఆరు లక్షణాలు గల గీతాలు–ఆ రాగాలకు గ్రామత్రయం – దాని వలన పదిహేను రాగాలు ఆ రాగాలకు ఆరు జాతులు – ఆరు జాతులకు ముప్పై ఆరు రాగాలు – వాటికి నాలుగు అంగములు – వాటి వలన నూట ఆరు రాగాలు పుట్టి అనంత కోటి రాగాలుగా విస్తరించింది. సమస్త రాగాలలోను ముప్పై రెండు రాగాలు లోక ప్రసిద్ధమైనవి.

**వాద్య వివేకం**

తత, ఆనద్ధ, సుషిర, ఘన ఈ నాలుగు చతుర్విద వాద్యాలు. కాహళ, పటహ, శంఖ, భేరి, జయ ఘంటికలు ఇవి పంచ మహావాద్యాలు. వీణాదులు ఇరవై రెండు రకాలు.

'త' కారం రుద్రుడు 'ల' కారం పార్వతి. ఆ రెంటి సంపుటియే తాళం. తాళానికి కాల, మార్గ, క్రియ, అంగ, జాతి, గ్రహ, కళ, లయ, యతి, ప్రస్తారము అనేవి దశవిధ ప్రాణాలు.

**భరత వివేకం**

శతానందా! హనుమ భరత శాస్త్రంలో కూడా నిష్ణాతుడు. ప్రవర్తకుడు. దర్శనకారుడు. 'భ' అంటే భావం. 'ర' అంటే రాగం. 'త' అంటే తాళం. భావ, రాగ, తాళము లనగా సాహిత్య, సంగీత, నాట్యముల వినియోగం ఇందులో ఉంది కనుక భరతం ఐంది. రసములు, భావములు, అభినయములు, ధర్మలు, వృత్తులు, ప్రవృత్తులు, సిద్ధులు, స్వరములు, ఆతోద్యములు, గానములు, రంగములు అను ఈ పదునొకండు విషయముల స్వరూపమే నాట్యవేదం. అట్టి నాట్య వేదానికి ప్రవర్తకుడు హనుమ.

**హనుమ తన సంగీతాన్ని వినిపించుట.**

శతానందా! అనేక విద్యలతో పాటు ఈ గాంధర్వాన్ని, భరతాన్ని సూర్యుని నుండి నేర్చుకొన్నాడు హనుమ. కొలువులో సీతారాముల ముందు విద్యా తత్వాన్ని తెలుసుకొని తన గాంధర్వ విద్యను మనోధర్మంగా ప్రదర్శించాడు. అతని గానానికి మ్రోడులు చిగిర్చాయి. చంద్రకాంతాలు చెమర్చాయి. సభ్యుల హృదయ పుండరీకాలు వికసించాయి. లోకం సమ్మోహితమైంది. అతని వల్లకీ వాద్యానికి రాళ్ళు కరిగాయంటె సభ్యుల అంతరంగాల మాట చెప్పేదేముంది?

హనుమ మేఘరంజని రాగాన్ని వీణావాదనంలో వినిపించాడు. అందులో అతను ప్రదర్శించిన మెలకువలు, ప్రౌఢిమ, రాగాలాపన, గ్రామ స్ఫూర్తి, తారలో ఆంతర స్ఫురిత నాద ప్రౌఢి, మీటు, కంపితం, ఆందోళితం, మూర్ఛన, శ్రుతులు, డాలు బహువిధ తాన మానాలు... వీటికి సభ్యులు మైమరచిపోయారు. ఆకాశం మేఘావృతమైంది. కొంగలు బారులు తీరాయి. చాతక పక్షులు తమ చిన్ని చిన్ని నోళ్ళు తెరచి ఆకాశం కేసి చూడసాగాయి. నెమళ్ళు పురివిప్పి నాట్య మాడాయి. పాతాళంలో పాములు పడగలెత్తి నర్తించాయి. వాన పుష్ప వర్షంగా జల్లు కురిసింది. సభ్యులలంకరించుకొన్న దివ్యమణీ విభూషలు కరిగాయి. శశికాంత వేదికలు స్రవించాయి. వైమానికులు పారవశ్య వైభవంతో గతులు తప్పారు. దంతపు బొమ్మలు జీవాన్ని పొందాయి.

హనుమ వాయిస్తున్నంత సేపు గాంధర్వ విద్యా శ్రేష్ఠుడైన రాఘవుడు "మజ్జారె! అయ్యారె! ఔరా! భళిభళి! మేలుమేలు! అహో! బాపురే!" ఇత్యాది ప్రశంసా వాక్యాలను వినిపిస్తూ సీతా సతితో తన ఆనందాన్ని పంచుకొన్నాడు. హనుమ వీణా వాదనానికి దగ్గర ఉన్న ఒక రాయి కరిగింది. సభంతా నివ్వెరపోయింది.

**నారద తుంబురుల గర్వభంగం**

నారద తుంబురుల తాళపు చిప్పలను తాను తీసికొని గుండక్రియ రాగాన్ని వీణపై వాయించాడు. ఆ రాయి ఎప్పటట్ల కాఠిన్యాన్ని వహించింది. తన చేతిలోని వీణను నారదుని కిచ్చి ఈ రాయిని కరిగించ గలవాడే గాన విద్యాధికుడు. ఈ తాళాలను తిరిగి తీసికొనటానికి అర్హుడు అని నియమం పెట్టాడు.

నారదతుంబురు లిద్దరు తమతమ శక్త్యానుసారం ప్రయత్నించారు. ఆ రాయి కరుగలేదు. ఇద్దరు తమ వీణెలను నేలపై పెట్టి తలలు వంచుకొని నిరహంకారులై సిగ్గుతో మనస్సు కుమిలిపోగా నిశ్చేష్టులై ఉండిపోయారు. అప్పుడు హనుమ "ఓ! గాంధర్వ విద్యాప్రవీణులారా! మీరీ రాయిని కరిగించ లేకపోతే మీ తారతమ్యాన్ని నేనెలా నిర్ణయించగలను? మీ రిప్పుడు మీ తాళపు చిప్పలను నా దగ్గర విడిచిపెట్టి వెళ్ళవలసి ఉంటుంది. వాగ్గేయకారులుగా లోక ప్రసిద్ధి పొందిన మీకు ఇది అవమానం కాదా?" అన్నాడు.

**నారద తుంబురులు హనుమను స్తుతించుట**

ఇలా ఎత్తి పొడిచే సరికి ఆ ఇద్దరు మరింత సిగ్గుపడి "ఓ హనుమా! మా మదం అణగి పోయింది. వెనకటి మాటలు ఇంకెందుకు? నగుబాటయింది. మా తాళపు చిప్పలను మాకెప్పటి వలెనె దయచేయించండి. కృప చూపండి. మీ ముందు గానం చెయ్యటానికి మేమెంత వారం! రాళ్ళను సైతం కరిగించే గానం మీది. పదునాలుగు లోకాలు సంచరించాం. కాని నీ వలె కఠినమైన గ్రావాన్ని కరిగించగల గాన విద్యా పరతంత్రుని చూడ లేదు.

నిన్నేమని స్తుతించాలి!

సీ॥ భానుతేజుడవని ప్రస్తుతించెద మన్న
పుట్టి నప్పుడె భాను పట్టినావు!
వనధి గంభీరుండవని నుతించెద మన్న
కడలి మైవడి లోతు గాంచి నావు!
వజ్రకాయుడవని వర్ణించెద మటన్న
హనుతటోద్ధతి వజ్రమడచి నావు!
శైలధీరుండని సన్నుతించెద మన్న
వాలాగ్రమున గిరుల్ వ్రాల్చినావు!

తే॥ ఒక గుణంబున నొక విద్య నొక్కసరణి
నీకు సరి యెంచ వచ్చునే లోకమునను
సాటి మీరితి వన్నిట మేటివౌదు
మహిత రుచి చంద్ర! శ్రీ హనుమత్కపీంద్ర!

(సమీర కుమార విజయం)

భాను తేజుడవని అందామా పుట్టినప్పుడె భానుని పట్టావు! సముద్ర గంభీరుడవని అందామా ఇంతకు ముందె సముద్రపులోతు చూచావు! వజ్రకాయుడవని అందామా నీ విషయంలో వజ్రాయుధం మొక్కపోయింది! శైలధీరుడవని అందామా వాలాగ్రంతో కొండలను పెకలించావు! గుణంలో కాని విద్యలో కాని నీ సాటి లోకంలో ఎవరున్నారు? నీ సాటి నీవే!

మేం కృపణులం. అపరాధులం. మమ్ము కృపతో మన్నించు" అని ఇలా పరిపరి విధాల కీర్తించిన... వారిని గౌరవించి తిరిగి మేఘరంజని వాయించి రాయిని కరిగించి వారి తాళపు చిప్పలను వారికిచ్చాడు హనుమ. హనుమ కీర్తిని గానం చేసికొంటూ తమ తమ స్వస్థలాలకు చేరుకొన్నారు నారద తుంబురులు.

సీతారాముల వద్ద సెలవు తీసికొని గంధమాదనానికి వెళ్ళి తన తపస్సులో మునిగిపోయాడు హనుమ. శ్రీకృష్ణుడు సత్యభామా గర్వభంగం, గరుడుని పరాభవం, నారదతుంబురుల అహంకార నిర్మూలనం ఈ మూడూ ఒక్కసారే సమకూడి నందులకు మనసులో సంతసించి ద్వారకలో సుఖస్థితిలో ఉన్నాడు.

**ఫలశ్రుతి**

శతానందా! ఈ కథ వ్రాసినా చదివినా, విన్నా ఈ కథ ప్రతులను పంచి పెట్టినా ఫల్గుణ సఖుడైన హనుమ దయవల్ల అన్నిటా విజయం లభిస్తుంది. కార్యసిద్ధి కలుగుతుంది. శత్రుభయం, రోగభయం, మృత్యుభయం ఉండవు. శాశ్వత ఆయురారోగ్యాలు కలుగుతాయి.

## షష్ఠాధ్యాయం సంపూర్ణం.

* * *

# సంపూర్ణ హనుమత్ చరిత్రము

## సప్తమాధ్యాయం

అఖిల భూత దయాగరిష్ఠుడైన వసిష్ఠుని జూచి గౌతమాత్మజుడైన శతానందుడిలా అన్నాడు: "మహర్షీ! హనుమత్కథా సుధారసం ఎంత ఆస్వాదించినా తృప్తి కలగటం లేదు. మారుతిని మీరు ఫల్గుణ సఖుడని అన్నారే! ఏ విధంగా గాండీవికి ఇష్టుడయ్యాడు? సవ్యసాచి కపికేతనుడని విన్నాను. ఆ వృత్తాంతాన్ని చెప్పండి."

## కృష్ణార్జునులు లవణ సముద్ర తీరంలో విహరించుట.

భగవాన్ వసిష్ఠుల వారిలా చెప్పసాగారు. "శతానందా! విను! ఒక రోజున కృష్ణార్జును లిరువురు లవణ సముద్ర తీరంలో విహారం చేస్తున్నారు. అలా వచ్చిన వారిద్దరికి సముద్రం నవ్వుతూ ఉప్పొంగే సంతోషంతో స్వాగతం చెపుతున్నదో అనునట్లు; నురుగుల ధావళ్యంతోను, ఉత్తుంగ కెరటాలతోను హృదయాహ్లాదకరంగా ఉంది. శ్రీకృష్ణుడు అర్జునునకు ఎదురుగా ఉన్న సముద్రాన్ని చూపి అనేక విధాల వర్ణించి ఇలా అన్నాడు: "అర్జునా! ఎడతెగకుండా నిరంతరము ఘోషించే ఈ సముద్రాన్ని చూచినప్పుడల్లా నాకేమనిపిస్తుందంటే... 'ఒక కోతి నన్ను లంఘించింది! ఒక రాజు నన్ను బంధిస్తానని బెదిరించాడు! ఒక ముని నన్ను ఆపోశనం పట్టాడు! నా దుస్తరత్వం నా దురవగాహత్వం నా దుశ్శక భావం అలా దూషితమయ్యాయి. అనే అవమాన భారంతో ఈ సముద్రం రోదిస్తున్నట్లుగా అనిపిస్తుంది."

**అర్జునుని అహంకారం**

ఆ పలుకులు విన్న గాండీవి కించిత్ అనుమానంతోను అంతకంటె ఎక్కువ అహంకారంతోను ఇలా అన్నాడు "కృష్ణా! రాఘవుడు కోదండ పాండితీ మండనుడై ఉండికూడా శరముల చేత కాక శైలతతి చేత వారధిని ఎందుకు కట్టించాడు? ఒక వేళ సీతా వియోగ దుఃఖంలో ఆ ప్రావీణ్యాన్ని విస్మరించాడా? లేక అతని వద్ద అక్షయ తూణీరం లేదా?" అని శంక చేశాడు.

దానికి మాధవుడు నవ్వి "అర్జునా! దాశరథికి శరములు లేక కాదు. ధీశాలి కాక కాదు. దానికొక రహస్యం ఉంది. చెపుతాను విను! రాముని సైన్యంలో ధీరులు, వీరాధివీరులు మేరుపర్వత సమాన దేహులు, గర్జనలతో ప్రళయకాల మేఘ నిస్వనాన్ని మించిన వారు, అట్టహాసాలతో దిక్కులను ప్రక్కలించ గలవారు అనేక కపివీరు లున్నారు. ఆ వీరుల పదఘట్టనలకు కట్టెల వంతెన పటాపంచలై పోదా? హనుమ ఒక్కడు పాదం మోపితే చాలు ఆ బాణాలు గీణాలు చీపురు పుల్లల్లా చెల్లాచెదరవుతాయి! హనుమ యొక్క ఉద్ధతికి మిగతా సైన్యం శతాంశం కూడా కాదు!"

**కృష్ణుడు హనుమను రప్పించుట.**

జనార్దనుని పలుకులు విన్న ధనంజయుడు మరింత అహంకారంతో "కృష్ణా! మారుతి అంత బలశాలి ఐతే ఏదీ పిలిపించు. బాణాలతో నేను వంతెన కడతాను. కూల్చమను" అని దర్పంతో అన్నాడు. గోవిందుడు లోలోపల నవ్వుకొని మనసులో మారుతిని తలచాడు. క్షణంలో వచ్చి వాలేడు హనుమ. "ఓ ప్రభంజన కుమారా! ఈ గాండీవి బాణాలతో సేతు నిర్మాణం చేస్తాడట. అది నీ పదాహతికి నిలుస్తుందో నిలువదో పరీక్షిస్తావా?" అని హనుమను అడిగాడు మాధవుడు. సరే! అని సమ్మతించాడు మారుతి. గాండీవిని శరవారధిని నిర్మించమని సెలవిచ్చాడు దామోదరుడు.

**అర్జునుని గర్వభంగం**

శరవారధి నిర్మాణానికి పూనుకొన్నాడు సవ్యసాచి. పుంఖాను పుంఖంగా బాణాలను ప్రయోగిస్తున్నాడు. మధ్య మధ్యలో గాండీవం యొక్క నారిని సారిస్తున్నాడు. అక్షయ తూణీరం లోంచి శరసంధానం చేస్తున్నాడు. రివ్వురివ్వుమని ఒకదాని వెంట మరొకటి అలా బాణాలను వానజల్లులా కురిపిస్తున్నాడు. అల్లె త్రాటి మ్రోత రివ్వుమనే అంపవాన సవ్వడి... ఈ రెండు కలిసి సముద్ర ఘోషను మ్రింగేసింది. అనేక దివ్యాస్త్ర పరంపరల చేత బలుపుగా సేతు బంధాన్ని చేశాడు విజయుడు.

చేసి కృష్ణుని చూచి మీ హనుమను సేతువు యొక్క దృఢత్వాన్ని పరీక్షించ మన్నాడు. సేతువును దృఢంగా బంధించావా? అన్నాడు మాధవుడు. "ఓ దిక్కరులు నడిచినా మొక్కవోని రీతిలో బంధించాను" అన్నాడు ధనంజయుడు. తనలో తాను నవ్వుకొని హనుమను చూచి కనుసైగ చేశాడు హరి.

ఒక్కసారి అట్టహాసం చేశాడు హనుమ. ఆ అట్టహాసానికి దిగ్గజాలు వాలాయి. ఆదిశేషువు అదిరిపడ్డాడు. సప్తాశ్వాల పగ్గాలూడగా ఆదిత్యుడు గతి తప్పాడు. చెపుతూన్న మంత్రం మాని బ్రహ్మగారు ఉలికిపడ్డాడు. కేసరినందనుడు కేసరి వోలె తన ఉద్ధతిని చూపుతూ శరవారధి మీదికి కుప్పించి దూకాడు. చీపురు పుల్లల్లా సేతువు నుగ్గునుగ్గై చెల్లాచెదరైంది. సవ్యసాచిని చూచి నవ్వుతోందా అన్నట్లు సముద్రమంతా నురుగు కమ్మేసింది. వార్ధి క్షోభించింది. పాతాళవాసులు ప్రాణాల మీద ఆశ కోల్పోయారు.

తాను కట్టిన శరవారధి కుప్ప కూలటం చూచిన గాండీవి అవమానంతో చింతాక్రాంతు డయ్యాడు. ఐతే వీరుడు కనుక రోషాన్ని వీరాన్ని తెచ్చుకొని బీరంగా ఇలా అన్నాడు "ఓ కపి శ్రేష్ఠా! నేను సేతువును ఇంకొక్కసారి నిర్మిస్తాను. తప్పక నిలుస్తుంది. అలా నిలువక పోతే నా గాండీవంతో అగ్నిప్రవేశం చేస్తాను." అని శపథం చేశాడు. ఆ శపథానికి

పార్థసఖుడైన నారాయణుడు ఉలిక్కి పడ్డాడు. దానికి ప్రతి వచనంగా హనుమ "అలా నిలిస్తే పోరులో నీకు హితుడనై నీ ధ్వజం మీద నేనుంటాను" అన్నాడు.

రెండవసారి శరవారధిని నిర్మించాడు పార్థుడు. మారుతి ఉగ్రుడై కుప్పించి దూకాడు. సేతువు చెక్కు చెదర లేదు. దానికి కారణం హనుమకు తెలుసు. పాండవ పక్షపాతి ఐన కృష్ణుడు విజయుని శపథాన్ని నెరవేర్పగోరి; మందర పర్వతాన్ని మోసిన ఆదికమఠం లాగ శరసేతువు క్రింద దూరాడు. హనుమ సంతోషంతో వీరుడైన విజయుని కౌగిలించుకొని జరగబోయే కురుపాండవ సంగ్రామలో నీ ధ్వజం మీద ఉండి నీకు విజయాన్ని చేకూరుస్తానని వరమిచ్చి శౌరివద్ద సెలవు తీసికొని తిరిగి గంధమాదనాన్ని చేరుకొన్నాడు ఆంజనేయుడు.

**కృష్ణుని శరీరం నెత్తురు ముద్దగుట.**

నిలువెల్ల నెత్తురుముద్దై నిలబడి యున్న నీరజనాభుని చూచి నివ్వెఱపడి "కృష్ణా! దీనికి కారణమేమి?" అని గ్రుడ్ల నీరు బొట బొట కారగా శోకిస్తూ అడిగాడు. దానికి సమాధానంగా అచ్యుతుడిలా అన్నాడు.

"అర్జునా! మారుతాత్మజుడంటే ఎవరను కొంటున్నావు? అది రుద్రావతారం! అతని పరాక్రమం ఎట్టిదో చెపుతాను విను. బాల్యంలోనే ఆదిత్యుణ్ణి పండని భ్రమించి పట్టబోయిన వాడీ.. హనుమ. శతకంధర వధ నిమిత్తమై చతుస్సాగరాలను అవలీలగా దాటిన వాడీ హనుమ. పూర్వ పశ్చిమ గిరులపై పాదాలుంచి సూర్యుని సన్నిధిని సకల విద్యలను నేర్చిన వాడీ మారుతి. తన తోకతో బ్రహ్మాస్త్రాన్ని వమ్ము చేసిన వాడీ ఆంజనేయుడు. అలాటి వీర విక్రముడైన పావని దుమికితే నీ శరవారధి కుప్ప కూలుతుంది. కార్యం తప్పుతుంది. నీ ప్రతిజ్ఞ నెరవేర్చటం కోసం నే వంతెన క్రింద దూరాను. వీపు బ్రద్దలైంది. శరీరం హూనమైంది. ఒడలు నజ్జునజ్జైంది. కళ్ళు బైర్లు కమ్మాయి. గుండె చెదిరింది. మూర్ఛగ్రమ్మింది. ఏం చెప్పను! అప్పటి స్థితి!

ఇప్పటికి కొంచెం తేరుకొన్నాను. అలా నేను అడ్డుపడక పోతే నీ శరసేతువు హనుమ ఉద్ధతికి నిజంగానే నిలిచిందను కొంటున్నావా? నీ మీది ప్రేమ నన్నిలా చేయించింది" అని హనుమ విక్రమాటోపాన్ని సంక్షేపంగా చెప్పాడు.

అర్జునుడు ఆశ్చర్యంతో "కృష్ణా! హనుమంతుడింత వాడని తెలియదు. అతని దర్శనం నీ వలన కదా లభ్యమైంది. అతను నా ధ్వజాన్ని అధిరోహించి ఉంటే రాబోవు సంగ్రామంలో మనకు విజయం తథ్యం" అని ఉప్పొంగి పోయాడు.

**హనుమ మాహాత్మ్యం**

శతానందా! రామరావణ సంగ్రామంలో మాత్రమే కాదు. కురు పాండవ భండనంలో కూడా హరిభక్తితో పార్థుని ధ్వజాన్ని అధిరోహించి తన ఉగ్రరూపంతో తేజస్సుతో, గర్జనలతో, హుంకారంతో, ఆర్భటులతో శత్రు సైన్యాన్ని సగం చంపినవాడు హనుమ. చచ్చిన వారిని చంపిన వాడు అర్జునుడు. అలా కాకపోతే భీష్మద్రోణాదులను ఎదుర్కోటం సాధ్యమా? హనుమ ధ్వజారూఢుడై ఉన్నాడన్న ధైర్యంతోనే కృష్ణుడు పార్థునితో యుద్ధరంగంలో బోధించిన గీతలో "పార్థా! ఈ కౌరవులు ఇంతకు ముందే హతులయ్యారు! నీవు నిమిత్త మాత్రుడవై యుద్ధం చెయ్యి" అన్నాడు. దశకంఠుని కిరీటాన్ని తన్నిన వానికి ఈ కౌరవులు లెక్కా? హనుమన్నామం జపించిన మాత్రాన కార్యసిద్ధి అవుతుంటే మారుతి చెంత నుంటే విజయం సిద్ధించదా?

**భీముడు ద్రౌపదికి సౌగంధిక పుష్పాన్ని తెచ్చి ఇచ్చిన వృత్తాంతం**

అంత మాత్రమే కాదు. ద్రౌపది కోరగా భీముడు సువర్ణ సౌగంధిక పుష్పాన్ని తెచ్చి ఇచ్చాడు. ఆ సందర్భంలో హనుమ భీమునికి యక్షరాక్షసులను నిర్జించే

శౌర్యాన్నిచ్చాడు. అని వసిష్ఠుడు తెల్పగా ఆ వృత్తాంతం చెప్పవలసిందని శతానందుడు అడిగాడు. వసిష్ఠ మహర్షి ఇలా చెప్పసాగారు.

"శతానందా! పాండవులు అరణ్యవాసం చేస్తున్న కాలంలో భీముడు ద్రౌపదితో కలసి గంధమాదన పర్వత ప్రాంతంలో వన విహారం చేస్తున్నాడు. ఆ వనం మల్లెపూపొదలతో, పన్నీటి కాలువలతో, గున్న మామిళ్ళతో, పూగ పున్నాగ చంపకాశోక పారిజాత వృక్షాలతో చంద్రకాంత శిలా వితర్దికలతో మనోహరంగా ఉంది. దివిజాంగనలు ఆకాశగంగలో వికసించిన సౌగంధిక పుష్పాలను కోస్తుండగా వనలక్ష్మి పాంచాలి స్నేహానికై చేయి చాస్తూందో అన్నట్లుగా; గాలి వాలుకు ఒక పుష్పం వారిద్దరు ఉన్న చోటికి వచ్చి పడింది. ఆ పుష్పాన్ని కేల గ్రహించి దాని దివ్య పరిమళానికి ఆశ్చర్యపడి ఆహా! ఈ రేకుల సౌకుమార్యం! రంగు, వాసన, కేసరాలు ఎంత బాగున్నాయి! అని పలుమార్లు మెచ్చుకొంది పాంచాలి. ఆమె ఇష్టాన్ని ఎఱిగిన భీముడు ఇలాంటి పుష్పాలు ఎక్కడున్నాయో వెదకి తెస్తానని ధనుర్బాణాలు ధరించి గదాపాణియై బయలుదేరాడు.

## భీమునికి గర్వభంగం

అలా అలా నడచుకొంటూ ముందుకు సాగాడు. దారిలో పూచిన సహకార తరువులు, సురపొన్నల పుప్పొడి రాసులు, నిలువెల్ల పూచిన పొదలు, ప్రవహించే సెలయేళ్ళు, కొబ్బరి చెట్ల తోపులు, అప్సరసలు క్రీడించే వెన్నెల తిన్నెలు ఇవన్ని దాటుకొంటూ కాంచన కదళీ వనాన్ని చేరుకొన్నాడు. ఆ వనం కన్నుల పండువుగా ఉంది. మనుష్య సంచారం లేని ఆ వనంలో దగ్గరలో ఎవరైనా నరులున్నారేమో ప్రతి సమాధానం చెపుతారన్న ఆశతో శంఖధ్వనిని పోలిన ఒక కేక పెట్టాడు. యోగ సంగతిలో ఉన్న హనుమ ఆ ధ్వనిని విన్నాడు. ఆ కంఠధ్వని వాయుపుత్రుడైన భీమునిదిగా గుర్తించాడు. అతని బలపరీక్ష చేయాలనుకొన్నాడు. తోకను పెంచి దారి కడ్డంగా పడుకొన్నాడు.

ముసలి రూపు, ముడుతలు పడ్డ శరీరం ఆజాను బాహువైన దీర్ఘదేహం, సాలవృక్షంలా దారి కడ్డంగా తోకను పెంచి యోగనిద్రలో ఉన్నట్లుగా పడుకొని ఉన్న హనుమను చూచాడు... భీముడు. అతనిని లేపాలనే ఉద్దేశంతో శబ్దం చేశాడు. అప్పుడే మేల్కొన్న వానిలా కన్నులు తెరిచాడు మారుతి.

భీమునితో ఇలా అన్నాడు: "వృద్ధాప్యంతోను రోగంతోను బాధపడుతూ నిద్రపోతున్న నాకిలా నిద్రాభంగం చేయుట న్యాయమా నీకు? నేను కపిని! నువ్వు మనిషివి. కార్యాకార్య వివేకంగల నీవు ఇలా చేయవచ్చా? నీకు భూతదయ లేదా? నీ దుశ్చర్య వృద్ధుడనైన నా మనస్సును ఎంత క్షోభ పెట్టిందో నీకు తెలుసా? నరులకు అగోచరమైన వనం ఇది. ఎవ్వరూ ఇక్కడకు రాలేరు. నీ వెందుకు వచ్చావు? ఈ పైన దారి లేదు. ఆకాశ మార్గంలో వెళ్ళగలిగిన వారు మాత్రమే పోగలరు. అమృతోపమానమైన ఇక్కడి ఫలాలను ఆరగించు. వెనక్కు తిరిగి వెళ్ళు. నామాట జవదాటకు."

హనుమకు సమాధానంగా భీముడిలా అన్నాడు. "నేను క్షత్రియుణ్ణి! పాండు రాజు పుత్రుడను. వాయువర విశేషం చేత కుంతికి పుట్టిన వాడను. ప్రాజ్ఞుల చేత మెచ్చదగిన నడవడిక గల వాడను. పెద్దలంటే గౌరవం ఉంది నాకు. ఒక పనిమీద వెడుతున్నాను. నాకు దారి ఇవ్వు. ఈయక పోతే సముద్రాన్ని లంఘించిన హనుమవలె నిన్నుదాటి వెడతాను." భీముని నోట తన మాహాత్మ్యాన్ని విని హనుమ లోలోపల సంతసించి "ఓ! పాండుపుత్రా! నువ్వేదో హనుమత్ ప్రశంస చేశావు. అతని చరిత్ర తెలిస్తే నాకు కాస్త చెప్పు. హనుమ ఏ సందర్భంలో లవణాబ్ధిని దాటాడు?" అని కుతూహలంతో అడిగాడు.

భీముడు తాను అధ్యయనం చేసిన రామాయణ గాథలోని హనుమద్వృత్తాంతాన్ని చెప్పాడు. చెప్పి "నేను కూడా వాయువర ప్రసాదుడను! హనుమ అంతటి వాడిని! నా సాహసం చూస్తావా?" అన్నాడు. అంతరంగంలో ఆనందించిన హనుమ "అన్నా! నే వృద్ధుడను! లేవలేను! ఇలా

పడి ఉన్నాను. నీవు తొందర పని మీద వెడుతున్నా నన్నావుగదా. నా తోకను ఒక ప్రక్కకు పెట్టి ఆ దారిలో నువ్వు వెళ్ళు!' అన్నాడు.

భీముడు అహంకారంతో అతనే హనుమ అని తెలియక ఎడమ చేతితో తోకను కదల్ప బోయాడు. అది కదల లేదు. శరాసనాలను సడలించాడు. బట్టను గట్టిగా కట్టాడు. గదను సంకలో పెట్టాడు. తన బాహుబలం అంతా ఉపయోగించి పలుమార్లు తోకను కదల్ప బోయాడు. అది కదల్లేదు. సముద్రానికి చెలియలికట్టలా చలనం లేకుండా ఉండిపోయింది. ఒళ్ళంతా చెమట పట్టింది. నీరసం వచ్చింది. ముఖం వెలవెల బోయింది. గుండె తల్లడిల్లింది. స్పృహ తప్పి పడ్డాడు. కొంత సేపటికి తెలివివచ్చి కనువిచ్చి చూచాడు. జ్ఞానోదయమైంది.

భయభక్తులతో అడుగులపై పడి "స్వామీ! మీ మాహాత్మ్యాన్ని తెలుసుకొనలేక అజ్ఞానంతో అహంకారంతో ఏవేవో అన్నాను క్షమించండి! నేను అతి సామాన్యుణ్ణి! మీరు ఈ కపిరూపంలో ఉన్న ఇంద్రుడో! విష్ణువో! ఈశ్వరుడవో? చెప్పండి! అని ప్రార్థించాడు.

దానికి హనుమ నవ్వి "అన్నా! నే వాయు పుత్రుడనైన హనుమను! లోకంలో సీతారాముల కథ ఎంత వరకు ఉంటుందో అంతవరకు నేనుంటాను. నా నివాసం ఈ గంధమాదన పర్వతం మీది కదలీవనం" అన్నాడు. అంత భీముడు చేతులు జోడించి నమస్కరించి "అమితప్రతాపా! నా పూర్వపుణ్యవశాన మీ దర్శనం లభించింది. పాపాలన్నీ నశించాయి. కృతార్థుడ నయ్యాను. నాదొక విన్నపం. ఆనాడు సముద్రాన్ని లంఘించిన మీ రూపాన్ని ఒక్కసారి చూపించండి!" అని ప్రార్థించాడు.

**హనుమ భీమునకు బోధించిన కాల మహిమానువర్ణనం.**

దానికి సమాధానంగా హనుమ ఇలా అన్నాడు: "సోదరా! అప్పటి రూపు ఇప్పుడు చూపమంటె ఎలా? కాలభేదం లేదా? త్రిమూర్తులు కూడా కాలానికి

కట్టుబడ్డ వారే కదా! కాలస్వరూపాన్ని గురించి చెపుతాను విను.

కాలంలో కాడు (శ్మశానం) వీడు (పట్టణం) అవుతుంది! వీడు కాడు అవుతుంది! మేలుకీడులు కాలంలోనే కలుగుతాయి. ఉదయ కాలంలో ఉండే పద్మినీ విభూతి రాత్రి సమయంలో ఉంటుందా? నిశాసమయంలో ఉండే కలువల వికాసం మధ్యాహ్న కాలంలో ఉంటుందా? వర్షాకాల మేఘ గర్జనం శరత్కాలంలో వినవస్తుందా? పున్నమనాటి చంద్రజ్యోత్స్న అమావాస్యనాడు కానరాదు గదా? వసంత ఋతు శోభ శిశిరంలో ఉంటుందా? దీనినే కాలాపేక్ష అంటాం. సర్వమూ కాలపేక్షయే.

ఈ శరీరానికి బాల్య కౌమార యౌవన వృద్ధాప్యములనే నాలుగు వికృతు లున్నాయి. కాలంలో వృద్ధాప్యం వచ్చాక వెనుకటి రూపు తిరిగి వస్తుందా? ఒక్క రోజులోనే నీ చుట్టూ ఉండే ప్రకృతిలో వచ్చే మార్పులను చూడు. అలాటప్పుడు యుగ ధర్మాలలో మార్పు ఉండదా? యుగాలు నాలుగు. యుగ ధర్మాలు కూడా వాటి ననుసరించే ఉంటాయి.

సోదరా! కాలతత్త్వాన్ని గురించి చెపుతాను! శ్రద్ధగా విను! కాలం ఆద్యంతాలు లేనిది. అనంతమైనది. అది సర్వవ్యాపి. కాలం పరమాత్మ స్వరూపం. స్త్రీలింగ వచనం చేత దీనిని 'కాళి' అంటారు. ఇది శక్తి స్వరూపం. ఈమె సమస్త భువనాలను నిత్యము పచనం (వంట) చేస్తూ ఆరగిస్తూ ఉంటుంది. పాచకత్వమే కాలం యొక్క స్వరూపం. ఈమెచే అనేక అండాండ, పిండాండ, బ్రహ్మాండములు సంహరింపబడ్డాయి. ఆ సంహార శక్తికి ప్రతీకగా ఆమె కంఠమందు మనం ముండమాలను ఊహిస్తాం. సృష్టి యొక్క ఈ పరిణామ శక్తినే మనం 'నిత్య సంగ్రామ కారిణి' అంటున్నాం. కాళీ ఉపాసకులు సృష్టికి విభుత్వాన్ని స్త్రీ యందే ఆరోపిస్తారు. ఈమె దశమహా విద్యలలోను మొదటిది. సృష్టికి కారణభూతుడైన సత్పురుషుడు లేక మహాకాలుని యొక్క నిత్య తాండవ వైభవమే 'కాళి'. ఆ మహాకాలుడు లేదా సదాశివుడే భక్తులకు భోగమోక్షప్రదుడై ఇరవై ఐదు సగుణ మూర్తులుగా విలసిల్లుతూ పూజలందుకొంటూ ఉంటాడు. అందులో 'నృత్యవిలాసి' ఐన

నటరాజమూర్తి స్వరూపం ఒకటి. అది తాండవమూర్తి. ఆ తాండవం ఆనంద – సంధ్యా – కలిక– విజయ–ఊర్ధ్వ – ఉమా–సంహార అనే నామములతో సప్త తాండవాలుగా వ్యవహరింపబడుతోంది. ఈ సప్త తాండవాలే కుండలిని విద్యలో సహస్రారంతో కలిపి ఏడు భూమికలుగా చెప్పబడింది. సమస్త జీవులయందు ఈ కుండలినీ శక్తి నిత్యతాండవం చేస్తూ ఉంటుంది. ఉపాసకుడు లేదా భక్తుడు ఆరు చక్రాలను భేదించి సహస్రారంలో ఐక్యభావాన్ని పొంది అద్వైత స్థితిలో ఉన్నప్పుడు మిగిలేది అఖండ అద్వైతానందమే కనుక ఆ స్థితిని 'ఆనంద తాండవం' అంటాం.

చలన క్రియ అంతా తాండవమే. స్పందన ప్రాణశక్తి యొక్క విలాసం. సృష్టి స్థితి లయములు మూడూ లయ తాలబద్ధమైన చలనము నందే సాగిపోతూ ఉంటాయి. పరిణామ శక్తి ఐన ఈ కాళీ శక్తి కేవలం సంహార శక్తి మాత్రమే కాదు. సృష్టికి కూడా కారణభూత మవుతోంది.

"నేను భువన సృష్టిని ఆరంభించుటకు వాయువువలె సర్వత్ర ప్రవహింతును" అనే వేదమంత్రం వాయువుకు ప్రాధాన్యతను ఇచ్చి ఈ విషయాన్నే చెపుతోంది. సాహిత్యం దృష్ట్యా వీర శృంగారాల అపురూప దర్శనం ఇది. ఈ వైభవం వల్లనే జగత్తుకు పరమకారణం పరమ శివుడయ్యాడు. పరమ శివుడే సదాశివుడు.

పరిణామ కారిణి ఐన ఈ సమష్టి శక్తి (ప్రకృతి శక్తి) సర్వభూతము లను ఆవేశించియున్న కారణంగా ఆ శక్తే వ్యష్టి శక్తిగా (వికృతి శక్తిగా) కూడా అవుతోంది.

సూర్యుని కాంతి చంద్రుని మీద పడి ప్రతిఫలించి ఉపాధి భేదం చేత వెన్నెల ఐనట్లే; జగత్తుకు కారణభూతమైన సమష్టి శక్తి (అనగా పరిణామ కారిణి ఐన ప్రకృతిశక్తి) ప్రాణికోట్లను ఆశ్రయించి 'కుండలిని' శక్తి అని పిలువబడుతోంది.

ఆ శక్తి పురము అనబడే దేహమునందు శ్రేష్ఠమైన ప్రాణాన్ని ఆవేశించి క్రియాశక్తి అవుతోంది. ఆ క్రియాశక్తి వ్యష్టి (వ్యక్తి) యొక్క

జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలతో కూడినప్పుడు శ్రేష్ఠమైన ప్రాణంగా లోకులచే వ్యవహరింప బడుతోంది. ఆ శక్తినే ప్రాణాతీతమైన పరమమైనదిగా భావించి... సృష్టికి కారణభూతమైన శక్తిగా ఉపాసించినప్పుడు స్వతంత్రమైన "చిత్" శక్తిగా శాస్త్రములయందు చెప్పబడుతోంది. ఆ 'చిత్‌శక్తి" నే "శ్రీ" అంటాం. "శ్రీ" యొక్క సగుణోపాసకులే శ్రీ విద్యోపాసకులు.

జీవుని యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములు ప్రాణ తరంగములే కాని ప్రాణంమాత్రం కాదు. సముద్ర తరంగాలు శక్తికాదు. శక్తియొక్క విలాసం తరంగాలు. పోనీ వాయువు, క్రియ ప్రాణం అవుతుందా అంటే అదీకాదు. సంసారంలో జీవుల యొక్క ప్రాణశక్తి ఉచ్ఛ్వాస నిశ్వాసలచే క్షీణిస్తోంది. కనుక ఆత్మశక్తి వృద్ధి కావాలంటే కాళిని ఉపాసించాలి. ఈ విద్య ఇహంలో సమస్త భోగభాగ్యాలను ఇస్తుంది. తుదకు మోక్షాన్నిస్తుంది.

పురుష శ్రేష్ఠుడవైన భీమా! ఈ విద్యనే వేదం 'సంసర్గ విద్య' అని 'ముఖ్యప్రాణోద్గీథ విద్య' అని గానం చేసింది. ఆ ముఖ్య ప్రాణాన్ని నేనే. నన్ను ఉపాసించిన వారు కాలాతీతులవుతారు. త్రికాలజ్ఞులవుతారు. పునరావృత్తి రహితమైన జన్మరాహిత్యాన్ని పొందుతారు. ఇందులో సందేహం లేదు. నే చెప్పిన ఈ విషయాలు అత్యంత రహస్యమైనవి. నీవు నా సోదరుడవైన కారణంగా సోదర భావంతో నీకు చెప్పాను."

హనుమ నోట కాలతత్త్వాన్ని విన్న భీముడు పరమానందభరితుడై ఇలా అన్నాడు: "అన్నా! ఆంజనేయా! తత్త్వంలో పరమాత్మ స్వరూపులమై ఉండికూడా దాన్ని అజ్ఞానంచే తెలుసుకోలేక జీవభ్రాంతితో సంసారంలో కొట్టుమిట్టాడుతున్న మాబోంట్లకు కాలతత్త్వాన్ని, పరమార్థాన్ని చెప్పి మహోపకారం చేశావు. చూడగా ఈ మనుష్యుల ప్రవర్తన వింతగా ఉంటుంది. సుఖాలన్నీ తమ ప్రయోజకత్వమని; కష్టాలకు కారణం ఇతరులని భావించి నిందిస్తారు. లేదా కాలాన్ని నిందిస్తారు. అంతేకాని కాలాన్ని పరమాత్మ స్వరూపంగా భావించి ఉపాసించే వారేరి? రాబోవు కలియుగంలో

**హనుమ భీమునకు చెప్పిన కలియుగ లక్షణాలు.**

ప్రజల, ప్రభువుల ప్రవర్తన ఎలా ఉంటుందో ఆ కాలజ్ఞానాన్ని కూడా చెప్ప వలసింది.”

హనుమ భీమునకు జ్ఞానార్జనయందు గల లక్ష్యశుద్ధికి సంతోషించి ఇలా చెప్పసాగాడు. “పాండునందనా! వినటానికి సైతం వెఱపు కలిగించే కలియుగ లక్షణాలను వివరిస్తాను విను. కృత త్రేత ద్వాపర కలియుగాలలో ఒక్కొక్క పాదం చొప్పున ధర్మాచరణ తగ్గుతూ కలియుగాంతానికి అసలు ధర్మమనేది ఉండదు. ద్వాపరం నువ్వు చూస్తున్నదే.

కలిలో కాలానుగుణంగా వర్షాలు పడవు. చల్లిన విత్తనాలు పొల్లు లవుతాయి. ఎప్పుడూ ప్రజలను కఱవు పీడిస్తూనే ఉంటుంది. పొట్ట గడవక ప్రజలు జన్మభూమిని విడిచి వలసలు పోతారు. తేలిక పంటలు ఎక్కువ అవుతాయి. పృథివి నిస్సారమవుతుంది. పువ్వులలో గంధగుణం ఉండదు. తినే పదార్థాలలో సారం ఉండదు. ఆ కారణంగా ప్రజలు దుర్బలులు, రోగగ్రస్తులు, మరుగుజ్జులు అవుతారు. అల్పాయుష్కులవుతారు. ఇరవై సంవత్సరాలు కలిలో పూర్ణాయుర్దాయం. ఏడు లేక ఎనిమిది సంవత్సరాల వయసుకే స్త్రీలు సంతానవతు లవుతారు.

వివాహ వ్యవస్థ, దాంపత్య ధర్మం భ్రష్టు అవుతాయి. భార్యలకు తమ భర్తలయందు సంపాదన ననుసరించియే గౌరవం కాని వేరే గౌరవం ఉండదు. సర్వులయందు స్వేచ్ఛాప్రవృత్తి ఎక్కువవుతుంది. భార్యాభర్తలు ఇష్ట సంచారం చేస్తారు. భార్యా భర్తలు, గురు శిష్యులు పరస్పర వంచకు లవుతారు. అత్తమామలను కోడళ్ళు నిర్లక్ష్యం చేస్తారు. తల్లిదండ్రులను పిల్లలు గౌరవించరు.

**సీ॥ అన్యధనంబు గంగామృత ప్రాయంబు**
**పరవధూసంగంబు ప్రాణపదము**
**కపటప్రచారంబు కరతలామలకంబు**
**నిందాపరత్వంబు నిత్యకృత్య**

**మాచార్య విద్వేష మాత్మ స్వభావంబు**
**బ్రాహ్మణాపహృతి పాపంబు తృణము**
**హాలారసాస్వాదలీల లీలాజాల**
**ముగ్రహింసాసక్తి ఉనికిపట్టు**
**సత్యేతరోద్యుక్తి సంతతాభ్యాసంబు**
**పరమ నాస్తిక్యంబు పట్టు గొమ్మ**

**తే॥ గా చరింతురు జనులు దుష్కర్మ లగుచు**
**ధర్మనిర్మూలనములైన దుర్మతముల**
**నెమ్మిగని కొమ్మలను నమ్మి తమ్మెఱుగరు**
**కలియుగము జాడ ఏమని పలుకువాడ!**

**(సమీర కుమార విజయం)**

క్రయ విక్రయాలలో అంతా కపటమే. దాచుకొన్న సొమ్ము దోచుకొంటారు. పరస్త్రీ, పరధనాలను పటికబెల్లం ముక్కలా చప్పరించేస్తారు. పుణ్యపాపాలు, పూర్వజన్మ పునర్జన్మలు, స్వర్గనరకాదులు లేవంటారు. ఎవరి దగ్గర శాస్త్రపాండిత్యం ఉండదు. వాగాడంబరం మాత్రం ఉంటుంది. వేదనింద అధికమౌతుంది. శాస్త్రంమీద విశ్వాసం ఉండదు. శరీరం మీద శ్రద్ధేకాని ఆత్మవిచారణ చెయ్యరు.

స్త్రీలకు కేశములే అలంకారాలు. కాంచనరత్నాభరణాలు ఉండవు. భగవంతుడు లేడంటారు – ధనవంతుణ్ణి కొలుస్తారు. ఆవు పాలు ఉండవు. ఇచ్చే పాలనుబట్టి గోవు మీద గౌరవం అంతేకాని గోవుయందు పవిత్ర భావముండదు. బ్రాహ్మణుని యందు సామాన్య గౌరవమే కాని పూజ్యభావముండదు. హింసాప్రవృత్తి అధికమౌతుంది. ప్రతి దానికి ప్రమాణం చేస్తారు – ఉల్లంఘిస్తారు. స్వార్థంతో శ్రేష్ఠమైన స్వధర్మాన్ని విడిచి భయావహమైన పరధర్మాన్ని ఆశ్రయిస్తారు.

ముఖ్యంగా స్త్రీలు దుష్టులవుతారు. వ్యభిచారిణులౌతారు. మనసుకు నచ్చినవాడే మగడంటారు. వివాహం విషయంలో ఒక మగాడు ఒక ఆడది

జట్టు కడతారు. కులగోత్రాలు పట్టించుకోరు. వర్ణవ్యవస్థ నడవదు. ధనవంతుడే రాజు. అంతా ధనప్రభావమే! ధనంతో కొనలేనిది ఏదీ ఉండదు. పంక్తిబాహ్యులైన నటులు ప్రభువు లౌతారు. దొంగలే రక్షకు లౌతారు. అంతా కవులవుతారు. పాలకులు పన్నులు వసూలు చెయ్యటమే కాని ప్రజల బాగోగులు పట్టించుకోరు. ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ ఉండదు – అనాథ లవుతారు. పాలకు లెప్పుడూ యుద్ధాలలో మునిగి తేలుతూ ఉంటారు.

దేవాలయాలు ధూపదీప నైవేద్యాలు పెట్టే దిక్కులేక కళాహీన మవుతాయి. వాని భూములను ఆక్రమించుకొంటారు. దైవదర్శనానికి ధనం గుంజుతారు. భక్తి సంపాదనకు మార్గం అవుతుంది. నిషిద్ధ పదార్థాలను సేవిస్తారు. అందరూ మాంసాహారు లవుతారు. బ్రాహ్మణులు అనాచారవంతులై కుక్కలను పెంచుతారు. ప్రజలు స్త్రీ, బాల వృద్ధ, అనాథలను హింసిస్తారు. దొంగలు, నాస్తికులు, పాషండులు ప్రభువులవుతారు. ప్రజలను రక్షించాల్సిన పాలకులే భక్షకులై ప్రజల ఆస్తులను దోచుకొంటారు.

కలి చివరలో రాజ్యాలమధ్య వైరం పెరిగి మహా భయంకరమైన యుద్ధాలు చెలరేగుతాయి. విశ్వ ప్రాణి నాశనమవుతుంది. మిగిలిన కొద్ది మంది ప్రజలు వేదవేత్తలైన విప్రులను ఆశ్రయించి వేద ధర్మాలను తెలుసుకొంటారు. పాలకులు, ప్రజలు తిరిగి వైదిక ధర్మావలంబకులు అవుతారు. ఆ విధంగా వైదికధర్మం పునః ప్రతిష్ఠిత మవుతుంది. ఆ ధర్మఛత్ర చ్ఛాయల్లో అందరు శాంతిసౌభాగ్యాలతో చల్లగా బ్రతుకుతారు."

**భీమునకు హనుమ తన విశ్వరూపాన్ని చూపుట.**

హనుమ చెప్పిన కలియుగ ధర్మాలను వినగానే వికలమనస్కుడై భీముడిలా అన్నాడు: "అన్నా! ఆంజనేయా!

వింటూంటేనే భయోత్పాతాన్ని కలిగించే ఈ కలిప్రభావాన్నుండి తప్పించుకొనే ఉపాయమేమైనా ఉందా?"

సమాధానంగా హనుమ దృఢగాత్రంతో ఇలా సమాధానం చెప్పాడు: "సోదరా! కుంతీపుత్రా! భవిష్యద్బ్రహ్మ ఐన నన్ను ఎవరు భక్తితో ఆరాధిస్తారో, కనీసం నా నామాన్నైనా సరే మనస్సును పూజాప్రసూనంగా సమర్పించి జపిస్తారో వారిని కలిదోషాలేమీ అంటవు. నా భక్తులంటే నాకు చాలా ఇష్టం. 'ఆంజనేయా' అని ఒక్కసారి ఆర్తితో పిలిస్తే చాలు పద్మం చెంత మధుపంలా అక్కడ వాలుతాను. ఆపన్నులను రక్షించటం కంటె నాకు వేరే కర్తవ్యం లేదు."

అది విన్న భీముడు వికలత్వం తొలగగా శాంతమనస్కుడై "అన్నా! హనుమా! నీవు భవిష్యద్బ్రహ్మవు! ప్రళయానంతరం జరుగబోయే సృష్టికి నీవే కర్తవు! కాలాతీతుడవు! కాలం నీకు ఆటంకమా? జనన మరణాలు లేని నీకు వృద్ధత్వం ఎక్కడుంది? లోకాలను భ్రమింప చేస్తున్నావు కాని నీవు వానరుడవా? సాక్షాత్తు ఈశ్వరుడవు. నేను నీ భటుణ్ణి. ఒక్కసారి నీ విశ్వరూపాన్ని చూపించు" అని కన్నీళ్ళతో ప్రార్థించాడు.

దానికి మారుతి మందహాసం చేసి "ఇదిగో! దర్శించు!" అని ఆకాశము, దిక్కులు అంతటా తానై తోక నక్షత్రాలను తాకగా దుర్నిరీక్ష్యుడై ఎదుట గోచరించాడు. భీముడు మేను వడకగా భయకంపితుడై చేతులు జోడించి గాద్గదికంతో ఎన్నో విధాల స్తుతించి "పరమాద్భుతంగా ఉంది నీ రూపం. కోటి సూర్యప్రభా భాసమానంగా ఉంది. నీ తోక కదిలిస్తే నాకం క్రింద పడుతుంది! ఇక చూడలేను! కన్నులు మిఱుమిట్లు గొల్పుతున్నాయి. ఉపసంహరించవయ్యా నీ విశ్వరూపాన్ని" అని ప్రార్థించాడు. మారుతి ఎప్పటి రూపున గోచరించాడు.

అప్పటికి అద్భుతం నుండి తేరుకొని భీముడిలా స్తుతించాడు. "ఓ! లోక బాంధవా! నక్షత్రాలు నీకు మొలపూసలా లేక పాదగజ్జెల మువ్వలా? కుల పర్వతాలు నీకు విరిబంతులు! సముద్రం గోష్పాదం! దనుజులు నీకు

కీటకాలు! నీ వంటి వాడు తోడై ఉండగా దాశరథి దశకంఠుని సంహరించటం ఏమంత విశేషం?"

భీముని మాటలకు ప్రేమతో హనుమ "సోదరా! నీవు నా తమ్ముడవు కదా! నన్నొక వింత చేసి స్తుతించవచ్చా? సరే! నీవు వచ్చినపని నాకు తెలుసు. అది దేవతల ఆధీనంలో ఉంది. నువ్వు సాహసమే చేశావు. దేవతలు ధ్యాన, దాన, హోమ, తంత్ర, మంత్ర, తపోవిధాన, భక్తి, బలి, తర్పణాదులకు వశులే కాని పురుషశక్తి సాధ్యులు కారు. ఆర్యసమ్మతి లేని కార్యానికి పూనుకోరాదు. పూనుకొంటె దుఃఖం మిగులుతుంది. దేశకాలాదులను గుర్తించకుండా కేవలం పశుబలంతో ప్రవర్తించే వాడు నిజంగా పశువే. సరే! నీ కార్యం ఏ విఘ్నం లేకుండానే చక్కబడుతుంది. నీవతి ధైర్యవంతుడవు. నీకొక వరం ఇస్తున్నాను.

దుర్బుద్ధితో మీ రాజ్యాన్ని కైవసం చేసికొన్న దుర్యోధనుడు దానిని తిరిగి మీకియ్యడు. మీ సంధి ప్రయత్నాలు ఫలించవు. ఆ కారణంగా యుద్ధం తప్పదు. నా నామాన్ని జపించు. విజయలక్ష్మి తప్పక మిమ్ములను వరిస్తుంది. ముఖ్యంగా సాక్షాత్తు విష్ణువైన కృష్ణుడు మీ పక్షాన ఉన్నాడు. ఇక వెళ్ళు. సౌగంధిక పుష్పాలున్న కొలనికి త్రోవ ఇదే" అని ప్రేమతో ఆలింగనం చేసికొని అంతర్హితు డయ్యాడు. మారుతి ఆలింగనానికి వెయ్యి ఏనుగుల బలం వచ్చింది భీమునికి. యక్షరాక్షసులను గెల్చి సౌగంధిక పుష్పాలను తెచ్చి ద్రౌపదికిచ్చి ఆమె ముచ్చట తీర్చి సుఖస్థితిలో ఉన్నారయ్యా పాండవులు.

## భీముడు పురుష మృగాన్ని తెచ్చుట.

అఖిల భూతదయా నిష్ఠుడైన వసిష్ఠుడు శతానందునితో ఇలా అన్నాడు. శతానందా! హనుమ కరుణచే భీముడు సాధించిన అతి మానుష కార్యం ఇంకొకటుంది. దానిని చెపుతాను విను.

పాండవాగ్రజుడైన ధర్మనందనుడు సమస్తదురిత క్షయార్థమై అశ్వమేధయాగం చేస్తూ కృష్ణునితో ఇలా అన్నాడు: "కృష్ణా! ఈ యాగశాల

సతత భోజనక్రియల చేతను, సంతత జనసమ్మర్దం చేతను శుద్ధిని కోల్పోయింది. నిత్యసంశుద్ధిగా ఈ క్రతువును సాంగంగా నడప వలసింది" అని కోరాడు.

దానికి సమాధానంగా నారాయణుడిలా అన్నాడు. "ధర్మ నందనా! పురుషమృగం అని ఒక మృగం ఉంది. అది పురుష భావాన్ని , మృగరూపాన్ని కలిగి ఉంటుంది. ఆ మృగం యొక్క మాహాత్మ్యాన్ని మూడుసార్లు పఠిస్తే దుస్వప్నభయం ఉండదు. ఆ మృగం ఉన్నచోట ఎంత కాలుష్యం ఉన్నా తొలగి వాతావరణం పరిశుద్ధమై తీరుతుంది. అది పర్యావరణాన్ని ఎప్పుడూ రక్షిస్తూ ఉంటుంది. అది దాని మాహాత్మ్యం . ఆ మృగం అసమాన శౌర్య, ధైర్య, ప్రతాపాలు కలది. యక్ష, రాక్షస, సిద్ధ, విద్యాధరాదులు ఆ మృగానికి పరిచర్యలు చేస్తూ ఉంటారు. అది పురుషులు లేని దుర్గమారణ్య సీమలో మాత్రమే ఉంటుంది.

ఆ పురుష మృగాన్ని మన భీముడు మాత్రమే తేగలడు." అని చెప్పి భీముని చూచి "భీమా! నీవు హనుమ యొక్క అనుగ్రహానికి నోచుకొన్న వాడవు కనుక నువ్వు వెళ్ళు. ఆంజనేయుడు ఏ ఉపాయాన్ని చెపితే ఆ ఉపాయాన్ని పాటించు. ఆ మృగాన్ని తీసికొని రా!" అన్నాడు.

భీముడు బయలుదేరి హనుమ ఉన్న గంధమాదనాన్ని చేరుకొన్నాడు. మారుతిని భక్తితో స్తుతించాడు. వెంటనే ప్రత్యక్షమైన మారుతికి తాను వచ్చిన పనిని విన్నవించాడు. హనుమ కొంచెం ఆశ్చర్యంతో "సోదరా! నువ్వెప్పుడూ ఇలాటి సాహస కృత్యాలనే చేస్తావు. దేవతలు కూడా దానిని సమీపించలేరు. పురుషోత్తముడే నిన్ను పంపించాడు కనుక ఒక ఉపాయాన్ని చెపుతాను విను!

ఆ మృగం ఉన్న చోటకు వెళ్ళి దూరంగా ఉండి గర్జించు. అది గర్జించిన వానిని వెంటపడి తరిమి చంపుతుంది. దానితో సమంగా ఎవరూ పరుగెత్తలేరు – నిలువరించ లేరు – చంపలేరు. నీ గర్జన విని అది నిన్ను తరుముతుంది. నీ బలం కొలది పరుగెత్తు. నేను నీకు నా వాల రోమాలను

ఇస్తున్నాను. అది నీ దగ్గరకు రాగానే ఒక రోమాన్ని దాని ముందు విడిచిపెట్టు. ఆ రోమం దానికి శివలింగంలా కనిపిస్తుంది. శివలింగం కనిపిస్తే అది పూజ చెయ్యకుండా ఉండదు. ఈ లోపులో నువ్వు ఓపిక ఉన్నంత వరకు పరుగెత్తు. దాని పూజయ్యాక అది నిన్ను తరుముతూ వస్తుంది. చేరువకు వచ్చాక దాని ముందు ఇంకొక రోమాన్ని పడవెయ్యి. దానికది శివలింగంలా కనిపిస్తుంది. పూజ చేస్తుంది. నువ్వు పరుగెత్తు. ఇలా సప్త రోమాలను పడవేస్తూ దానిని హస్తినాపురం వరకు తీసికెళ్ళు." ఇలా ఉపాయాన్ని చెప్పి మారుతి భీమునకు సప్త వాల రోమాలను ఇచ్చాడు.

వాటిని సభక్తికంగా గ్రహించి భీముడు బయలుదేరి ఒక కీకారణ్యాన్ని ప్రవేశించి హనుమ చెప్పిన చొప్పున గర్జించాడు. ఆ గర్జనను విని ఆ మృగం కన్నుల నిప్పులురాల లోకాలు తల్లడిల్ల నా నెలవుకి ఎవరో ప్రవేశించారనే ఆగ్రహంతో భీముని ఉగ్రంగా చూచి వెంబడించింది. భీముడు వాయుపుత్రుడు కనుక వాయువేగంతో పరుగెత్తాడు. అలసిపోయాడు. మృగం సమీపించగానే ఒక రోమాన్ని దాని ముందు పడవేశాడు.

అక్కడ ఒక దివ్యమైన శివాలయం వెలసింది. ఒక మాయాలింగం, రత్నగోపురాలు, వికసించిన పద్మాలు, నల్లకలువలతో కూడిన సరోవరం, పూలతోట ఇలా అన్ని హంగులతో దివ్య తేజోవిరాజమానంగా ఉంది. వెంటనే పురుష మృగం ఆగింది. అతి భక్తితో సరోవరంలో స్నానం చేసి పూలతోటలోని పూలను కోసి ఆత్మనిష్ఠతో పూజ చేసింది. తిరిగి తీవ్ర క్రోధంతో భీముని వెంబడించింది. మృగం తన చెంతకు చేరినప్పుడల్లా ఒక్కొక్క రోమం పడవేస్తూ హస్తినకు వచ్చి గృహమందిర ద్వారం దాటాడు. మృగం తరుముతూ వచ్చి భీముని కాలు పట్టింది.

దానిని చూచిన ధర్మనందనుడు కృష్ణునితో కలిసి మృగాన్ని సమీపించి "ఓ! శిష్ట మృగమా! మా శరణు జొచ్చిన వానిని చంపుట న్యాయమా? నీవు విజ్ఞానముగల దానవు. నీకు తెలియని ధర్మాలు మావద్ద లేవు. నా సోదరుడు నీకంటె ముందుగా ద్వారం దాటి గృహంలో

ప్రవేశించాడు. క్రూర మృగాలు సైతం ఇంట్లోకి రావుగదా? నీవు మహాప్రాజ్ఞుడవు! ద్వారం బయట నీకు చిక్కిన కాలును భక్షించు – మిగిలిన అర్ధభాగాన్ని వదిలెయ్యి" అని ప్రార్థించాడు! అతని ధర్మ బుద్ధికి సంతసించిన మృగం "ధర్మనందనా! నీ సుకృతానికి సంతోషించాను. ఏ వరం కావాలో కోరుకో" అంది. "నా యజ్ఞం పూర్తయ్యే వరకు ఉండి శౌచక్రియను నడుపుతూ ఉండవలసింది" అని కోరాడు ధర్మజుడు. ధర్మనందనుని కోర్కె మేరకు ఆ మృగం ఆ ప్రాంతమంతా సంచరించి శౌచక్రియను నెరవేర్చి పాండవాగ్రజుని సఫల మనోరథుని చేసింది.

## గంధమాదనం వద్ద హనుమ దినచర్య

బ్రహ్మజ్ఞాని ఐన వసిష్ఠ మహర్షి సుధామధురంగా వినిపించిన హనుమ దివ్యచరిత్రను విన్న శతానందుడు ఇలా అన్నాడు: "మహర్షీ! హనుమ యొక్క దివ్య గాథ ఎంతవిన్నా తనివి తీరటం లేదు. ఇంకా ఇంకా వినాలని ఇంపు పుడుతోంది. గంధమాదన పర్వతం మీద హనుమ దినచర్య ఎలా నడుస్తోంది? ఆన తియ్య వలసింది."

దానికి సమాధానంగా వసిష్ఠుల వారిలా సెలవిచ్చారు: "శతానందా! కింపురుష వర్షంలో భవిష్యద్బ్రహ్మ ఐన ఆంజనేయుని దినచర్య, కొలువుకూటం, ప్రజల నడవడిక ఎలా ఉందో చెపుతాను విను! అచ్చటి ప్రజలు మారుతి ముఖారవిందాన్నే కాని అన్యముఖ సందర్శనం చెయ్యరు! ముందు ఆంజనేయునికి ప్రదక్షిణ నమస్కారం చేసికాని ఏ దినచర్యకు దిగరు! పావని పావన చరిత్రనే కాని అన్య గీతాలను ఆలపించరు. సమీర కుమారుని సేవలే కాని ఇతరేతర సేవా సంసక్తులు కారు! ప్రభంజన సుతుని సద్గుణాలనే కాని అన్యగుణ కీర్తనం చెయ్యరు. ఇలా వారందరు హనుమద్భక్తులై, ఆంజనేయ కృపాకటాక్షపాత్రులై, హనుమ తోడిదే లోకంగా ధన్యాత్ములై ఆయురారోగ్య భోగభాగ్యాన్వితులై, నిత్యతృప్తులై పుత్ర పౌత్రాభివృద్ధిగా ఉంటున్నారయ్యా!

ఇక సూర్యవంశ సంజాత, చతుర్దశభువనాధీశ్వరి ఐన సువర్చలా సహిత ఆంజనేయ స్వామి యొక్క కొలువుకూటం ఎలా శోభిల్లుతూ ఉందో చెపుతాను విను!

ఒక చెంత సీతారాముల దివ్య చరిత్ర గీతాలను గంధర్వులు గానం చేయగా...

సత్యధర్మ పరాక్రముడైన రాఘవేశ్వరుని పవిత్ర చరిత్రను మునులు ఉగ్గడింపగా....

శరణాగత వత్సలుడైన కాకుత్థ్సుని గాథా విశేషాలను అప్సరసలు ఆడగా...

దాశరథి హృద్య పద్యగద్యలను చారణులు చదువగా..

యక్ష కిన్నర సిద్ధ సాధ్య విద్యాధర దేవసంఘాలు కైవారం సేయగా..

ఇంద్రాది దిక్పాలకులు, పంచభూతాలు, సమస్త ఋషిగణాలు,అష్ట వసువులు, పదకొండు లక్షల సంఖ్య దేవతాగణం పరివేష్టించి తన్ను కొలువగా.. భవిష్యద్బ్రహ్మ ఐన హనుమ...

శ్రవణ, కీర్తన, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదనాపూర్వక నవవిధ భక్తిమార్గ తత్పరుడై 'అంతా రామమయం! ఈ జగమంతా రామమయం' అని పాడుకొంటూ ఆడుకొంటూ రామభక్తి తత్పరుడై తన్మయుడై మైమరచి ఉంటున్నాడు!!!

**ఋషిగణం హనుమను తత్త్వోపదేశం చెయ్యమని కోరుట.**

శతానందా! అలా ఉండగా ఒక రోజున సనక సనందనాది భక్తులు, ఋషిగణం, మునులు హనుమను సమీపించి ఇలా ప్రార్థించారు. "ఆంజనేయా! నీవు సర్వజ్ఞుడవు! ఈశ్వరాంశ సంభూతుడవు! భవిష్యద్బ్రహ్మవు! మాకు కొన్ని సందేహాలున్నాయి. వాటి విషయంలో శాస్త్రాలు తలకొక దారి నడిచాయి. వేదాభ్యాసం చేసినా, భేదబుద్ధి నశించటం లేదు. శాస్త్రావలోకనం చేసినా చిత్త

చాంచల్యం తప్పటం లేదు. ఆ కారణంగా నిశ్చయబుద్ధి ఏర్పడటం లేదు. సరికదా చిత్త విభ్రమం కలుగుతోంది. వాటికి తాత్పర్య నిర్ణయం చేసి తత్త్వోపదేశాన్ని అనుగ్రహించండి.

కర్మ భక్తి జ్ఞాన మార్గాలలో ఏది శ్రేష్ఠం?
జన్మకు కారణ మేమిటి?
జన్మ రాహిత్యానికి ఉపాయమేమి?
మోక్ష స్వరూప నిర్ణయం ఎలా చెయ్యాలి?"

దానికి హనుమ సంతోషించి కొద్దిసేపు కనులు మూసికొని మనసులో శ్రీరామచంద్రుని ధ్యానించి నిర్మల స్వాంతంతో, దృఢ చిత్తంతో, మేఘ గంభీర స్వరంతో ఇలా సమాధానం చెప్పాడు. "ఆత్మ స్వరూపులారా! మీరడిగిన ప్రశ్నలు చాలా కీలకమైనవి. అవి తర్కంచేతగాని, బుద్ధి చాతుర్యం చేత గాని నిర్ణయింప తగినవి కావు. శ్రుతి వాక్య తాత్పర్య నిర్ణయం వలన మాత్రమే వాటికి సమాధానాలు లభిస్తాయి.

సంసార లంపటంలో పడి మునిగి తేలే మానవులలో చాల మందికి ఈ ప్రశ్నలే పుట్టవు. వారి కంటికి ధనసంపాదనే తరుణోపాయంగా కనిపిస్తుంది. ఇక జిజ్ఞాసువుల సంగతి. వారికి దారిచూపే సరియైన గురువు లభించటం దుర్లభం. శాస్త్రం చదువుకొని దాని మర్యాదను, మర్మాన్ని తెలిసికొన్నవాడు కోటిమందిలో ఒకడుంటాడు. శాస్త్రం వేదం మీద ఆధారపడింది. మహావాక్య చతుష్టయ తాత్పర్య నిర్ణయం వల్ల మాత్రమే జ్ఞానం కలుగుతుంది. జ్ఞాన మార్గం ఉత్తమమైనది. జన్మకు కారణం – జన్మరాహిత్యానికి ఉపాయం ఈ రెండూ వేరు వేరు కావు. రెంటికి సమాధానం ఒకటే. వెలుగును సృష్టించటానికి ఒక ప్రయత్నం చీకటిని తొలగించటానికి వేరే ప్రయత్నం ఇలా రెండు ఉండవు గదా! అందువల్ల అద్వైతమే అందరికి శరణ్యం. మోక్షం అంటే జీవబ్రహ్మైక్యమే! ఇలా వేదం వరకు వెళ్లగలిగిన వారెంతమంది ఉంటారు?

గురువు లక్ష్య భ్రష్టుడైతే శిష్యునికి గమ్యాన్ని ఎలా నిర్దేశించగలడు? గురువు చేతిలో దీపం లేకపోతే శిష్యునికి దారెలా చూపగలడు? లోకం అంతా వాగాడంబరమే! దానికే ముగ్ధులవుతారు జనులు! సర్వజ్ఞుడైన ఈశ్వరుడు దక్షిణామూర్తి అవతారంలో చిన్ముద్రను హస్తం చేత అభినయించి జీవబ్రహ్మైక్యాన్ని మౌనంగా బోధించ లేదా?

నిజమైన జ్ఞాని ఐన గురువు సరుకులమ్మే వర్తకునిలా వీధికెక్కుతాడా? చీమ మొదలుగా ఈశ్వరుని వరకు అన్నిటా అంతటా వ్యాపించియున్న చైతన్య స్వరూపాన్ని గుర్తించి ఆ వైభవాన్ని దర్శిస్తూ, ఆత్మానందాన్ని అనుభవిస్తూ, పిచ్చివానిలా నవ్వుకొంటూ, రాళ్లను ఏరుకొంటూ, చిదానంద దరహాసంతో వెలిగిపోతూ ఉంటాడు. సంతత తైలధారావచ్ఛిన్నంగా తాననుభవించే బ్రాహ్మీభూత స్థితినుండి క్షణం కూడా ఎడబాటుకు ఇష్టపడడు.

గురుశిష్య సంబంధం సామాన్యమైనది కాదు. అది 'సంహితా' స్వరూపం. అణువు మొదలు మహత్తు వరకు అంటే పదార్థంలోని అణువులు మొదలు గ్రహనక్షత్ర తారకామండలాలతో, అనేక లోకాలోకాలతో కూడియున్న ఈ అనంత విశ్వాన్ని నిరంతర సహచర్యంతో విడదీయటానికి వీలులేకుండా కలిపి బంధించి ఉంచే శక్తి (చైతన్యం) ఏదైతే ఉందో దానికి 'సంహిత' అని పేరు. అది అనాది – సహజము – ప్రకృతి సిద్ధము ఐన శక్తి. అదే పరమాత్మ స్వరూపం. దానినే 'సత్' అంటాం. పురుష వాచకంగా చెపితే సత్యపురుషుడని అంటాం. స్త్రీ వాచకంగా చెపితే 'సతి' అంటాం. రెంటికి అభేదం. సతీత్వధర్మం ఏమిటంటే సతి ఎప్పుడూ సత్యపురుషుని విడిచిపెట్టదు. అది సంహితా లక్షణం.

శివశక్తులు, లక్ష్మీ నారాయణులు, వాణీబ్రహ్మలు, సీతారాములు వీరందరు సంహితా స్వరూపులు. ఒకరిని విడిచి ఒకరు ఎప్పుడూ ఉండరు. ఈ లక్షణాన్నే పురాణ మర్యాద ననుసరించి శివుని అర్ధనారీశ్వరుడని, లక్ష్మిని 'అనపాయిని' అని, సరస్వతి ఎప్పుడూ బ్రహ్మముఖంలో ఉంటుందని అంటాం.

ఋషిపుంగవులారా! ఈ "సంహిత" నాలుగు అవయవములు కలది. 1 ) పూర్వ రూపం 2 ) ఉత్తర రూపం 3) సంధి 4) సంధానం. వేదం కూడా 1) మంత్రము 2) బ్రాహ్మణము 3) ఆరణ్యకము 4) ఉపనిషత్తు అనబడే నాలుగు అవయవములు కలిగి ఉంటుంది. అందుకే వేదాన్ని సంహిత అంటాం. కొందరు మంత్ర భాగాన్ని మాత్రమే అంగీకరిస్తాం అంటారు. అప్పుడు వేదానికి సంహితా లక్షణం పట్టదు గదా?

ఇప్పుడు గురుశిష్యులు సంహితా స్వరూపులెలా అయ్యారో వినండి. 1) ఆచార్యుడు అనగా గురువు పూర్వరూపం 2) అంతేవాసి (శిష్యుడు) ఉత్తరరూపం 3) విద్య సంధి. వారిద్దరిని కలిపేది. 4) ప్రవచనం అంటే విద్య చెప్పటం సంధానం. విద్య అంటే వేదమే. ఈ విధంగా గురుశిష్యులు సంహితాస్వరూపు లయ్యారు.

**కలిలో రామ కృష్ణావతారం - ఆంజనేయావతారం**

ఋషిపుంగవులారా! గురువు సాక్షాత్తు శివుడే. సందేహం లేదు. కలియుగం ఎంత పాపిష్ఠిదైనా కలిలో కూడా శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాల వలె అవతార ఆవిర్భావాలు జరుగుతాయి. శ్రీరామునిది ఇచ్ఛాశక్తి – నాది క్రియాశక్తి. శ్రీ కృష్ణునిది ఇచ్ఛాశక్తి – అర్జునునిది క్రియాశక్తి. కలియుగంలో శ్రీరామ శ్రీ కృష్ణ అవతారాలు రెండు కలిసిన అవతారం ఆవిర్భవిస్తుంది. అది తన ఇచ్ఛాశక్తి చేత ప్రపంచాన్ని నడిపిస్తుంది. నేను ఆ అవతారానికి ఇప్పటి వలెనె దాసుడనై ఆవిర్భవించి సముద్ర లంఘనం చేసి ప్రపంచాన్ని నా క్రియాశక్తిచే నడిపిస్తాను. కలిలో ఆవిర్భవింపబోయే ఆ అవతారం సాక్షాత్తు మహాశివుడైన మహాకాలుడు. శివ శక్తులు పరస్పరోపాసకులు. అలాగే మహాకాల – మహాకాళి ఈ ఇద్దరు పరస్పరోపాసకులు. కలిలో ఆ అవతార రహస్యాన్ని కొద్దిమంది జ్ఞానులు మాత్రమే గుర్తించి లబ్ధి పొందగలరు. తక్కిన వారు మాయలో ఉంటారు.

సత్పురుషులారా! మీరడిగిన ప్రశ్నలకు సమాధానాలు వినండి! కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలలో కర్మకంటె భక్తి, భక్తి కంటె జ్ఞానం శ్రేష్ఠమైనవి. తాత్త్విక చింతన ఉత్తమం. జపచింత మధ్యమం. శాస్త్రచింత అధమం. లోక చింత అధమాధమం.

కర్మమార్గం: చెట్టు మొదట్లో ఉన్న చీమ చిట్టచివర కొమ్మ వరకు ప్రాకి పండును ఆస్వాదించినట్లుగా చాలాకాలానికి ఫలిస్తుంది.

భక్తిమార్గం: కోతి ఒక కొమ్మనుండి మరొక కొమ్మ మీదికి దూకి పండును పట్టుకొన్నట్లుగా ఉంటుంది.

జ్ఞానమార్గం: పక్షి ఎగిరి పండు మీద వ్రాలినట్లుగా ఉంటుంది.

అంతమాత్రాన కర్మ, భక్తి మార్గాలు నింద్యములు కావు. నేను జ్ఞాని నయ్యాను అని అనుకొని కర్మను, భక్తిని విడిచిపెట్టే వానికి నరకమే గతి. చెట్టు పండు దశలో పుష్పాన్ని విడిచి పెడుతుంది. అదీ తత్త్వజ్ఞాని స్థితి.

తపోధనులారా! జన్మ కారణం – పునర్జన్మ రాహిత్యానికి ఉపాయం మీరడిగారు. వేదవాక్య తాత్పర్య నిర్ణయాన్ని మీకు చెపుతున్నాను వినండి. పొట్టు ఉంటే ధాన్యం అంటాం. పొట్టు (ఊక) తీసేస్తే బియ్యం అంటాం. ధాన్యం చల్లితే మొలకెత్తుతుంది. ఇదే ధాన్యానికి పునర్జన్మ. బియ్యం చల్లితే మొలకెత్తదు. ఇదే ధాన్యానికి పునర్జన్మ రాహిత్యానికి ఉపాయం.

అలాగే కోరికలే బంధాలై మనిషి పునర్జన్మకు కారణ మవుతున్నాయి. నిజానికి పొట్టు ఏమీ సారం లేనిది. కాని అదే పునరుత్పత్తికి లేదా పునర్జన్మకు కారణమవుతోంది ధాన్యం విషయంలో. అలాగే అసంగతము, అజ్ఞాన విలసితము, నిష్ఫలము, నిస్సారమైన కోరికలే పునర్జన్మకు కారణ మవుతున్నాయి మనిషి విషయంలో. పొట్టును వదిలించినట్లు అజ్ఞాన విలసితమైన కోరికలనే వలయాన్ని ఛేదించుకొని మనిషి నిస్సంగుడైతే జన్మరాహిత్యాన్ని పొందుతాడు. చాలామంది తీరని కోరికలతో కాలి దహించుకుపోతూ ఉంటారు. నిజానికి మనం దహించ వలసింది కోర్కెలను.

అంతేకాని ఎప్పటికి తీరని కోర్కెలచే మనం దహింపబడటం కాదు. వేపిన విత్తనాలు ఫలించవు గదా.

మనుష్యులందరు విపరీత ఆచరణ కలవారై కోర్కెల విషవలయంలో చిక్కుకొని చావుపుట్టుకల చక్రభ్రమణంలో పరిభ్రమిస్తున్నారు."

**సువర్చలా వృత్తాంతం.**

ఇంత వరకు విన్న శతానందుడు ఎంతో ఔత్సుక్యంతో వసిష్ఠ భగవానుని ఇలా ప్రశ్నించాడు. "మహర్షీ! మీరు సువర్చలా సహిత ఆంజనేయుడని హనుమను గృహస్థుగా చెప్పారే! హనుమ నిత్య బ్రహ్మచారి అని విన్నాను. ఆ కళ్యాణ గాథను కర్ణపర్వంగా సెలవియ్యండి" అని కోరగా వసిష్ఠుల వారిలా చెప్ప సాగారు.

**శ్లో॥ సువర్చలాధిష్టిత వామభాగం**
**వీరాసనస్థం కపిబృంద సేవ్యం ।**
**స్వపాదమూలం శరణం గతానామ్**
**అభీష్టదం శ్రీహనుమంత మీళే ॥**

తా॥ సువర్చలాదేవి అధివసించిన వామభాగము కలవానిని, వీరాసనమున కూర్చొనియున్న వానిని, వానర బృందముచే సేవింపబడు వానిని తన పాదములను శరణు పొందిన వారి కోరికలను తీర్చు శ్రీ హనుమంతుని సేవించు చున్నాను.

శతానందా! త్రిభువన పావనమైన సువర్చలా – ఆంజనేయుల కళ్యాణ గాథను చెపుతున్నాను. విను. సువర్చల త్రిమూర్త్యాత్మకుడు, కర్మసాక్షి ఐన సూర్యుని కూతురు. అయోనిజ. సూర్య భగవానుడు ఒకప్పుడు దుర్నిరీక్ష్య తేజోవిరాజమానుడై ఉండేవాడు. ఆ తేజస్సుకు ముల్లోకాలు గగ్గోలు పడ్డాయి. అంతేకాదు ఆయన భార్య ఐన సంజ్ఞాదేవి సైతం తట్టుకోలేక పుట్టింటికి వచ్చేసింది. సంజ్ఞ దేవతాశిల్పి ఐన విశ్వకర్మ కూతురు.

తనభార్య యందుండే అనురాగం చేత మార్తాండుడు తన తేజస్సును తగ్గించుకోటానికి ఇష్టపడి తన మామగారైన విశ్వకర్మను తరణిపట్టమని కోరాడు. సూర్యుని తరణి పట్టగా ఆ తేజస్సు ఉదయాద్రిమీద రజస్సుగా రాలింది. ఆ తేజస్సు నుండి ఒక కన్యక ఉద్భవించింది.

చక్కని వర్చస్సుతో ప్రకాశిస్తున్న ఆ కన్యకను చూచి బ్రహ్మాది లోకపాలకులంతా 'సువర్చల' అని నామకరణం చేశారు. అప్పుడు అమరులు కమలాసనుని సమీపించి పితామహా! అద్భుత తేజోరాశి మహాసౌందర్య మూర్తి ఐన ఈ కన్యకు తగిన వరుడెవ్వరని కుతూహలంతో ప్రశ్నించారు. పద్మభవుడు దివ్య దృష్టితో పరికించి ఈశ్వరాంశ సంభూతుడైన అంజనాసుతుడైన ఆంజనేయుడు ఈమెకు పతి కాగలడని భవిష్యత్తును చెప్పాడు.

ఆ బాలిక శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందుతూ గురువుల చెంత సకల విద్యలను, కళలను నేర్చి యుక్తవయస్సు వచ్చేసరికి సకల కళాప్రపూర్ణురాలైంది. ఆ సమయంలోనే హనుమ విద్యాభ్యాసం నిమిత్తం సూర్యుని వద్దకు వచ్చాడు. ఆంజనేయుణ్ణి చూచింది సువర్చల. అతని దివ్య చరిత్రను వింది. తరుణార్కద్యుతితో, రత్న ప్రభామండితమైన మకుటంతో, మకర కుండలాలతో, మౌంజీ బంధంతో, కాంచన చేలంతో, బ్రహ్మచారి తేజస్సుతో వెలిగిపోతున్నాడు మారుతి.

కాలం గడుస్తోంది. హనుమ విద్యాభ్యాసం నడుస్తోంది. అతనిలో వయసుతోపాటు బ్రహ్మచారి తేజస్సు అధిక మౌతోంది. క్రమంగా ఆమెకు లౌకిక విషయాల యందు అలసత్వం పెరిగి చివరకు శరీరం మీద సైతం శ్రద్ధ తగ్గింది. చెలికత్తెలీ విషయాన్ని గమనించి ప్రేమతో లాలించి ప్రశ్నించగా మనసులోని కోరికను ఎట్టకేలకు బయటపెట్టింది. చెలులు సంజ్ఞా – సూర్యుల వద్దకేగి సవర్చల మనోగత అభిప్రాయాన్ని తెలియ చెప్పారు.

వారా వార్తను విని ఎంతో ఆనందించారు. భవిష్యద్బ్రహ్మ ఐన ఆంజనేయుడు తమకు అల్లుడు కాబోతున్నందుకు లోపల సంతోషించినా ఆమె

నిర్ణయం ఎంత దృఢమైనదో తెలిసికోవాలని ఇలా అన్నారు: "అమ్మాయీ! హనుమ ఈశ్వరాంశ సంభూతుడు. అవతార పురుషుడు. మహామహిమోపేతుడు. పుడుతూనే బాల బ్రాహ్మచారిలా జన్మించాడు. ఆజన్మ బ్రహ్మచారి. అలాటి వానితో నువ్వు సంసార సుఖాన్ని ఏం పొందగలవు? బాగా ఆలోచించుకో."

ఆ మాటలు విన్న సువర్చల దృఢచిత్తంతో "నాకు ఐహిక విషయాలయందు ఆసక్తి లేదు. నిత్య బ్రహ్మచారిణిగా ఉండి నా తపస్సును కొనసాగించ తల్చుకొన్నాను. హనుమ బ్రహ్మనిష్ఠ కలవాడు. మా ఇద్దరి జన్మరహస్యాలను ఎఱిగిన మీరు నా కోరికను సఫలీకృతం చెయ్యండి." అని తల్లిదండ్రులను అర్థించింది.

ఇంతలో హనుమ విద్యాభ్యాసం పూర్తయింది. ఆదిత్యుని సమీపించి "త్రిమూర్త్యాత్మకా! కర్మ సాక్షీ! మీ కరుణతో నా విద్యాభ్యాసం పూర్తయింది. గురుదక్షిణ ఏమియ్యమంటారో సెలవీయండి." అని నమస్కార పూర్వకంగా అర్థించాడు.

దానికి ఆదిత్యుడు ఆనందించి ఇలా అన్నాడు: "హనుమా! నీ వినయానికి చాలా సంతోషించాను. నా కూతురైన సువర్చలను నీ అర్ధాంగిగా చేసికో. ఆమె నా తేజోద్భవ! సకల గుణ సంపన్న. నీకన్నివిధాలా తగినది. నీ మనసెరిగి నీకు పరిచర్యలు చేస్తూ నీ మెప్పు పొందగలదు. ఇదే నువ్వు నాకిచ్చే గురుదక్షిణ. ఈమె నీ బ్రహ్మచర్య వ్రతదీక్షకు భంగం కలిగించదు. నువ్వు అన్యథా తలచకు. త్రిమూర్తులు సైతం గృహస్థాశ్రమ స్వీకారం చేసిన వారే! వివాహితుడు కానివానికి జీవితంలో పరిపూర్ణత సిద్ధించదు."

ఆ సమయంలో హనుమకు చాలా సందేహాలు తోచాయి. వాటినన్నిటికి సమాధానాలు చెప్పి శంకలు తీర్చాడు ఆదిత్యుడు. హనుమ సరేయని తిరిగి కిష్కింధకు వచ్చి విషయాలన్ని తల్లిదండ్రులకు, మేనమామలకు, బంధు వర్గానికి చెప్పి వారందరి అనుమతితో వివాహానికి అంగీకరించాడు.

## సువర్చలా హనుమల కళ్యాణం

జ్యేష్ఠ శుద్ధ దశమి బుధవారం ఉత్తరానక్షత్రయుక్త సింహలగ్న పుష్కరాంశయందు నిర్జరగురుడైన బృహస్పతి లగ్న నిర్ణయం చేశాడు.

శతానందా! సూర్య పుత్రియైన సువర్చల - వాయుపుత్రుడైన ఆంజనేయుల వివాహ వైభవ కోలాహలాన్ని ఆదిశేషువు సైతం వర్ణించలేడయ్యా!

ముప్పై రెండు కోట్ల సకల దేవతా సమూహం ఇంద్రాది దిక్పాలకులతో కలిసి... మణి మకుట రత్నా భరణ కాంతులు గగన భాగాన విద్యుత్ప్రభలను విరజిమ్మ నిజవాహనారూఢులై ముందు నడువ; అంతకు మించి అర్బుద సంఖ్యలో కపి కోట్లు కిలకిలార్భటులతో ఆనందంతో అట్టహాసం చేస్తూ వెంటరాగా... ఉభయ పక్షాల వారు కళ్యాణ వేదిక వద్ద కొలువు తీరారు. రెండు సముద్రాలు పోటెత్తి కలిసినట్లుంది ఆదృశ్యం.

విష్ణువు స్వయంగా బెత్తాన్ని ధరించి వచ్చిన పెళ్ళివారందరిని మర్యాద లెరిగి ఉచితాసనాసీనుల్ని చేస్తున్నాడు.

ప్రమథగణ పరివృతుడై, పార్వతీ సహితుడై నందీశ్వరుని భుజంమీద తన హస్తాన్నుంచి అరుదెంచిన పరమేశ్వరుడు విష్ణువు చేసిన మర్యాదకు సంతసించి మంచు కొండ కూతురు వైపు తిరిగి మందహాసం చేసి చెంత కూర్చోమన్నట్లు సైగ చేశాడు.

అమృత బిందువులు చిలుకగా అమర వాహినీ ప్రభవమైన పద్మాతపత్రాన్ని పట్టి ఆశీర్వదించింది ఆది లక్ష్మి.

కళ్యాణ సమయార్హములైన గద్య పద్యాలతో కైవార మొనరించింది వాణి.

నారదతుంబురులు వీణాగానం చేశారు.

జంభారి కొలువు కూటంలోని రంభోర్వశీ దివిజ మత్తకాశినులు బృందారక బృంద డెందము లానందంతో కందళింపగా సంరంభంతో గాంధర్వ విద్యా నైపుణ్యాన్ని నెరవేర్చారు.

గంగా యమునలు వింజామరలు వీచారు.

సముద్రుడు వజ్ర, వైడూర్య, ప్రవాళ, పద్మరాగ మాణిక్యాది అనర్ఘ రత్నరాశులను కానుకలుగా భద్రంగా తెచ్చి ఇచ్చాడు. చతుర్ముఖుడు బ్రహ్మత్వాన్ని వహించాడు. సప్తర్షులు అరుంధతీ సహితులై మహదాశీర్వచనం చేశారు.

సంజ్ఞాదేవి కరకమలాల బంగారు భృంగారువునెత్తి అమృతతుల్యమైన అమరవాహినీ జలాలను ధారగా పోయ సురాసురకిరీట మణి ప్రభాభాసితమైన ఆంజనేయుని పాదకంజాతాలను కడిగి కన్యాదానం చేశాడు కమలాప్తుడు.

ఈ విధంగా అఖిల జనలోచనోత్సవంగా సువర్చలా ఆంజనేయుల కళ్యాణ మహోత్సవం ఊహాతీతంగా మహావైభవంగా సాగింది.

శతానందా! విను!

గాన విద్యలో హనుమ పెట్టిన భిక్షతో తలెత్తుకు తిరుగుతున్న వారు తుంబురు నారదులు.

భరత శాస్త్రంలో సహస్రాంశం కూడా నేర్వని వారు రంభాదులు. హనుమ మహిమలో అణుమాత్రమైనా ఎఱుగని వారు దిక్పాలకులు. తను ఉపదేశించిన వాక్యాల తాత్పర్య లేశంతో ముక్తులైనవారు గౌతమ అత్రిచ్యవన భరద్వాజాది మహర్షులు.

**ఫలశ్రుతి**

హనుమ దర్శనానికై అతని కొలువుకు వచ్చే వేల్పులలో అడుగులు తడబడకుండా వచ్చే దివ్యుడుగాని, స్తుతిస్తూ కంఠం గాద్గదికం కాని అమరుడుగాని, మ్రొక్కుతూ వణకని గీర్వాణుడు కాని, దర్శించి పారవశ్యం పొందని బృందారకుడుకాని ఒక్కడూ లేడు!

శతానందా! శ్రీ హనుమత్కథా శ్రవణ ఫలాన్ని విను! నిశ్చల భక్తితో తత్పరమతులై హర్ష పులకిత గాత్రులై ఆనందాశ్రువు లొలుక చేతులు జోడించి "ఆంజనేయా! హనుమా! మారుతీ! సువర్చలా ప్రియా! రామభక్తా!" అంటే

చాలు వచ్చి వాలతాడయ్యా! పుణ్యం అంటే ఈ భరతవర్ష ప్రజలదే! ఎందుకంటె ఆ అవతారం ఈ కర్మభూమిలో కోరి అవతరించింది! హనుమద్భక్తులు ధర్మార్థకామాలను ఇక్కడ సాధించి ఆపై మరుజన్మలో కింపురుష వర్షంలో జన్మించి నిరంతరము హనుమద్దర్శనాన్ని పొంది ఆపై పునరావృత్తిరహిత నిరతిశయానంద అద్వైతసిద్ధిని పొందుతారు. ఇది నిశ్చయం.

**కం॥ ఈ సామీరి చరిత్రం**
**బే సుజనుడు చదువుకొన్న హితమతి విన్నన్**
**వ్రాసిన మతి వ్రాయించిన**
**ఆ సాత్వికుడిహ పరంబులందు సుఖియగున్.**

ఈ ఆంజనేయుని యొక్క దివ్య చరిత్రను ఏ మానవుడు భక్తి శ్రద్ధలతో చదివినా, విన్నా లేదా భక్తులకు, బంధువులకు, హితులకు గ్రంథ ప్రతులను మ్రొక్కుగా పంచిపెట్టినా ఆ మానవునికి (భక్తునికి) ఎల్లవేళలా హనుమ యొక్క సంపూర్ణ కటాక్షం, అనుగ్రహ ఆశీర్వచనాలు లభిస్తాయి. ఆ భక్తుడు ఇహపరాలలో సుఖంగా ఉంటాడు" అని చెప్పి ముగించారు భగవాన్ వసిష్ఠ మహర్షి.

**శ్లో॥ బుద్ధిర్బలం యశోధైర్యం – నిర్భయత్వ మరోగతా ।**
**అజాడ్యం వాక్పటుత్వంచ – హనూమత్స్మరణాద్భవేత్॥**

**శ్లో॥ మాతా సువర్చలాదేవీ – పితామే వాయునందనః ।**
**బాంధవా హనుమద్భక్తాః – స్వదేశో భువనత్రయమ్ ॥**

**శ్లో॥ సువర్చలా కళత్రాయ – చతుర్భుజ ధరాయచ ।**
**ఉష్ట్రారూఢాయ వీరాయ – మంగళం శ్రీ హనూమతే ॥**

**శ్లో॥ స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం**
**న్యాయేన మార్గేణ మహీం మహీశాః ।**

సప్తమాధ్యాయం

**గో[బ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం**
**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు ॥**

**శ్లో॥ కాలే వర్షతు పర్జన్యః – పృథివీ సస్య శాలినీ।**
**దేశోయం క్షోభరహితో – బ్రాహ్మణాస్సన్తు నిర్భయాః ॥**

**శ్రీ సువర్చలా సమేత సుందర హనుమత్ప్రసాదేన**
సర్వేజనాః
సుఖినో భవంతు సమస్త సన్మంగళాని భవంతు ॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

## గద్య

ఇది శ్రీ త్రిలింగ దేశాంతర్గత కోనసీమ మండల పవిత్ర కౌశికీతీర "బ్రహ్మపురి' నామ విఖ్యాత "పేరూరు" గ్రామోపకంఠ "విశ్వేశ్వరాగ్రహార" గ్రామ అగ్రజన్ముండును, విమల "విశ్వనాధం" వంశ సచ్చరిత్రుండును, కుత్ససగోత్ర పవిత్రుండును, అన్నపూర్ణా సుబ్బరాయ ద్వితీయ పుత్రుండును, పార్వతీ సహిత శ్రీవిశ్వేశ్వర స్వామి పదసమారాధన బద్ధచిత్తుండును, నిత్య సాహితీ పఠనాయత్త చిత్తుండును సంగీత సాహిత్య నృత్యగీత కళాభిజ్ఞుండును, "అలంకృతి' నామ శివస్తోత్ర కృతి విరాజితుండును, సమస్త ఆంధ్ర ప్రబంధ పరిశీలిత "నృత్యకళా ప్రస్తావన" నామ గ్రంథరచనాభి శోభితుండును, **"సాహిత్య కళానిధి"** బిరుద విభ్రాజమానుండును, బుధజన విధేయుండును అగు సత్యనారాయణ మూర్తి నామ కవి వర్యునిచే రచింపబడిన **"సంపూర్ణ హనుమత్ చరిత్రము"** అను గద్య కావ్యము సర్వము సంపూర్ణం.

## సంపూర్ణం.

* * *

vedhagrandhalayam@gmail.com వేద గ్రంథాలయం 9666122140